తాళ్లపాక సాహిత్యము

# అధ్యాత్మ సంకీర్తనలు



తాళ్లపాక అన్నమాచార్యులు

శ్రీ తాళ్లపాకవారి పదసాహిత్యము – సంపుటము – 3

# అధ్యాత్మ సంకీర్తనలు

అన్నమాచార్య విరచితములు


పరిష్కర్త :

గౌరిపెద్ది రామసుబ్బశర్మ



ప్రచురణ :

కార్యనిర్వహణాధికారి,

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

1986

ADHYATMA SANKIRTANALU. Vol-3

Edited by:
Sri Gauripeddi Ramasubba Sarma

Second Edition: 1986

Copies: 2000

*Published by*

Sri S. Lakshminarayana, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*Printed at*

Tirumala Tirupati Devasthanams Press, Tirupati.

# ముందుమాట

పదకవితాపితామహుడుగా, సంకీర్తనాచార్యుడుగా శ్రీ వేంకటేశ్వర స్వామి అపరావతారంగా వెలుగొందిన పరమ భక్తాగ్రేసరుడు తాళ్లపాక అన్నమాచార్యులు. తిరుమల శ్రీ వేంకటేశ్వరుని వైభవాన్ని వింత వింతలుగ ముప్పదిరెండువేల సంకీర్తనల్లో వర్ణించిన మహానుభావు డాయన. ఆ కీర్తనల్లో కొన్ని శ్రీస్వామివారిని అలౌకికశృంగార మూర్తిగా వర్ణించే భక్తి శృంగార కీర్తనలయితే, మరికొన్ని సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపంగా వర్ణించే అధ్యాత్మకీర్తనలు.

అదృష్టవశాత్తు మనకు లభించిన అన్నమయ్య సంకీర్తనలు దాదాపు 13 వేలు మాత్రమే.

ఈ కీర్తన లన్నింటిని రాగిరేకులనుంచి పరిష్కరించి ముద్రించే కార్యక్రమం నిరాఘాటంగా సాగుతున్నది. అందులో భాగంగా, ఇది రెండవసారి ముద్రితమైన అన్నమయ్య అధ్యాత్మకీర్తనల మూడవ సంపుటం.

ప్రతి సంపుటంలోలాగే ఈ సంపుటంలోకూడా పరిష్కర్త శ్రీ గౌరి పెద్ది రామసుబ్బశర్మ అమూల్యమైన పీఠిక సంతరించారు. ఇందులో వారు విపులంగా చర్చించిన 'భక్తుడు-భగవంతుడు' అన్న అంశం, మరికొన్ని పదాల పరిశీలన పండితుల, పరిశోధకుల దృష్టిని ఆకట్టుకో గలదని తలంపు. ఇదివరకటి సంపుటాల్లాగే దీనినీ పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

ఎస్. లక్ష్మీనారాయణ,
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దే., తిరుపతి.

తిరుపతి,
మార్చి 29, 1986.



తాళ్లపాక అన్నమాచార్యులు
(1408—1503)

# పీఠిక

శ్లో॥ వేంకటేశాత్మనాఽఽత్మానం సర్వం లోకంచ భావయన్ ।
బహిరంతస్స్ఫురద్రూప మన్నమార్యం నమామ్యహమ్ ॥

పూజ్యపాదులు కీ॥ శే॥ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు 201 వ రేకునుండ 250 వ సంఖ్యరేకువరకుగలపాటలను 8 వ సంపుట ముగా 15–4–1952 న ప్రకటించి. 251 వ రేకునుండి 300 వ రేకువరకుగల 50 రేకులను 9 వ సంపుటముగా 18—6—52 న ప్రకటించిరి.

8 వ సంపుటమునందలి రేకులలో 216 వ రేకు, 9 వ సంపు టమునందలి రేకులలో 300 వ రేకు వారికి దొరకనట్లు, 9 వ సంపుటము నందు పీఠికలో చెప్పినారు.

కాని 300 వ రేకుమాత్రము మాకు లభించినది. ఈ రేకు ఆ మధ్య ఎట్లు అంతర్ధానమయియుండినదో తెలియదు. పాత 8, 9 సంపుటముల సమష్టిరూపమే ఇది. 201 నుండి 300 వరకు గలరేకులకు సంబంధించినది ఈ సంపుటము.

మునుపటిఅధ్యాత్మకీర్తనలసంపుటములవలెనే ప్రాచీనులు ప్రకటించినవానికి, మా పరిశోధనలో దొరికిన, ఊహించిన భావము-లను, అక్కడక్కడ కఠిన పదములకు అర్థములను ౧, ౨, ౩ ఇత్యాది తెలుగుసంఖ్యలలో గుర్తించి ప్రకటించినాము. 1 నుండి 4 వ ఫారము వరకు పొరపాటుతో 1, 2, 3, ఇత్యాది సంఖ్యలతో గుర్తింపబడినవి. సహృదయులు మన్నించి చదువుకొనగలరు. పాతపరిష్కర్తలు చాల-స్థలములందు మూలపాఠముదగ్గర ప్రశ్నచిహ్నములతో తమసందేహ ములను వెలిబుచ్చినారు. అట్టి స్థలములందు ౧. ౨. ౩ మొదలుగా గలతెలుగుఅంకెలతో గుర్తించి సాధ్యమైనన్నిస్థలములలో నాకు

తోచినఅర్థమును సూచించియున్నాను. దాని బాగోగులకు సహృదయహృదయమే ప్రమాణము.

అన్నమయ్య తాను రామానుజమతస్థుడనని బాహాటముగచెప్పుకొన్నాడు. తదితరమతములను ఘాటుగా దూషించినాడుకూడ. అందులో ప్రధానముగ దూషణ పాత్రమైనది అద్వైతమే. శైవులకైనను వైష్ణవులకైనను ఉమ్మడి శత్రువు అద్వైతియేకదా.

అన్నమయ్య తనఅధ్యాత్మకీర్తనలలో అక్కడక్కడ శైవమతమునుగూడ ఖండించినాడు, అన్నమాచార్యులు ఖండించిన — అద్వైతమునకు, శైవమునకు సంబంధించి మచ్చుకు కొన్నిపాటల సంఖ్యలను ఉదాహరించుచున్నాను చూడవచ్చు. అద్వైత ఖండనము ఈ సంపుటములో 5, 33, 40, 52, 53, 65, 74 సంఖ్యలుగల పాటలలో గుర్తింపవచ్చును. అట్లే శైవమత దూషణము 351, 364 సంఖ్యగలపాటలలో గుర్తింపవచ్చు.

గాఢముగా ఒక మతమును విశ్వసించినవారు మరియొక — మతమును దూషించుట ఆనాళ్లలో పరిపాటి. అసలు సోమన, పండితారాధ్యుడు మొదలైనవారలవీరశైవమునకు ఎదురొడ్డిబలిచిన- వీరవైష్ణవవాఙ్మయ మిది. దీనిలో ఈపాటిఖండన ముండుట తప్పు కాదనియే భావింపవచ్చు. శ్రుతి స్మృతి పురాణములయందు కూడా ఒకచోట విష్ణువు, మరియొకచోట శివుడు, ఇంకొకచోట బ్రహ్మ సర్వోత్కృష్టులుగ కీర్తింపబడుట మన మెరిగినదే.

శైవమునకో, వైష్ణవమునకో చెందినవ్యక్తులు ఆ మూర్తిని సర్వోత్కృష్టముగ సాధింపనినాడు ఆమతమే కుప్పకూలిపోవలసి- వచ్చును. అందువలన రామానుజమతస్థుడగు అన్నమాచార్యులు పరమవిష్ణుభక్తుడు. పరమ వైష్ణవుడుకూడ. ఆ మతమునకు సాక్షాత్తుగా విరుద్ధమయిన శైవమునుగాని, శివకేశవులను సమానభక్తితో

సేవించుఅద్వైతమునుగాని ఆయన ఖండించుటయు న్యాయ్యమే. ఇంకొక్కవిశేషము. ఈయనవరకు ఈతని వంశములోని వారందరూ, అద్వైతసంప్రదాయమునకే చెందినవారు. ఈతనినుండి ఈ వంశము రామానుజమతవంశముగా సిద్ధమైనది. ఈతవిలోకూడ జన్మసిద్ధ–మైనఅద్వైతవాసన పూర్తిగా నశించలేదని, అక్కడక్కడ మినుకు మినుకుమని గోచర మగుచున్నదని, 185, 296, 342, 440 మొదలగు పాటలలో తెలియుచున్నది.

అన్నమయ్యలో ఆవేశించినవైష్ణవము ఈ క్రిందిపాటలలో బాగ గుర్తింపవచ్చు.

శంకరాభరణం

అచ్యుత మిమ్ముఁదలఁచేయంతపని వలెనా
యిచ్చల మీవారే మాకు నిహపరా లియ్యఁగా ॥పల్లవి॥

మిమ్ము నెఱిఁగినయట్టిమీదాసుల నెఱిఁగే–
సమ్మతివిజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీసేవ సేసుకుండేటివైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు ॥అచ్యు॥

నిరతి నీకుమొక్కేనీడింగరీలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్నుఁ బూజించే ప్రపన్నులఁ బూజించే —
సరిలేనిభాగ్యము చాలదా నాకు ॥అచ్యు॥

అంది నీకు భక్తులైనయలమహానుభావుల —
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడునీబంటుబంటుకు
సందడిబంట నవుటే చాలదానాకు ॥అచ్యు॥

(ఈసంపుటము–పాట 23)

ముఖారి

సులభపుమార్గములు చుట్టిరానే వుండఁగాను
బలుప్రయాసపుకర్మబద్ధులైరి జీవులు ॥పల్లవి॥

శ్రీపతిభక్తియనేటిచింతామణి వుండఁగాను
యేపున మోసపొయ్యేరు యేలో జీవులు
చేపట్టి నామాంకితపుసిద్ధరసము గలిగి
కోపుల నుడిగి పనిగొనరేలో జీవులు ॥సుల॥

అక్కడనే శరణాగతనేవోడ వుండఁగాను
యెక్కి భవవార్ధి దాఁటరేలో జీవులు
తక్కక దాస్యమనేటిధనము దమకుండఁగా
లెక్కించి కూడవెట్టుకోలేరు యేలో జీవులు ॥సుల॥

అట్టె శ్రీవేంకటేశుఁ డంతరాత్మై వుండఁగాను
పట్టి కొలువరేలో పైపై జీవులు
పట్టపుహరిదాసులు ప్రత్యక్షమై వుండఁగాను
యిట్టె వారికృప చేరుటెన్నఁడో యీ జీవులు ॥సుల॥

(ఈసంపుటము-పాట 279)

వైష్ణవమునందును తత్రాపి శరణాగతియందును కలసులభ —
మైనగొప్పఫలము ఈ క్రిందిపాటలో గుర్తింపవచ్చు.

సాళంగనాట

ఈ మాట విని నిన్ను నిందుకే నవ్వితి నేను
నేమ మెంత నేమెంత నీకరుణ యెంత ॥పల్లవి॥

సకలకర్మముచేత సాధ్యముగానినీవు
    సోక ఇంచుకంతభక్తి కొగి లోనైతి
    ప్రకటించి బహువేదపఠనఁ జిక్కనినీవు
    మొకరివై తిరుమంత్రమునకుఁ జిక్కితివి ॥ ఈమా ॥

కోటిదానములచేత కోరి లోనుగానినీవు
    పాటించి శరణంచేనే పట్టి లోనైతి
    మేటివుగ్రతపముల మెచ్చి కైకొననినీవు
    గాటపుదాసులైతేనే కైకొని మన్నించితివి ॥ ఈమా ॥

పెక్కుతీర్థములాడిన భేదించరానినీవు
    చొక్కి నీముద్రవారికి సులభుఁడవు
    గక్కనదేవతలకుఁ గానరానినీవు మాకు
    నిక్కడ శ్రీవేంకటాద్రి నిరవైతివి ॥ ఈమా ॥

(ఈసంపుటము-పాట ౬౮)

భగవంతుడూ, సర్వవ్యాపీ, పరమకారుణికుడూ అగు శ్రీ మహావిష్ణువుయొక్క దయాళుత్వమును అన్నమయ్య ఎంతచక్కగా గుర్తించెనో ఈ క్రిందిపాటలో తెలిసికొనవచ్చు.

శ్రీరాగం

మఱి యేపురుషార్థము మావంక లేదు మీకు
    అఱువడము మాకెంత అత్తువో నీవు ॥ పల్లవి ॥

హరి నీవు నాకు నంతర్యామివైనఫలము
    తిరిగినందె మావెంటఁ దిరిగెదవు
    ఇరవుగ నీవు మాకు నేలికవైనఫలము
    గరుమె మాపాపమెల్లఁ గటుకొంటివి ॥ మఱి ॥

భువిలోన నీవు నన్నుఁ బుట్టించినఫలము
ఇవల రక్షించేటోడు సిద్ధోకటాయ
తివిరి నన్ను నీకుతుఁ దెచ్చిడుకొన్న ఫలము
జవళి నా నేరములు చక్కఁబెట్టఁబడెను ॥ మఱి॥

గారవాన నన్ను వెనక వేసుకొన్న ఫలము
చేరి నన్నుఁ బుణ్యునిఁగాఁ జేయవలసె
ఆరసి నాకుఁ బ్రత్యక్షమైనఫలమున నన్ను
యీరీతి శ్రీవేంకటేశ ఇముడుకోఁబడెను ॥ మఱి॥

(ఈసంపుటము-పాట 69)

శ్రీవైష్ణవమునందు హరికంటె హరిభక్తు లధికులు. భక్తుడు గొప్పయా? భగవంతుడు గొప్పయా? అన్నప్రశ్నమునకు భారత భాగవత రామాయణాదులయందు భక్తుడే గొప్ప అని నిరూపించు-నంశములు కోకొల్లలు గలవు. మచ్చుకు భారతకథ భాగవతమున, భీష్మార్జునయుద్ధమునందు కృష్ణుడు, అర్జునునితో నిన్ను చంపింతునని భీష్మునితో పలికెను. భీష్ముడు నీచే చక్రము పట్టింతునని కృష్ణునితో ననెను. ఎనిమిదవనాటియుద్ధమున కాబోలు భీష్మునిధాటికి అర్జునయ్య కొయ్యబారగా, శ్రీకృష్ణుఁడు మహాసంరంభముతో చక్రము చేబట్టి రథముపైనుండి దుమికి భీష్మునివైపు పరుగెత్తెను. ఆ సందర్భమున,

సీ॥ కుప్పించి యెగసినకుండలంబుల కాంతి
గగనభాగంబెల్ల గప్పికొనఁగ
నుఱికిన నోర్వక యుదరంబులోనున్న
జగములవ్రేఁగున జగతి గదలఁ
జక్రంబుఁ జేపట్టి చనుదెంచురయమునఁ
బైనున్నపచ్చనిపటము జాఱ
నమ్మితి నాలావు నగుఁబాటు సేయకు
మన్నింపుమని క్రీడి మఱలఁదిగువ.

తే॥ గరికి లంఘించుసింహంబుకరణి మెఱసి,
నేఁడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁ గాతు
విడువు మర్జున! యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచుదేవుండు దిక్కు నాకు

అనువద్యముతో ప్రాప్తకాముడు, పరమభాగవతుడునగు భీష్ముడు శ్రీకృష్ణుని స్తుతించెను.

(ఆంధ్రమహాభాగవతము ప్రథమస్కంధము పద్యం—222)

శ్రీమద్భాగవతమున నృసింహావతార కథయే ఇందుకు తార్కాణము. లోకులందరి దృష్టిలో ప్రహ్లాదుడు పరమబాలభాగవతుడుగ, హిరణ్యకశిపుడు మిక్కిలి క్రూరుడుగ కనపడుట సహజము. కాని ఇందు విచారించినచో హిరణ్యకశిపుడు అంతరంగికముగ ఎంతగా సాత్త్వికభక్తుడో, అంతగా బయటికి పరమరాక్షసుడు. ప్రపంచములో ఎక్కడ ఏతండ్రిగాని ఏకొడుకునుగాని ఇంత హింసల పాలుచేసినవాడు కానరాడు. ఈ ఘట్టములో పోతన నడిపించినకథ చాలహృదయంగమము. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని బాధించిన పద్ధతి:—

సీ॥ ఒకమాటు దిక్కుంభియూథంబుఁ దెప్పించి
కెరలి డింభకునిఁ ద్రొక్కింపఁ బంపు—
నొకమాటు విషభీకరోరగశ్రేణుల
గడువడి నర్భకుఁ గఱవఁబంపు—
నొకమాటు హేతిసంఘోగ్రానలములోన
విసరి కుమారుని వ్రేయఁబంపు—
నొకమాటు కూలంకషోల్లోలజలధిలో
మొత్తించి బాలకు ముంపఁబంపు

ఆ॥ విషముఁ బెట్టఁ బంపు; విదళింపఁగాఁ బంపు;
దొడ్డకొండచఱులఁ ద్రోయఁ బంపుఁ;
బట్టి కట్టఁ బంపు; బాధింపఁగాఁబంపు
బాలుఁ గినిసి దనుజపాలుఁ డధిప.

సీ॥ ఒకవేళ నభిచారహోమంబు సేయించు—
నొకవేళ నెండల నుండఁబంచు—
నొకవేళ వానల నుపహతి నొందించు —
నొకవేళ రంధ్రంబు లుక్కఁబట్టు—
నొకవేళఁ దనమాయ నొదవించి బెగడించు—
నొకవేళ మంచున నొంటి నిలుపు —
నొకవేళఁ బెనుగాలి కున్ముఖుఁ గావించు —
నొకవేళఁ బాఁతించు నుర్వియందు

తే॥ నీరు నన్నంబు నిడనీక నిగ్రహించుఁ
గశల నడిపించు ఉవ్విళ్లు గండశిలల
గదల వేయించు నేయించు ఘనశరములఁ
గొడుకు నొకవేళ నమరారి క్రోధియగుచు.

(ఆంధ్రమహాభాగవతము – సప్తమస్కంధం, 198 199. పద్య)

ఇంత బాధించినను చావని కొడుకునుగని "ఏకాంతంబున దురంత చింతా పరిశ్రాంతుండయి రాక్షసేంద్రుండు తన మనంబున,

ఉ॥ ముంచితి వార్ధులన్; గదల మొత్తితి; శైలతటంబులందు ద్రో—
బ్బించితి; శస్త్రరాజిఁ బొడిపించితి; మీఁద నిభేంద్రవంక్తి త్రో—
ప్పించితి; ధిక్కరించితి; శపించితి; ఘోరదవాగ్నులందుఁ ద్రో—
యించితిఁ; బెక్కుపాట్ల నలయించితిఁ జావఁ డిదేమిచిత్రమో!

చ॥ ఎఱుఁగఁడు జీవనౌషధము; లెవ్వరు భర్తలులేరు; బాధలం
దరలఁడు; నైజతేజమునఁ దథ్యము బాధ్యములేదు; మిక్కిలిన్
మెరయుచునున్నవాఁ; డొకని మేషము దైన్యము నొందఁ; డింక నే
తెఱఁగునఁ ద్రుంతు వేసరితి; దివ్యము వీని ప్రభావ మెట్టిదో?"

(ఆంధ్ర. భాగ. సప్తమస్కంధం - 201, 202, పద్య.)

అని తానే చింతించి తుదకు ఓసిగి వేసారి వీని అంతు కనుగొని యెదనని నీ విష్ణుఁడెందుగలడని ధిక్కరించి అడిగిన,

క॥ ఇందుఁగలఁ డందు లేఁడని
సందేహము వలదు; చక్రి సర్వోపగతుం;-
డెందెందు వెదకి చూచిన -
నందందే కలఁడు దానవాగ్రణి వింటే

(ఆంధ్ర. భాగ. స్క-7- పద్యం- 276)

అని ప్రహ్లాదుడు భాపింప

క॥ స్తంభమునఁ జూపవేనిం
గుంభిని నీశిరసుఁ ద్రుంచి కూల్పఁగ రక్షా -
రంభమున వచ్చి హరి వి-
స్రంభంబున నడ్డపడఁగ శక్తుండగునే

(ఆంధ్ర. భాగ. స్క 7- ప-280)

అని గద్దించి పలుక ప్రహ్లాదుఁడు,

శా॥ అంభోజాసనుఁ డాదిగాఁగఁ దృణపర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబున నుండుఁబోడ విపుల స్తంభంబునం దుండఁడే!
స్తంభాంతర్గతుఁడయ్యు నుండుటకు నేసందేహమున్ లేదు ని-
ర్దంభత్వంబున నేఁడు గానఁబడుఁ బ్రత్యక్షస్వరూపంబునన్

(పద్యం 282)

అని సమాధానింప,

శా॥ వినరా డింభక! మూఢచిత్త గరిమన్ విష్ణుండు విశ్వాత్మకుం
డని భాషించెద; వైన నిందుఁగలఁడే యంచున్ మదోద్రేకియై
దనుజేంద్రుం డరచేత వ్రేసెను; మహోదగ్ర ప్రభాశుంభమున్
జనదృగ్భీషణదంభమున్ హరిజనుస్సంరంభమున్ స్తంభమున్

(ఆంధ్ర. భా. స్క. 7- పద్యం 284)

అని స్తంభమును అరచేత గ్రుద్దెను. అప్పుడు స్వామి నరసింహా-స్వరూపముతో బ్రహ్మాదిపిపీలికాపర్యంతము నిండియుండుటచే, దెబ్బ పడిన స్తంభమునుండి ఫెళఫెళార్భటులతో భయంకరాట్టహాసంబుతో ఆవిర్భవించినం, గనుంగొని హిరణ్యకశిపుడు,

క॥ నరమూర్తి గాదు కేవల-
హరిమూర్తియుఁ గాదు మానవాకారముఁ గే-
సరియాకారము నున్నది
హరిమాయారచితమగు యథార్థము సూడన్

ఉ॥ తెంపున బాలుఁ డాడినను, ధీరత సర్వగతత్వముం బ్రతి
ష్ఠింపఁ దలంచి, యిందు నరసింహశరీరముఁ దాల్చి చక్రి శి-
క్షింపఁగ వచ్చినాఁడు; హరిచే మృతియంచుఁ దలంతు నైన. నా
సొంపును బెంపు నందఱును జూడఁ జరింతు హరింతు శత్రువున్

వలికెను.

(ఆంధ్ర. భా. స్క-7- పద్యం - 286, 287)

ఈ 287వ పద్యములో హిరణ్యకశిపుని జ్ఞానిత్వము వ్యక్తమగుచున్నది. 'హరిచే మృతియంచు దలంతును' అన్న వాక్యములో, వాడు పూర్వము ఘోరతపముచేసి బ్రహ్మనుండి కోరినవరములను

శా॥ గాలిం గుంభిని నగ్ని నంబువుల నాకాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములం దమఃప్రభల భూరిగ్రాహరక్షోమృగ-
వ్యాళాదిత్యనరాదిజంతుకలహవ్యాప్తిన్ సమస్తాస్త్రశ-
స్త్రాళిన్ మృత్యువులేని జీవనము లోకాధీశ! యిప్పింపవే

(పద్యం 90)

నిరూపించు పద్యమును ఒక్కసారి మననము చేయుదుమేని పంచభూతములు, తద్వికారములు, కాలము, దిక్కులు, వెలుపల, లోపల, పగలు, రాత్రి, పైన, క్రింద కాని ప్రదేశమునందును, ప్రాణము ముకలిగినవి, ప్రాణములేనివి కాని వస్తువులతో మరణమును కోరు-కొన్నాడు. ఇన్నింటికి అతీతమైనఉత్తమవస్తువు శ్రీమన్నారా-యణమూర్తి కాక వేరొకటుండునె? కావుననె, సర్వమూ శ్రీమన్నారా-యణ అవతారావతారమగు నృసింహునిచేత, స్వామిఒడిలోనే, ఏ ఆయుధములు లేక స్వామి గోళ్లచేతనే తనచావును కోరుకొన్నాడు భక్తుడు. భక్తుడు కోరుకొన్న కోరికను, వాని తపస్సుకు సంతుష్టుడైన పరమేశ్వరుడు కాదనక,

"వ॥ ఇట్లు కేవలపురుషరూపంబును, మృగరూపంబునుం గాని నరసింహరూపంబున, రేయునుం బవలునుంగాని సంధ్యాసమ-యంబున, నంతరంగంబును బహిరంగంబునుంగాని సభాద్వారంబున, గగనంబును భూమియునుంగాని యూరుమధ్యంబునఁ, బ్రాణసహితంబులును బ్రాణరహితంబులునుంగాని నఖంబులం, దైత్యలోక్య జన-హృదయ భల్లుండయిన దైత్యమల్లుని వధియించి, మహోదహనకీలా భీలదర్శనుండును, గరాళవదనుండును, లెలిహానభీషణ జిహ్వుండును, శోణితపంకాంకిత కేసరుండును నై; ప్రేవులు కంఠమాలికలుగ ధరించి, కుంభికుంభవిదళనంబు సేసి చనుదెంచుపంచాననంబునుం బోలె దనుజ కుంజర హృదయకమల విదళనంబు సేసి, తదీయ రక్తసిక్తంబులైననఖంబులు సంధ్యారాగరక్తచంద్ర రేఖల చెలువు వహింప సహింపక లేచి, తనకట్టెదుర నాయుధంబు లెత్తుకొని తత్తఱంబున రణంబునకు నురవణించురక్కసులఁ బెక్కుసహస్రంబులఁ జక్రాదికనిర్వక్రసాధనంబుల నొక్కనిఁ జిక్కకుండం జక్కడిచె."

దీనివలననే హిరణ్యకశిపుడు పరోక్షభక్తుడు. ప్రహ్లాదుడు ప్రత్యక్షభక్తుడు. ప్రహ్లాదునితల్లి కయాధు పరమపతివ్రతయని తెలినది.

శ్రీమద్రామాయణమున రావణునికథ సుప్రసిద్ధమే. వాడు పతివ్రతలను, యజ్ఞములను, సాధువులను ఎందరినో భంగపరిచెను. వాడు చేయనిపాపమంటూ లేదు.

ఇంకొకవైపు చూచినచో, వాడు గొప్పశాస్త్రవేదిత, మహా-మాహేశ్వర భక్తుడు. ఆజ్ఞ చేసి దేవేంద్రునికూడ తనయొద్దకు రప్పించుకొనగలఅధికారము గలవాడు. హేమమయమైన దివ్య-పత్తనము లంక వాని నివాసము, పుట్టినది బ్రాహ్మణవంశము. ఇన్నిటికీ బిందెడుపాలలో ఒక ఉప్పుగల్లన్నట్లు, వాడు లోకములను వేధించినకారణముగ దశముఖుడు రావణాసురుడైనాడు.

వీనికి కూడ శ్రీమహావిష్ణువునందు అంతరంగికముగ అపారమైన భక్తి. కాని బయటికి తనరావణత్వము మాత్రము విడువడు. తుదకు రామావతారముననున్న స్వామిభార్యనే అపహరించుకొని పోయినాడు. ఇంతకంటె వేరొక పాపము వానివిషయమున చెప్పవలసినదే లేదు.

భార్యను పోగొట్టుకొన్న రాముడు, కన్నీరు మున్నీరుగా ఏడ్చి లక్ష్మణ సహితుడై, సుగ్రీవునితో స్నేహము చేసుకొని, వానరులచే సీతను వెదకించి, లంకయందున్నట్లు తెలిసికొని, వారధిగట్టి దక్షిణ సముద్రము దక్షిణతీరమునకు చేరెను. ఇంతలో సాక్షాత్తు రావణుని-తమ్ముడు పరమభాగవతుడు మహాసత్త్వసంపన్నుడు అయిన విభీషణుడు సీతను రాముని కప్పగించుట మేలని అన్నకు బుద్ధి చెప్పి వానిచే తాడితుడై రాముని శరణు చొచ్చెను. వెంటనే రాముడు విభీషణునకు లంకారాజ్య పట్టాభిషేకము చేయించెను. రావణునితో యుద్ధము జరిగెను. రాక్షసులందరు వరుసగ మడిసిరి.

ద్విశ్శరం నాభిసంధత్తే
ద్విః స్థాపయతి నాశ్రితాన్
ద్విర్దదాతి న చార్థిభ్యః
రామో ద్విర్నాభిభాషతే॥

అని కీర్తి గడించిన శ్రీరాముడు రావణుని చంపుటకు మనసురాక, వానిని సంస్కరించి దొడ్డరాజుగా చేయవలెనను అభిప్రాయముతో, వానిని నాలుగుసార్లు గ్రుక్కత్రిప్పుకొననట్లు చేసి, యుద్ధభూమి నుండి లంకకు త్రిప్పి పంపెను. కాని రావణుడు పట్టువిడువక ఐదవ సారి యుద్ధమునకే వచ్చెను. అప్పుడు రాముడు ఇంక వీనిని సంస్క-రించుట వీలుగాని పని అని దొడ్డగా విజృంభించి "అరావణ మరా మంవా జగద్ద్రక్ష్యథ వానరాః" అని పలికి రావణునిపై యుద్ధము నకు తలపడెను. రావణుడు కూడ పట్టువిడువక యుద్ధమునకే ఉపక్రమించెను. అప్పుడు వీరిరువురిమనస్సులలోని భావములను సరిగా తూచి పసికట్టిన వాల్మీకి,

జేతవ్యమితి కాకుత్స్థః
మర్తవ్యమితి రావణః"

అని వారిరువురి అంతరంగిక అభిప్రాయములు వెలువరించినాడు. తుదకు తన కోరిక ప్రకారము అంతర్భాగవతుడగు రావణుడు చచ్చెనేకాని, రాముని కోరిక ప్రకారము సంస్కరింపబడలేదు. కావున పై చూపిన భారతభాగవతరామాయణములకు సంబంధించిన గాథలప్రకారము భగవంతునికంటె భక్తుడే గొప్ప.

ఈ నిర్ణయమే విశిష్టాద్వైత సిద్ధాంతమునందు ప్రబలముగ కానవచ్చును. దీనిని గురుతించేటట్టు అన్నమయ్య చూపిన ఈ సం-పుటములోని ఈ క్రింది 23, 49, 450 పాటలు ఉదాహరణముగ తీసి కొనవచ్చును.

శంకరాభరణం

అచ్యుత మిమ్ము(దలఁచేయంతపని వలెనా
యిచ్చల మీవారే మాకు నిహపరా లియ్య(గా ॥ పల్లవి ॥

మిమ్ము నెఱి(గినయట్టిమీదాసుల నెఱిఁగే—
సమ్మతివిజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీసేవసేసుకుండేటివైష్ణవుల
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు ॥ అచ్యు ॥

నిరతి నీకు మొక్కేనీడింగరిలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
పరగ నిన్నుఁ బూజించే ప్రపన్నులఁబూజించే—
సరిలేనిభాగ్యము చాలదా నాకు ॥ అచ్యు ॥

అంది నీకు భక్తులైన యలమహానుభావుల—
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడునీబంటుబంటుకు
సందడి బంట నవుటే చాలదా నాకు ॥ అచ్యు ॥

(ఈ సంపుటము-పాట23)

దేసాళి

నీవే నేరవుగాని నిన్నుఁ బండించేము నేము
దైవమా నీకంటే నీదాసులే నేర్పరులు ॥ పల్లవి ॥

వట్టిభక్తి నీమీ(ద వలుకువేసి నిన్నుఁ
బట్టితెచ్చి మతిలోనఁ బెట్టుకొంటిని
పట్టె(డుదులసి నీ పాదములపైఁ బెట్టి
బట్టిగొనిరి మోక్షము జాణలు నీదాసులు ॥ నీవే ॥

నీవు నిర్మించినవే నీకే సమర్పణసేసి
సోవల నీ కృపయెల్లఁ జూరగొంటిమి
భావించొక మొక్కు మొక్క భారము నీపై వేసిరి
పావనపునీదాసులే పంతపుచతురులు ॥ నీవే ॥

చెరువులనీళ్లు దెచ్చి చేరఁ(రెఁ?)డు నీపైఁజల్లి
వరము వడసితిమి వలసినట్టు
యిరవై శ్రీవేంకటేశ యిటువంటివిద్యలనే
దరిచేరి మించిరి నీదాసులేపో ఘనులు ॥ నీవే ॥

(ఈ సంపుటము—పాట—49)

శుద్ధవసంతం

ఎందు వెదకనేల యే ప్రయాసాలునేల
యిందే వున్నది బ్రదు కిహపరములకు ॥ వల్లవి ॥

ముక్కోటితీర్థములు ముకుందుదాసుల—
వొక్కపాదాంగుటమున నొలికీనిదె
మిక్కిలిజపతపాలు మించినప్రపన్నుల—
చిక్కనికృపాకటాక్షసీమ నున్నదిదివో ॥ ఎందు ॥

చేసేటిపుణ్యఫలాలు శ్రీవైష్ణవులచేత
రాసులై యిరుదెసల రాలీనిదె
ఆసల విజ్ఞానార్థ మదివో ప్రపన్నుల—
భాసురపుఁబెదవులఁ బాఁతి పైపై నున్నది ॥ ఎందు ॥

సకలదేవతలచే సాధించేవరములు
మొకరి తదియ్యులమూఁక నిదివో
వెకలి శ్రీవేంకటాద్రివిభునిమహిమలెల్లా
ప్రకటించి వీరిసల్లాపాన నున్నదిదివో ॥ ఎందు ॥

(ఈ సంపుటము—పాట 450)

ఇంతమాత్రమేకాక తాళ్ళపాకకవులవాఙ్మయ మందంతటా "దాసాను దాసుడను" ఇత్యాది ప్రయోగములుకూడ ఈ భావమునకే సూచకములు.

ప్రాచీనుడు ఆళ్వారులలో నొకడునగు కులశేఖరాళ్వార్ రచించిన ముకుందమాలలోని

త్వద్భృత్యభృత్య పరిచారకభృత్యభృత్య ।
భృత్యస్య భృత్య ఇతి మాం స్మర లోకనాథ

అను పద్యమూ.

దాసానుదాసచరమావధిదాసదాసః॥

ఇత్యాదులుకూడ ఈ సిద్ధాంతమునకు పరమోదాహరణములు కాగలవు.

ఈ సంపుటము నందు కొన్ని పదములు వ్యావహారిక దృష్టితో ప్రయోగింపబడి కొంత వివరణ మపేక్షించు చున్నట్లున్నవి. వానిలో మచ్చుకు కొన్ని.

1. చెల్లపిళ్లలు. పాట. 54 -1వ చరణం -2వ పాదం.
   శెల్వప్పిళ్లై = ముద్దుబిడ్డ అని తమిళము. అదియే చెల్లపిళ్లలుగా వ్యావహారికరూపము ధరించి వుండవచ్చు.
2. దూప: పాట 183 - 2వ చరణం - 1 వ పాదం.

తొడికి మింటితాపలు తుంచి దూప(?)దాటకినమ్ము

ఈ సంపుటము అచ్చువేయుసందర్భమున ఈ పదమునకు ఏదో ఒకటి అప్పటికి తోచినఅర్థము ఇచ్చినాను. తరువాత యోచింపగా ఈ క్రింది అర్థము గోచరించుచున్నది.

సీతారామకల్యాణానంతరము దశరథుడు వశిష్ఠాదులతో కలిసి అయోధ్యకు బయలుదేరగా, మార్గమధ్యమున భార్గవరాముడు ఎదురుపడతాడు. అప్పుడు అతడు శ్రీరామునిగూర్చి 'నీ పరాక్రమము విన్నాను, ఈ ధనుస్సును ఎక్కుపెట్టుము. బాణము సంధింపుము; చూతము నీ బలము' అని అడుగగా అతడట్లు చేయును. అప్పుడు రాముడు,

బ్రాహ్మణోఽసీతి పూజ్యో మే
విశ్వామిత్రకృతేన చ
తస్మాచ్ఛక్తో న తే రామ
మోక్తుం ప్రాణహరం శరమ్॥

ఇమాం పాదగతిం రామ
తపోబలసమార్జితాం
లోకా న్నప్రతిమాన్వా తే
హనిష్యామి యదీచ్ఛసి॥

నహ్యాయం వైష్ణవోదివ్యః
శరః పరపురంజయః
మోఘః పతతి వీర్యేణ
పరదర్పవినాశనః॥

(శ్రీమద్రామాయణము - బాలకాండ - 76 సర్గ శ్లో 6, 7, 9).

అంటాడు పరశురామునితో. దానికి బదులుగా పరశురాముడు,

న చేయం మమ కాకుత్స్థ
వ్రీడా భవితు మర్హతి
త్వయా త్రైలోక్యనాథేన
యదహం విముఖీకృతః॥

II

శర మప్రతిమం రామ
మోక్తు మర్హసి సువ్రత
శరమో`క్షే గమిష్యామి
మహేందం పర్వతో`త్తమమ్॥
స హతాన్ దృశ్య రామేణ
స్వాన లో`కాన్ తపసాఽఽర్జితాన్
జామదగ్న్యో జగామాశు
మహేంద్రం పర్వతో`త్తమమ్॥

శ్రీమద్రామాయణము - బాలకాండ - 76 సర్గ - శ్లోకం - 19, 20, 22.

ఈ పై వాక్యములు చెప్పినాడు.

ఇందు అభివ్యక్తమైన ఈగాథయే ఈపాదమునందు సూచిత మైనదని నాయభిప్రాయము.

మింటి తాపలు=ఊర్ధ్వలో`కపు మెట్లు, పరశురాముడు దీర్ఘ-కాల తపస్సుతో` ఊర్ధ్వలో`కములకు నడచిపో`వుశక్తిని సంపాదించు-కొ`నియుండినాడు. ఆ ఊర్ధ్వలో`కగతిని రామబాణము హరించినది. బాణము వ్యర్థము కాకూడదు కదా. అందువలననే నేటికిని పరశు రాముడు చిరంజీవులలో` ఒకడుగా ఇహలో`క వాసిగా కీర్తింపబడు-చున్నాడు;

అశ్వత్థామా బలి ర్వ్యాసః హనూమాంశ్చ విభీషణః।
కృపః పరశురామశ్చ సప్తైతే స్థిరజీవినః॥

అని.

దూప=దప్పి, శ్రమ కావచ్చు. ఈ రెండర్థములు శ. ర. లో` సూ. ని. లో` ఇవ్వబడినవే.

దూపతాఁకిన=దప్పిగొ`న్న; శ్రమగొ`న్న - కావచ్చు.

8. తిరుపళచ్చి :- పాట 298 – పల్లవి-1వ పాదం.

ఇది "తిరు పళ్ళి ఎళుచ్చి" అను ఆరవపదమునకు సంగ్రహ రూపమైన వ్యావహారిక పదము కావచ్చు.

తిరుపళ్లిఎళుచ్చి = శ్రీ శయ్యోత్థాపనము = మంగళకరమైన పడకనుండి మేలుకొలుపు కావచ్చు.

ఈ సంపుటమునకు ఇంతమాత్రము పీఠిక తయారు చేసి, ఈవాఙ్మయమున ఏయే పెద్దలు ఎంతెంత వరకు పనిచేసి ఎంతెంత కార్యము సాధించినారనువిషయమును ఏ సంపుటమున నైన ఇయ్య-వలెనను ఆశ ఒకటి వుండినది. దానిని దీనికి అనుబంధముగా "తాళ్ల-పాకకవులవాఙ్మయము–పరిష్కర్తలు" అను శీర్షికతో ఇచ్చుచున్నాను.

# తాళ్లపాకకవులవాఙ్మయము – పరిష్కర్తలు

అన్నమాచార్యప్రాజెక్టుక్రింద పరిష్కరణశాఖ ఒకటి, ప్రచారశాఖ రెండుగా పనిచేయుచున్నవి. అందులో పరిష్కరణ శాఖకు సంబంధించిన విషయములను ఇందు తెలుపుచున్నాను.

1974 నుండి శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శ్రీ వేంకటేశ్వర-ప్రాచ్యకళాశాల ఆంధ్రశాఖాధ్యక్షపదవినుండి వాతికముగాను, 1976 జూలై నుండి పూర్తిగ అన్నమాచార్యవాఙ్మయపరిష్కరణ చేయుటకు బదిలీ చేయబడిరి. తదుపరి 1979 జనవరినుండి ఈ అన్నమాచార్యవాఙ్మయపరిష్కరణశాఖకు "స్పెషలాఫీసరు" హోదాతో శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, J. బాలసుబ్రహ్మణ్యముM. A. అను సహాయకునితో కలిసి పనిచేయుచున్నారు.

## దీని సంగ్రహపూర్వచరిత్ర

ఈ తాళ్లపాక కవుల వాఙ్మయము 1922-23 ప్రాంతమునుండి, అప్పటి దేవస్థానపుటుద్యోగియగు కీ॥ శే॥ సాధుసుబ్రహ్మణ్యశాస్త్రి గారి సూచనపై, రాగి రేకులనుండి పరిష్కరణ ప్రకటన కార్యములు ప్రారంభములైనవి. వారు ఈ రాగి రేకులలోని వాఙ్మయమునంతా అప్పటి హైస్కూల్ తెలుగుపండితులు కీ॥ శే॥ కలబరిగి వేంకటరమణ శాస్త్రులద్వారా ఎత్తివ్రాయించినారని, వారు ఉద్యోగనియంత్రణ—ములో వేరొకచోటికి బదలీకాగా, అప్పటిచెక్కపెట్టెలనిండా నింపిన ఈవాఙ్మయమంతా నష్టమైపోయినదని శ్రీ సాధు సుబ్రహ్మణ్య శాస్త్రిగారే స్వయముగా నాతో చెప్పిరి. హతశేషమైన ఆ వాఙ్మయ మును మహారాజశ్రీ రావుబహద్దూరు శ్రీ K. సీతారామరెడ్డి, B. A' B. L. (కమీషనరు తి. తి. దే) గారి అధికారముక్రింద, కీ॥ శే॥ పండిత విజయరాఘవాచార్యులు (ఎపిగ్రఫిస్టు, తి తి. దే) వారిపరి— ష్కరణముతో, "తాళ్లపాకకవుల లఘుకృతులు (The Minorworks of tallapaka poets) "అనుపేరుతో మొదటి సంపుటము (vol. I) ను 1935 లో ప్రకటించిరి. తరువాత "అధ్యాత్మసంకీర్తనలు" గల రెండవసంపుటము (vol II) ను 1936 లోను, "శృంగారసంకీర్తనలు" గలమూడవ సంపుటము(voll III) ను 1937 లోను శ్రీమాన్ పండిత వి. విజయరాఘవాచార్యులుగారే పరిష్కరించి ప్రకటించిరి. కాని వీరి ఈ ముద్రణములందు ఎక్కడను రేకులసంఖ్యగాని, నేటి వ్రాతమోడికి తగిన అచ్చుపద్ధతిగాని పాటింపబడలేదు. పై రెండవ, మూడవ సంపుటములలోని కీర్తనలన్నియు తరువాతి తరువాతి సంపుటములలో అచ్చైపోయినవి కాబట్టి, ఇంక ఆ సంపుటములు లెక్కలోనికి తీసికొనవలసినపనిలేదు.

అట్లే పై వారిపరిష్కరణముతోనే తాళ్లపాకవంశమునకు చెందిన చినతిరువెంగళనాథ(చిన్నన్న)రచితములగు మూడు

ద్విపద కావ్యములు I) అష్టమహిషీ కల్యాణము (1937), II) ఉషా కల్యాణము (1938), (III) పరమయోగి విలాసము (1938) ప్రకటితములైనవి.

1940-1941 విద్యాసంవత్సరమునందు తి. తి. దేవస్థానము వారిచే "శ్రీ వేంకటేశ్వర సంస్కృత పాఠశాల" "శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల"గా రూపొందింపబడి, దానిలో తెలుగు, హిందీ, అరవము మొదలైన విద్వాన్ పట్టములు ప్రారంభింపబడినవి అట్లనే 1939వ సంవత్సరములోనే "శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనసంస్థ" కూడ ప్రారంభింపబడినది. ఆ పరిశోధనాలయములో పలువురు ఉద్దండ పండితులు పరిశోధనలు సాగించినారు. వారిలో కీ॥ శే॥ మానవల్లి రామకృష్ణకవిగారు, కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తెలుగునకు సంబంధించిన ప్రముఖులు. కీ॥ శే॥ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు తొలుత ప్రాచ్యకళాశాలలో ఆంధ్రశాఖకు అధ్యక్షులుగ పాఠములు బోధించుచుండిరి. తరువాత కొంతకాలమునకు వారు పరిశోధనకంకితమైరి. అప్పుడు వారు తాళ్లపాకకవుల వాఙ్మయమును పరిశోధించి ప్రకటింపబూనిరి.

శ్రీ శాస్త్రిగారు పరిశోధనకు దిగిన వెంటనే తాళ్లపాక పెదతిరుమలాచార్యుల వైరాగ్యవచనగీతములను రేకులలో నున్నవాటితోపాటు తంజావూరులో లభించిన వానినికూడ చేర్చి, 1945 సంవత్సరమున "వైరాగ్యవచనమాలికలు" అను పేరుతో వెలయించిరి. తరువాత కీర్తనల భండారమును వరుసగా ప్రకటించుటకు, కీర్తనల రేకులను ఇవి, ఇవి ఫలానా ఫలానా వారివి అని విభజించి 1947లో, కీ॥ శే॥ పండిత విజయరాఘవాచార్యులు ప్రకటించిన లఘుకృతుల, కీర్తనల సంపుటముల సంఖ్య కనుబంధించి IV వ సంపుటముగ అన్నమయ్య శృంగారకీర్తనల తొలివంద రేకులలోని 31 వ రేకులోని 3 వ పాట నుండి, 60 వ రేకు వరకు గల

పూ_ర్తిపాటలను ప్రకటించిరి. తక్కినవి III సంపుటమున ముద్రిత ములు గనే భావించి వదలివేసిరి. తరువాత 1950వ సంవత్సరమున అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనల తొలివంద రేకులలోని 54 రేకుల-లోని 331 పాటలను V సంపుటముగ ప్రకటించిరి. ఈ మధ్యలో 1949 వ సంవత్సరమున శ్రీ శాస్త్రిగారు, చిన్నన్న రచించిన అన్నమాచార్యచరిత్ర (ద్విపద)47 పేజీలతో ముగియగా, దానికి 183 పేజీల విపులపీఠికను సంతరించి, ఆ చరిత్రకు సాక్ష్యములిచ్చు కీర్తన-లను జోడించి, పై చరిత్రతో కలిపి ప్రకటించినారు. ఈ సందులో "శ్రీ వేంకటేశ్వరలఘుకృతులు" అను పేరుతో నానాకవులు నానా విధవృత్తములతో రచించిన గ్రంథము నొకదానిని ప్రకటించిరి.

ఈ 5 గ్రంథముల ప్రకటనతరువాత కాలపురుషుడు శాస్త్రి-గారిని మనకు దూరము చేసినాడు శ్రీ శాస్త్రిగారు ఈ సంపుటము-లను ముద్రించి ప్రకటించడముతో పాటు, దేవస్థానము వారి సాహాయ్య-ముతో అన్నమాచార్యుల వర్ధంతి నొకదానిని సాగించుచువచ్చిర అందు పండితప్రముఖులచేత తాళ్లపాక వాఙ్మయములోని సాహిత్య-మును విమర్శింపజేయుచు, విజయవాడ ఆలిండియా రేడియో వారి-సహాయముతో తాళ్లపాకవారి సంకీర్తనగానసుధను నలుమూలల వ్యాపింపజేయుచు వచ్చిరి. ఆ సాంప్రదాయ మీ నాటికిని సాగు చున్నది. వారిసేవ ఈ వాఙ్మయమునకు 5 సంవత్సరములే ఐనను మరపురాని మహౌషధిగా పనిచేసినది.

— —

ఈ శాఖలో ఎన్ని గ్రంథములు ఎప్పుడెప్పుడు ఎవరెవరిచేత పరిష్కరింపబడి ప్రకటింపబడినవో, వానిని వివరముగా తెలుపగలపట్టిక.

| సంపుటము | సంవత్సరము | వివరములు | పరిష్కర్త |
|---|---|---|---|
| I సంపుటము | 1935 | తాళ్లపాకకవులలఘుకృతులు (రేకులసంఖ్యలేదు) | పండిత వి.విజయ రాఘవాచార్య |
| II సంపుటము | 1936 | అధ్యాత్మ సంకీర్తనలు రేకుల సంఖ్యలేదు | ,, |
| III సంపుటము | 1937 | శృంగార సంకీర్తనలు (రేకులసంఖ్య లేదు.) | ,, |
| (i) ద్విపద | 1937 | అష్టమహిషీకల్యాణము (చిన్నన్న) | ,, |
| (ii) ద్విపద | 1938 | ఉషాకల్యాణము (చిన్నన్న | ,, |
| (iii) ద్విపద | 1938 | పరమయోగి విలాసము (చిన్నన్న) | ,, |
| వైరాగ్యవచన మాలికలు | 1945 | పెదతిరుమలయ్య వచనములు | వేటూరి ప్రభాకర శాస్త్రి |
| IV సంపుటము | 1947 | అన్నమాచార్యుల శృంగార కీర్తనలు (30 రేకులు) | ,, |
| అన్నమాచార్యచరిత్ర | 1947 | చిన్నన్నద్విపద + పీఠిక | ,, |
| V సంపుటము | 1950 | అన్నమయ్య అధ్యాత్మ కీర్తనలు (50 రేకులు) | ,, |
| VI సంపుటము | 1951 | అన్నమయ్య అధ్యాత్మ కీర్తనలు (50 రేకులు) | ఏ. వి. శ్రీనివాసాచార్యులు |
| సంకలనము | 150 | ఉత్సవగాయకోప యోగార్థముద్ధృతములు | ,, |
| VII సంపుటము | 1951 పాటలు | అన్నమయ్యఅధ్యాత్మ కీర్తనలు (50 రేకులు) | రా. అ. కృష్ణశర్మ ఏ. వి. శ్రీనివాసాచార్యులు ,, |
| VIII సంపుటము | 1952 | ,, (50 రేకులు) | ,, |
| IXసంపుటము | 1952 | అన్నమయ్య అధ్యాత్మకీర్తనలు (50 రేకులు) | గాళ్లపల్లి అనంత కృష్ణశర్మ |

**ఈ శాఖలో ఎన్ని గ్రంథములు ఎప్పుడెప్పుడు ఎవరెవరిచేత పరిష్కరింపబడి ప్రకటింపబడినవో, వానిని వివరముగా తెలుపగలపట్టిక.**

| సంపుటము | సంవత్సరము | వివరములు | పరిష్కర్త |
|---|---|---|---|
| X సంపుటము | 1952 | ,, (50 రేకులు) | రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ |
| XI సంపుటము | 1955 | ,, (70 రేకులు + కొన్ని విడురేకుల్లోని కీర్తనలు) | ,, |
| (i) సంపుటము | 1955 | 54 పాటలు స్వరపరచినవి | ,, |
| (ii) సంటము | 1956 | ,, ,, | ,, |
| XII సంపుటము | 1956 | అన్నమయ్య శృంగార సంకీర్తనలు (64 రేకులు) | |
| XIII సంపుటము | 1960 | ,, (100 రేకులు) | ,, |
| XIV సంపుటము | 1961 | ,, (50 రేకులు) అ-శృంగారసంకీర్తనలు | రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ ఏ. వి. శ్రీనివాసాచార్యులు |
| XV సంపుటము | 1961 | ,, (50 రేకులు) | ఎ. వి. శ్రీనివాసాచార్యులు |
| XVI సంపుటము | 1962 | చినతిరుమలయ్య అధ్యాత్మ + శృంగార కీర్తనలు (30 రేకులు) | ,, |
| XVII సంపుటము | 1963 | అన్నమయ్య శృంగార కీర్తనలు (100 రేకులు) | ,, |
| XVIII సంపుటము | 1964 | అన్నమయ్య శృంగారకీర్తనలు (100 రేకులు) | పి. టి. జగన్నాథ రావు |
| XIX సంపుటము | 1965 | అన్నమయ్య శృంగార కీర్తనలు (100 రేకులు) | రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గౌరిపెద్ది రామ సుబ్బశర్మ |
| XX సంపుటము | 1965 | ,, (100 రేకులు) | ,, |
| XXI సంపుటము | 1975 | పెద తిరుమలయ్య అధ్యాత్మ కీర్తనలు (100 రేకులు) | పి. టి. జగన్నాథ రావు |

ఈ శాఖలో ఎన్ని గ్రంథములు ఎప్పుడెప్పుడు ఎవరెవరిచేత పరిష్కరింపబడి ప్రకటింపబడినవో, వానిని వివరముగా తెలుపగలపట్టిక.

| సంపుటము | సంవత్సరము | వివరములు | పరిష్కర్త |
|---|---|---|---|
| 22 (xxii) | 1975 | అన్నమయ్యశృంగారకీర్తనలు (100 రేకులు) | రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ<br>గౌరిపెద్ది రామ సుబ్బశర్మ |
| 12 (xii) | 1976 | అన్న-శృం-యూనివర్సిటి వారికై విపులమైనపీఠికతో | గౌ. రా. శర్మ |
| 23 (xxii) సం | 1976 | పెదతిరుమలయ్యశృంగార కీర్తనలు (100 రేకులు) | పి. టి. జగన్నాథ రావు |
| 24 (xxiv) సం | 1977 | అన్నమయ్యశృంగారకీర్తనలు (100 రేకులు) | గౌరిపెద్ది రామ సుబ్బశర్మ |
| 25 (xxv) సం | 1977 | ,, (100 రేకులు) | ,, |
| అన్నమాచార్యచరిత్ర పీఠిక | 1978 | మూడవ ముద్రణ | ,, |
| 26 (xxvi) సం | 1979 | ,, (100 రేకులు) | ,, |
| 27 (xxvii) సం | 1979 | ,, (100 రేకులు) | ,, |
| 28 (xxviii) సం | 1980 | ,, (100 రేకులు) | ,, |
| 29 (xxix) సం | 1980 | ,, (100 రేకులు) | ,, |
| 30 (xxx) సం | 1983 | ,, (100 రేకులు) | ,, |
| 31 (xxxi) సం | 1984 | ,, (100 రేకులు) | ,, |
| 1 వ సంపుటము | 1980 | ద్వితీయముద్రణ.<br>అన్నమయ్య అధ్యాత్మకీర్తనలు (100 రేకులు) | ,,<br>,, |
| 2 సంపుటము | 1981 | ,, (100 రేకులు) ద్వితీయ ముద్రణ. | ,, |

ఈ శాఖలో ఎన్ని గ్రంథములు ఎప్పుడెప్పుడు ఎవరెవరిచేత పరిష్కరింపబడి ప్రకటింపబడినవో, వానిని వివరముగా తెలుపగలపట్టిక.

| సంపుటము | వివరములు | పరిష్కర్త |
|---|---|---|
| 3వ సంపుటము | అన్నమయ్య అధ్యాత్మ కీర్తనలు (100 రేకులు) ఈ సంపుటమే | గౌరిపెద్ది రామ సుబ్బశర్మ |
| 32 ,, | అన్నమయ్య శృంగార సంకీర్తనలు 100 రేకులు ముద్రణమునకు సిద్ధము చేయబడినది. | ,, |
| 33 ,, | ,, (100 రేకులు) | ,, |
| 34 ,, | ,, (100 రేకులు) | ,, |
| 35 ,, | ,, (100 రేకులు) | ,, |
| 4 ,, | అన్నమయ్యఅధ్యాత్మకీర్తనలుద్వితీయ (100 రేకులు)ముద్రణకు సిద్ధము చేయబడినది. | ,, |

శ్రీమాన్ ఏ. వి. శ్రీనివాసాచార్యులు తి తి. దేవస్థాన-వేంకటేశ్వరప్రాచ్యపరిశోధనాలయములో నుండియే VI వ సంపుటమును స్వతంత్రముగను, VII, VIII సంపుటములను కీ॥ శే॥ పూజ్యులు రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారితో కలిసియు వెలువరించిరి.

1956 లో వేంకటేశ్వరప్రాచ్య పరిశోధనాలయము, అందున్న పండితులు, సిబ్బందితోపాటు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము-నకు దేవస్థానము వారిచే దానము చేయబడిన తరువాత, విశ్వవిద్యా-లయమువారి అనుమతితో XV, XVI, XVII సంపుటములను శ్రీమాన్ శ్రీనివాసాచార్యులుగారు స్వతంత్రముగ వెలువరించిరి

వేటూరి ప్రభాకరశాస్త్రిగారి చేతనే 'సంగీత సాహిత్యపుష్టి గలవా' రని పేర్కొనబడిన పూజ్యులు శ్రీరాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

గారు మైసూరు ప్రభుత్వకళాశాలనుండి విశ్రాంతిగైకొన్న తరువాత, ఈ దేవస్థానములో దఫాలువారిగా కొన్నిసార్లు పనిచేసిరి. 1962లో శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు దేవస్థానమునుండి విశ్రాంతిగైకొనగా, ఈ వాఙ్మయమంతయు కీ. శే. పి. టి. జగన్నాథ రావుగారికి అప్పగింపబడి, వారు XVIII సంపుటమును ప్రకటించిరి. XIX, XX సంపుటములను పూజ్యులు కీ॥ శే. రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ కలిసి పరిష్కారముద్రణములు సాగించినారు. కీ॥ శే. పి. టి. జగన్నాథరావుగారు పెదతిరుమలా చార్యుల శృంగార, అధ్యాత్మసంకీర్తనలుగల XXI XXIII సంపుట ములను కూడ వెలువరించిరి.

24 (XXIV) సంపుటమునుండి ఇప్పటివరకు జరిగిన జరుగు చున్న సంపుటముల పరిష్కరణమంతయు శ్రీ గౌరిపెద్దిరామసుబ్బ శర్మ చేతిమీదుగనే సాగినది, సాగుచున్నది.

ఇదికాక ఎన్నడో అచ్చై చెల్లిపోయిన చిన్నన్న ద్విపద కావ్య ములు కూడ ప్రస్తుతం శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ పరిష్కరించు చున్నారు. అవి త్వరలో ముద్రణభాగ్యమునందగలవు.

శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ ఉద్దేశము ప్రకారము అన్నమా చార్య అధ్యాత్మకీర్తనల సంపుటములు-4, అన్నమాచార్య శృంగార కీర్తనల సంపుటములు-20, పెదతిరుమలాచార్యుల అధ్యాత్మకీర్తనల సంపుటము-1, పెదతిరుమలాచార్యుల శృంగారకీర్తనల సంపుటము1, చినతిరుమలాచార్యుల శృంగారాధ్యాత్మకీర్తనల సంపుటము - 1 (అన్నీకలిసి 30 రేకులు కాబట్టి) కాగా, తాళ్లపాక కవుల లఘు కృతుల సంపుటము-1, చిన్నన్నరచించిన ద్విపదకావ్యములు 3, అన్న మాచార్య చరిత్రతోకూడ -4, వెరసి 32 సంపుటములు-అగును, నార సింహమంత్ర సంఖ్యతో "తాళ్లపాకకవుల వాఙ్మయనారసింహము" అను పేరుతో ఈ గ్రంథమండలిని అంతా ప్రకటింపవచ్చును.

పరమ భాగవతులు, మన వేంకటేశ్వరస్వామికే మీదుగట్టిన భక్తిగలవారు అగు ఈ తాళ్ళపాకకవుల వాఙ్మయమును లోకమునందంతటా ప్రకాశింప జేయుటకు రాగిరేకులలో నున్నదానిని పుస్తకరూపముగా ప్రచురించుటకు ఎంత ఖర్చైనను వెనుకాడని తి. తి. దేవస్థానముల కమిటీ చైర్మన్, శాసనసభ్యులునగు శ్రీ వి. కె. డి. వి. సత్యనారాయణరాజుగారికి, వారి ఆదేశమును ఇబ్బడిముబ్బడిగా పండింపగల తి. తి. దేవస్థానముల కార్యనిర్వహణాధికారి శ్రీ యస్. లక్ష్మీనారాయణ ఐ. ఏ. యస్ గారికిని నా ధన్యవాదములు. తమది పై అజమాషీయే అయినా సొంతమగు శ్రద్ధతో ఈ — పనికి తోడ్పడుచున్న తి. తి. దేవస్థానముల పౌరసంబంధ శాఖాధికారి డా॥ రావుల సూర్యనారాయణమూర్తిగారికి, మాపనియందు నిత్య సంబంధము గలిగి మాకడుగడుగున తోడ్పడుచున్న 'సప్తగిరి' సంపాదకులు శ్రీ కాట్రపాటి సుబ్బారావు M.A., గారికి, అచ్చుపనిలో పనికి ముందుస్థానమిచ్చి నడిపించుచున్న తి. తి. దే. ప్రెస్ మేనేజరు శ్రీ యం. విజయకుమారరెడ్డిగారికిని నా కృతజ్ఞతలు.

ఈ పరిష్కరణ కార్యములందు నాకు సర్వవిధముల చేదోడు వాదోడుగా పనిచేయుచున్న చి॥ కె. బాలసుబ్రహ్మణ్యం, యం. ఏ. కు నా మంగళాశాసనములు.

అచ్చుపనిలో కడుజాగరూకులై మాకు తోడ్పడుచున్న — దేవస్థానము అచ్చుకూర్పరులకు నా మంగళాశాసనములు. మాకను గప్పి దొరలిన తప్పులను సవరించి మా కను విప్పగలసహృదయులకు మా అభినందనములు.

శ్లో॥ రంగనాథకవేః సత్తాం సహేతుం యోన్వరూపయత్
కట్టమంచిమతిక్రమ్య రాళ్లపల్లిగురుం స్తువే

తిరుపతి,
22—7—85.

ఇట్లు
బుధవిధేయుడు
**గౌరిపెద్ది రామసుబ్బశర్మ,**
తాళ్లపాక వాఙ్మయ పరిష్కర్త.

# పీఠిక

అన్నమాచార్యులఅధ్యాత్మకీర్తనలలో ౨౦౧-వ రేకు మొదలు ౨౫౦-వ రేకు వఱకును గల ౨౮౯ సంకీర్తనలు ఈ యెనిమిదవ సంపుటముగా ప్రకటింపఁబడినవి. ఇఁక మూఁడుసంపుట-ములలో ఆయనగారిఅధ్యాత్మకీర్తనలన్నియు ముగిసి ముద్రణ-కెక్కఁగలవు. వాని సంశోధనకార్యము త్వరగా సాఁగుచున్నది. అందుపై వారిశృంగారసంకీర్తనలసముద్రము నీఁదుప్రయత్నము చేయవలసియున్నది ఈఁదించువాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు. ఈఁదు కోరికమాత్రమే మాది.

ఇందలి సంకీర్తనలలో 'అలిమేలుమంగ జూడఁబోతే' అను ౧౨౬వదియు, 'ఈతఁడే ముక్తిదోవ' అను ౧౮౩వదియు అన్నమాచార్యునివి కావనుట స్పష్టము. కుమారుఁడు పెదతిరుమలయ్య-గారిదో మనుమలదో కాఁగలదు. చెప్పినవారిదో చెక్కినవారిదో అసడ్డచేత అన్నమాచార్యసంకీర్తనములలోఁ గలిసినవి. రేకులలోని క్రమమును మార్చు స్వాతంత్ర్యము వహింపలేదు గనుక ఉన్నరీతినే ప్రకటించుటయైనది.

కీర్తనలకన్నిటికిఁ గాకున్నను కొన్నిటికైనను లఘుటీక వ్రాసి ప్రకటించుట మేలని కొందఱు మిత్రులు సూచించిరి. కాని 'దీన్నిగడిచి దీర్ఘాయుష్మంతుడై తేగదా పెన్నదాటి పెరుమాళ్ళ-సేవ చేసేది' అను సామెత పదే పదే జ్ఞప్తికి వచ్చి నన్ను భయపెట్టుచున్నది. ప్రకృత మీయుండుపరస్పరాప్రకృతులను ప్రకటింపఁ గల్గితిమేని అదే పదివేలు. అందుమీఁద అన్నమాచార్యుల భాష, కవిత, మతము మొదలగు విషయములచర్చ యెంతో చేయవలసియున్నది. అది నాచేతనే చేయించునో నాకంటె సమర్థతరుల కా-కైంకర్యమునిచ్చునో ఆ శ్రీనివాసులకే యెఱుక!

యథాపూర్వముగా ప్రాచ్యపరిశోధనాలయమందలి గ్రంథ-భాండాగార పండితులగు శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసా-చార్యులు ఈ సంకీర్తనల సంశోధన కైంకర్యమందు చూపుచున్న అసాధారణశ్రద్ధాభక్తులు అభినందనీయములు. వారికి నాయనంత-మంగళాశాసనములు

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము.
తిరుపతి
15-3-52.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

# పీఠిక

ఈ తొమ్మిదవ సంపుటమున ౨౫౧-వ రేకు మొదలు ౨౯౯ వ రేకు వఱకునుగల ౨౮౮ అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనలు. ప్రకటింపఁబడినవి. ఒక్కొక్కసంపుటమందు ౫౦ రేకులసంకీర్తన-ములను క్రమముగా ప్రచురించుట యీవల మేమవలంబించిన పద్ధతి. ౩౦౦-వ రేకు మాకు లభింపమిచే ౪౯ రేకుల సారస్వతము మాత్రమే ఇందు చేర్పఁబడినది. ౮-వ సంపుటమునఁగూడ ౨౧౬-వ రేకు లభింపమిచే ఇట్లే ౪౯ రేకులకే సంపుటము ముగింపఁబడినది. ఈ సంపుటమున ౨౯౬-వ రేకును పేర్కొనక పోవుట పొరఁబాటు. ౨౬౫-వ సంకీర్తనము మొదలు ఆఱు పదములు ఆ సంఖ్యగల రేకు-లోనివి.

౧౮౪-వ సంకీర్తనము 'ఆరీతిఁ తాళ్ళపాక అన్నమయ్య ఘనుఁడాయ-వారివారమై నేము వహికి నెక్కితిమి' అని ముగియుటచే, ౮ వ సంపుటమందలి ౧౨౬, ౧౮౩, సంఖ్యలసంకీర్తన-ములవలె, ఇదియు అన్నమాచార్యుల రచన కాదనియు, పుత్ర పౌత్రులలో ఎవరో రచించినదనియు, సంకలనముచేసినవారి పొరఁబాటున ఇందు చేరినదనియు ఊహింపవలసియున్నది.

యథాపూర్వముగా శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనా-లయమందలి గ్రంథభాండాగారపండితులు శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు ఈ సంపుటమును సిద్ధపఱుచుటయందు నాకు చేసిన తోడ్పాటు శ్రీ శ్రీనివాసుని పరమానుగ్రహమునకుఁ బాత్ర-

మైనది. తప్పొప్పులపట్టిక యావశ్యకత లేకుండవలెనను సంకల్పముతో చిత్తులు దిద్దుట జరిగినది. ఐనను అందందు కొన్ని చిఱుతప్పులు కన్నుమీఱి నిలిచినవి. సహృదయులు వానిని సులభముగా సవరించుకొందురు.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము. తిరుపతి.
18—6—1952

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ,
సంగీతవాఙ్మయ పరిశోధకుడు.

శుభమస్తు

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహనశకవరుషంబులు ౧౩౪౬ అగునేఁటిక్రోధిసంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించినపదారుయేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అదిమొదలు-గాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగునేఁటిదుందుభి సంవత్సరఫాల్గుణ బ ౧౨*నిరుధానకు (నిరోధానకు? తిరోధానానకు) తిరు-వేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన అధ్యాత్మ సంకీర్తనలు.

రేకు 201 మాళవి

ఇట్టిప్రతాపముగలయీతనిదాసులనెల్ల
కట్టునా కర్మములెల్ల గాలిఁ బోవుఁగాక. ॥పల్లవి॥

యెలమిఁ జక్రాయుధున కెదురా దానవులు
తొలఁగ కెందు చొచ్చినఁ దుండించుఁగాక
ఇల గరుడధ్వజుపై నెక్కునా విషములు
కలఁగి నీరై పారి గాలిఁ బోవుఁగాక. ॥ఇట్టి॥

---

* ఈ శబ్దము, 'విరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారికరూపముగా గానవచ్చు-చున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాఁడు కడవటిదినమని తాత్పర్యము. శ్రీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన 'సరియగు' అనునర్థము తాత్పర్యార్థము గావచ్చును. 'అవధి' అను నర్థములో "ఈ నిరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండవెంగ-మాంబగారిప్రయోగము దీనికి సహాయపడుచున్నది.' సాహిత్య అకాడమీవారి 'విష్ణుపారిజాతము' ౯౯ పుట. నేఁటిప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు "నిఱుత్తం" అనునరవపదముగూడ 'నిలుపు' అను నర్థముతో దీనికి సహాయపడుననిరి.

గోవర్ధనధరునిపై కొలుపునా మాయలు
వేవేలదునుకలై విరుగుఁగాక
కేవలుఁడచ్యుతునొద్దఁ గీడు చూపఁగలవా
కావరమై తాఁ దానె గాలిఁ బోవుఁగాక. ॥ఇట్టి॥

వీరనాఁసింహునకు వెరపులు గలవా
దూరాన గగ్గులకాడై తొలఁగుఁగాక
కోర యీ శ్రీవేంకటేశుఁ గొలిచితి మిదివో
కారుకొన్నపగలెల్ల గాలిఁ బోవుఁగాక. ॥ఇట్టి॥ 1

బౌళి

ఏది నిజంబని యెటువలె నమ్ముదు
పోదితోడ నను బోధింపవే. ॥పల్లవి॥

సత్తు నసత్తని సర్వము నీవని
చిత్తగించి శ్రుతి చెప్పెడిని
వుత్తమమధ్యమ మొగిఁ గలదని మరి
యిత్తల శాస్త్రము తేర్పరచీని. ॥ఏది॥

నానారూపులు నరహరి నీవని
పూనినవిధు లిటు పొగడెడిని
మానక హేయము మరి వుపాధే(దే?)యము
కానవచ్చి యిలఁ గలిగియున్నవి. ॥ఏది॥

భావాభావము పరమము నీవని
దైవజ్ఞులు నినుఁ దలఁచెదరు
శ్రీవేంకటగిరిఁ దెలఁగిననీవే
తావుగ మదిలోఁ దగిలితివి. ॥ఏది॥ 2

సాళంగనాట

గెలిచితి భవములు గెలిచితి లోకము
ఎలమి నీదాసుల కెదు రింక నేది. ॥ పల్లవి ॥

జయ జయ నరసింహా జయ పుండరీకాక్ష
జయ జయ మురహర జయ ముకుంద
భయహరణము మాకుఁ బాపనాశనము
క్రియతోడి నీసంకీర్తన గలిగె. ॥ గెలి ॥

నమో నమో దేవ నమో నాగపర్యంక
నమో వేదమూర్తి నారాయణా
తిమిరి మమ్ముఁ గావఁగ దిక్కయి మాకు నిలువ
బమళిభుజముల [1]శంకుఁజక్రములు గలిగె. ॥ గెలి ॥

రక్ష రక్ష పరమాత్మ రక్ష శ్రీవేంకటపతి
రక్ష రక్ష కమలారమణ పతి
అక్షయసుఖ మియ్యఁగల న(వ?)టు దాపుదండగా
పక్షివాహనుఁడ నీభక్తి మాకుఁ గలిగె. ॥ గెలి ॥ ౩

దేసాళం

ఎక్కడ చూచిన వీరే యింటింటిముంగిటను
పెక్కుచేఁతలు సేసేరు పిలువరే బాలుల. ॥ పల్లవి ॥

పిన్నవాఁడు కృష్ణుఁడు పెద్దవాఁడు రాముఁడు
వన్నె నిద్ద రమడలవలె నున్నారు
వెన్నలు దొంగిలుదురు వీఁడు వాఁడు నొక్కచే
పన్నుగడై వచ్చినారు పట్టరే యీబాలుల. ॥ ఎక్క ॥

1. 'శంఖచక్రములు' పూ. ము. పా.

నల్లనివాఁడు కృష్ణుఁడు తెల్లనివాఁడు రాముఁడు
అల్లదివో కోడెకోడెలై వున్నారు
వెల్లవిరై తిరిగేరు వేరు లేఁ దద్దరికిని
పెల్లుగ యశోదవద్దఁ బెట్టరె యీబాలుల. ॥ఎక్క॥

రోలఁ గట్టె నొకఁడు రోఁకలి వట్టె నొకఁడు
పోలిక సంబేసికిఁ బోంచి వున్నారు
మేలిమి శ్రీవేంకటాద్రి మించిరి తానే తానై
ఆలించి నె(యొ?)వ్వరి నేమి ననకురే బాలుల. ॥ఎక్క॥ 4

నాట

దాసోహ మనుబుద్ధిఁ దలఁచరు దానవులు
యీసులకే పెనఁగేరు యిప్పుడూఁ గొందరు. ॥పల్లవి॥

హరిచక్రముదూషించేయట్టివారే యసురలు
అరయఁ దామేదైవమన్నవారు నసురలే
ధర నరకాసురుఁడు తానే దైవమని చెడె
యిరవై యిది మానరు యిప్పుడూఁ గొందరు. ॥దాసో॥

పురుషోత్తమునిపూజపొంతఁ బోరు అసురలు
సరవి విష్ణుని జపించనివారు నసురలే
హిరణ్యకశిపుఁడును యీతని నొల్లక చెడె
ఇరవై యీతని నొల్ల రిప్పుడూఁ గొందరు. ॥దాసో॥

సురలును మునులును శుకాదియోగులును
పరమము శ్రీవేంకటపతి యనుచు
శరణని బ్రదికేరు సరి నేఁడు వైష్ణవులు
యెరపరికానఁ బోయ్యే రిప్పుడూఁ గొందరు. ॥దాసో॥ 5

బౌళి

వెట్టివాఁడ వెట్టివాఁడ వినియుఁ గనియుఁ మర
వెట్టి దెలిసి రోఁకలి వేరె చుట్టేఁగాక. ॥పల్లవి॥

పుట్టించినవాఁడవట పూఁచి నన్నుఁ బెంచలేవా
[1]కట్టఁగడ నమ్మని నాకడమేకాక
వొట్టి నాలో నుందువట వొగిఁ బాపము నాకేది
గట్టిగాఁ బుణ్యము వేరే కట్టుకొనేఁగాక. ॥వెట్టి॥

యేడనైనా నీవేయట యెదుట నుండఁగలేవా
వేడ(డె?)వెట్టి యేడనైనా వెదకేఁగాక
ఆడినదెల్లా నీవట అందులోఁ దప్పులున్నవా
వీడుపడ్డతలఁపుతో వెరచేఁగాక. ॥వెట్టి॥

భావించితే మెత్తువట పరము నీవియ్యలేవా
[2] నీవాఁడననినానేరమే కాక
శ్రీ వేంకటేశుఁడ నేను చేరి నీకు శరణంటి
దేవుఁడవై కావఁగా నే దిద్దుకొనేఁగాక. ॥వెట్టి॥ 6

రేకు-202 అహిరి

పూచినయీదేహము పువ్వుగాని పిందెగాని
చేచేత నెవ్వరికిఁ జెప్పనోపఁ బ్రియము. ॥పల్లవి॥

పుట్టించినదైవము పూరి మేపునా మమ్ముఁ -
బట్టినపూర్వకర్మము పాసిపొయ్యీనా
మెట్టినసంసారము మెదిగినపాటే చాలు
తొట్టి కన్నవారినెల్ల దూరనోప మిందుకు. ॥పూచి॥

1. అరసున్నవిచార్యము, 2. నీవాఁడను+అనవి

నొసలఁ వ్రాసినవ్రాలు నుసిగితే మానినా
కొసర జగము నాకే కొత్తలయ్యీనా
వుసురుతోడిసుఖము వుండినపాటే చాలు
కొసరి జన్మము లింకాఁ గోరనోప నేను. ॥పూచి॥

యేలినవాఁడు శ్రీహరి యేమిసేసినా మేలె
వేళతో నాతఁడే శ్రీవేంకటేశుఁడు
పాలించె నాతఁడు మమ్ము పదివేలులాగులను
యీలాగులనే సుఖియించేము నేము. ॥పూచి॥ 7

ధన్నాసి

పుట్టినట్టె వున్నవాఁడ పోలేదు రాలేదు
ఇట్టె నీదాసుఁడ నైతి యెంగిలెల్లఁ బాసె ॥పల్లవి॥

వెలినున్న జగమెల్ల విష్ణుఁడ నీమహిమే
అలరి నాలోన నీవే అంతరాత్మవు
తెలిసి నేనున్నచోటే దివ్యవైకుంఠము
వెలలేనినరకములవెరపెల్లఁ దీరె. ॥పుట్టి॥

తనువుతోనుండేది నీతలఁచినతలఁపేనా
మనువుసంసారము నీమాయచేతిదే
పనులనాకర్మము నీపంచినట్టిపనుపే
మనసులోపలియనుమానమెల్లఁ బాసె. ॥పుట్టి॥

తెరమరుగుదినాలు దేవుఁడ నీకల్పితమే
నొరిది యీసురలెల్ల చుట్టాలే నాకు
నిరతి శ్రీవేంకటేశ నీమరఁగు చొచ్చి నేఁడు
గురునియానతిచేతఁ గొంకులెల్లా బాసె. ॥పుట్టి॥ 8

వరాళి

ఐనదయ్యీఁ గానిదెల్లా నటు గాకుండితే మాని
మానుపరా దివి హరిమాయామహిమలు ॥ పల్లవి ॥

పుట్టేటి వెన్ని లేవు పోయేటి వెన్ని లేవు
వెట్టిదేహాలు మోచినవెడజీవులు
గట్టిగాఁ దెలుసుకొంటే కలలోనివంటి దింతే
పట్టి ఇందుకుఁగా నేల బడలేమో నేము ॥ ఐన ॥

కడచిన వెన్ని లేవు కాచుకున్న వెన్ని లేవు
నుడిగొన్నతనలోనిసుఖదుఃఖాలు
యెడపుల నివి రెండు యెండనీడవంటి వింతే
కడనుండి [1]నేమేలకరఁగేమో [2]నేము. ॥ ఐన ॥

కోరినవి యెన్ని లేవు కోరఁగల వెన్ని లేవు
తీరనిసంపదలతో తెందేపలు
ధారుణి శ్రీవేంకటేశుదాసులమై యిన్నియును
చేరి కైకొంటిమి యేమిసేసేమో నేము. ॥ ఐన ॥ 9

సాళంగం

భక్తసులభుఁడును పరతంత్రుఁడు హరి
యుక్తిసాధ్య మిదె యొకరికిఁ గాఁడు. ॥ పల్లవి

నినుపగులోకముల నిండినవిష్ణుఁడు
మనుజుఁడ నాలో మనికియయ్యె
మునుకొని వేదముల ముడిగినమంత్రము
కొననాలికలలోఁ గుదురై నిలిచె. ॥ భక్త ॥

---

1. 2. ఇట్టి పునరుక్తులక్కడక్కడ గలవు.

యొలమి దేవతలనేలినదేవుఁడు
నలుగడ నధముని నను నేలె
బలుపగు లక్ష్మీపతియగు శ్రీహరి
యిల మాఁయింటను యిదివో నిలిచె. ॥ భక్త ॥

పొడవుకుఁ బొడవగుపురుషోత్తముఁ డిదె
బుడిబుడి మాచేతఁ బూజ గొనె
విడువ కిదివో శ్రీవేంకటేశ్వరుఁడు
బడివాయఁడు మాపాలిట నిలిచి. ॥ భక్త ॥ 10

లలిత

జ్ఞానినైనా నీకుఁ బో దజ్ఞానినైనా నీకుఁ బోదు.
నేను చేసిననేరమి నీకే సెలవయ్యా. ॥ పల్లవి ॥

గరిమ మాపుట్టుగు నీగర్భవాసములోనే
అరయ మామోహము నీయరచేతిదే
వెరవు లెంచుకోఁబోతే వేరే మాకు గతి లేదు
నిరతి మాబదుకులు నీకే సెలవయ్యా. ॥ జ్ఞాని ॥

నిండినమాకోరికలు నీపెరరేఁపులే
వుండఁ జోటు నీకు నావుల్లములోనే
చండిపెట్టి మాకైతే స్వతంత్ర మించుకా లేదు
నిండినమాచేఁతలెల్లా నీకే సెలవయ్యా. ॥ జ్ఞాని ॥

యిదె మాసంసారములు యిట్టె నీకల్పితములు
తుదమొదలును నీవే తోడునీడవు
యెదుట శ్రీవేంకటేశ యేలినవాఁడవు నీవే
నిదురమాదినములు నీకే సెలవయ్యా. ॥ జ్ఞాని ॥ 11

సాళంగనాట

ఎక్కడి నరకములు యెక్కడి మృత్యువు మాకు
దక్కి నీదివ్యనామామృతము చూరగొంటిమి. ॥పల్లవి॥

తమితో [1] శ్రీపతి నీదాసులఁ జేరినప్పుడే
యమకింకరభయము లణఁగిపోయ
జమళి నీయాయుధలాంఛనము మోచినప్పుడే
అమరఁ గాలదండము లవియెల్లఁ బొలిసె. ॥ఎక్క॥

మును నీనగరిత్రోవ మొగమైనయప్పుడే
ఘనయామ్యమార్గము గట్టువడియ
వొనర నీతిరుపతి నొకరాత్రి వున్నపుడే
కనలు కాలసూత్రాదిఘాతలెల్లఁ బూడె. ॥ఎక్క॥

యెడరై నీమంత్రజప మెంచుకొన్నయపుడే
కడుఁ జిత్రగుప్తునిలెక్కలు గడచె
వడిగా శ్రీవేంకటేశ్వర మీశరణనఁగా
అడరి వైకుంఠము మాయరచేత నిలిచె. ॥ఎక్క॥ 12

రేకు—208 సామంతం

పురుషుల నీగతి బోధించి బోధించి
సురతసమాధియందుఁ జొక్కించే రదివో ॥పల్లవి॥

కొంకక సతులనేటిగురువు లందరికి
కంకిగా మర్మాలు సోఁకఁగ వార్షించి
లంకెలను బంచాంగుళహస్తమస్తకమున
వుంకువఁ దమయంగము వుపదేశించేరు. ॥పురు॥

1. 'శ్రీపతిదాసులఁ' పూ. ము. పా.

మదనమంత్రములెల్ల మరి చెవిలోనఁ జెప్పి
మొదల నఖాంకురపుముద్రలు వెట్టి
పదిమారులుఁ దమ్ములప్రసాదములు వెట్టి
వుదుట సంసారబ్రహ్మ ముపదేశించేరు. ॥ పురు ॥

బడలించి అనంగపరవస్తువును జూపి
కడపట విరక్తిఁ గడు బోధించి
తడవి శ్రీ వేంకటేశుదాసులఁ దప్పించి
వుడివోనిజీవులకు నుపదేశించేరు. ॥ పురు ॥ 13

గుజ్జరి

ఇంతేపో వారివారిహీనాధికములెల్ల
పంతాన తా మేపాటిభాగ్యము నాపాటే. ॥ పల్లవి ॥

అందరిలో దేవుఁడుండు అందధికులు గొందరు
కొందరు హీనులై కుందుదు రింతే
చెంది పిచేగాలొకటే చేనిపంటా నొకటే
పొంది గట్టికొలుచుండి [1] పొల్లు కడఁబడును. ॥ ఇంతే ॥

పుట్టుగందరి కొకటే భూమిలో యేలికలును
వెట్టిబంట్లుఁ గొందరై వీఁగుదు రింతే
చుట్టి వరిగురుమతో జొన్నగింజ సరిదూఁగు
తెట్టలై మేలొకటికి కీలొకటికాయ. ॥ ఇంతే ॥

కోరి శ్రీ వేంకటపతికుక్షిలోనే లోకములు
ఆరయఁ [2] గిందెడు మీఁదెడై వున్నవింతే
యీరీతి నితనిదాసు లెక్కిరి పొడవులకు
తారి కిందికె దిగిరి దానవులై కొందరు ॥ ఇంతే ॥ 14

1. 'పొల్లగడఁ' రేకు. 2. "గిందేడు మీఁదేడై " పూ. ము. పా. కిందెడు= కిందికి దిగినవి. మీఁదెడు=పైకెక్కినవి.

లలిత

అన్నిటా నాపాలిటికి హరి యాతఁడే కలఁడు
యెన్నికగాఁ దుదిపద మెక్కితిమి మేలు. ॥పల్లవి॥

కొందరుజీవులు నన్నుఁ గోపగించినా మేలు
చెంది కొందరట్టె సంతసించినా మేలు
నిందించి కొందరు నన్ను నేఁడే రోసినా మేలు
పొందుగ కొందరు నన్నుఁ బొగడినా మేలు. ॥అన్ని॥

కోరి నన్నుఁ బెద్దసేసి కొందరు మొక్కినా మేలు
వేరే హీనుఁడని భావించినా మేలు
కూరిమిఁ గొందరు నన్నుఁ గూడుకుండినా మేలు
మేరతో విడిచి నన్ను మెచ్చకున్నా మేలు ॥అన్ని॥

యిప్పటికిఁగలపాటి యెంతవేదయినా మేలు
వుప్పతిల్లుసంపద నాకుండినా మేలు
యెప్పుడు శ్రీవేంకటేశు కే నిచ్చినజన్మ మిది
తప్పు లే దాతనితోడితగులమే మేలు, ॥అన్ని॥ 15

ధన్నాసి

ఊరకే నీశరణని వుండుటే నాపనిగాక
యీరీతి నావుపాయము లేద లెక్కినయ్యా. ॥పల్లవి॥

ముందే అంతర్యామివై మొగి నాలో నుండఁగాను
చెంది నిన్ను లేనివానిఁ జేసుక నామనసులో
గొంది నీయాకారముగా కొంత నే భావించుకొంటా
ఇందుఁ గల్పితధ్యానము లెట్టు చేసేనయ్యా. ॥ఊర॥

కన్నులఁ జూచినందెల్ల కమ్మి నీవై యుండఁగాను
అన్నిటాఁ బ్రత్యక్షమందు అభావన చేసుకొని
విన్ననై తెలియలేక వేరే యెందో వెదకుచు
పన్నినప్రయాసాలఁ బడనేఁటికయ్యా. ॥ ఊర ॥

శ్రీవేంకటాద్రిమీఁద శ్రీపతివై కొలువుండి
ఆవటించి తలఁపులో నచ్చొత్తి నట్టుండఁగాను
దేవుఁ డెట్టివాఁడంటా తెగనిచదువులందు
సోవలుగా నింక నేమి సోదించేనయ్యా. ॥ ఊర ॥ 16

రామక్రియ

భూమిలోనఁ గొత్తలాయఁ బుత్రోత్సవ మిదివో
నేమవు[1]కృష్ణజయంతి నేఁడే యమ్మా ॥ పల్లవి ॥

కావిరి బ్రహ్మాండము కడుపులోనున్నవాని
దేవకి గర్భమున నద్దిర మోచెను
దేవతలెల్ల వెదకి తెలిసి కాననివాని
యీవల వసుదేవుఁడు యెట్టు గనెనమ్మా. ॥ భూమి ॥

పొడవుకుఁ బొడవైన పురుషోత్తముఁడు నేఁడు
అడరి తొట్టెలబాలుఁడాయ నమ్మ
వుడుగక యజ్ఞభాగమొగి నారగించేవాఁడు
కొడుకై తల్లిచన్ను గుడిచీనమ్మా. ॥ భూమి ॥

పాలజలధియల్లుండె(డై ?) పాయకుండేయీతనికి
పాలవుట్లపండుగ [2]బాఁతే(తా?)యనలే
అలరి శ్రీవేంకటాద్రి [3]నాటలాడనే మరిగి
పేలరియై కడు పెచ్చువెరిగీనమ్మా ॥ భూమి ॥ 17

1. 'క్రిష్ణ' రేకు 2 'బాఁతేయ' రేకు. బాఁతి+అయ=బాఁతేయ ఇట్టి వ్యావహారిక సంధు లీవాఙ్మయమున కొల్లలు. 3. నాటలాడ నే మరిగి। పూ. ము. పా.

లలిత

అందాఁకా నమ్మలేక అనుమానపడు దేహి
అంది నీసొమ్ముగనక అదియుఁ దీరుతువు. ॥ పల్లవి ॥

నీదాసుఁడననేటినిజబుద్ధి గలిగితే
ఆదెస నప్పుడే పుణ్యుఁడాయ నతఁడు
[1]వేప(దుః)తో నొక్కొక్కవేళ వెలుతులు గలిగితే
నీదయవెట్టి వెనక నీవే తీరుతువు. ॥ అందా ॥

తొలుత నీశరణము దొరకుటొకటేకాని
చెలఁగి యాజీవునికిఁ జేటు లేదు
కలఁగి నడుమంత్రాన గతిదప్పనడచిన
నెలకొని వంకలొత్త నీవే నేరుతువు. ॥ అందా ॥

నీవల్లఁ గొరత లేదు నీపేరు నొడిగితే
శ్రీవేంకటేశ యిటె చేరి కాతువు
భావించలేకుండఁగాను భారము నీదంటేఁ జాలు
నీవారి రక్షించ నీవే దిక్కౌదువు. ॥ అందా ॥ 18

రేకు 204 లలిత

కడునజ్ఞానపుకరవుకాల మిదె
వెడలదొబ్బి మావెరపు దీర్చవే. ॥ పల్లవి ॥

పాపపుపసురము బందెలు మేయఁగ
పోపులపుణ్యము పొలివోయ
శ్రీపతి నీకే చేయి చాఁచెదము
యేపున మమ్మిఁక నీడేర్చవే. ॥ కడు ॥

1. 'వేధ'కు 'వేద' అని ఈవాఙ్మయమున పలుతావుల గందు.

యిలఁ గలియుగమను యెండలు గాయఁగ
చెలఁగి ధర్మమనుచెరు వింకె
పొలసి మీకృపాంబుధి చేరితి మిదె
తెలిసి నాదాహము తీర్చవే. ॥ కదు ॥

వడిగొని మనసిజవాయువు విసరఁగ
పొడవగు నెఱుకలు పుటమెగసె
బడి శ్రీవేంకటపతి నీశరణము
విడువక చొచ్చితి వెసఁ గావఁగదే. ॥ కదు ॥ 19

గుజ్జరి

భావించి నేరనైతి పశుబుద్ధి నైతిని
యీవల నాయపచార మిది గావవయ్యా. ॥ పల్లవి ॥

హరి నీవు ప్రపంచమందుఁ బుట్టించితి మమ్ము
వరము నే సాధించేది బలుద్రోహ మవుఁగాదో
సిరులనేలేటివాఁడు చెప్పినట్టు సేయక
విరసాలు బంట్లకు వేరే సేయఁదగునా. ॥ భావిం ॥

పంచేంద్రియములు నాపైఁ బంపువెట్టితివి నీవు
యెంచి వాని నే దండించే దిది నేరమౌఁగాదో
పెంచేటితల్లిదండ్రులు ప్రియమై వడ్డించఁగాను
కంచము కాలఁదన్న సంగతియా బిడ్డలకు. ॥ భావిం ॥

మిక్కిలిసంసారము మెడఁగట్టితివి నాకు
అక్కర నే వేసారేది అపరాధ మవుఁగాదో
దిక్కుల శ్రీవేంకటాద్రిదేవుఁడ నీవియ్యఁగాను
యెక్కడో జీవుఁడ నేను యెమరాడఁదగునా. ॥ భావిం ॥ 20

రామక్రియ

గరుడధ్వజం బెక్కె కమలాక్షు పెండ్లికి
పరుష లదివో వచ్చెఁ బైపై సేవించను. ॥ పల్లవి ॥

పాడిరి సోబాన నదె భారతియు గిరిజయు
ఆడిరి రంభాదులై నచ్చరలెల్ల
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి
వేడుకలు మీరఁగ శ్రీవిభుని పెండ్లికిని. ॥ గరు ॥

కురిసెఁ బువ్వులవాన కుప్పలై యెందు చూచిన
మొరసె దేవదుందుభి మోఁతలెల్లను
బెరసె సంపదలెల్ల వెంటలై శ్రీవేంకటాద్రి
తిరమైమించిన దేవదేవుని పెండ్లికిని. ॥ గరు ॥

వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల
పోసి రదే తలఁబాలు పుణ్యాపతులు
ఆసల శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
సేసలు వెట్టినయట్టిసింగారపు పెండ్లికి. ॥ గరు ॥ 21

గుండ్రక్రియ

ఇతరచింత లికఁ నేమిటికి
అతఁడే గతియై అరసేటివాఁడు. ॥ పల్లవి ॥

కర్మమూలమే కాయము నిజ—
ధర్మమూలమే తనయాత్మ
అర్మిలి రెంటికి హరియొకఁడే
మర్మ మితఁడే మనిపేటివాఁడు. ॥ ఇత ॥

బహుళభోగమయము ప్రపంచము
నిహితజ్ఞానము నిజము త్రి
ఇహపరములకును యీశ్వరుఁడే
సహజపుఁగర్త జరపేటివాఁడు. ॥ ఇత ॥

అతిదుఃఖకరము లాసలు
సతతసుఖకరము సమవిరతి
గతి యలమేల్మంగతో శ్రీవేంకట-
పతి యొకఁడిన్నిటఁ బాలించువాఁడు ॥ ఇత ॥ 22

శంకరాభరణం

అచ్యుత మిమ్ముఁదలఁచేయంతపని వలెనా
యిచ్చల మీవారే మాకు నిహపరా లియ్యఁగా. ॥ పల్లవి ॥

మిమ్ము నెఱిఁగినయట్టిమీదాసుల నెఱిఁగే-
సమ్మతివిజ్ఞానమే చాలదా నాకు
వుమ్మడి మీసేవసేసుకుండేటివైష్ణవుల -
సమ్ముఖాన సేవించుటే చాలదా నాకు. ॥ అచ్యు ॥

నిరతి నీకు మొక్కేటినీడింగరీలకు
సరవితో మొక్కుటే చాలదా నాకు
వరగ నిన్నుఁ బూజించేప్రపన్నులఁ బూజించే-
సరిలేనిభాగ్యము చాలదా నాకు. ॥ అచ్యు ॥

అంది నీకు భక్తులై నయలమహానుభావుల-
చందపువారిపై భక్తి చాలదా నాకు
కందువ శ్రీవేంకటేశ కడు నీబంటుబంటుకు
సందడిబంట నవుటే చాలదా నాకు. ॥ అచ్యు ॥ 23

భవుళి

నవనీతచోర నమో నమో
నవమహిమార్ణవ నమో నమో. ॥ పల్లవి ॥

హరి నారాయణ కేశవాచ్యుత శ్రీకృష్ణ
నరసింహ వామన నమో నమో
మురహర పద్మనాభ ముకుంద గోవింద
నరనారాయణరూప నమో నమో. ॥ నవ ॥

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవ త్రివిక్రమ ద్వారక –
నగరాధినాయక నమో నమో. ॥ నవ ॥

వైకుంఠ రుక్మిణీవల్లభ చక్రధర
నాకేశవందిత నమో నమో
శ్రీకరగుణనిధి శ్రీ వేంకటేశ్వర
నాకజననుత నమో నమో. ॥ నవ ॥ 24

రేకు 205 శంకరాభరణం

అతఁడే సకలము అని భావింపుచు
నీతితో నడవక నిలుకడ యేది. ॥ పల్లవి ॥

యెందునుఁ జూచిన యీశ్వరుఁ డుండఁగ
విందుల మనసుకు వెలితేది
సందడించేహరిచైతన్య మిదివో
కందువలిఁక వెదకఁగ నేది. ॥ అతఁ ॥

అంతరాత్ముఁడై హరి పొడచూపఁగ
పంతపుకర్మపుభయ మేది
సంతత మాతఁడే స్వతంత్రుఁ డిదివో
కొంత గొంత మరి కోరెడి దేది. ॥ అతఁ ॥

శ్రీవేంకటపతి జీవుని నేలఁగ
యీవల సందేహ మిఁక నేది
భావం బీతఁడు ప్రపంచ మీతఁడు
వేవేలుగ మరి వెదకెడి దేది. ॥ అతఁ ॥ 25

సాళంగనాట

అద్దిరా వోయయ్య నే నంతవాఁడనా। వొక-
కొద్ది నీదాసులసేవ కోరఁగలఁగాక ॥ పల్లవి ॥

హరి నీమాయలకు నే నడ్డము చెప్పేవాఁడనా
అరిదైన దదియు రాచాజ్ఞ గనక
పరమపదాన కాసపడుటయు ద్రోహము
సొరిది నీభండారము సొమ్ముగనక. ॥ అద్ది ॥

పంచేంద్రియముల నేఁ బారఁదోలేవాఁడనా
ముంచి నీవు వెట్టినట్టిముద్ర కర్తలు
అంచల నావిజ్ఞాన మది దలఁచవచ్చునా
నించి నీవు పాఁతినట్టినిధాన మది. ॥ అద్ది ॥

వొట్టి సంసారపుమోపు వోపనేవాఁడనా
వెట్టి మమ్ముఁ జేయించేటివేడుక నీది
గట్టిగా శ్రీవేంకటేశ [1]కడిసి నీశరణంటి
అట్టుగ నేఁ జెప్పేదా మిఱఁగ నీరహస్యము. ॥ అద్ది ॥ 26

1. కదిసి—రేకు.

రామక్రియ

ఇచ్చలోఁ గోరేవల్లా ఇచ్చేధనము
అచ్యుతనామమెపో అధికపుధనము. ॥ పల్లవి ॥

నారదాదులువొగడేనాలుకపయిధనము
సారపువేదములలో చాటేధనము
కూరిమిమునులు దాఁచుకొన్నట్టిధనము
నారాయణనామ మిదే నమ్మినట్టిధనము. ॥ ఇచ్చ ॥

పరమపదవికి సంబళమైనధనము
యిరవై భక్తులకెల్లా నింటిధనము
పరగ నంతరంగాన పాఁతినట్టిధనము
హరినామ మిదియపో అరచేతిధనము. ॥ ఇచ్చ ॥

పొంచి శివుఁడు కాశిలో బోధించేధనము
ముంచినఆచార్యులమూలధనము
పంచి శ్రీ వేంకటపతి పాలించేధనము
నించి విష్ణునామ మదే నిత్యమైనధనము ॥ ఇచ్చ ॥ 27

శ్రీరాగం

ఇతనికంటె ఘను లిఁక లేరు
యితరదేవతలయిందరిలోన. ॥ పల్లవి ॥

భూపతి యీతఁడె పొదిగి కొలువరో
శ్రీపతి యీతఁడే చేకొనరో
యేపున బలువుఁడు నీతఁడే చేరరో
పైపై వేంకటపతి యైనవాఁడు. ॥ ఇత ॥

మరుగురుఁ డితఁడే మతి నమ్ముఁగదరో
పరమాత్ముఁ డితఁడె భావించరో
కరివరదుఁ డితఁడె గతి యని తలఁచరో
పరగ శ్రీవేంకటపతి యై నాఁడు. ॥ఇత॥

తల్లియు నితఁడే తండ్రియు నితఁడే
వెల్లవిరై యిఁక విడుఁకురో
చల్లగా నితని శరణని బ్రతుకరో
అల్ల శ్రీవేంకటహరి యయినాఁడు. ॥ఇత॥ 28

లలిత

చూడ వేడుకలు సొరిది నీమాయలు
తోడనే హరి హరి దొంసీ నిదివో. ॥పల్లవి॥

పుట్టేటిజీవులు పొదలేటిజీవులు
జట్టిగొని రిదియే జగమెల్లా
కట్టిడికర్మము కాయజుమర్మము
నెట్టుకొన్న దిదె నిఖిలంబెల్లా. ॥చూడ॥

ములిగేటిధనములు మోచేటిధనములు
కలిమి మెరసె లోకంబెల్లా
పొలసి వేగుటలు పొద్దు గుంకుటలు
కలిగిన విదివో కాలంబెల్లా. ॥చూడ॥

తగిలేటిపురుషులు తమకపుకాంతలు
బగివాయని దీబదుకెల్లా
అగపడి శ్రీ వేంకటాధిప నీకృపఁ
దెగనిజీవనము దినదినమెల్లా. ॥చూడ॥ 29

దేవగాంధారి

ఎన్నఁడొకో నేఁ దెలిసి యెక్కుడయి బ్రదికేది
పన్నినవనాగుణమెల్లా భ్రమతపాలాయ. ॥పల్లవి॥

ధనమద మిదె నన్ను దైవము నెఱఁగనీదు
తనుమద మెంతయిన తపముఁ జేయనీదు
ఘనసంసారమదము కలుషముఁ బాయనీదు
మనెడినామనువెల్ల మదముపాలాయ. ॥ఎన్న॥

పొంచి కామాంధకారము పుణ్యము గానఁగనీదు
కంచపుజన్మపుచిక్కు గతి చూపదు
పెంచి యజ్ఞానతమము పెద్దల నెరఁగనీదు
చించరానినాబుద్ధి చీఁకటిపాలాయ. ॥ఎన్న॥

శ్రీవేంకటేశ్వరుమాయ చిత్తముఁ దేరనీదు
యేవంకా నీతఁడే గతి యిన్నిటా మాకు
యేవుపాయమును లేక యీతనిమఱఁగు చొచ్చి
దేవుఁ డంతర్యామి యని తేజముఁ బొందితిమి. ॥ఎన్న॥ 80

రేకు 206 సాళంగనాట

అని రావణుతల లట్టలుఁ బొందించి
చెనకి భూతములు చెప్పె బుద్ధి ॥పల్లవి॥

కట్టిరి జలనిధి కపిసేన లవిగో
చుట్టు లంక కంచుల విడిసె
కొట్టిరి దానవకోట్లతల లదే
కట్టిడిరావణ గతియో నీకు. ॥అని॥

యెక్కిరి కోటలు యిందరు నొకపరి
చిక్కిరి కలిగినచెరయెల్ల
పక్కన సీతకుఁ బరిణామమూయ
[1]నిక్కె(క్క?)ము రావణ నీకో బ్రదుకు. ॥అని॥

పరగ విభీషణుఁ బట్టము గట్టెను
తొరలి లంకకును తొలుఁదొలుతే
గరిమెల శ్రీవేంకటగిరి రాముఁడు
మెరసెను రావణ మేలాయఁ బనులు. ॥అని॥ 81

దేవగాంధారి

దైవము నీవే యిఁక దరి చేరుతువుగాక
జీవులవసము గాదు చిక్కిరి లోలోననే. ॥పల్లవి॥

పుట్టుట సహజ మిది పొదలేజీవులకెల్ల
గట్టిగా జగమునందు కలకాలము
నట్టేటివరదవలె నానాటినీమాయ
కొట్టుక పారఁగఁ జొచ్చె కూడినవిజ్ఞానము. ॥దైవ॥

పాపమే సహజము బద్ధసంసారులకెల్ల
కాఁపురపువిధులలో కలకాలము
తేపలేవిసముద్రము తెరఁగున కర్మమెల్లా
మాపురేపు ముంచఁజొచ్చె మతిలోనిధైర్యము. ॥దైవ॥

లంపటమే సహజము లలి దేహధారులకు
గంపమోపు [2]కోరికెలకలకాలము
యింపుల శ్రీవేంకటేశ ఇదె నీదాసులని
పంపుసేసి బ్రదికించె ప్రపన్నుసుగతి. ॥దైవ॥ 82

1. 'నిక్కెము' వంటిప్రయోగములు ఈ వాఙ్మయమున వందిగ గలవు.
2. 'కోరికలు కలకాలము' కావచ్చు.

గుండక్రియ

ఇట్టి నాస్తికులమాట యేమని నమ్మేరి దీక
పట్టి సములమంటానే భక్తుల దూషింతురు. ॥ పల్లవి ॥

వేదములు చదువుతా విశ్వమెలాఁ గల్లనేరు
ఆదెస తాము పుట్టుండి అదియును మాయనేరు
పాదగువిష్ణుఁడుండఁగ బయలు తత్త్వమనేరు
లేదు జీవత్వమంటా లేములఁ బొందుదురు ॥ ఇట్టి ॥

తిరమై తమఇండ్ల దేవపూజలు సేసేరు
ధరలోన తముఁ దామే దైవమనేరు
అరయఁ గర్మమె బ్రహ్మమని యాచరించేరు
సరి నదే కాదని సన్యసించేరు. ॥ ఇట్టి ॥

అందుక పురుషసూక్తమర్థముఁ జెప్పుదురు
కందువ నప్పటి నిరాకారమందురు
యిందులో శ్రీవేంకటేశ యిటె నీదాసులుగాక
మందపురాతనులాదేమతము నడతురు. ॥ ఇట్టి ॥ 33

వసంతవరాళి

ఇహముఁ బరముఁ జిక్కె నీతనివంక
అహిశయనునిదాసులంతవారు వేరీ. ॥ పల్లవి ॥

సిరిగలిగినవారు చింతలిన్నిటనుఁ బాసి
నిరతపువర్గ(గర్వ?)ముతో నిక్కేరటా
సిరికి మగఁడయిన శ్రీపతి యేలి మ—
మ్మరయుచునున్నాఁడు మాయంతవారు వేరీ. ॥ ఇహ ॥

బలవంతుఁడైనవాఁడు భయములిన్నిటఁ గాసి
గెలిచి పేరువాడుచుఁ గెరలీనటా
బలదేవుఁడైన శ్రీపతి మాయింటిలోన
అలరివున్నాఁడు మాయంతవారు వేరీ. ॥ ఇహ ॥

భూములేలేటివాఁడు భోగములతోఁ దనిసి
కామించి యానందమునఁ గరఁగీనటా
సేమముతో భూపతైన శ్రీవేంకటేశుఁడు మాకు
అముకొనివుండఁగా మాయంతవారు వేరీ. ॥ ఇహ ॥ 84

మాళవిగౌళ

అన్నియు నీతనిమూల మాతఁడే మాపాలఁ జిక్కె
కన్నుల మావేడుకకు కడయేది యిఁకను. ॥ పల్లవి ॥

కామధేను [1]గలి(గి?)తే గర్వించు నొక్కరుఁడు
భూమి యేలితే నొకఁడు పొదలుచుండు
కామించి నిధి గంటె కళలమించు నొకఁడు
శ్రీమంతుఁడగుహరి చిక్కె మాకు నిదివో. ॥ అన్ని ॥

పరుసవేదిగలి(గి?)తే పంతములాడు నొకఁడు
ధరఁ జింతామణబ్బితే దాఁటు నొకఁడు
సురలోక మబ్బితేను చొక్కుచునుండు నొకఁడు
పరమాత్ముఁడే మాపాలఁ జిక్కెనిదివో. ॥ అన్ని ॥

అమృతపానముసేసి యానందించు నొకఁడు
భ్రమసు దేహసిద్ధిఁ బరగొకఁడు
తమి శ్రీవేంకటేశుఁడే దాఁచినధనమై మాకు
అమరి నామతిఁ జిక్కె నడ్డములే దిదివో. ॥ అన్ని ॥ 85

1 'కలిగితే' అనుటకు 'కలితే' ఈ వాఙ్మయమున కోకొల్లలుగ ప్రయోగములు కలవు.

దేవగాంధారి

పట్టరో వీదులఁ బరువులువెట్టి
పుట్టుగులతో హరి పొలసీ వీఁడే ॥పల్లవి॥

వేవేలు నేరాలు వెదకేటిదేవుఁడు
ఆవులఁ గాచీ నలవాఁడే
పోవుగ బ్రాహ్మలఁ బుట్టించుదేవుఁడు
నోవల యశోదసుతుఁడట వీఁడే ॥పట్ట॥

ఘనయజ్ఞములకుఁ గర్తగుదేవుఁడు
కినిసి వెన్న దొంగిలె వీఁడే
మునులచిత్తములమూలపుదేవుఁడు
ఘనసీ గొల్లెతలయింటింట వీఁడే ॥పట్ట॥

నుడిగి నారదుఁడు నుతించుదేవుఁడు
బడిరోలఁగట్టువడె వీఁడే
వుడివోనివరము లొసఁగెడుదేవుఁడు
కడఁగిన(శ్రీ) వేంకటగిరి వీఁడే ॥పట్ట॥ 36

రేకు 207 భైరవి

వెట్టివారిఁ దెలుపుట వేవేలు సుకృతము
ముట్టుఁజాలమంతే కాని ముందు గాన దైవమా ॥పల్లవి॥

ఇంతకతొల్లిటిజన్మ మెటువంటిదో యెరఁగ
పొంతనే ఇటమీఁదటిపుట్టు వెరఁగ
అంతరానఁ బెరిగేకాయమే నాకు సుఖమై
సంతసాన మురిసేను సంసారమందును. ॥వెట్టి॥

వొదలిలోపలి హేయ మొకటింతాఁ దలఁచను
బడి నెదిటిదేహాలపచ్చి దలఁచ
సుడిసి పై పచారాలే చూచి సురతసుఖాన
పడఁతుఁ బొంది పొంది పరిణామించేను. ॥ వెట్టి ॥

పాపమూలమున వచ్చేబలునరకము లెంచ
యేపునఁ బుణ్యపుబుద్ధి ఇంచుకా నెంచ
దీపనపుజంతువునుఁ దెచ్చి పావనుఁ జేసితి
చేపట్టి నన్ను రక్షించు శ్రీ వేంకటేశుఁడా. ॥ వెట్టి ॥ 87

సామంతం

ఎందరితోఁ బెనఁగేను యెక్కడని పొరలేను
కందర్పజనక నీవే గతిగాక మాకు. ॥ పల్లవి ॥

నిక్కి నాబలవంతాన నేనే గెలిచేనంటే—
నొక్కపంచేంద్రియముల కోపఁగలనా
తక్కనసంసార వార్ధి దాఁటఁగలనో మరి
దిక్కుల కర్మబంధము తెంచివేయఁగలనో. ॥ ఎంద ॥

పన్ను కొన్న పాయమున పరము సాధించేనంటే
యెన్న నీమాయ కుత్తర మియ్యఁగలనా
ఎన్నెలనామనసే వంచుకోఁగలనో మరి
కన్నట్టి యీప్రపంచమే కడవఁగఁగలనో ॥ ఎంద ॥

వుల్లములో నిన్ను ధ్యాన మొగి నేఁ జేసేనంటే
తొల్లిటియజ్ఞానము తోయఁగలనా
ఇల్లిదే శ్రీవేంకటేశ యెదుటనే నీకు మొక్కి
బల్లిదుఁడ నౌదుఁగాక పంద నేఁ గాఁగలనా. ॥ ఎంద ॥ 88

ఆహిరి

అయ్యో నానేరమికే అట్టే యేమని వగతు
ముయ్యంచుచంచలాన మోసపోతిఁగాక. ॥పల్లవి॥

కానఁనా నావంటివారే కారా యీజంతువులు
నానా యోనులఁ బుట్టి నడచేవారు
మానక నాగర్వమున మదాంధవున ముందు.
గానక భయపడినకర్మి నింతే కాక అయ్యో॥

చదువనా నేఁ దొల్లి జన్మజన్మాంతరముల
ఇది పుణ్య మిది పాప మింతంతని
వదలక నాభోగవాంఛలే పెంచి పెంచి
తుదకెక్క వెదకనిదుష్టుఁడ నేను ॥అయ్యో॥

విననా నేఁ బురాణాల వెనకటివారినెల్ల
మనెడిభాగవతులమహిమలెలా
యెనయుచు శ్రీవేంకటేశుకృపచేత నేడు
ఘనుఁడ నయితిఁగాక కష్టుఁడఁగానా ॥అయ్యో॥ 89

సాళంగనాట

తాము స్వతంత్రులు గారు 'దాసోహము' నన లేరు
పామరపుదేహులకు పట్టరాదు గర్వము. ॥పల్లవి॥

పరగుబ్రహ్మాదులు బ్రహ్మమే తా మనలేరు
వారికే మొరవెట్టేరు ఆపదైతేను
ధరలో మనుజులింతే తామే దయివమనేరు
పొరిఁ దాము చచ్చిపుట్టే పొద్దెరఁగరు ॥తాము॥

పండినవ్యాసాదులు ప్రపంచము కల్లనరు
కొండలుగాఁ బురాణాలఁ గొసియాడేరు
అండనే తిరిపెములై అందరి నడిగి తా —
ముందుండి లేదనుకొనే రొప్పదన్నా మానరు. ॥తాము॥

సనకాదియోగులు శౌరిభక్తి సేసేరు దు-
ర్జనులు భక్తి వొల్లరు జ్ఞానులమంటా
నినుపయి శ్రీవేంకటేశ నినుఁ జేరి మొక్కుతానే
అనిశము నిరాకారమనేరు యీద్రోహులు. ॥తాము॥ 40

శంకరాభరణం

ఎట్టు మోసపోతి నేను యివియెల్ల నిజమని
నెట్టన హరినే నమ్మనేర నయితిఁగా. ॥పల్లవి॥

దేహమిది నాదని తెలిసి నమ్మివుండితే
ఆహా నే నొల్లనన్నా నల్లే ముదిసె
వూహల నాభోగమెల్లా వొళ్లఁబట్టెనంటా నుంటే
దాహముతోడ నినుముదాగిఁనీరాయఁగా. ॥ఎట్టు॥

మనసు నాదని నమ్మి మది మది నే పెంచితి—
ననుఁగుఁబంచేంద్రియములందుఁ గూడెనా(ను?)
యెనసి ప్రాణవాయువు లివి సొమ్మని నమ్మితి
మొనసి లోను వెలినై ముక్కువాత నున్నవి ॥ఎట్టు॥

ఇందుకొరకె నేను ఇన్నాళ్లు పాటువడితి
ముందు వెనకెంచక నే మూఢుఁడ నైతి
అంది శ్రీవేంకటేశ్వరుఁ డంతటా నుండి నా—
చందము చూచి కావఁగ జన్మమే యీడేరె. ॥ఎట్టు॥ 41

నాట

ఎందరైనఁ గలరు నీ కింద్రచంద్రాదిసురలు
అందులో నే నెవ్వఁడ నీ వాదరించే దెట్టో. ॥పల్లవి॥

పెక్కుబ్రహ్మాండములు నీపెనురోమకూపములఁ
గిక్కిరిసున్న వందొక కీటమ నేను
చక్కఁగా జీవరాసులసందడిఁ బడున్నవాఁడ
ఇక్కువ నన్నుఁ దలఁచి యెట్టు మన్నించేవో. ॥ఎంద॥

కోట్లైనవేదములు [1]కొనాడీ [2]నిన్నందులో నా—
నోటివిన్నపము లొక్క నువ్వుగింజంతే
మాటలు నేరక కొఱమాలి వాకిట నుండ
చాటుగా నీదయ నాపైఁ బారుటెట్టో. ॥ఎంద॥

అచ్చపునీదాసులు అనంతము వారలకు
రిచ్చల నే నొకపాదరేణువ నింతే
ఇచ్చగించి శ్రీవేంకటేశ నిన్నుఁ దలఁచుక
మచ్చికఁ గాచితి నన్ను మఱవనిదెట్టో. ॥ఎంద॥ 42

రేకు 208 ముఖారి

పుట్టించేవాఁడవు నీవే పోరులు వెట్టేవు నీవే
యెట్టు నేరుచుకొంటి విది నీవినోదమా. ॥పల్లవి॥

కొందరు దేవతలును కొందరు రాక్షసులును
ఇందరి కంతర్యామి వెప్పుడు నీవు
అంది కోప మొకరిపై అట్టె ప్రసాద మొకరి—
కిందులోనే పక్షపాత మిది నీకే తగును. ॥పుట్టిం॥

---

1. 'కొనాడి' పూ. ము. పా. కొని+అడి=కొనాడి.
2. 'విన్నందులోన' పూ. ము. పా.

నరకమనుచుఁ గొంత నగి స్వర్గమని కొంత
నిరతి గురిసేసేవు నీకుతిలోనే
ధరఁ జీఁక టొకవంక తగ వెన్నె లొకవంక
నెరపేవు నీమాయ నీకే తెలుసును. ॥పుట్టిం॥

దాసపరిపాలనము తగు దుష్టశిక్షణము
వాసిఁ గైకొంటివి నీకు వశమై రెండు.
దోసము నీవల్ల లేదు తొలుతే శ్రీవేంకటేశ
సేసినవారిపుణ్యమే చిత్తానఁ బెట్టితివి. ॥పుట్టిం॥ 48

దేవగాంధారి

ఇతరదేవతల కిది గలదా
ప్రతి వేరీ నీప్రభావమునకు. ॥పల్లవి॥

రతిరాజజనక రవిచంద్రనయన
అతిశయ శ్రీవత్సాంకుఁడవు
పతగేంద్రగమన పద్మాసతిపతి
మతి నినుఁ దలఁచిన మనోహరము. ॥ఇత॥

ఘనకిరీటధర కనకాంబర పా—
వన క్షీరాంబుధివాసుఁడవు
వనజచక్రధర వసుధావల్లభ
నినుఁ బేరుకొనిన నిర్మలము. ॥ఇత॥

దేవపితామహ త్రివిక్రమ హరి
జీవాంతరాత్మక చిన్మయుఁడా
శ్రీవేంకటేశ్వర శ్రీకర గుణనిధి
నీవార మనుటే నిజసుఖము. ॥ఇత॥ 44

మాళవి గౌళ

ఎట్టు వలసినాఁ జేయు మేఁటి విన్నపము లేక
కట్టుకో పుణ్యమైనాఁ గాక మరేమైనాను. ॥పల్లవి॥

నన్ను నెంచి కాచేనంటేనా యవగుణి నేను
నిన్ను నెంచి కాచేనంటే నీవు లక్ష్మీపతివి
యిన్నిటా నాకంటే హీనుఁ డేఁక మరెవ్వఁడూ లేఁడు
వున్నతి నీకంటే ఘను లొకరూ లేరు. ॥ఎట్టు॥

నిలువెల్లా నెంచుకొంటే నివ్వరిముల్లంత లేను
బలువుఁడ నీవైతే బ్రహ్మాండము
యెలమి నే నుపకార మెవ్వరికిఁ జేయలేను
మెలఁగి నీవే తృణము మేరువు సేయుదువు. ॥ఎట్టు॥

భావించ నీ వేలికవు బంటుమాత్ర మింతే నేను
నీవు సర్వాంతరాత్మవు నే నొకఁడను
సావధానమున నేను సర్వభక్షకుఁడ నింతే
శ్రీవేంకటేశ నీవు జీవరక్షకుఁడవు. ॥ఎట్టు॥ 45

శంకరాభరణం

వేవేలు బంధములు విడువ ముడువఁబట్టె
దైవమా నిన్నెట్టు తగిలేమయ్యా. ॥పల్లవి॥

పారి ముందటిభవపాశములు
తీరిఁ దొల్లిటితిత్తిలో పుణ్యము
వూరిఁ గోరిక లొకటొకటే
యేరీతి సుజ్ఞాన మెరిఁగేనయ్యా. ॥వేవే॥

పట్టి నాకొంగు పంచేంద్రియములు
తొట్టిఁ బాపము తోడుతనే
పెట్టి భ్రమలఁ బెరిగి నీమాయలు
అట్టె మోక్ష మెన్నఁ డందేమయ్యా. ॥ వేవే ॥

పిండై యిహము వెనకకుఁ దీసీ
అందీ వై[1]రాగ్య మరచేతికి
కందువ శ్రీవేంకటపతి యీ రెండు
పొందించితి వేది భోగింతునయ్యా. ॥ వేవే ॥ 46

కన్నడగౌళ

ఎట్టు గెలుతుఁ బంచేంద్రియముల నేఁ
బట్టరానిఘనబలవంతములు. ॥ పల్లవి ॥

కడునిసుమంతలు కన్నులచూపులు
ముడుఁగక మిన్నులు ముట్టెడిని
విడువక సూక్ష్మపువీనులు యివిగో
బడిబడి నాదబ్రహ్మము మోచె. ॥ ఎట్టు ॥

అదె తిలపుష్పంబంత నాసికము
కదిసి గాలి ముడెగట్టెడని
పొదిగి నల్లెఁడే పొంచుక నాలికె
మెదలుచు సర్వము మింగెడిని ॥ ఎట్టు ॥

బచ్చెనదేహపుపైపొర సుఖమే
యిచ్చఁ బ్రపంచం బీనెడిని
కచ్చెర మనసిది శ్రీవేంకటేశ్వరుఁ
దచ్చి తలఁచఁగా దరి చేరెడిని. ॥ ఎట్టు ॥ 47

---

1. 'వయిరాగ్య' రేకు.

బౌళిరామక్రియ

నే నొకఁడ లేకుండితే నీకృపకుఁ బాత్ర మేది
పూని నావల్లనే కీర్తిఁ బొందేవు నీవు. ॥పల్లవి॥

అతిమూఢులలోన నగ్రేసరుఁడ నేను
ప్రతిలేనిఘనగర్వపర్వతమను
తతిఁ బంచేంద్రియములధనవంతుఁడను నేను
వెతకి నావంటివాని విడువఁగఁ జెల్లునా ॥నేనొ॥

మహిలో సంసారపుసామ్రాజ్యమేలేవాఁడ నేను
యిహమునఁ [1]గర్మవహికెక్కితి నేను
బహుయోనికూపసంపదఁ దేలేవాఁడ నేను
వహించుక నావంటివానిఁ దేనొపేవా. ॥నేనొ॥

భావించి నావంటినీచుఁ బట్టి కాచినప్పుడుగా
ఈవంక నీకీర్తి గడునెంతురు భువి
నావల్ల నీకుఁ బుణ్యము నీవల్ల నే బ్రదుకుదు
శ్రీవేంకటేశుఁడ యింత చేరెఁ జుమ్మీ మేలు. ॥నేనొ॥ 48

రేకు 209 దేసాళి

నీవే నేరవుగాని నిన్నుఁ బండించేము నేము
దైవమా నీకంటే నీదాసులే నేర్పరులు. ॥పల్లవి॥

పట్టిభక్తి నీమీఁద వలుకువేసి నిన్నుఁ
బట్టితెచ్చి మతిలోనఁ బెట్టుకొంటిని
పట్టెఁడుదులసి నీపాదములపైఁ బెట్టి
జట్టిగొనిరి మోక్షము జాణలు నీదాసులు. ॥నీవే॥

1. 'కర్మివహి' లేక 'కర్మమహి' కావచ్చునేమో?

నీవు నిర్మించినవే నీకే సమర్పణసేసి
పావల నీకృపయెల్లఁ జూరగొంటిమి
భావించొకమొక్కి మొక్కి భారము నీపై వేసిరి
పావనపునీదాసులే పంతపుచతురులు. ॥నీవే॥

చెఱువులనీళ్లు దెచ్చి చేరఁ(రెఁ?)డు నీపైఁజల్లి
వరము వడసితిమి వలసినట్టు
యిరవై శ్రీవేంకటేశ యిటువంటివిద్యలనే
దరిచేర మించిరి నీదాసులే పో ఘనులు. ॥నీవే॥ 49

దేసాళం

ఎన్నఁడు దీరీ నీతెఁదేపలు
పన్నినజీవులబంధములు. ॥పల్లవి॥

భారపుఁజిత్తము ప్రవాహరూపము
వూరేటిమదములు వూటెత్తె
తీరనింద్రియపుదేహభ్రాంతులు
కోరేటికోర్కులఁ గొండలు పెరిగె. ॥ఎన్నఁ॥

[1]ఉడికేటిపాపము లుగ్రనరకములు
తొడికేటికర్మము తోడంటు
విడువవు భవములు వెంటవెంటనే
చిడుముడిఁ జిత్తము చీఁకటి వడెను. ॥ఎన్నఁ॥

రవణపుభవములు రాట్నపుగుండ్రలు
చపలపుబుద్ధులు జలనిధులు
ఇపుడిదె శ్రీవేంకటేశుఁడ నీవే
కపటము వాయఁగఁ గరుణించితివి. ॥ఎన్నఁ॥ 50

1. 'ఉడికేటిపాతము' వూ. ము. పా.

ముఖారి

నీవెంత నేనెంత నీకు నాకు నెంతదవ్వు
దైవమా సిగ్గువడక తగిలే నేఁ గాకా. ॥పల్లవి॥

చెంది నీకు బ్రహ్మాదులు సేవలు సేయఁగాను
యిందు మాసేవలు నీకు నేడకువచ్చు
పొంది [1]వసిష్ఠాదు లట్టె పూజలు సేయఁగాను
సందడి మాపూజలు సరకా నీకు. ॥నీవెం॥

సనకాదియోగులు సారె నిన్నుఁ దలఁచఁగా
యెనసి మాతలఁపు నీ కేడకెక్కును
నునుపుగా శేషాదులు నుతులు నిన్నుఁ జేయఁగా
పనివడి మానుతులు [2]బాఁతేయనా నీకు. ॥నీవెం॥

కిట్టి నారదాదులు నీకింకరులై వుండఁగాను
యిట్టె నీదాసుఁడనను యెంత కెంత
వొట్టి శ్రీవేంకటేశ మాకొకవుపాయము గద్దు
పట్టి నీదానులబంటుబంటు నయ్యేనికను. ॥నీవెం॥ 5।

లలిత

అయ్యో వికల్పవాదులంతటా సిగ్గువడరు
యియ్యెడ నెట్టుగలిగె నీయసురమతము. ॥పల్లవి॥

నీముద్రలూ నొల్లరు నీదాసోహము నొల్లరు
కామించి నీమీఁదిభక్తి కరు నొల్లరు
నామమంత్రము నొల్ల రనామయుండ [3]వనెందురు
తాము వైష్ణవుల మంటాఁ దర్కింతురు. ॥అయ్యో॥

1. 'వసిష్ఠా' రేఫ 2. ' బాఁతేయ ' రేఫ " బాఁతి + ఆయనా = బాఁతేయనా , ఇట్టిసంధులీవాఙ్మయమున కొల్లలు 3. అని+అందురు=అనెందురు. ఈవాఙ్మయమున ఈ సంధులు కొల్లలు.

పైతృక వేళ నీప్రసాదమూ నొల్లరు
ఘాతలనూర్ధ్వపుండ్రము గాదందురు
జాతరదై వాల నిన్ను సరిగాఁ బూజింతురు
ఆతల వైష్ణవులు దామనుకొందురు. ॥ అయ్యో ॥

శ్రీవైష్ణవులఁ గంటేఁ జేతులెత్తి మొక్కరు
భావింతురు పగవారిఁబలెఁ గన్నట్లు
ఆపల వైకుంఠమూ ననిత్యమందురు
కావించి వైష్ణవులము కామా నే మందురు. ॥ అయ్యో ॥

వరుస రావణాదులవలె నెఙ్జాలు సేతురు
సరుస నట్టే వేదమూఁ జదువుదురు
నిరతి శ్రీవేంకటేశ నీమహిమ లెరఁగక
అరిది వైష్ణవులమే యని యాడుకొందురు. ॥ అయ్యో ॥ 52

## గుండక్రియ

నీయంతవారు గారు నిందుసామర్థ్యము లేదు
యీయహంకారపుముక్తి యీడేరీనా తమకు. ॥ పల్లవి ॥

నీసేవలే సేసి నీకృప రక్షించఁగాను
అసలఁ బొందేముక్తి అదిచాలక
నీసరివారలై నీవే తా మనుకొని
యీసులఁ బొందేముక్తి యీడేరీనా తమకు. ॥ నీయం ॥

పొంచినరాక్షసులెల్ల పూర్వదేవతలమంటా
యెంచుక పెట్టినమద మీగర్వము
అంచెలఁ గర్మమే సేసేరాయాదేవతలఁ గూర్చి
ఇంచుకంతలోనే ముక్తి యీడేరీనా తమకు. ॥ నీయం ॥

హారిలాంఛనపుభక్తి కందుకు నోడఁబడరు
సరి రోగికిఁ బథ్యము చవిగానట్లు
గరిమ శ్రీవేంకటేశుఁ గని మననివారికి
యెరవులనే ముక్తి యీడేరీనా తమకు. ॥నీయం॥ 53

బౌళి

వట్టిమోపు మోయనేల వడిఁ ములుగఁగనేల
పట్టిన నేమముతోడ బ్రదుకఁగవలదా. ॥పల్లవి॥

తల్లిదండ్రిగలవారు తమలేము లెఱఁగక
చెల్లపిళ్లలై యాటలఁ జెందినయట్టు
వుల్లములో హరినమ్మివుండినప్రపన్నులెల్ల
పల్లదాన నిర్భరులై బ్రతుకఁగవలదా. ॥వట్టి॥

మగఁడుగలసతులు మంచి ముత్తైదువలై
యెగువ నితరమార్గా లెరఁగనట్టు
నగుతా లక్ష్మీపతి నమ్మినప్రపన్నులెల్ల
పగటుఁ గర్మము మాని బ్రదుకఁగవలదా. ॥వట్టి॥

యేలికె నమ్మినబంటు లేటికిఁ బ్రియము చెప్ప—
కోలిఁ బతివాకిలి గాచుండినయట్టు
తాలిమి శ్రీవేంకటేశుదాసులై నప్రపన్నులు
పాలించినాతని నమ్మి బ్రతుకఁగవలదా. ॥వట్టి॥ 54

రేకు 210 భూపాళం

నీయాధీనము లింతే నిఖిలప్రపంచమును
మాయాకృతము నీవు మానుమంటే మానదా. ॥పల్లవి॥

నీకు నరుహంబైన నిండినయీమనసు
కాకువిషయాలపాలుగా నరుహమా
చేకొని నీవు పెరరేఁచినయీచైతన్యము
పైకొని అకర్మములపాలు సేయఁదగునా. ॥ నీయా ॥

అంచల నీవంతర్యామివైనయీదేహము
పంచేంద్రియముల కొప్పనసేతురా
యెంచఁగ నీకుఁజిలోన నెత్తినయీజన్మము
కొంచెపుభోగములకు గురిసేయవలెనా. ॥ నీయా ॥

శ్రీవేంకటేశ నీకుఁ జిక్కినయీదాస్యము
యీవల సంసారమున కియ్యవలెనా
దేవుఁడవు నీవేయని తెలిపితి విదే మాకు
జీవులము మమ్ము నిఁక చిమ్మిరేఁచనేఁటికి. ॥ నీయా ॥ ౫౫

సాళంగనాట

ఈమాట విని నిన్ను నిందుకే నవ్వితి నేను
నేమమెంత నేమెంత నీకరుణ యెంత. ॥ పల్లవి ॥

సకలకర్మముచేత సాధ్యముగానినీవు
వొకఇంచుకంతభక్తి కొగి లోనైతి
ప్రకటించి బహువేదపఠనఁ జిక్కనినీవు
మొకరివై తిరుమంత్రమునకుఁ జిక్కితివి. ॥ ఈమా ॥

కోటిదానములచేత కోరి లోనుగానినీవు
పాటించి శరణంటేనే పట్టి లోనైతి
మేటి వుగ్రతపముల మెచ్చి కైకొననినీవు
గాటపుదాసులైతేనే కైకొని మన్నించితి. ॥ ఈమా ॥

పెక్కుతీర్థములాడిన భేదించరాని నీవు
చొక్కి నీముద్రవారికి సులభుఁడవు
గక్కన దేవతలకుఁ గానరానినీవు మాకు
నిక్కడ శ్రీవేంకటాద్రి నిరవైతివి. ॥ ఈమా ॥ 56

లలిత

వెలలోఁ జోట లేఁడు వీఁడివో హరి
పిలిచితైయె చేరువనే వీఁడివో హరి. ॥ పల్లవి ॥

మునుకొని వెదకితే ముక్కునూర్పుగాలికొన
వెనవెనకఁ దిరిగీ వీఁడివో హరి
పెనఁగి వెదకఁబోతే పెదచెవులమంత్రమై
వినవచ్చీ మాటలలో వీఁడివో హరి. ॥ వెలలో ॥

సోదించి వెదకితేను చూపులకొనలనే
పీదుల నెందు చూచినా వీఁడివో హరి
ఆదిగొని వెదకితే నట్టే నాలికకొన
వేదమై నిలిచినాఁడు వీఁడివో హరి. ॥ వెలలో ॥

తెలిసి వెదకఁబోతే దేహపుటంతరాత్మయై
వెలుపలా లోపలాను వీఁడివో హరి
చెలఁగి శ్రీవేంకటాద్రిఁ జేకొని మమ్ము రక్షించ
వెలసె నిందరుఁ జూడ వీఁడివో హరి. ॥ వెలలో ॥ 57

బౌళి

బోధింపరే యెఱిఁగినబుధులాల పెద్దలాల
శ్రీధరునిమాయలలోఁ జిక్కితిమి నేము. ॥ పల్లవి ॥

దైవమును నొల్లము ధర్మమును నొల్లము
దావతిసంసారముతో తగులేకాని
భావపుభవబంధాలభయమూ నెఱఁగము
వేవేలు విధులే కాని వేగిలేచి నేము. ॥బోధిం॥

[1]ముందు విచారించము [2]మొదల విచారించము
పొందేటిసతులతోడిభోగమేకాని
చెందినమనసులోనిచింతలను బాయము
మందపుమదమే కాని మాపుదాఁకా నేము. ॥బోధిం॥

పరమూఁ దడవము భక్తిఁ దడవము
అరిది ధనముమీఁది ఆసలేకాని
ఇరవై శ్రీవేంకటేశుఁ డేలుకొనెఁ దానే నన్ను
నిరతి నెఱఁగనైతి నే నించుకంతాను. ॥బోధిం॥ 58

శ్రీరాగం

మఱి యేపురుషార్థము మావంక లేదు మీకు
అఱువడము మాకెంత అత్తువో నీవు. ॥పల్లవి॥

వాం నీవు నాకు నంతర్యామివైనఫలము
తిరిగినందే మావెంటఁ దిరిగెదవు
ఇరవుగ నీవు మాకు నేలికవైనఫలము
గరిమె మాపాపమెల్లఁ గట్టుకొంటివి. ॥మఱి॥

భువిలోన నీవు నన్నుఁ బుట్టించినఫలము
ఇవల రక్షించేతోడుసిదొకటాయ
తివిరి నన్ను నీకుక్షఁ దెచ్చిడుకొన్నఫలము
ఇవల నానేరములు చక్కఁబెట్టఁబడెను. ॥మఱి॥

1. ముందు=కార్యప్రారంభమునకుముందు 2. మొదల=కార్యప్రారంభమునందు.

గారవాన నన్ను వెనకవేసుకొన్నఫలము
చేరి నన్ను బుణ్యునిఁగాఁ జేయవలసె
అరసి నాకుఁ బ్రత్యక్షమైనఫలమున నన్ను
యీరీతి శ్రీవేంకటేశ ఇముడుకొఁబడెను. ॥మఱి॥ 59

అహిరి

ఏనోరువెట్టుక నిన్ను నేమని కావుమందును
నే నిన్నుఁ దలఁచినది నిమిషమూ లేదు. ॥పల్లవి॥

పాయమెల్ల సంసారముపాలే పడితిఁగాని
చేయార నీసేవ నేఁ జేసుట లేదు
కాయమెల్ల కాంతలకే కడుశేషమాయఁగాని
నీయవసరములందు నే నొదుగలేదు. ॥ఏనో॥

చిత్తము ఆసలపాలే సేసి బదికితిఁ గాని
హత్తి నిన్ను ధ్యానము సేయఁగలేదు
సత్తెపునానాలుకెల్ల చవుల కమ్మితిఁగాని
మత్తిలి నీకీర్తనము మరపుటా లేదు. ॥ఏనో॥

పుట్టుగెల్లా నజ్ఞానముపొంతనే వుంటిఁగాని
వొట్టి నీవిజ్ఞానము నొల్లనైతిని
యెట్టు నన్ను మన్నించితి విందుకే పో వెరగయ్యీ
నెట్టన శ్రీవేంకటేశ నిన్నడుగా లేదు. ॥ఏనో॥ 60

రేకు 211 దేసాళం

తనసొమ్మీడేరించక తా మానీనా
పెనఁగుచు నే మూరకే విగిసేముగాక. ॥పల్లవి॥

భూమితోఁ బ్రపంచమెల్లఁ బుట్టించినదేవుఁడు
ఆమీఁదిపారుపత్యాన కందుకోపఁడా
నామమాత్రజీవులము నడుమంతరాల వచ్చి
నేము గర్తలమనుచు నిక్కేముగాక. ॥తన॥

యెనలేక యెదిరికి ఇనుమడిచేవారికి
తనతగర మడువఁ దడవయ్యీనా
గునిసి సంసారపుకొండనే మోచేనంటా
తినికేమిదియు వట్టి దీమసముగాక. ॥తన॥

చిత్తములో నున్నట్టి శ్రీవేంకటేశ్వరుఁడు
మత్తిల్లి ననుఁ గావక మానఁబోయ్యీనా
కొత్తగా నీతని నేఁడు కొలిచేమనుచు నేము
తత్తరపుస్వతంత్రానఁ దగిలేముగాక. ॥తన॥ 61

ముఖారి

తాము స్వతంత్రులు గారు తమయంతను
ఆమీఁదటిగురి అది నీవు. ॥పల్లవి॥

యెలమి స్వర్గమేలేటిఇంద్రునికైనాను
అలమి కోరేటిఫల మది నీవు
బలిమిఁ గైలాసమేలేపతిరుద్రునికైనా
నిలుకడైనపదము నీపదము. ॥తాము॥

యెక్కుడు సత్యలోకము యేలేబ్రహ్మకునైనా
ఇక్కువఁ జేరేచోటు యెందును నీవు
వెక్కసపుఁబుణ్యాముల వేదములకైనాను
అక్కరతో ముఖ్యమైన అర్థమెల్లా నీవు, ॥తాము॥

నాఁడు నాఁడే ముక్తులైన నారదశుకాదులకు
నేఁడును విహరించేనెలవు నీవు
వోఁడిమి శ్రీవేంకటేశ వోలించ నెవ్వరూ లేరు
[1]మూఁడులోకముల నీవే మూలము నీవే. ॥ తాము ॥ 62

## గౌళ

చింతలు రేఁచకు మమ్ము చిత్తమా నీవు
పంతముతో మముఁగూడి బతుకుమీ నీవు. ॥ పల్లవి ॥

తల్లి శ్రీమహాలక్ష్మి తండ్రి వాసుదేవుఁడు
ఇల్లు మాకు బ్రహ్మాండమింతా నిదె
బల్లిదపుహరిభక్తి పాఁడీఁ బంటా నాకు
వొల్లము కర్మఫలము లొకటి నేము. ॥ చింత ॥

జ్ఞానమే మాకు ధనము సర్వవేదములు [2]సొమ్ము
పూనినవైరాగ్యమే వుంబళి మాకు
ఆనినగురుసేవలు [3]ఆఁడుబిడ్డలు నాకు
మేనితోనే తగులాయ మేలు మాకుఁ దేరెను. ॥ చింత ॥

యేలికె శ్రీ వేంకటేశుఁ డింటిదేవపూజ మాకు
పాలుగలబంధువులు ప్రపన్నులు
కీలు మాకు నీతనిసంకీర్తన మోక్షమునకు
యేలా ఇంకా మాకు నేమిటితో గొడవ. ॥ చింత ॥ 63

## ఆహిరి

ఎక్కడ నున్నారో సురలెవ్వరు భూమికి దిక్కో-
తొక్కులఁబడె జీవుఁడు దుండగీలచేతను. ॥ పల్లవి ॥

---

1. 'మూఁడులోకముల' కావచ్చు.
2. ఈ "సొమ్ము" పూర్వముద్రితములో తప్పిపోయినది.
3. "ఆఁడుబి(లబి?)డ్డలు" పూ. ము. పా.

ఆసలనియెడివెట్టి యంగడివెంటాఁ దిప్పె
దోసిలొగ్గించె దైన్యము దొరలెదుట
యీసుల నాఁకటి(లి?) విషమేమైనాఁ దినిపించె
గాసిఁబడె జీవుఁడిదె కన్నవారిచేతను. ॥ఎక్క॥

కడుఁగోపపుభూతము కాయమెల్లా మఱపించె
వడి నజ్ఞానపుచేరు వరతఁగొట్టె
నడుమఁ బాపపుచొక్కు నరకపుగుంటఁదోసె
గడుసాయ జీవుఁ డిదె కన్నవారిచేతను. ॥ఎక్క॥

భవము సంసారపుబందెలదొడ్డిఁ బెట్టించె
[1]తగి(వి?)లింద్రియపుతాళ్లు[2] దామెనఁ గట్టె
యివల శ్రీవేంకటేశుఁ డింతలో దిక్కయి కాచె
కవడువాసె జీవుఁడు కన్నవారిచేతను. ॥ఎక్క॥ 64

సాళంగనాట

ఏదెస మోక్షము లేదు యెవ్వరికి ననేరు మీ—
వేదాంతశ్రవణము వెట్టికిఁ జేసేరా. ॥పల్లవి॥

అంతా బ్రహ్మమైతే[3]నాతుమా వొక్కటియైతే
చింతింప గురుఁడు లేఁడు శిష్యుఁడూ లేఁడు
బంతినే ముక్తుఁడూ లేఁడు బద్ధుఁడూ లేఁడిట్లయితే
వంతుల సత్కర్మమెల్ల వఱతపాలాయఁబో. ॥ఏదె॥

యిహమెల్లాఁ గల్లనేరు యేఁటికిఁ బుట్టినవారు
సహజమే యిదనేరు చావనేఁటికి
మహి మీకు బోధించినమహాత్ము శంకరాచార్యుఁ—
డహరహ [4]మేమైయున్నా నాతనికేది గతి (?) ॥ఏదె॥

---

1. 'ప్రాసభంగము' 2. 'దామేనఁ' పూ. ము. పా. 3. 'నాదుమా'రేకు.
4. ఏమైయున్నాఁ డాతనికేదిగతి'' కావచ్చు.

కొందరికి సుఖమిది కొందరికి దుఃఖమది
యిందుఁ జిక్కి బ్రహ్మమున కిఘోరమేలా
అందిన శ్రీవేంకటేశుఁ డంతరాత్ముఁ డొక్కఁడింతే
మందలించికొలువరు మంటికా మీజ్ఞానము. ॥ఏరె॥ 65

పాడి

వాఁడివో వీఁడివో హరి వలసినవారికెల్లా
మూఁడులోకముల మరి మొరఁగఁ జోటేది. ॥పల్లవి॥

బహిరంతరాన హరి ప్రత్యక్షమై యుండఁగాను
సహజానఁ బ్రత్యక్షవిచారమేల
ఇహములోఁ గలవెల్లా యీతనిలీలై యుండఁగా
విహరించేలీల వేరే వెదకనేలా. ॥వాఁడి॥

మవికై యన్నిటా నుండి మాటలాడుచుండఁగాను
వెనక హరి మాటలు వేరేవున్నవా
కనుచూపతఁడంతటా కలగొనఁ జూడఁగాను
చనవిచ్చి [1]కృపాదృష్టి చల్లుమననేలా. ॥వాఁడి॥

నెలవై యాతఁ డిన్నిటా నిండుకొనియుండఁగాను
అలరి వేరే వచ్చిననేలా
యెలమి శ్రీవేంకటేశుయిచ్చకొలఁదే [2]యింతా
పలుమారు నిట్టట్టని భావించఁదగునా. ॥వాఁడి॥ 66

రేకు 21౨ లలిత

చెలఁగి నా కిందుకే చింతయ్యీని
తెలిసినదాఁకా నిది ద్రిష్టమయ్యీనా. ॥పల్లవి॥

---

1. 'ద్రిష్టి' రేకు 2. ఈ 'యింతా' పూర్వముద్రితములో తప్పిపోయినది.

వారి పుట్టించినదేహి వారినే కొలువక
నరులఁ గొలుచుట అన్యాయమయ్యా
గరిమ నేరు గుడిచి కాలువఁ బొగడఁబోతే
యెరవెరవే కాక యితవయ్యీనా. ॥ చెలఁ ॥

దేవుఁడచ్చినట్టిబుద్ధి దేవునిపయిఁ బెట్టక
భావ మింద్రియాలకియ్యఁ బాపమయ్యా
జీవిత మొకరిసొమ్ము జీవించి యొకరివెంట
ఆవలఁ బరువులిడు టందమయ్యీనా. ॥ చెలఁ ॥

అరిది శ్రీ వేంకటేశుఁ డంతరాత్మయి వుండఁగాను
శరణనకుండు టనాచారమయ్యా
ధరఁ దనయింటఁ గోటిధన మట్టేవుండఁగాను
మరలి తిరియఁబోతే మట్టుపడీనా. ॥ చెలఁ ॥ 67

పాడి

కాకుంటే యీశూన్యవాదకతినచిత్తులచేత
పై కొని వివేకులకు బ్రదుకఁగవచ్చునా. ॥ పల్లవి ॥

అల్ల నాఁడు నిరాకారమనెడిమాటలచేత
వెల్లిఁబోయ లోకములో విజ్ఞానమెల్లా
కల్లని మీత్రివిక్రమాకారము చూపి మీరు
చెల్లఁబెట్టితిరి వేదశిఖలందు మరియు. ॥ కాకుం ॥

అలకించి యహంబ్రహ్మమనెడిబుద్ధులచేత
గాలిఁబోయ భక్తి [1]యల్లా కాలమందే
యేలి ప్రహ్లాదునికిఁగా హిరణ్యకశిపునొద్ద
యేలికబంటువరుస లిందె చూపితిరి. ॥ కాకుం ॥

---

1. 'యల్లకాలమందే' పూ. ము. పా.

అంతా నొక్కటియనే అధర్మవిధులచేత
గుంతఁబడెఁ బుణ్యమెల్లాఁ గొల్లఁబోయి
ఇంతట శ్రీవేంకటేశ యెక్కుడు నేనని కొండ
వింతగాఁగఁ బొడవెక్కి విఱ్ఱవీఁగితివి. ॥ శాకుం ॥ 68

శుద్ధవసంతం

చేకొనువారికి చేరువిదే పైకొనుజీవులభాగ్య మిదే
యేకడఁ జూచిన యితరము లేదు. ॥ పల్లవి ॥

తలఁపులోన నంతర్యా మిదివో
తెలిసిచూచితే ద్రిష్టంబు
చలమునఁ దనమతి సందేహించిన
కలఁగి మూఁడులోకంబుల లేఁదు. ॥ చేకొ ॥

వెసఁ గనుదెఱచిన విశ్వాత్మకుఁ డిదె
దెసల నింతటా ద్రిష్టంబు
పసిగొని తనుఁ బాపములు భ్రమించిన
కసరి సృష్టి చీఁకటివడు నపుడే. ॥ చేకొ ॥

చేరి కొలిచితే శ్రీవేంకటపతి
సారె బ్రతుకునకు శాసనము
పైరగుతనలో భక్తి వదలితే
కూరిమి తెరమఱఁగునకును మఱఁగు. ॥ చేకొ ॥ 69

వరాళి

పెంచి తముపెట్టుఁజెట్టు పెరికివేయ రెవ్వరు
మంచివాఁడఁ గాకున్న మన్నించకుండేవా. ॥ పల్లవి ॥

తెరువు దప్పి యడవిఁ దిరిగేటివారిఁ దెచ్చి
తెరువునఁ బెట్టుదురు తెలిసినవారలు
నరుఁడనై నేరక నడిచేటినన్ను నీవు
మరిగించి కావక మానవచ్చునా. ॥పెంచి॥

దిక్కుమాలినట్టివారిఁ దెచ్చి దయగలవారు
దిక్కయి కాతురు వారి దిగఁద్రోయరు
తక్కక మాయలోఁ బడి దరిదాపులేనినన్ను
వెక్కసాన రక్షించక విడిచేవా నీవు. ॥పెంచి॥

ఆవల భయపడ్డవా రంగడిఁబడితే దొర—
లోవల విచారించి వూరడింతు రంతలోనే
శ్రీవేంకటేశ నీవు [1]సృష్టికల్లా నేలికవు
వేవేలు మామొర నీవు విచారించకుండేవా. ॥పెంచి॥ 70

సామంతం

ఎన్నఁడు మంచివాఁడ నయ్యేను నేను
నన్ను నీవే మన్నించి నడుపవే దయివమా. ॥పల్లవి॥

వేఁపమానికిని చేఁదు విడువక వుండేది
యేపొద్దు సహజమే యెంతైనాను
పాపపుణ్యాలంపటానఁ బరగివుండేటినేను
చాపలదుర్గుణినౌట సహజమే. ॥ఎన్నఁ॥

పాముకు విష మెప్పుడు పండ్లఁ బెట్టుకుండేది
భూమిలో సహజమే పోరి నెంతైనా
కామక్రోధుఁడ నాకుఁ గరుణ యించుక లేక
సామజపుదుర్మదము సహజమే. ॥ఎన్నఁ॥

1. 'స్రిష్టి' రేకు.

అటుగాన శ్రీవేంకటాధిప నాకిఁక వేరే
తటుకన నేఁడు శాంతము వచ్చినా
ఘటన నీకృపయందుగలిగినమేలు నాపై
తటుకన ముంచి నన్ను దరిచేర్చవే. ॥ఎన్నఁ॥ 71

గుజ్జరి

వెట్టి మానుప రెవ్వరు వేఁదురు నాయంత విడువదు (ను?)
ముట్టఁజాలలోఁ బుట్టిన ముంచిన వెట్టెయ్యా. ॥పల్లవి॥

జగములు రక్షించఁ జాల్పడి సర్వేశ్వరుఁడే వుండఁగ
అగణితుఁ డాతనిశక్తి యల్పముగాఁ దెలిసి
జిగి[1] నాసంసారరక్షణ నేసెదనంచునుఁ దిరిగెద
నగుఁబాట్ల యల్పుఁడ నే నావెట్టిదేయయ్యా. ॥వెట్టి॥

అంతర్యామై దేవుఁడు అటు సుఖదుఃఖము లొసఁగఁగ
అంతయు మనుజులు సేసేరని నేఁ దిరిగితిని
బంతినే నావంటిజీవులబడిఁ దిరిగాడుచుఁ గర్మపు -
దొంతులఁ జిక్కిననా[2] వెట్టితోడనే యిదేయయ్యా. ॥వెట్టి॥

శ్రీవేంకటపతి యెదుటనే చేకొని వరము లొసఁగఁగ
దావతిపడి యితరుల నేఁ దగులుచు నడిగితిని
యీవేళనే నాగురుఁడును యీ దైవము నిటు చూఁపగ
తోఁ వెరిఁగిటు నే బతికితి తొల్లెల్ల వెట్టినయ్యా. ॥వెట్టి॥ 72

రేకు 213 దేసాక్షి

ఇతనికంటే నుపాయ మిఁక లేదు
మతిలోననున్న వాఁడు మర్మ మిదే సుండీ. ॥పల్లవి॥

---

1. ఈ 'నా' పూర్వముద్రణమున తప్పినది. 2. 'వెట్టి' రేకు.

ఇన్నిలోకసుఖములు ఇంద్రియప్రీతులే
తన్నుఁ గనినతల్లిదండ్రి తనపోషకులే
కన్ను లెదిటిధనాలు కారణార్థములే
వున్నతి నిష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు. ॥ఇత॥

కలదేవత లిందరు కర్మఫలదాతలే
అలి విద్యలెల్ల ఖ్యాతిలాభపూజలకొరకే
పలుమంత్రములెల్లను [1]బ్రహ్మలోక మీసందివె
వొలిసి ఇష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు. ॥ఇత॥

అనుదినరాజసేవ లల్పార్థహేతులే
కోనఁ గల్పవృక్షమైనఁ గోరినవిచ్చేటిదే
ఘన శ్రీవేంకటేశుఁడు కల్పించె జీవునిఁ గావ-
నొసర నిష్టార్థసిద్ధి కొక్కఁడే దేవుఁడు ॥ఇత॥ 73

బౌళి

నన్ను నెవ్వరు గాచేరు నాఁటిపగెంతురుగాక
నిన్న నేఁ డీరోఁతలై తే నీతియౌనా నాకును. ॥పల్లవి॥

దేవుఁడ నేనేయఁటా తిరిగే నాస్తికుఁడనా
దేవతలకు మొక్కఁబోతే నీఁక నగరా
తావించి యింద్రియములే గతెలి యున్నాళ్ల నుండి
ఆవల జితేంద్రియుఁడనంటే నవి నగవా. ॥నన్ను॥

కర్మము దొల్లి సేయక కడుదూరమై ఇఁక నా-
కర్మము సేయఁగఁబోతే కర్మమే నగదా
దుర్మతి సంసారినై తొయ్యలులకు మోహించి
అగ్మలి దూషించితేను అట్టె వారు నగరా. ॥నన్ను॥

1. "బ్రహ్మలోకమిసందివె(?) పూ. ము. పా.

నేనే స్వతంత్రుఁడనంటా నిందుదానాలెల్ల మాని
పూని యిఁకఁ జేయఁబోతే పొంచి యవి నగవా
నే నిన్నిటా సిగ్గువడి నీమరఁగు చొచ్చితిని
అనుకొని శ్రీవేంకటాధిపుఁడ కావవే. ॥నమ్ము॥ 74

సామంతం

పరుసము సోఁకక పసిఁడౌనా
పురుషోత్తముఁడే బుద్ధిచ్చుఁగాక. ॥పల్లవి॥

భువి భోగములకుఁ బుట్టినదేహము
వివరపుమోక్షము వెదకీనా
యివల సకలమును యేలేటిదేవుఁడు
తవిలి రక్షింపుట ధర్మముగాక. ॥పరు॥

తెరసి యాసలనే పెరిగేటిదేహము
ధరఁ గొంతయినాఁ దనిసీనా
అరుదుగ నంతర్యామగుదేవుఁడు
పొరిఁ బెర రేఁచుకే పొందౌఁగాక. ॥పరు॥

ఘనమగుసంసారకారణజీవుఁడు
తనసుజ్ఞానముఁ దలఁచీనా
వెనకమునుప శ్రీవేంకటపతియే
కనుఁగొని మమ్మిటు కాచుటగాక. ॥పరు॥ 75

లలిత

ఏమిహో మది [1] యెంత నీవు చేసేచేఁత లెంత
దీమసపునీమాయలు తెలియరాదయ్యా. ॥పల్లవి॥

---

1. 'యంత' రేకు.

నిషాదతీర్థము నెత్తి మోచె నొకఁడు
పూఁపకోడుకై యొకఁడు బోడ్డునఁ బుట్టె
యేపున నింతటివారి కెక్కుడైనదైవమవు
మోపుచు ధర్మరాజుకు మొక్కుచెట్టయ్యా ॥నీమ॥

నీలీల జగమెల్లా నిండియున్న దొకవంక -
నోలి నీలో లోకా లున్న వొకవంక
యేలీలఁ జూచినాను యింతటిదైవమవు
బాలుఁడవై రేపల్లెలోఁ బారాడితి వెట్టయ్యా. ॥నీమ॥

శ్రీసతికి మగఁడవు భూసతికి మగఁడవు
యీసరున శ్రీవేంకటేశుఁడవు
రాసికెక్కి నీవింతటిరాజసపుదైవమవు
దాసులము మాకెట్ల దక్కితివయ్యా. ॥నీమ॥ 76

ఆహిరి

కలకాల మిట్లాయఁ గాఁపుర మెల్లా
అలదైవ మెందున్నాఁడో ఆలకించఁడుగా. ॥పల్లవి॥

తనకే సంతసమైతే తనభాగ్యము వొగడు
తనకుఁ జింతవుట్టితే దైవము దూరు
మనుజునిగుణమెల్లా మాపుదాఁకా నిట్లానె
ఘనదైవ మెందున్నాఁడో కరుణఁ జూడఁడుగా. ॥కల॥

విరివిఁ బాపాలు సేసేవేళ నాదాయము లెంచు
నరకమందఁ పుణ్యము నాఁడు వెదకు
తిరమైనజీవునితెలివి యిలా నీలాగె
ధర దైవ మెందున్నాఁడో దయఁ జూడఁడుగా. ॥కల॥

వేళతో నిద్దిరింపుచు విరక్తునివలె నుండు
మేలుకొన్నవేళ నన్ని మెడఁ బూనును
యీలీల దేహిగుణము యెంచి శ్రీవేంకటేశుఁడు
యేలీ(లే?)దైవ మెందున్నాఁడో యుల్లో మన్నించఁడుగా. ॥కం॥ 77

శంకరాభరణం

ఉన్నచోనే మూఁడులోకా లూహించి చూచితే నీవే
కన్నచోటనే వెదకి కానఁ డింతేకాక. ॥పల్లవి॥

యెక్కడ వొయ్యోడి జీవుఁ డేచి వైకుంఠము
యిక్కడ హరి యున్నాఁడు హృదయమందె
ముక్కున నూరుపు మోచి ముంచి పుణ్యపాపాల-
కక్కసానఁ జిక్కి తమ్ముఁ గానఁ డింతేకాక. ॥ఉన్న॥

యేమి విచారించీ దేహి యెందు దేవుని వెదకీ
కామించి యాతఁ డిన్నిటాఁ గలిగుండఁగా
దోమటిసంసారపుదొంతికర్మములఁ జిక్కి
కాముకుఁడై కిందుమీఁదు గానఁ డింతేకాక. ॥ఉన్న॥

యేవిధులు తాఁ జేసీ యెవ్వరి నాడఁగఁబోయీ
శ్రీవేంకటేశ్వరుసేవ చేతనుండఁగా
భావ మాతఁడుగాను బ్రతికె నిదవో నేఁడు
కావరాన నిన్నాళ్లు కానఁ డింతేకాక. ॥ఉన్న॥ 78

రేకు 214 ధన్నాసి

కటకటా యేమిటాను కడవర గానఁడిదే
నిటలపువ్రాఁత యెట్టో నిజము దెలియదు. ॥పల్లవి॥

బాదలసంసారము పరవంజుకొని తొల్లి
యేది నమ్మి పాటువడె నీజీవుఁడు
గాదెలకొలుచుగాఁగఁ గట్టుకొని కర్మములు
యేదెస చొచ్చినోకాని యీప్రాణి. ॥కట॥

కాఁపురమై తమతల్లికడుపున వచ్చి పుట్టి
యేపని గలిగెనో యీదేహి
కాపాడీ నిజేపాలు కడునాసతోఁ బాఁతి
యేపదవిఁ దా నుండునో యీజంతువు. ॥కట॥

దవ్వుల యమబాదలు దలఁచి వెరవఁ డిదె
యెవ్వరి సలిగెనమ్మో యీజీవి
రవ్వగా శ్రీవేంకటాద్రిరాయఁడు మన్నించఁగాను
యివ్వల బతికెఁగాక యెవ్వఁడోయి తాను. ॥కట॥ 79

కాంబోది

ఎవ్వరు దిక్కింక నాకు నేది బుద్ధి
యివ్వల విచారించవే ఇందిరారమణా. ॥పల్లవి॥

వెంటఁబెట్టి కామక్రోధవితతులు చుట్టి [1] నన్ను
తొంటి మీసేవకు [2] నన్ను దూరము సేసె
కంటకపుటింద్రియాలు కడుహితశత్రులై
అంటినమోహముత్రోవ నంటకుండాఁ జేసెను. ॥ఎవ్వ॥

తిప్పి తిప్పి నాయాసలు తెగి వైష్ణవధర్మానఁ
దెప్పలఁ దేలకుండాను తీదీపు సేసె
వొప్పగుసంసార మిది వున్నతి నాచార్యసేవ
చొప్పు మాపి పుణ్యానకుఁ జొరకుండాఁ జేసెను. ॥ఎవ్వ॥

1. 2. ఇట్టిపునరుక్తులక్కడక్కడ గలవు.

మచ్చరపుదేహ మిది మనసట్టె పండవిక
తచ్చి యజ్ఞానమునకుఁ దావుసేసె
ఇచ్చల శ్రీవేంకటేశ ఇంతలో నన్ను నేలఁగ
నిచ్చలు నీకృపే నన్ను నిర్మలము సేసెను. ॥ఎవ్వ॥ 80

దేసాళం

అనంతమహిముఁడవు అనంతశక్తివి నీవు
యెనలేనిదైవమా ని న్నేమని నుతింతును. ॥పల్లవి॥

అన్నిలోకములు నీయందు నున్న వందురు నీ-
వున్నలోక మిట్టిదని వూహించరాదు
యెన్న నీవు రక్షకుఁడ విందరిపాలిటికి
నిన్ను రక్షించేటివారి నేనెవ్వరి నందును. ॥అనం॥

తల్లివి దండ్రివి నీవు తగుబ్రహ్మాదులకు
యెల్లగా నీతల్లిదండ్రు లెవ్వరందును
యిల్లిదె వరములు నీ విత్తు విందరికిని
చెల్లఁబో నీకొకదాత చెప్పఁగఁ జోటేది. ॥అనం॥

జీవుల కేలికవు శ్రీవేంకటేశుఁడవు నీ-
వేవలఁ జూచిన నీ కేయేలికే లేఁడు
వేవేలు మునులును వెదకేరు నిన్నును
నీ వెవ్వరి వెదకేవు నిర్మలమూరితివి. ॥అనం॥ 81

శ్రీరాగం

పాటించి నమ్మినవారభాగ్యముగాదా
కోటిసుద్దులేల యిదె కోరి చేకొనేది. ॥పల్లవి॥

స్వామిద్రోహియైనచండిరావణాసురుఁడు
కామించి శరణంటేను కాచే నంటివి
యేమని నీదయ యెంతు నెంతని నీమహిమెంతు
ఆమాటకు సరియా నఖిలవేదములు. ॥ పాటిం ॥

దావతి సీతాద్రోహము దలఁచి కాకాసురుఁడు
కావుమని శరణంటేఁ గాచితివి
ఆవల నీవని యెట్టు అట్టె నీమన్నన యెట్టు
యీవల నీశరణనే ఇందుసరే తపము. ॥ పాటిం ॥

చిక్కులిన్ని నిఁకనేల చేరి యేపాటివాఁడైన
గక్కన నీశరణంటేఁ గాతువు నీవు
అక్కరతో నిన్ను శరణంటిమి శ్రీవేంకటేశ
యెక్కువ నీబిరుదుకు యీడా పుణ్యములు. ॥ పాటిం ॥ 82

పాడి

నేఁడు దప్పించుకొంటేను నేరుపున్నదా
వేఁడుక భోగించుతానే వెనఁగఁ జోటున్నదా. ॥ పల్లవి ॥

తనువుమోచిననాఁడే తప్పులెల్లాఁ జేసితిని
వెనక మంచితనాలు వెదక నేది
ననిచి సంసారినైననాఁడే నిష్ఠూరానకెల్ల
మునుప నే గురియైతి మొరఁగఁ జోటున్నదా. ॥ నేఁడు ॥

సిరులు చేకొన్ననాఁడే సిలుగెల్లా గట్టుకొంటి
తరవాతిపను లింకఁ దడవనేల
నరలోకముచొచ్చిననాఁడే పుణ్యపాపముల—
పొరుగుకు వచ్చితిని బుద్ధు లింక నేల. ॥ నేఁడు ॥

వూపిరిమోచిననాఁడే వొట్టికొంటి నానలెల్లా
మాపుదాఁకా వేసరిన మానఁబొయ్యీనా
యేపున శ్రీవేంకటేశుఁ డింతలో నన్నుఁ గావఁగా
పైపై గెలిచితిఁగాక పంతమాడఁగలనా. ॥ నేఁడు ॥ 83

దేసాళం

ఇన్ని దేహములఁ బుట్టి యేమిగంటిమి
వున్నతపుహరిదాస్య మొక్కటేకాక. ॥ పల్లవి ॥

హీనజంతువైననాఁడు యేనుగై పుట్టిననాఁడు
ఆనంద మొక్కటే అంగాలే వేరు
యీనేటియజ్ఞానము యీజీవుల కొక్కలాగే
జ్ఞానమే యెక్కుడుగాక సరిలేనిదొకటే. ॥ ఇన్ని ॥

నరలోకభోగానకు వరకానుభవానకు
నరేకాని[1] మిగులదు చనెఁ దొల్లె (?)
గరిమ నేర్పడ నందు ఘనమేమి కొంచమేమి
హరిదాసుఁడై బ్రదుకుటదియే లాభము. ॥ ఇన్ని ॥

బాలుఁడైనయప్పుడూను పండి ముదిసినప్పుడు
కాలమొక్కటే బుద్ధి కడు లేదు
ఆలకించి శ్రీవేంకటాధిపతి సేవించి
యేలికంటా మొక్కుచుండే దిదియే భాగ్యము. ॥ ఇన్ని ॥ 84

రేకు 215 గుజ్జరి

ఎన్నఁడు మానవు యీదుర్గుణములు యేది అవుషధము యిందుకును
కన్నులఁ జూచుచుఁ జెవుల వినుచు [1] నేఁ గనియు వినియునిదె కష్టుడ
[నయ్యా [2] నేను. ॥ పల్లవి ॥

---

1. "మిగులదంచనెఁ దొల్లె" కావచ్చు
1. 2. ఇట్టిపునరుక్తు లక్కడక్కడ గలవు.

హృదయములోపల దేవుఁ డుండఁగా నెఱఁగక భ్రమయుచుఁ
గన్నచోటనే
వెదకియుఁ గానక అనుమానించేటివేఁదురనయ్యా నేను
చెదరినజననము దుఃఖరూపమని చెప్పఁగ విని యది సుఖమని కోరుచు
మది దీపమువట్టుక నూఁతఁబడినమత్తునిలెనవయ్యా నేను. ॥ఎన్న॥

పరమగురువులదె భక్తిమార్గ మిటు ప్రాణులకెల్ల నుఁ బెట్టివుండఁగా
విరసపుటింద్రియమార్గములఁ దిరుగువీరిడినయ్యా నేను
దరిచేర్పఁగ హరినామము గలిగియు దైన్యము నొందితి సంసారములో
పరుసము చేతఁబట్టుక తిరిసేటిభ్రాంతునివలెనయ్యా నేను. ॥ఎన్న॥

శ్రీవేంకటపతి యెదుటనుండఁగా సేవింపఁగ సంసారములోపల
దావతిఁ బొరలుచు వేసరుచుండేటితగనిజడుడనయ్యా నేను
కైవశమై యీదేవుఁడే యిటు నన్నుఁ గరుణింపుచు రక్షింపుచు నుండఁగ
పూవునుఁ బరిమళమునువలనే నేపొదలుచు నుండెదనయ్యా[2]నేను.॥ఎన॥85

దేవగాంధారి

ఎంతగాలమునకైనా యీయర్థమే కలది
యింతటిలోననే హరి నెరఁగఁగవలయు. ॥పల్లవి॥

యెంచి నూరేండ్లమీఁద యెప్పుడో మరణము
ముంచి యిట్టె మోచీనదె మురికిదొక్క
యించుకంత యిందుకుఁగా నేల కోరేమో సుఖము
కాంచన మెవ్వరికిఁగా గడియించేమో. ॥ఎంత॥

కలిగినదినములు కాఁపురానకే సెలవు
తలఁపెల్ల నాసలకంతటఁ [3]గొలఁది(?)
ఫల మిందు నేమిగద్దో ప్రాణి ఇందేమిటివాఁడో
తెలిసి పాపఁగలేము తీరనియీచిక్కు. ॥ఎంత॥

---

1. 2. ఇట్టిపునరుక్తు లక్కడక్కడ గలవు. 3. కొలఁదివాలినది కావచ్చు.

పేసినకర్మములెల్లా చెప్పరాని మోపులాయ
రాసికెక్కి యింద్రియాలరపమాయను
వేసరి యిన్నిటికి శ్రీవేంకటేశుఁ గొలిచితి
నూసినదే మణుఁగాయ మాకు నేఁడు జన్మము. ॥ ఎంత ॥ 86

నాళంగనాట

ఇన్నియు ముగిసెను ఇటు నీలోననె
పన్ని పరులఁ జెప్పఁగఁ జోటేది. ॥ పల్లవి ॥

కుందనినీరోమకూపంబులలో
గొందుల బ్రహ్మాండకోట్లట
యెందరు బ్రహ్మలో యెంత ప్రపంచమో
యిందుఁ బరులమని యెంచఁగనేది. ॥ ఇన్ని ॥

నీకొనచూపున నెటిఁ గోటిసూర్య—
లేకమగుచు నుదయింతురటా
నీకాయ మెంతో నీవునికేదో
నీకంటెఁ బరుఁని నిక్కఁగనేది. ॥ ఇన్ని ॥

జీవకోటి నీచిన్నిమాయలో
బ్రోవులగుచు నటు పొడమెనటా
శ్రీవేంకటేశ్వర చెప్పఁగ నీ వెంతో
అవలఁ బరులకు నాధిక్యమేది. ॥ ఇన్ని ॥ 87

బౌళి

ఎన్నఁడు నే నీఁక బుద్దెరిఁగేది యీశ్వర నిను నేఁ దగిలేడిది
విన్నప మిదియే నీకే భారము వీని గెలువ నావసమౌనా. ॥ పల్లవి ॥

తగిలెడి నీనయనేంద్రియములు తగఁ జూచినయందెల్లను
తగిలెడి నీశ్రవణేంద్రియములు తగినలోకవార్తలకెల్లా
మగుడఁగనేరవు జన్మజన్మముల మనసు వీనికే సహాయము
తెగ వెన్నటికిని యింద్రియసంపద తీగెలుసాగుచు నొకటొకటి. ॥ఎన్న॥

యెక్కెడిని నానాఁటికి మదమెంతైనా స్థానమున
యెక్కెడి నీసంసారమే హరియెదుటనే మిత్తాయిగొన్నట్లు
చిక్కఁ డెంతయిన మోక్షమార్గమున జీవుఁ డిందుకే లోలుఁడు
దిక్కమెకమువలెఁ గిందికి మీఁదికిఁ దిప్పెడిఁ గర్మము దేహమును. ॥ఎన్న॥

మెఱయుచుఁ బెరిగెడి నీయాసలు గడు మీఁదమీఁద లంపటమగుచు
మఱియునుఁ బెరిగెడి పుణ్యపాపములు మలసి రాసులై పెక్కగుచు
యెఱఁగను శ్రీవేంకటేశ్వర [1]యెంతో ఇఁక నాలోపలిదుర్గ(ర్గు?)ణములు
మఱఁగుచొచ్చితిని నే నిన్నాళ్లకు మరి నాభాగ్యము నీ చిత్తము.॥ఎన్న॥88

సామంతం

దేవా [2]నీమాయ తెలియ నలవిగాదు
భావభేదముల భ్రమసితిని. ॥ పల్లవి ॥

జననంబొకటే జంతుకులమొకటే
తనువికారములే తగఁ బెక్కు
దినములు నివియే తివిరి లోకమిదె
పనులే వేరయి పరగీని. ॥ దేవా ॥

మాఁటలు నొకటే మనసులు నొకటే
కోటులసంఖ్యలు గుణము లివి
కూటము లిట్లనె గుఱిఁ గామఁ డొకఁడె
మేటివలపులకె మేరలే లేవు. ॥ దేవా ॥

1. 'యంతో' రేకు. 2. "వీమహిమ" పూ. ము. పా.

జ్ఞానమొకచే యజ్ఞానము నొకచే
నానామతిములు నడచీని
అనుక శ్రీవేంకటాధిప నీకృప
తానే మమ్మిటు తగఁ గాచీని. ॥ దేవా ॥ 89

## 216 వ రేకు లేదు.

రేకు 217 ౹ దేశాక్షి

కన్నవిన్నవారెల్లా కాకుసేయరా
వున్నతుఁడవైననీ కీవొచ్చములేలయ్యా. ॥ పల్లవి ॥

దేవతలఁగాచినట్టిదేవుఁడ నీకుఁ బసుల
నీవలఁ గాచితివనే హీనమేలా
కావించి పాలజలధిఁ గాఁపురముండినయట్టి—
నీవు పాలదొంగవనే నింద నీకేలయ్యా. ॥ కన్న ॥

కాలమందు బలిదైత్యుఁ గట్టివేసినట్టినీకు
రోలఁ గట్టువడినట్టిరోఁత నీకేల
పోలించి లోకాలకెల్ల పొడవైనదేవుఁడవు
బాలుఁడవై రేపల్లెలోఁ [1]బారాడనేలయ్యా. ॥ కన్న ॥

పాముమీఁదఁ బవ్వళించి పాయకుండినట్టినీకు
పాముతల దొక్కినట్టిపగ లేలా
కామించి శ్రీవేంకటాద్రికడపరాయఁడ నీవు
భూమి మాయలణఁచి నేర్పులమాయలేలయ్యా. ॥ కన్న ॥ 90

వరాళి

చేసినట్టె సేసుఁగాక చింత మాకేలా
వాసి వంతూ నతనిదే వట్టిజాలియేలా. ॥ పల్లవి ॥

---

1. 'బారేడ' రేకు. పారి + అడన్ = పారేడన్. ఈవ్యావహారికనందు లీ- వాఙ్మయమున కొల్లలు.

కర్మమూలమైనవి యీకాయపువర్తనలెల్లా
ధర్మమూలమైనది యీ దైవికము
మర్మమైనవాఁ డొక్కఁడే మనసులోనున్నహరి
నిర్మిత మాతనిదింతే నేర నే నెంతవాఁడ. ॥ చేసి ॥

ధనమూలమైనది యీతగినప్రపంచమెల్లా
తనువుమూలమైనది యీతపసులెల్లా
ననిచి యీరెంటికిని నారాయణుఁడే కర్త
కొనమొద లాతనిదే కొసరు మాకేల. ॥ చేసి ॥

భోగమూలమైనది యీపొందైనసంసారము
యోగమూలము విరతి కొక్కటైనది
యీగతి శ్రీవేంకటేశుఁ డెట్టువలసినఁ జేసు
బాగులుగా నీతనిశ్రీపాదమే మాదిక్కు. ॥ చేసి ॥ 91

పాడి

ఎదురేది యెంచిచూడ నితనిప్రతాపానకు
పదిదిక్కులను భంగపడిరి దానవులు. ॥ పల్లవి ॥

యెక్కువగా వినోదాన కితఁడు తేరెక్కితేను
యెక్కిరిదైత్యులు కొట్టు లిందరుఁ గూడి
చక్కఁగా నితఁడు చేత చక్రమెత్తినమాత్రాన
దిక్కులఁ బరువెత్తిరి దిమ్మరిఅసురలు ॥ ఎదు ॥

దట్టమై యీతనిభేరిఁ దగ నాదువుట్టితేను
పుట్టె నుత్పాతాలు వైరిపురములందు
అట్టె గరుడధ్వజ మటు మిన్నుముట్టితేను
కిట్టి దనుజుల కపకీర్తి తుదముట్టెను. ॥ ఎదు ॥

అలమేలుమంగవిభుఁ డటు వీధు లేఁగితేను
ఖలు లేఁగిరి యమునికట్లెదిరికి
యెలమి శ్రీవేంకటేశుఁ డేపుమీరఁ జొచ్చితేను
ములిగి దైత్యసతులు మూలమూల చొచ్చిరి. ॥ఎదు॥ 92

సాళంగనాట

కన్నులపండుగలాయఁ గడపరాయనితేరు
మిన్ను నేల శృంగారము మితిమీరినట్లు. ॥పల్లవి॥

కదలెఁ గదలె నదె గరుడధ్వజునితేరు
పొదిగి దేవదుందుభులు మ్రోయఁగా
పదివేలు సూర్యబింబము లుదయించినట్లు
పొదలి మేరువు వచ్చి పొడచూపినట్లు. ॥కన్ను॥

వచ్చె వచ్చె నంతనింత వాసుదేవునితేరు
అచ్చుగ దేవకామిను లాడిపాడఁగా
ముచ్చటతో గరుడఁడు ముందట నిలిచినట్టు
మెచ్చులమెరుఁగులతో మేఘము వాలినట్టు. ॥కన్ను॥

తిరిగెఁ దిరిగె నదె దేవదేవోత్తముతేరు
సరుస దేవతలెల్ల జయవెట్టఁగా
విరివిఁ గడపలో శ్రీవేంకటేశుఁడు తేరుపై—
నిరవాయ సింహాసన మిదేయన్నట్లు. ॥కన్ను॥ 93

బౌళి

రామా దయాపరసీమా అయోధ్యపుర—
ధామా మావంటివారితప్పులు లోఁగొనవే. ॥పల్లవి॥

అపరాధియైనట్టియాతనితమ్మునినే
కృపఁజూపితివి నీవు కింకలు మాని
తపియించి యమ్మునెమొన దారకుఁజిక్కినవాని
నెపానఁ గాచి విడిచి నీవాదరించితివి. ॥ రామా ॥

సేయరానిద్రోహము సేసినపక్షికి నీవు
పాయక అప్పటి నభయమిచ్చితి
[1] చాయసేసుకొని వుండి స్వామిద్రోహిఁ జెప్పనట్టి -
తోయపుచేలని మంచితోవనే పెట్టితివి(?). ॥ రామా ॥

నేరము లెంచవు నీవు నీదయే చూపుదుగాని
బీరపు శరణాగతబిరుద(వు?) నీవు
చేరి నేఁడు నిలుచుండి శ్రీవేంకటాద్రిమీఁదఁ
గోరినవరములెల్లా కొల్ల లొసఁగితివి. ॥ రామా ॥ 94

ఆహిరి

ఎట్టయినాఁ జేసుకో ఇఁక నీచిత్తము నన్ను
పట్టిచ్చె మాగురుఁడు నీపాదాలు విడువను. ॥ పల్లవి ॥

పోఁడిమి నానామములు పొద్దువొద్దు నుడిగీని
వీఁడేమడుగునోయని వెలవకుమీ
నాఁడే నాయాచార్యుఁడు నాకు నన్నీ యిచ్చినాఁడు
నేఁ డిదేలంటే నతనినేమము నే మానను. ॥ ఎట్ట ॥

ప్రేమతో వీఁడు నన్నింటఁ బెట్టుక పూజించీని
యేమిగారణమోయని యెంచుకోకుమీ
కామించి యాచార్యుఁడే కారణము నీకు నాకు
యీ మరులేలంటే నాతఁడిచ్చినసొమ్మే నేను. ॥ ఎట్ట ॥

1. ఇది దర్పశయనవృత్తాంతమా?

పలుమారు వీఁడు వాపై బత్తిచేసీ నేఁటికని
వెలయ శ్రీవేంకటేశ వేసరకుమీ
యెలమి నాచార్యుఁ డదేవని చేసినాఁడు
నిలిచెఁ గలకాలము నీకు నాకుఁ బోదు. ॥ఎట్ట॥ 95

రేకు 218 గుండక్రియ

వివరముమాలినట్టివెట్టిదేహి తొల్లి
అవకట్టినంతేకాక చండపోరనేఁటికే. ॥పల్లవి॥

మనసంతే మంగళము మరి యెంత పొరలినా
తనువుకొలఁదియే సత్వములెల్లాను
తనకలి మెంచుకోక తగనిమురి పెముల
పెనఁగఁబోతే తీపు పిప్పిలోనఁ గలదా. ॥వివ॥

చెంది విత్తినకొలఁదే చేరి మొలచేటిపైరు
అంది ఆఁకటికొలఁదే ఆహారమెల్ల
ముందువెనక చూడక మొక్కలపువరువేల
అందనిమానిపంటికి నాసపడవచ్చునా. ॥వివ॥

శ్రీవేంకటేశ్వరుఁ గొలిచినకొలఁదియే మేలు
భావించ నాతఁడిచ్చేది భాగ్యమెల్లాను
వేవేలు మొక్కులేల వెస నానాఁటికినెల్ల
తోవగానితోవఁ బోతే తుదకెక్కఁగలదా. ॥వివ॥ 96

సామంతం

ఈతగవే నాకు నీకు నెంచి చూచితే
కాతరపుజీవులకుఁ గలదా వివేకము. ॥పల్లవి॥

భారము నీదిగవక పలుమారుఁ బాపములే
చేరిమొక్కలాన నేఁ జేసితిని
పేరడిఁ దల్లిదండ్రులు బిడ్డ లేమిసేసినాను
వోరుచుక ముద్దుసేసుకుందురు లోకమున. ‖ ఈత ‖

కావ నీవుగలవని కడదాఁకా నేరములే
వేవేలు సేసితిని వెఱవక
భావించుక యింటిదొర పసురము దెంచుకొని
యేవిధిఁ బైరుమేసినా నెగ్గుసేయఁ డతఁడు. ‖ ఈత ‖

పుట్టించేవాఁడవు నీవు బొదలేవారము నేము
యెట్టుండినా నీకుఁ బోదు యెన్నటికిని
వొట్టుక శ్రీవేంకటేశ వోడఁగట్టినదూలము
అటునిట్టుఁ బొరలినా నండవాయ దెపుడు. ‖ ఈత ‖ 97

లలిత

ఏఁటినేను యేఁటిబుద్ధి యెక్కడిమాయ
పీటఁబొయ్యే వెఱ్ఱిఁ గాను వివేకిఁ గాను. ‖ పల్లవి ‖

అరసి కర్మముసేసి అవి(ది?)నన్నుఁ బొదిగితే
దూరుదుఁ గర్మము గొంది దూరుచు నేను
నేరక లంపటములు నేనే కొన్నిగట్టుకొని
పేరడిఁ బరుల నందుఁ బెట్టరంటాను. ‖ ఏఁటి ‖

యెక్కుడు నాదోషములు యెన్నైనా వుండఁగాను
వొక్కరిపాపము లెంతు వూరకే నేను
తిక్కవట్టి నాకునాకే దేవతలకెల్లా మొక్కి
వొక్కరివాఁడ గాకుందు వుస్సురనుకొంటాను. ‖ ఏఁటి ‖

విరతిఁ బొందుదుఁ గొంత వేరేసంసారముఁ జేతు
యెరవుల వాఁడనే యెప్పుడు నేను
అరిది శ్రీవేంకటేశుఁ డంతలో నన్ను నేలఁగా
దొరనై తి నధముఁడఁ దొల్లే నేను. ॥పంటి॥ 98

భైరవి

అతఁడు భక్తసులభుఁ డచ్యుతుఁడు
రాతిగుండెవాఁడు గాఁడు రంతు మానుఁ డిఁకను. ॥పల్లవి॥

జీవుఁడా వేసరకు చిత్తమా జడియకు
దైవము గరుణించఁ దడవుగాదు
తోవచూపె మనకుతొల్లే ఆచార్యుఁడు
కావలసినట్లయ్యీఁ గలఁగకుఁ డిఁకను. ॥అతఁ॥

కాలమా వేగిరించకు కర్మమా నన్ను మీరకు
పాలించ దైవానకు నే భార మిఁకను
ఆలించి తిరుమంత్రమే అతని నన్నుఁ గూరిచె
వేళగానిఅందాఁకా వేసరకుఁ డిఁకను. ॥అతఁ॥

వెలివకు దేహామా వేసరకు ధ్యానమా
యెలిఁగి శ్రీవేంకటేశుఁ డెడసిపోఁడు
తలి నిహాపరము లితనిదాసు లిచ్చిరి
గుఱియైతి నిన్నిటికిఁ గొంకకుఁడీ ఇఁకను. ॥అతఁ॥ 99

సాళంగం

పలువిచారములేల పరమాత్మ నీవు నాకు
గలవు కలవు వున్నకడమలేమిటికి. ॥పల్లవి॥

నీపాదములచింత నిబిడమైతేఁ జాలు
యేపాతకములైన నేమిసేసును
యేపార నీభక్తి ఇంత గలిగినఁజాలు
పైపై సిరు లచ్చుటఁ గాదుకొనినిలుచు ॥పలు॥

సారిది నీ శరణము చొచ్చితినంటేఁ జాలు
కరుణించి యప్పుడట్టే కాతువు నీవు
సరుస నీముద్రలు భుజముల నుంటేఁజాలు
అరుదుగాఁ జేతనుండు అఖిలలోకములు. ॥పలు॥

నేరక వేసినఁ జాలు నీమీఁద నొకపువ్వు
కోరినకోరికలెల్లఁ గొనసాగును
మేరతో శ్రీవేంకటేశ మిమ్ము ౧గొలిచితి నేను
యేరీతి నుండినఁగాని యిన్నిటా ఘనుఁడను. ॥పలు॥ 100

బౌళి

ఇందుకంటే మరి యిఁకలేదు హితోపదేశము వోమనసా
అంది సర్వసంపన్నుఁడు దేవుఁడు ఆతనికంటే నేరుతుమా. ॥పల్లవి॥

కల దొకఁటే ధర్మము కల్పాంతమునకు నిలిచినది
తలఁకక మీశరణుచొచ్చి మీదాసుఁడ ననెడి దొకమాఁట
వలవనిజోలే యింతాను వడ నిదిగాక యేమిసేసినను
సులభ మిందునే తొల్లిటివారలు చూరలుగొని రదేమోక్షంబు ॥ఇందు॥

మొదలొకటే యిన్నిటికి ముందర వెనకా వచ్చేది
వొదుగుచు గోవిందునిదాసులకు నొక్కమాటే మొక్కినఁజాలు
తుదకెక్కనివే యితరములు దొరకొని మరేమిసేసినను
బదికి రిందునే పరమవైష్ణవులు పలుచదువులలో వినరాదా. ॥ఇందు॥

---

౧. 'గొలిచిరి' రేకు.

తగులోకచే విడువరానిది తతి నెన్నటికినిఁ జెడనిది
వొగి శ్రీవేంకటపతినామజపము వొకమాచే అబ్బినఁ జాలు
నగుబాచే యింతాను నానాఁటి కేమేమి సేసినను
తగునీబుద్ధుల నడచిరి మున్నిటిదైవజ్ఞులు పూర్వాచార్యులును.
॥ ఇందు ॥ 101

రేకు 219 దేసాక్షి

ఏలోకమున లేఁడు యింతటిదైవము మరి
కోలి దవ్వి తవ్వి యెంత సోదించినాను. ॥ పల్లవి ॥

మంచిరూపున నెంచితే మరునిగన్నతండ్రి
ఇంచుకంత సరిలేదు ఇతనికిని
మించుసంపదల నైతే మేటిలక్ష్మీకాంతుఁడు
పొంచి యీతనికి నీడు పురుఁడించఁగలరా. ॥ ఏలో ॥

తగఁ బ్రతాపమునను దానవాంతకుఁ డితఁడు
తగుల నీతనిమారుదైవాలు లేరు
పొగరుమగతనానఁ బురుషోత్తముఁ డితఁడు
వెగటై యీతనిపాటి వెదకిన లేరు. ॥ ఏలో ॥

పట్టి మొదలెంచితేను బ్రహ్మఁగన్నతండ్రితఁడు
మట్టున నింతటివారు మరి వేరి
ఇట్టె శ్రీవేంకటేశుఁ డిగికి వరదుఁడు
గొట్టఁగొన నితరుల గురిసేయఁగలరా. ॥ఏలో॥ 102

బౌళి

అవాప్తసకలకాముఁ డనుమాట నీకుఁ జెల్లె
వివేకించఁ బురుషార్థవిధి మాయందేది. ॥ పల్లవి ॥

మఱిగి నీపై భక్తి మాకుఁ గలుగుటెల్లాను
అరసి నీవు రక్షించే ఆసకొరకే
హరి నీవు భక్తవాత్సల్యము మాపైఁ జేయుటెల్ల
ఇరవైననీకు నిరుహేతుకమే. ॥ అవా ॥

కొసరుచు నిన్ను నేము కొలిచినదెలాను
వెస మాభారము నీపై వేయుకొరకే
వసముగా నీవు నన్ను వలెనని యేలుటెల్ల
యిసుమంతైన నిరుహేతుకమే. ॥ అవా ॥

శ్రీవేంకటేశ్వర నీకుఁ జేయెత్తి మొక్కుటయెల్ల
నీవే మావాఁడవై మన్నించుకొరకే
ఆవటించి అంతర్యామివై నీవుండుటయెల్ల
యేవలఁ జూచిన నిరుహేతుకమే. ॥ అవా ॥ 103

బౌళి

మఱచిన వెఱచిన మఱి లేదు
యెఱిఁగినసులభుఁడు యీ హరి యొక్కఁడే ॥ పల్లవి ॥

ఆతుమ తొల్లిటిదే అంతరాత్మ తొల్లిటిదే
నీతితో యీదేహములే ౧ నిత్యకొత్తలు
యీతల నేర్పరులకు నిందే యిహపరములు
చేతిలో నున్నవి యిది చింతించరో జనులు. ॥ మఱ ॥

కాలము నెందూఁ బోదు కర్మము నెందూఁ బోదు
జాలిఁబడ్డమనసే సావివోయను
పోలింప వివేకులకు పుణ్యమునుఁ బాపమును
వేళవేళనే వున్నవి వెదకరో జనులు. ॥ మఱ ॥

---

౧. 'నిత్యకొత్తలు' వంటి సమాసములు ఈ భాషకు భూషలు.

ఆఁకలినిఁ దీరదు అన్నమునుఁ దీరదు
తేఁకువ తనధైర్యమే తీరెఁ గాని
తాఁకక శ్రీవేంకటేశుదాసులై తేఁ జాలుఁగాని
తాఁక దీరు నిందరికిఁ గనుఁగోరో జనులు. ॥మఱి॥ 104

రామక్రియ

చవులకుఁ జవి సంసారము
భవము నానాఁటికి పచ్చిదే. ॥పల్లవి॥

దైవికము మాస్వతంత్రముతోఁ గూడె
సావి వోదెన్నఁడు సంసారము
వూవుపిందెవలెఁ బోడమివున్నవి
యేవల యీరెండు నేకమే. ॥చవు॥

పాపముఁ బుణ్యము పైపైఁ గూడుకొని
దాపకిందినీరు సంసారము
రేపుమాపువలె రెట్టించి వున్నవి
యేపొద్దు నీరెండు నేకమే. ॥చవు॥

మాయ గొంత నిజమార్గమునుఁ గొంత
చాయ దప్పదిదే సంసారము
చేయిచ్చి వున్నాఁడు శ్రీవేంకటేశుఁడు
యీయెడ నీరెండు నేకమే. ॥చవు॥ 105

దేవగాంధార

ఒరసి చూడఁగబోతే నొకటీ నిజములేదు
పొరలమేను ధరించి పొరలఁగఁ బట్టెను. ॥పల్లవి॥

పాతకములట కొన్ని బలుపుణ్యాలట కొన్ని
యీతల స్వర్గనరకాలిచ్చేవట
యేతుల నందుఁగొన్నాళ్లు యిందుఁగొన్నాళ్లు దేహికి
పోతరించి కాతరించి పొరలనే పట్టెను. ॥ ఒర ॥

పొలఁతులట కొందరు పురుషులట కొందరు
వెలుఁగును జీఁకట్లు విహారమట
కలవరింతలు గొంత ఘనసంసారము గొంత
పొలసి జీవులు రెంటాఁ బొరలఁగబట్టెను. ॥ ఒర ॥

వొక్కవంక జ్ఞానమట వొక్కవంకఁ గర్మమట
మొక్కి ఇహపరాలకు మూలమిదట
తక్కక శ్రీవేంకటేశుదాసులై గెలిచిరట
పుక్కట నిన్నాళ్లు రెంటాఁ బొరలఁగఁ బట్టెను. ॥ ఒర ॥ 106

భూపాళం

మదించినయేనుగను మావటీఁడు దిద్దినట్టు
త్రిదశవంద్యుఁడ నీవే తిప్పఁగదే మనసు. ॥ పల్లవి ॥

నేరమి సేసినవాఁడు నిక్కపుటేలికఁ గని
తారి తారి యిందు నందు దాఁగినయట్టు
తీరని పంచేంద్రియాలదిమ్మరియై తిరిగాడి
కోరి నీపై భక్తియంటే కొలువదు మనసు. ॥ మదిం ॥

పగసేసుకొన్నవాఁడు బలుమందసములోన
వెగటుజాగరముల వేగించినట్టు
మిగుల వేదమార్గము మీరి పాపమునఁ జిక్కి
జిగి నిన్నుఁ జేరుమంటేఁ జింతించీ మనసు. ॥ మదిం ॥

నిరుఁబేదయైనవాఁడు నిధానము వొడగని
గరిమ భ్రమసి యట్టె కాచుకున్నట్టు
యిరవై శ్రీవేంకటేశ యిట్టే నిన్నుఁ బొడగని
వెరవున నిగుణాలు వెదకీని మనసు. ॥మది॥ 107

రేకు 220 గుజ్జరి

అయ్యో సదా మత్తుఁడను హరి నీదాసులు నన్ను
ఇయ్యెడనే దయఁజూచి యీడేర్చిరిగాక. ॥పల్లవి॥

తెగక కన్నులుమూసి దేహము మఱచేవాఁడ
నిగిడి దేవుఁడవని నిన్నెఱఁగేనా
తగఁ బసిఁడిచూచి నే ధర్మము మరచేవాఁడ
జగతి విజ్ఞానము సరవెఱఁగేనా. ॥అయ్యో॥

వలచి సతులనేటివలలఁ బడేటివాఁడ
మలసి తప్పించుక నీమాయ దాఁటేనా
వెలయ నన్నీఁ జదివి వికేకమొల్లనివాఁడ
చలివాసి నీభక్తి చవిగొనేనా. ॥అయ్యో॥

మించుసంసారము చొచ్చి మీఁదు దెలియనివాఁడ -
నంచ నీ వంతర్యామి వని మొక్కేనా
యెంచక శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
మంచిదాయ నిఁక నిది మానబొయ్యేనా. ॥అయ్యో॥ 108

గుండక్రియ

గోవింద హరి గోవింద గునిసి యాడుచం బిటురారో
ఆవటించి మన మెట్లు గడచెదము ఆశ్చరియం బిది హరిమాయా ॥పల్లవి॥

కర్మానుగుణము కాలము
ధర్మానుగుణము దైవము
మర్మము రెంటికి మనుజుఁడు
అర్మిలిఁ బొదిగీ హరిమాయా. ॥ గోవిం ॥

అజ్ఞానహేతువు లాసలు
విజ్ఞానహేతువు విరతొకటి
౧తజ్ఞులు రెంటిఁదగిలిరి (?)
జిజ్ఞాను (సు?) గప్పెను శ్రీహరిమాయా. ॥ గోవిం ॥

సకలకారణము సంసారము
ప్రకటకారణము ప్రపంచము(?)
అకటా శ్రీవేంకటాద్రీశుదాసులు
వొకరిఁ దడవదువో హరిమాయా. ॥ గోవిం ॥ 109

శంకరాభరణం

ఉడివోనిసంసారాన నున్నారము ౨ నట్ట -
నడుమాయ నవ్వులకు నాబ్రతుకు. ॥ పల్లవి ॥

పుట్టనిజన్మము లేదు పొందనిభోగము లేదు
నెట్టన మాయలఁ జిక్కి నేఁ దొల్లి
కొట్టఁగొన కెక్క లేదు కోరి మొదలను లేదు
నట్టనడుమ నున్నది నాబ్రదుకు. ॥ ఉడి ॥

చొరనిలోకము లేదు చూడనివిద్యలు లేదు
నిరతి మాయలఁ జిక్కి నేఁ దొల్లి
దరిచేరుటా లేదు తగులు లేదు నానాఁడు
నరకమే కురిసీని నాబ్రదుకు. ॥ ఉడి ॥

---

౧. ప్రాసభీతితో 'తద్జులు' 'తజ్ఞులు' అయినట్లున్నది.
౨. ఈ 'నట్ట' పూర్వముద్రితములో తప్పిపోయినది.

చేయనికర్మము లేదు చెందని ఫలము లేదు
నీయిచ్ఛమాయలఁ జిక్కి నేఁ దొల్లి
యీయెడ శ్రీవేంకటేశ యిట్టె నీవు నన్నేలఁగా
నాయిచ్చ సఫలమాయ నాబ్రదుకు. ॥ ఉడి ॥ 110

### గుండక్రియ

ఒక్కటితరువాత వేరొకటై కాచుకుండు
చక్క దెరనాటకముసంగతి సంసారము. ॥ పల్లవి ॥

వొంటె నాపద దీరితే నొంటె సంపదైనా వచ్చు
అంద నెన్నఁడుఁ దీరదు హరిఁ దలఁచ
తండోపతండములై తలమోపులు పనులు
చండిపెట్టి పనిగొను సంసారము. ॥ ఒక ॥

పాప మొల్లనంటేను బలుపుణ్యమై తగులు
యేపొద్దుఁ దీరదు హరి నిటు దలఁచ
వోపనన్నాఁ బోనీదు వూరకైనఁ బనిగొను
చాపకిందినీరువలె సంసారము. ॥ ఒక ॥

పగలెల్లా నలసితే పైకొను రాతిరి నిద్ర
అగపడ దెప్పుడును హరిఁ దలఁచ
తగిలి శ్రీవేంకటాద్రిదైవమే పొడచూపఁగా
జగడము ౧ సంతమాయ సంసారము. ॥ ఒక ॥ 111

### ముఖారి

ఆడరమ్మ పాడరమ్మ అందరు మీరు
వేడుక సంతసములు వెల్లవిరియాయను. ॥ పలవి ॥

---

౧. శాంతశబ్దభవము కావచ్చు. అర్థమూ అదే.

కమలనాభుఁడు పుట్టెఁ గంసునిమదమణఁచ
కమిరి దేవకిదేవిదేహమందును
అమరులకు మునుల కభయమిచ్చె నితఁడు
కొమరెగొల్లెతలపైఁ గోరికలు నిలిపె. ॥ ఆడ ॥

రేయిఁ బగలుగఁ జేసి రేపల్లెఁ బెరుగఁజొచ్చె
ఆయెడ నావులఁ గాచె నాదిమూలము
యీయెడ లోకాలు చూపె నిట్టె తనకడుపులో
మాయసేసి యిందరిలో మనుజుఁడై నిలిచె ॥ ఆడ ॥

బాలలీలలు నటించి బహుదై విక్రమము మించె
పాలువెన్నలు దొంగితెఁ బరమమూర్తి
తాళీ భూభార మణఁచె ధర్మము పరిపాలించె
మేలిమిశ్రీవేంకటాద్రిమీఁద నిట్టె నిలిచె. ॥ ఆడ ॥ 112

ధన్నాసి

అంతవాని కింతసేయ నమరునటే
వింతలు యీసుద్దులకే వెరగయ్యీ మాకు. ॥ పల్లవి ॥

కడిసి బ్రహ్మాండములు గర్భములోనున్న దేవుఁ—
డిదె దేవకిగర్భాన నెట్టు పుట్టెనే
అదె మఱ్ఱాకుమీఁదట నటు పవ్వళించువాఁడు
యెదుట యశోదచేత నెట్టు వినోదించీనే. ॥ అంత ॥

అడుగులుమూఁట లోకా లటు గొలచినవాఁడు
బడిబడి రేపల్లెఁ బారాడీని
అడరి యజ్ఞభాగము లారగించేదేవుఁడు
సడితో వెన్న ముచ్చిలి చవిగొనీ నిదివో. ॥ అంత ॥

వేదపల్లవములందు విహరించేదేవుఁడు
సాదుగొల్లెతల రతిసంగడిఁ జిక్కె
మోదపువైకుంఠాన ముదమందేకృష్ణుఁడు
యీదెస శ్రీవేంకటాద్రి నిరవాయ నిదివో. ॥ అంత ॥ 113

రేకు 221 లలిత

చూడ నరుదాయనమ్మ సొరిది నందరికిని
వేడుకతో వచ్చి సేవించేరు బ్రహ్మాదులు. ॥ పల్లవి ॥

కోరి చంద్రుఁడుదయించ గోకులచంద్రుఁడు పుట్టె –
నేరీతి నీతఁడు నాతఁ డేమౌదురో
వారిధికొడు కతఁడు వారిధియల్లుఁ డీతఁడు
యీరీతి నీతఁ డాతని కేలికాయఁగాని. ॥ చూడ ॥

నల్లనివాఁ డీతఁడాయ తెల్లనివాఁ డతఁడాయ
యెల్లవారికిఁ జూడ వీ రేమౌదురో
అల్లాతఁడే యమృతము అమృతనాథుఁ డీతఁడు
చల్లనైనహరితోడ సరిగాఁడుగాని. ॥ చూడ ॥

అతఁడు పూర్వాద్రిమీఁద నమరెఁ నిందరుఁ జూడ
నీతఁడు శ్రీ వేంకటాద్రి నిరవైనాఁడు
యేతుల వుబ్బుసగ్గులు యిలమీఁద నాతనికి
చైతన్యమెప్పు డీతఁడు సింగారవిభుఁడుగాని. ॥ చూడ ॥ 114

దేసాక్షి

దేవత లెందున్నవారో దిష్ట మెవ్వరిఁ గానము
యీవలఁ దామే కలితే నేమని తావలదా. ॥ పల్లవి ॥

పరమేదో ఇహమేదో బదికేజీవులకెల్ల
నరకపుదేహాలలో నానుచున్నారు.
అరసి పుట్టించినట్టిఅజుఁ డెందు దాఁగినాఁడో
సరి గాన మెవ్వరిఁ గొసరేమంటేను. ‖ దేవ ‖

యేమి గలి గేమి సెల వెన్నటికో తమమేలు
యీమేరఁ బ్రాణులు మాయ నీఁదుచున్నారు
భూమికి దిక్కైనవారు పొడచూపి కావవద్దా
దీముగా నిలువలేరు తెలిసేమంటేను. ‖ దేవ ‖

తుదయేడ మొదలేడ ౧తొంగిచూచేవా రెవ్వరు
అదె సంసారానఁ బ్రాణు లాడుచున్నారు
ఇదె శ్రీవేంకటేశ్వరుఁ డింతలో విచ్చేసి కాచె
యెదుట రక్షకుఁడై తే నిట్టుండవలదా. ‖ దేవ ‖ 115

సామంతం

నీవు దేవుఁడవు నేనొక జీవుఁడ
యీవిధి నిద్దరి కెంతంతరువు. ‖ పల్లవి ‖

పొడమినజగములు పుట్టెడిజగములు
గుడిగొనె మీరోమకూపముల
యెడయక నీరూప మేమని ధ్యానింతు
అడరి మీవాఁడ నే ననుటే కాక. ‖ నీవు ‖

మునుపటిబ్రహ్మలు ముందరిబ్రహ్మలు
మొనసి మీనాభిని మొలచేరు
ఘనుఁడవు నిన్నేగతి నేఁ దెలిసెద
అనువుగ మిము శరణనుటే కాక. ‖ నీవు ‖

౧. 'తోఁగి' రేకు ఈ 'తోఁగి' రూపము ఈ వాఙ్మయమున పలుతావుల గలదు.

సహజానందము సంసారానంద-
మిహముఁ బరముగా నిచ్చేవు
అహిపతి శ్రీవేంకటాధిప నీకృప
మహిలో సేవించి మనుటే కాక. ॥నీవు॥ 116

ధన్నాసి

శరణాగతవజ్రపంజరుఁ డీతఁడు చక్రధరుఁ డసుర సంహారుఁడు
వెరవుతోడఁ దను శరణనువారివెనుబల మీతఁడే రక్షకుఁడు. ॥పల్లవి॥

హరినామోచ్చారణఁ దెగనికర్మ మవల వేరొకటున్నదా
అరసి యెందు నమ్మికచాలక ప్రాయశ్చిత్తంబులు చెప్పెదరు
ధర నెరఁగనివా రేమనినాఁ దామసులగొడవ యేమిటికి
హరి హరి యంటే దురితము లణఁగెను అతఁడే మాకిఁక రక్షకుఁడు. ॥శర॥

శ్రీపతి దిక్కయి కావఁగ మరియునుఁ జేరనిసంపద లిఁకనేవి
చాపలబుద్ధుల(లు?) నది నమ్మక విచ్చనవిడి నోములు చెప్పెదరు
తీపులు వుట్టించి యెవ్వరేమనినఁ దెలిపి వాదడువ నేమిటికి
శ్రీపతిఁ గొలిచితి చేరె సంపదలు జిగి నితఁడే మారక్షకుఁడు ॥శర॥

అంతరాత్మ శ్రీ వేంకటేశ్వరుఁడు అన్యము భజించఁ జో టేది
యింతట నమ్మక దేవతాంతరము లేఁటేఁటివో మరి చెప్పెదరు
యెంత లేదు ప్రాకృతజనములభ్రమ యెవ్వరిఁ గాదన నేమిటికి
యింతకు శ్రీవేంకటేశుదాసులము యీతఁడే మా కిఁక రక్షకుఁడు.
॥శర॥ 117

లలిత

వెదకినఁ దెలియదు వెనకముందరలు
పదమున నిలుపవె పరమాత్మా. ॥పల్లవి॥

కోరిక లూరక కొనలు సాగఁగా
కారలు చాఁచీఁ బ్రపంచము
యీరీతి జీవులు ఇలఁ బొడమఁబొడమ
దూరం బాయను తొలుతటిరాక. ॥ వెద ॥

కాయపుమదములు కప్పఁగఁగప్పఁగ
ఆయము లంటీ నదె మాయ
పాయక ఇందే పనుపడి పనుపడి
చాయలు మరచిరి జంతువులు. ॥ వెద ॥

బలుశరణాగతి ప్రాణులు దలఁచఁగ
నెలవున నిలిపెను నీకరుణ
ఇలపై శ్రీవేంకటేశ్వర యిహపర—
మలవడి దొరకెను అరచేతికిని. ॥ వెద ॥ 118

బౌళి

కనకము కనకమే కడు నినుమినుమే
వెనక సరిదూఁగితే వెలువకురాదు. ॥ పల్లవి ॥

హరిఁ గొలిచినవారి కమరు నన్నిసుఖాలు
గరిమతో వారలభాగ్యమే భాగ్యము
తెరమరఁగుల కర్మదేహులెల్ల వీరితోడ
పురుఁడు వెట్టుకోఁబోతే పోలికలు రావు. ॥ కన ॥

భాగవతులైనవారు పట్టినదెల్లా నీడేరు
చేగదేర వారలు సేసినదే చేఁత
౧ తీగెసంహారమత్తులు తెలియక వీరివలె
వేగినంతా నయ్యేమంటే వెరవులఁ బడవు (?). ॥ కన ॥

౧. తెగనిసంసారములో తిరిగేమత్తులు, హరిదాసులవలె నవుతామంటే సరిపడ-దని భావమా?

శ్రీవేంకటేశుదాసులు చేసినదెల్లా సృష్టి
యేవంకా ధ్రువపట్టమే ఇటు వారికి
కావరపుమనుజులు గతిగనేమని వారి—
తోవల నడవఁబోతే దూఁగదు తమకును. ॥కన॥ 119

రేకు 222 సామంతం

ఇందునే వున్నది యెఱుకయు మఱపును
చందమిదివో ఇకఁ జదివెడిదేది. ॥పల్లవి॥

అంది కర్మముల ననుభవింపుచును
ముందర మరి సుఖములు గోరు
కందువ నీదేహి కనియుం గానఁడు
౧దిందుపడ(?)నొరులు తెలిపెడి దేది. ॥ఇందు॥

వొకచేత హేయ ముడుగక కడుగును
వొకచేత భుజించు నొగి రుచులు
అకటా దృష్టం బరచే నుండఁగ
సకలము నుపదేశము లిఁక నేవి. ॥ఇందు॥

మలయుభోగములు మాయలని యెరుఁగు
నిలిచినమోక్షపునిజ మెరుఁగు
యిలపై శ్రీవేంకటేశుఁడు గలఁడిదె
బలిమి గలిగె నిఁకఁ బదరెడిదేది. ॥ఇందు॥ 120

లలిత

పురుషోత్తముఁడ నీవే పుణ్యాము గట్టుక నన్ను
దరిచేర్చి రక్షించి దయఁజూడఁగదవే. ॥పల్లవి॥

౧. దిందుపడన్—" అజ్ఞానము మాసిపోవునట్లుగా " కావచ్చునేమో.

ధరలో యాచకునకు ధర్మాధర్మము లేదు
సిరులఁ గాముకునికి సిగ్గు లేదు
పరమపాతకునకు భయ మించుకా లేదు
విరసపునాకైతే వివేకమే లేదు ॥పురు॥

మించినకృతఘ్ను నికి మే లెన్నఁడును లేదు
చంచలచిత్తునకు నిశ్చయమే లేదు
అంచల నాస్తికునకు నాచారమే లేదు
కొంచపుమూర్ఖుఁడ నాకు గుణమే లేదు. ॥పురు॥

మదించినసంసారికి మరి తనివే లేదు
పొదిగొన మూర్ఖునకు బుద్ధే లేదు
అదన శ్రీవేంకటేశ అలమేల్మంగదాసుఁడ—
నిదివో చనవరి నాకెదురే లేదు. ॥పురు॥ 121

సాళంగనాట

తిరువీధు లేఁగీని దేవతలు జయవెట్ట
హరి వాఁడె పెండ్లికొడుకై ప్రతాపమున. ॥పల్లవి॥

కనకపుఁగొండవంటిఘనమైనరథముపై
దనుజమర్దనుఁడెక్కెఁ దరుణులతో
వినువీధిఁ బడెగె(డగ?)లు వేవేలు కుచ్చులతోడఁ
పెనగొనఁగఁ గదలె భేరులు మ్రోయఁగను. ॥తిరు॥

వరుసఁ జంద్రసూర్యులవంటిబండికండ్లతోడ
గరుడధ్వజుఁ డొరసీఁ గడు దిక్కులు
పరగువేదరాసులే పగ్గాలు వట్టితియ్యఁగ
సరుగ దుష్టులఁ గొట్టి జయము చేకొనెను. ॥తిరు॥

అటులఁ బాటలు వింటా నలమేల్మంగయుఁ దాను
యీటున శ్రీవేంకటేశుఁ డెదురులేక
వాటపుసింగారముతో వాకిటవచ్చి నిలిచీ
కోటానఁగోటివరాలు కొమ్మని ఇచ్చుచును ॥తిరు॥ 122

వరాళి

ఇన్నిటికి నీశ్వరేచ్ఛ యింతేకాక
తన్నుఁదానే హరి గాచు దాసుఁడై తేఁ జాలు. ॥పల్లవి॥

ప్రకృతిఁ బుట్టినదేహి ప్రకృత(తి?)గుణమే కాని
వికృతి బోధించబోతే విషమింతే కాదా
వోకవిత్తు వెట్టితే వేరొకచేల మొలచును
ప్రకటమైనవట్టిప్రయాసమే కాక. ॥ఇన్ని॥

పాపానఁ బుట్టినమేను పాపమే పేయుంచుఁగాక
యేపునఁ బుణ్యముతోవ యేల పట్టును
వేపచేఁదు వండితేను వెస నేల బెల్లమవును
పైపై బలిమిసేసేశ్రమ యింతేకాక. ॥ఇన్ని॥

ప్రపంచమైనపుట్టుగు ప్రపంచమునకే కాక
వుపమించ మోక్షమున కొడఁబడునా
ప్రపన్నుఁడైనవేళ భాగ్యాన శ్రీవేంకటేశుఁ-
డపుడు దయఁజూడఁగ నధికుఁడౌఁగాక. ॥ఇన్ని॥ 123

సాళంగం

ఎక్కడిసుద్ది యీశ్రమనేల పడేరు
అక్కటా వో దేవులాల హరినే తలఁచరో. ॥పల్లవి॥

బలు దేవతలకునుఁ బాయదట వ్యామోహము
యిలపై నరులము నే మెంతకెంత
కలదట మునులకుఁ గడ(డు?) రాగద్వేషాలు
చలనచిత్తులము మాజాడ యిఁక నేది. ॥ ఎక్క ॥

పరగఁ దొల్లిటివారు పంచేంద్రియబద్ధులట
నెరవుగా ముక్తులమా నేఁటివారము
అరిదిఁ బ్రపంచము మాయామయమట నేము
దురితవర్తనులము తొలఁగేమా. ॥ ఎక్క ॥

ఘనసిద్ధగంధర్వులు కడ గానలేరట
దినమత్తులము మా తెలివేఁటిది
యెనలేని శ్రీవేంకటేశ్వరు శరణుచొచ్చి
మనువార మింతే కాక మరి గతియేది. ॥ ఎక్క ॥ 124

దేసాళం

దేవదుందుభులతోడ తేటతెల్లమైనాఁడు
సేవించరో యిదే వీఁడే సింగార దేవుఁడు. ॥ పల్లవి ॥

బంగారుమేడలలోనఁ బన్నీట మజ్జనమాడి
అంగముతడి యొత్తఁగా నదే దేవుఁడు
ముంగిటఁ బులుకడిగినముత్యమువలె నున్నాఁడు
కుంగనిరాజసముతో కొండవంటిదేవుఁడు. ॥ దేవ ॥

కాంతులుమించినమాణికపుదోరణముకింద
అంతటఁ గప్పురముచాతు కదే దేవుఁడు
పొంతల నమృతమే పోగై నట్టున్నవాఁడు
సంతతము సంపదలసరిలేని దేవుఁడు ॥ దేవ ॥

తట్టుపుణుఁగు నించుక దండిసొమ్ములెల్లాఁ బెట్టి
అట్టెలమేల్మంగ నురుతఁ గట్టి
నెట్టన నమ్మినవారినిధానమై వున్నవాఁడు
పట్టపుశ్రీవేంకటాద్రిపతియైనదేవుఁడు. ॥దేవ॥ 125

రేకు 228 సామంతం

ఒడఁబడఁగదవో వో మనసా
పెడరేఁచి యతఁడే పెనఁగీఁగాక ॥పల్లవి॥

అంతయుఁ జూచిన హరిసంకల్పమే
చింతలు సిలుగులు జీవులవి
భ్రాంతివట్టి యిఁకఁ బదరఁగనేఁటికి
చెంతనతఁడు దయసేసీఁగాక. ॥ఒడఁ॥

౧ఘనవిశ్వకుటుంబిని(?)కమలాక్షుఁడే
జననమం(మా?)త్రములే జంతులవి
గొనకొని యిందుకుఁ గోరికలేఁటికి
వొనరించి యతఁడె వొపగీఁగాక. ॥ఒడఁ॥

సిరు లందించఁగ శ్రీవేంకటేశుఁడు
సరగు భోగములె ప్రాణులవి
మరుగక యీమేలు మఱవఁగనేఁటికి
గరిమ నీతఁ డెపుడు గలిగీఁగాక. ॥ఒడఁ॥ 126

దేవగాంధారి

౨అఱిముఱిఁ జూడఁబోతే నజ్ఞాని నేను
మఱఁగు చొచ్చితి మీకు మహిలో నారాయణా. ॥పల్లవి॥

---

౧. 'ఘనవిశ్వకుటుంబి–యీకమలాక్షుఁడే' అని కావచ్చునేమో?
౨. ఈపాటకూడ పెదతిరుమలయ్యదో చినతిరుమలయ్యదో అయి–యుండవచ్చు.

విన్ను ధ్యానము సేసీని నిచ్చ నిచ్చఁ దాళ్లపాక—
 అన్నమయ్యఁగా రెదుట నదిగోవయ్యా
 పన్ని యాతనినే చూచి పాతకులమైనమమ్ము
 మన్నించవయ్యా వో మధుసూదనా. ॥ అతి ॥

సంకీర్తనలు సెసీ సారెఁ దాళ్లపాకన్నయ్య
 అంకెల నీసన్నిధినే అదిగోవయ్యా
 అంకించి నే వాఁడవాఁడనని దుష్టుఁడనై నా నా—
 నంకెదీరఁ గావవయ్యా సర్వేశ్వరా. ॥ అతి ॥

పాదాలందున్నాఁడు దాళ్లపాకన్నమయ్య మీకు
 ఆదరాన ముక్తుఁడై అదిగోవయ్యా
 యీదెస శ్రీవేంకటేశ యీసమ్మంధాననే ౧ నన్ను
 నీదయవెట్టి రక్షించు నెమ్మది భూరమణా. ॥ అతి ॥ 127

సాళంగనాట

తప్పదు యీయర్థము ధరణిలోన
 వొప్పుగ యేకచిత్తాన నుండవచ్చు నిఁకను. ॥ పల్లవి ॥

కాకాసురుదోషము కడకుఁ బరిహరించి
 చేకొంటివి శరణంటే చేరి మగుడ
 యీకడ మానేరములు యింతకంటే నెక్కుడా
 నీకే నే శరణంటి నీవు మమ్ముఁ గాతువు. ॥ తప్ప ॥

౨అమ్మునవేసినవాఁడు అట్టె దండము వెట్టితే
 నిమ్ముల నిహపరము లిచ్చితివి
 యెమ్మెల మావంకనైతే నింతేసిచేఁతలు లేవు
 నెమ్మి నీకే మొక్కితిమి నీవే మమ్ముఁ గాతువు. ॥ తప్ప ॥

---

౧. ఈ 'నన్ను' పూర్వముద్రణములో తప్పిపోయినది.
౨. ఇది కృష్ణావతారవిషయము.

పరులఁ గొలిచి వచ్చి ప్రాణాచారాలువడితే
సిరుల వరాలిచ్చేవు శ్రీవేంకటేశా
వొరులఁ గొలువము నే మొగి నిపాదాలే నమ్మి
నిరతిఁ గొలిచితిమి నీవే మమ్ముఁ గాతువు. ॥తప్పు॥ 128

కాంబోది

ఏడ పెద్దల మెప్పైతిమో మరి
తోడనే నవ్వేము దొరకొని మమ్మును. ॥పల్లవి॥

పంచేంద్రియములఁ బట్టగలేమట
యెంచఁగ వివేక మెన్నటికి
అంచెల మమతల నణఁచఁగలేమట
పొంచినబుద్ధులు భువి నెన్నటికి. ॥ఏడ॥

వెడవెడ నాసలు విడువఁగలేమట
యెడయనిధైర్యం బెన్నటికి
తొడుసగుబంధముఁ దుంచఁగలేమట
బెడిదపుతనలో నికుదెన్నటికి. ॥ఏడ॥

కామక్రోధములఁ గడవఁగలేమట
యీమానుషములు యెన్నటికి
కామించ శ్రీవేంకటపతి గలఁడట
నేమపుతపముల నే మెన్నటికి. ॥ఏడ॥ 129

లలిత

ఇదిగాన తనధర్మ మించుకా వదలరాదు
వుదుటున హరివారై వుండవలెఁగాని. ॥పల్లవి॥

జాతిచండాలము దీరు జన్మాంతరములను
యేతులఁ గర్మచండాల మెన్నఁడూఁ బోదు
యీతల స్వర్గము చేరనియ్యకుండఁగాఁ ద్రిశంకుఁ —
డాతలఁ దాఁ బ్రతిస్వర్గమందు నున్నాఁ డదివో. ॥ ఇది ॥

ఆస్తికులయినవారు అట్టె రామునిఁ గూడిరి
నాస్తికు లసురకుఁ బ్రాణము లిచ్చిరి
ఆస్తికనాస్తికుఁడై తా నం దెవ్వరివాఁడూఁగాక
కస్తిఁబడి వాలి వృథాకలహానఁ బొలిసె. ॥ ఇది ॥

యింక నొక్కటి గలదు యెదుటనే వుపాయము
అంకెల శ్రీవేంకటేశుఁ డందే వున్నాఁడు
సంకెదీర నీతనికి శరణుచొచ్చి వరాలు
బొంకముగాఁ జేకొనేరు భూజనులు నేఁడును. ॥ ఇది ॥ 180

శంకరాభరణం

నలినాక్ష నీకు నమస్కరించిన —
ఫలము వొగడ నిఁక బ్రహ్మకు వశమా. ॥ పల్లవి ॥

పూర్వదోషములఁ బోఁదోలి మఱియు
సర్వాపచారము క్షమియించి
గర్వితమదముల కసటు వాపి నను
నిర్వహించె నిదె నీనామము. ॥ నలి ॥

నేఁడునుఁ జేసిననేరము లణఁచి
వేఁడికర్మముల విడిపించి
వాఁడిదుఃఖముల వడిఁ బరిహరించె
నాఁ డెఱఁగఁగ నీనామము. ॥ నలి ॥

వుమ్మడి సుఖముల నొనరించి మాకు
సమ్మతిశుభములు జయమొసఁగి
యిమ్ముల శ్రీవేంకటేశ్వర యిదివో
నెమ్మది రక్షించె నీనామము. ॥వలి॥ 131

రేకు 224 దేసాళి.

జాలి ౧మోహినీగజము సంసారమిది
లోలుఁడఁ గాకపోదు లోకముసహజము(?). ॥పల్లవి॥

నేరమెల్లా జీవునిది నేరుపెల్లా దేవునిది
దారదప్పి విఱ్ఱవీఁగఁ దనకేల
కారణమాతఁడు దాఁ గార్యమాత్ర మింతే
శూరుఁడై రెంటాఁ జొరక చూచుటే సుఖము. ॥జాలి॥

ప్రకృతి కాతుమ దాను పరమాత్ముఁ డాతఁడు
తకపికలై మురియఁ దనకేల
సకలము నాతఁడు సత్తామాత్రము దాను
వొకటిఁ గోరక వూరకుండుటే సుఖము. ॥జాలి॥

సేవించఁ దనకుఁ గద్దు శ్రీవేంకటేశుఁ డాతఁడు
దావతిఁ గర్మపుఁజాటు తనకేల
శ్రీవిభుఁ డాతఁడు దాను చేతనమాత్ర మింతే
కేవల మాతనివాఁడై గెలుచుటే సుఖము. ॥జాలి॥ 132

నాట

బాపు బాపు రాఘవ నీప్రతాప మేమనిచెప్ప
పైపై నీపేరు విని పారేరు రాకాసులు. ॥పల్లవి॥

---

౧. పెద్ద మోహకళ్త్రి అని యర్థము.

వాలినెత్తురునీటను వాఁడిపదనిచ్చినమ్ము
కూలిచె నొక్కమాటునఁ గుంభకర్ణుని
యీలకొని మాయామృగ మెమ్ములనొరసినమ్ము
రాలించె నుత్తరగోపురముపై గొడగులు. ॥చాపు॥

తొడికి మింటితాపలు తుంచి ౧దూప(?)దాఁకినమ్ము
జడధిమరుదేశాల జల మింకించె
యెడయక కౌశికునియజ్ఞముగాచినమ్ము
అడరి రావణుని పూర్ణాహుతిగఁ జేసెను. ॥చాపు॥

జెరని యేపొద్దును నీపిడికిటిలోనియమ్ము
సురలభయముఁ బాపి సూటికెక్కెను.
ఇరవై శ్రీవేంకటాద్రి నిటు రామచంద్రుఁడవై
సరగఁగ నీయమ్ము పగయెల్ల నీఁగెను. ॥చాపు॥ 183

లలిత

పలుమారు వాదమేల పంతమేమివచ్చె ని(మీ?)కు
చలమో ఫలమో సాధించుకోరయ్యా. ॥పల్లవి॥

ధరమీఁదఁ జేయఁబోతే తగు పుణ్యములు లేవా
హరిదాసుఁడయ్యేపుణ్య మందుటగాక
సురలు బ్రహ్మాదులును చూడఁగా నేపొడవున
తిరమై యున్నారో తెలుసుకోరయ్యా. ॥పలు॥

మాపుదాఁకా సలిగెలు మహిమలు లేవా
శ్రీపతిదాసులై యంత చెల్లదుగాక
చేపడినమాత్రమున చేటులేనిపదవుల
యేపున నెవ్వ రున్నారో యెరుఁగరయ్యా. ॥పలు॥

---

౧. 'దూసి' కావచ్చునా? దూప=దాహము కలుగునట్లు కావచ్చునా?

యేవలఁ గొలువఁబోతే నెందరు దైవాలు లేరు
శ్రీవేంకటేశువలె రక్షించరుగాక
కోవరమై యేఁటనేఁటాఁ గోరి వరములకుఁగా
కావించి పరుషవచ్చేకత చూచుకోరయ్యా. ॥ వలు ॥ 184

శుద్ధవసంతం

[1]నగుఁబాట్లకు లోనై నడచుఁగాక
అగపడి పరసుఖ మందఁబోయీనా. ॥ పల్లవి ॥

కడిగేది వొకచేత కష్టమే దినదినము
కుడిచేది వొకచేతఁ గోరినవెల్లా
యెడయక తనసిగ్గు యెరఁగని యీదేహి
అడరి హరిమహిమల వెరఁగీనా. ॥ నగు ॥

వొద్దనుండి రాతిరెల్లా వొడలేమి నెరఁగఁడు
పొద్దువొడచినమీఁద భోగమే కోరు
కొద్దిమాలినట్టితనఘోరము విచారించఁడు
సుద్దులైనహరిభక్తి సోదించీనా. ॥ నగు ॥

అనుభవించేది నిచ్చా నంగనలమాంసమే
అనిశము సేయఁబొయ్యే వాచారములే
తనివోక మనసులో తనవెట్టి గానఁడు
ఘనుఁడు శ్రీవేంకటేశుఁ గానబొయ్యీనా. ॥ నగు ॥ 185

దేవగాంధారి

ధర్మాధర్మములాల దైవములాల
నిర్మిత మాతఁడే కాని నే నేమీ నెఱఁగ. ॥ పల్లవి ॥

---

౧. ఈపాటలో మొదటిచరణము భావమే కుడి ఎడమగ 120 వ పాట- రెండవచరణమున దొరలినది.

పుట్టించేటివాఁడు హరి పుట్టెడువాఁడ నేను
నెట్టన నున్నపనులు నే నెఱఁగ
వెట్టివాఁడ నే నింతే విష్ణుఁడు నాకేలికె
చుట్టిననడుమంత్రాలసుద్దులూ నెఱఁగ. ॥ధర్మా॥

లోకము దేవునిమాయ లోనైనవాఁడ నేను
చేకొని కర్మములలో చేఁతలెరఁగ
సాకిరిమాత్రము నేను సర్వజ్ఞుఁడాతఁడు
దాకొని నేఁ దలఁచేటితలఁపూ నెఱఁగ. ॥ధర్మా॥

అంతరాత్మ యాతఁడు ఆతనిబంట జీవుఁడ
సంతాన నాలోపలిభావ మెరఁగ
యింతయు శ్రీవేంకటేశుఁ డిటువంటివాఁడ నేను
చెంతల నానంద మిది చెప్పనేమీ నెఱఁగ. ॥ధర్మా॥ 186

శంకరాభరణం

పట్టి పిసుక నిఁక బనిలేదు
గుట్టు దెలిసితే గులగులలు. ॥పల్లవి॥

ఆలకించితే నంతా హేయమె
సోలి భోగములు సుజ్ఞానికి
మేలు దెలుసుకొని మెచ్చెదమంటే
౧నాలికెఁ గడచితే నరకములు. ॥పట్టి॥

యోఁచి చూచితే నింతా నెరవే
పొంచి ప్రపంచము పుణ్యునికి
దించక తిరిగేతిమ్మట లన్నియు
అంచల వెఱ్ఱులఅలమటలు. ॥పట్టి॥

---

౧. ఈ పాదమంత సుబోధముగా లేదు.

పట్టినదెల్లా బ్రహ్మానందమె
గట్టిగ శరణాగతునికిని
యిట్టె శ్రీవేంకటేశుకరుణ నిఁక
పుట్టినప్పుడే భోగ్యములు. ॥పట్టి॥ 187

రేకు 225 రామక్రియ

అన్నిటా నేరుపరి హనుమంతుఁడు
పిన్ననాఁడే రవినంటె పెద్దహనుమంతుఁడు. ॥పల్లవి॥

ముట్టినప్రతాపపురాముని సేనలలోన
అట్టె బిరుదుబంటు శ్రీహనుమంతుఁడు
చుట్టి రా నుండినయట్టిసుగ్రీవుప్రధానులలో
గట్టియైనలావరి చొక్కపుహనుమంతుఁడు. ॥అన్ని॥

వదలక కూడినట్టివనచరబలములో—
నదె యేకాంగవీరుఁడు హనుమంతుఁడు
చెదరక కుంభకర్ణుచేతిశూలమందరిలో
నదరాన విరిచె భీషణహనుమంతుఁడు. ॥అన్ని॥

త్రిజగములలోపల దేవతాసంఘములోన
అజునిపట్టాన నిల్చె హనుమంతుఁడు
విజయనగరాన శ్రీవేంకటేశు సేవకుఁడై
భుజబలుఁడై యున్నాఁ డిప్పుడు హనుమంతుఁడు. ॥అన్ని॥ 188

గౌళ

పవరించుకొనివారివెట్టితన మింతేకాక
తవిలి రెంటికి గురి తామేకారా. ॥పల్లవి॥

కడుఁబాపకర్మానకుఁ గలిగినట్టిబలిమి
నడుమఁ బుణ్యకర్మమునకు లేదా
అడరి నరలోకమందు గలిగినవిధి
కడు మంచిస్వర్గలోకమునకు లేదా. ॥ వివ ॥

తప్పక బంధములను తగిలించేకోరికె
ముప్పిరిఁగొనేటిమోక్షమునకు లేదా
కప్పి యట్టె కల్లలాడఁగలిగిననాలికె
దప్పిదీర శ్రీహరిఁ దలఁచఁగలేదా ॥ వివ ॥

పంచుకొన్నవిషయాలకారిఁ జిక్కే జీవుఁడు
అంచెలవైరాగ్యమునందు లేఁడా
పంచల నరులవెంటఁ బారాడించేమనసు
కొంచక శ్రీవేంకటేశుఁ గొలిపించలేదా. ॥ వివ ॥ ౧౬౭

దేసాళి

తలఁచినప్పుడు వచ్చు దయ యెప్పుడూఁ దలఁచు
కలసినబంధువుఁడు కమలారమణుఁడే. ॥ పల్లవి ॥

ఆతుమలోననే వుండు అన్నిటాఁ బాయనివాఁడు
యీతలనాతలఁ దానే యేమైనా నిచ్చు
౧చేతిలోఁ జేసేకర్మాలు చెడనియ్యఁ డెన్నఁడును
ఆతురబంధువుఁడు హరి యొక్కఁడే. ॥ తలఁ ॥

నిచ్చలు విందులు వెట్టు నెలఁతల నొడఁగూర్చు
యిచ్చెరఁగి కప్పఁ గోక లెందైనాఁ దెచ్చు
మెచ్చు నేమిటికినైనా యిచ్చినవి గైకొను
ముచ్చటైనబంధువుఁడు ముకుందుఁడే. ॥ తలఁ ॥

---

౧. "చేతితో" కావచ్చు.

తోడునీడై వచ్చి మరి దొరతనము సేయించు
పాడితోఁ బంచేంద్రియాలఁ బాపు సేయించు
మేడెపు సంసారములో మించినని(ద దెలుపు
వేడుకబంధువుఁడు (శ్రీ)వేంకటేశుఁడే. ॥తల॥ 140

వసంతవరాళి

నారాయణుఁ డితఁడు నరులాల
మీరు శరణనరో మిమ్ముఁ గాచీని. ॥పల్లవి॥

తలఁచినచోటను తానే వున్నాఁడు
వలెననువారికై వస మెపుడు
కొలచెను మూఁడడుగుల జగ మెల్లాను
కొలిచినవారిఁ జేకొనకుండునా. ॥నారా॥

యెక్కడఁ బిలి(చి)నా నేమని పలికి
మొక్కిన మన్నించు మునుముగను
రక్కసుల నణఁచి రక్షించు జగములు
దిక్కువినమ్మినఁ దిరముగా నేలఁడా. ॥నారా॥

చూచినయందెల్ల చూపును రూపము
౧వోచిక (?)బొగడిన వుండు నోటను
తేచిన (శ్రీ)వేంకటేశుఁడే యితఁడట
చేచేతఁ బూజింప సేవలు గొనఁడా. ॥నారా॥ 141

సాళంగనాట

కొమ్మలు చూడరె గోవిందుఁడు
కుమ్మరించీ ముద్దు గోవిందుఁడు. ॥పల్లవి॥

---

౧. 'వాచిక'మునకు వ్యావహారికము.

ఉట్టకాలులతోఁ దిరిగి వీధుల
గొట్టి నుట్లు గోవిందుఁడు
పట్టినకోలలు పైపైఁ జాఁపుచు
౧కుట్టిఁ దూఁట్లుగా గోవిందుఁడు. ॥కొమ్మ॥

నిలువుఁగాళతో నిడిగూఁతలతో
కొలకొలమని గోవిందుఁడు
వలసినపాలు వారలువట్టుచు
కులికి నవ్వీ గోవిందుఁడు. ॥కొమ్మ॥

కారలు చాఁపుచుఁ బట్టఁగ నింతులఁ
గూరిమిఁ గూడీ గోవిందుఁడు
చేరి జవ్వనుల శ్రీవేంకటాద్రిపై
గోరఁ జెనకీ గోవిందుఁడు. ॥కొమ్మ॥ 142

సాళంగనాట

అంజనాతనయుఁడైనహనుమంతుఁడు
రంజితపుమతంగపర్వతహనుమంతుఁడు. ॥పల్లవి॥

రాకాసునెల్లాఁ గొట్టి రావణుని భంగపెట్టి
౨ఆకాసము మోచె నదే హనుమంతుఁడు
చేకొని యుంగరమిచ్చి సీతకు సేమము చెప్పె
భీకరప్రతాపపుపెద్దహనుమంతుఁడు. ॥అంజ॥

రాముని మెప్పించి మధ్యరాతిరి సంజీవి దెచ్చి
ఆముకొని యున్నాఁడు హనుమంతుఁడు
స్వామికార్యమునకే సరిఁ బేరువడ్డవాఁడు
ప్రేమముతోఁ బూజగొనీఁ బెద్దహనుమంతుఁడు. ॥అంజ॥

---

౧. 'కొట్టి' కావచ్చు. ౨. 'అకసము' కావచ్చునేమో!

ఉదయాస్తశైలముల కొక్క జంగగాఁ జాఁచి
అదె సూర్యుతోఁ జదివె హనుమంతుఁడు
యెదుట శ్రీవేంకటేశు కిష్టుఁడై రామజపానఁ
బెదవులు గదలించీఁ బెద్దహనుమంతుఁడు. ॥ అంజ ॥ 143

రేకు 226 సాళంగనాట

అవధారు దేవ హరికులరామ
వివిధమై నీబంటు వెలయుచున్నాఁడు. ॥ పల్లవి ॥

అదె కలశాపురముహనుమంతరాయఁడు
కదనములోన రక్కసులఁ గొట్టి
యెదుట నిందరిలోన నేకాంగవీరుఁడై
కొదలేక ప్రతాపించి కొలువై వున్నాఁడు. ॥ అవ ॥

చల్లనివనాలనీడ సాగుడుఁగొండలోన
వల్లెగా వేసుకొన్నవాలముతోడ
పల్లదాన వలకేలు పంతమున నెత్తుకొని
కొల్లున మంటపములోఁ గొలువై వున్నాఁడు. ॥ అవ ॥

పెక్కుపండ్లగొలలు పిడికిటఁ బట్టుకొని
చక్కఁగాఁ బెరిగి పెద్దజంగ చాఁచి
యిక్కువ శ్రీవేంకటాద్రి నిరవైనసర్వేశ
గుక్కక నీపై భక్తిఁ గొలువై వున్నాఁడు. ॥ అవ ॥ 144

మాళవిగౌళ

రెక్కలకొండవలె మీరినబ్రహ్మాండమువలె
వెక్కసమైనతేరుపై వెలసీని దేవుఁడు. ॥ పల్లవి ॥

7

విలువిలుఁ దిరిగేటిపెనుబండికండ్లతో
గులుతైనపడగెలగుంపులతో
తటితో ధరణి గ్రక్కదలఁ గదలెను తేరు
మెఱసీ వీధివీధుల మేఁటియైనదేవుఁడు. ॥ రెక్క ॥

ధగధగమనునాయుధపుమెరుఁగులతోడ
జిగిమించుఁ బగ్గములచేరులతో
పగటురాకాసులపైఁ బారీ నదె తేరు
నిగిడ నలుదిక్కుల నీటు చూపీ దేవుఁడు. ॥ రెక్క ॥

ఘణఘణమనియెడిగంటలరవముతోడ
ప్రణుతి నలమేల్మంగపంతాలతోడ
రణములు గెలిచి మరలె నదే తిరుతేరు
గణుతికెక్కెను శ్రీవేంకటగిరిదేవుఁడు. ॥ రెక్క ॥ 145

దేసాళం

ఇందిరయుఁ దానుఁ గూడి యిట్టె వరాలొసఁగుతా
సందడించి దిక్కులెల్లా సాధించీ నిదివో. ॥ పల్లవి ॥

వేదములే గుఱ్ఱములు విష్ణునిరథమునకు
వాదపుశాస్త్రములే తీవ్రపుఁబగ్గాలు
పాదగు పంచభూతాలే పరగుబండికండ్లు
ఆదిగొని మనోవీధులందు నేఁగీ నిదివో. ॥ ఇంది ॥

జీవులెల్లా సారథులు శ్రీవిభునితేరునకు
కావించుఁ నెజ్జాలు పడిగలగుంపులు
భావించఁ దనప్రకృతి పట్టపుసింహాసనము
వేవేలుసంపదలతో వెలసీ నేఁ డిదివో. ॥ ఇంది ॥

చందురుఁడు రవియును సరుసఁ బైఁడికుండలు
చెందినపుణ్యములెల్ల సింగారాలు
అందపుశ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ దాను
కందువల మెరయుచు కరుణించీ నిదివో. ॥ఇంది॥ 146

ఆహిరి

విన్నపము లేమిసేసే వేగినంతాను
మన్నించి రక్షించేనీమహిమలే ఘనము. ॥పల్లవి॥

నీవంక నేరమిగద్దా నేనే అపరాధిని
దేవ నే జడుఁడఁగాన తెలుసుకోను
వావాత మీగురుఁ డాదేవాక్యము నీయాధీనము
పావనమైననీపలుకెల్లా సత్యను. ॥విన్న॥

మంచితనమల్లా నీదె మాయదారివాఁడ నేను
చంచలుఁడఁ గనక విచా(చా?)రించుకోను
అంచల నీదాసునిఆనతి యమోఘము
రొంచ నీవిచ్చినవర మెం(మిం?)దుకంటే బలువు. ॥విన్న॥

కరుణెల్లా నీసొమ్ము కఠినచిత్తము నాది
నరుఁడఁగనక అట్టె యరసుకోను
పరగ మాజనకుని ప్రతిజ్ఞయు నీవంపు
నిరతి శ్రీవేంకటేశ నీపంతము సతము. ॥విన్న॥ 147

రామక్రియ

మొక్కరయ్యా అన్నిటికి మూల మీతఁడు
చుక్కలు మొలపూసలై సొంపుమీరీ నితఁడు. ॥పల్లవి॥

అదె కలశాపురహనుమంతుఁడు
వుదయార్కు ఫలమని వొగ్గుచున్నాఁడు
వుదుటు బాలక్రీడ నుబ్బుచున్నాఁడు
మదించి రామునిబంటై మలయుచున్నాఁడు. ॥ మొక్క ॥

జలనిధి కొకజంగ చాఁచుకున్నాఁడు
యిలఁ బ్రతాపమునఁ జేయెత్తుకున్నాఁడు
బలువాల మల్లార్చి పట్టుకున్నాఁడు
వెలయఁగఁ గీలుగంటు వేసుకున్నాఁడు. ॥ మొక్క ॥

సరుగ లంకారాజ్యము సాధించినాఁడు
అరిది సీతకు సేమ మందించినాఁడు
నిరతి శ్రీవేంకటాద్రినిలయునికి
పరగినసేవలనుఁ బ్రబలుచున్నాఁడు. ॥ మొక్క ॥ 148

శంకరాభరణం

అక్కలాల చూడుఁ డందరును
నిక్కి వారవట్టీ నేఁడు కృష్ణుఁడు. ॥ పల్లవి ॥

ఆనవాలవుట్టి అడుకులవుట్టి
పానకపుటుట్టి బలిమినే
అనుక కోలల నందియంది కొట్టి
౧తేనెవుట్టి(?)గొట్టీ దేవకీసుతుఁడు. ॥ అక్క ॥

పెరుగువుట్టి మంచిపేరిననేతివుట్టి
సరివెన్నవుట్టి చక్కెరవుట్టి
వెరవుతోఁ గొట్టి వెస బాలులతో
౨పొరుగువుట్టి(?)గొట్టీ పొంచి రాముఁడు. ॥ అక్క ॥

---

౧. 'తేనెవుంచినవుట్టి' కావచ్చు. ౨ 'పొరుగింటివారివుట్టి' కావచ్చు.

మక్కువ నలమేలుమంగఁ గూడి నేఁడు
చొక్కి శ్రీవేంకటేశుఁడు వీధుల
నిక్కి వుట్లెల్లా నిండాఁగొట్టి ౧వుట్టి(?)–
చక్కిలాలు గొట్టీ జగతీశుఁడు. ॥ అక్క ॥ 149

రేకు 227 దేసాళం

పచ్చిదేరుచు నుట్ల పండుగాయను
• గచ్చులకు గొల్లెతలు కాఁగిలించిపట్టఁగా. ॥ పల్లవి ॥

పీతాంబరముమీఁద పెద్దకిరీటముమీఁద
నేతిపాలచారలెల్ల నిండె నదివో
జాతిగొల్లెతలవుట్లు సారెఁ గోలఁలెత్తి కొట్టి
చేతులుదాఁచారగించి చిమ్మి రేఁగఁగాను. ॥ పచ్చి ॥

సొరిది సొమ్ములమీఁద సోయగపుచెక్కులపై
పెరుగులు మీఁగడలు వేరుకొనెను
అరుదుగ వీధులను అందరివుట్లు గొట్టి
దొరతనములతోడ దొమ్మిసేయఁగాను. ॥ పచ్చి ॥

పూని శ్రీవేంకటేశుపై ౨పొందె(దియ?)లమేలుమంగపై
తేనెలునుఁ జక్కెరలుఁ దెట్టెగట్టెను
నానావిధములను నడుమ నుట్లు గొట్టి
ఆనందాన నారగించి అలరుచుండఁగను. ॥ పచ్చి ॥ 150

ధన్నాసి

వీఁడె వీఁడె కూచున్నాఁడు వేడుకతో గద్దెమీఁద
వాఁడి|ప్రతాపముతోడి వరదానసింహము. ॥ పల్లవి ॥

---

౧. 'వుట్టిలోనున్నచక్కిలాలు' కావచ్చు. పాటలో అంతటా వుట్టిశబ్దమును సమాసాంతములోవాడి ఇక్కడమాత్రము పూర్వపదముగా వాడుట వింత.

౨. 'పొందెలమేలుమంగ' రేకు. పొంది + అలమేలుమంగ = పొందెలమేలుమంగ. ఈ సంధు లీవాఙ్మయమున కొల్లలు.

అరయఁ బ్రహ్లాదునికి౧ఆపదోద్ధారసింహము
గిరిపై యిందిరకును క్రీడాసింహము
నిరతి ౨ సురలభయనివారణసింహము
సరి హిరణ్యకసిపుసంహారసింహము. ॥పీఁడె॥

ఇట్టె విశ్వమునకు నేలికైనసింహము
గట్టిగ శరణాగతులఁ గాచేసింహము
దిట్టయై వేదాలలోనితెరవేఁటసింహము
నెట్టుకొనినదురితనివారణసింహము. ॥పీఁడె॥

అంచల మూఁడుమూర్తులకాధారమైనసింహము
పంచల మునులభాగ్యఫలసింహము
పొంచి శ్రీవేంకటాద్రికి భూషణమైనసింహము
చెంచుల అహోబలపుశ్రీనారసింహము. ॥పీఁడె॥ 151

లలిత

సర్వసులభుఁ డితఁడు సర్వేశ్వరుఁడు
గర్వముఁ బాసితేను కానవచ్చు నితని. ॥పల్లవి॥

చింతలెల్లా నుడిగితే శ్రీపతి యందేవుండు
మంతనాన నుండితేను మరి నాతఁడే
పంతపువుబ్బు మానితే పరమాత్ముఁడు దోడౌను
వింతలు దలఁచకుంటే విశ్వరూపమే. ॥సర్వ॥

వెడకర్మాలు దోసితే విష్ణునిసాన్నిధ్య మబ్బు
కడునాస లొల్లకుంటే కలఁ డాతఁడు
వొడ లోముకొనకుంటే వుపేంద్రుఁడు రక్షించు
పొడఁబడకుంటేనే పూర్ణ భావ మలరు. ॥సర్వ॥

---

౧. 'ఆపదుద్ధార' కావచ్చు. 'ఆపదోద్ధార' వ్యావహారిక ప్రయోగము.
౨. "సురల కభయ వివారణసింహము" పూ. ము. పా.

ఇతర మెఱఁగకుంటే నిందిరానాథుఁడు మెచ్చు
సతికౌఁగిఁ బడకుంటే జంటౌ నాతఁడు
హితవులు గోరకుంటే నెదుట ౧ శ్రీపతి నిల్చు
జితేంద్రియవ్రతమందే శ్రీవేంకటేశుఁడు. ॥సర్వ॥ 152

నాట

నానాటికిఁ బెరిగీని నరసింహము
అనుక వరములిచ్చీ నౌభళపుసింహము. ॥పల్లవి॥

వేఁడిప్రతాపముతోడ విభవాలు మెరయుచు
మూఁడుమూర్తులొక్కటైనముఖ్యసింహము
వాఁడివాఁడికోరలతో వడి నసురఁ జక్కాడి
తీఁడేటి౨మీసాలతోడిదేవదేవసింహము. ॥నానా॥

సరుస శంఖచక్రాదిసకలాయుధాలు వట్టి
పరబ్రహ్మమే తానైనపటుసింహము
వరుసఁ గొలువులు దేవతలెల్లాఁ జేయఁగాను
తిరమైనకృపతోడి దివ్యసింహము. ॥నానా॥

కేలిసింహాసనముపై కిరీటము ధరియించి
చాలు వేయిచేతులకాంచనసింహము
పాలించి ప్రహ్లాదునిభక్తులపాలిటి ౩కిలు—
వేలుపై శ్రీసతితో శ్రీవేంకటాద్రిసింహము. ॥నానా॥ 153

మాళవి

ఎందుజూచినా నీవే ఇదివో నీప్రతాపము
నందకధరుఁడ నీకు నమో నారసింహా. ॥పల్లవి॥

---

౧. 'శ్రీసతి' పూ. ము. పా.
౨. 'మీసాలతోడి దేవసింహము' పూ. ము. పా. ఈ పాఠములో ఒక 'దేవ' శబ్దము తప్పిపోయినది. ౩. 'కిలువేలుపు' పూ. ము. పా.

అచ్చలపుబ్రహ్మాండ మది నీకుఁ బెద్దగుహ
చెచ్చెర నహోబలాద్రి సింహాసనము
అచ్చుటఁ గనకదైత్యుఁ డాహారపుమేగము
విచ్చనవిడిఁ జెలఁగు విజయనారసింహ. ॥ఎందు॥

జలధు లేడును నీకు జలకపుమడుగులు
అలరి భూమెల్లా విహారదేశము
కెలన రెలుఁబగళ్లు కిందిమీఁదిరెప్పలు
వెలయఁగ విహరించు విజయనారసింహ. ॥ఎందు॥

చక్కటి శ్రీమహాదేవి జంటైనఆడుసింహము
నిక్కపుదేవతలెల్లా నీపిల్లలు
యెక్కువై శ్రీవేంకటాద్రి నిన్నిటా భోగించేవు
వెక్కసమై మమ్మేలుకో విజయనారసింహ. ॥ఎందు॥ 154

శ్రీరాగం

శరణు వేఁడెద యజ్ఞసంభవ రామ
అరసి రక్షించు మమ్ము నయోధ్యారామా. ॥పల్లవి॥

ధారుణిలో దశరథతనయ రామ
చేరినయహల్యను రక్షించినరామ
వారిధిబంధన కపివల్లభరామ
తారకబ్రహ్మమైనసీతాపతిరామా. ॥శర॥

ఆదిత్యకులాంబుధిమృగాంకరామ। హర—
కోదండభంజనముచేకొనినరామ
వేదశాస్త్రపురాణాదివినుతరామ
ఆదిగొన్నతాటకాసంహార రామా. ॥శర॥

రావణునిఖండించినరాఘవ రామ
వావిరి విభీషణవరద రామా
సేవ నలమేల్మంగతో శ్రీవేంకటేశుఁడవై
యీవల దాసులనెల్లా నేలినట్టిరామా. ॥శర॥ 155

రేకు 228 సామంతం

ముందరఁ గలదని మోసపోతి నిదె
యిందునే తుదిపద మెక్కితినా. ॥పల్లవి॥

కాయము మోచితి ౧ఘడన గడించితి
చేయారఁబుణ్యము సేసితినా
పాయము గైకొంటి పలురుచు లెరిఁగితి
రోయఁదగిన విల రోసితినా. ॥ముంద॥

నిదుర మేల్కనితి నిక్కల గంటిని
హృదయపువిజ్ఞాన మెఱిఁగితినా
చదువులు చదివితి జపములు సేసితి
మది చంచలములు మానితినా. ॥ముంద॥

అందరిఁ గొలిచితి నన్నియుఁ జూచితి
నెందునైన మే లెఱిఁగితినా
కందువ శ్రీవేంకటపతి నీవే
చెంది కాచితివి చెదరితినా. ॥ముంద॥ 156

శంకరాభరణం

సీతారమణ వో శ్రీరామచంద్ర దా—
దాత లక్ష్మణుఁ డదే తగు రామచంద్ర. ॥పల్లవి॥

---

౧. 'గడన' కావచ్చు.

చెలువపుసింగారాల శ్రీరామచంద్ర నీ—
సెలవుల నవ్వు గారీ శ్రీరామచంద్ర
చెలఁగీ చెక్కులఁ గళ శ్రీరామచంద్ర
మొలచె మోహనము నీమోమున రామచంద్ర. ॥సీతా॥

చిక్కనిమురిపెముల శ్రీరామచంద్ర
చిక్కులేదు పెద్దకొప్పు శ్రీరామచంద్ర
చిక్కె నీచే మదనుఁడు శ్రీరామచంద్ర
చొక్కపునున్న నిమేనిసొంపు రామచంద్ర. ॥సీతా॥

చేవదేరినసిగ్గుల శ్రీరామచంద్ర
శ్రీవేంటాద్రిమీఁది శ్రీరామచంద్ర
యీవల దాసరిపల్లెనిరవుకొని మీ—
సేవకుల మమ్ము నేలే శ్రీరామచంద్ర. ॥సీతా॥ 157

దేవగాంధారి

ఎందునైనా మీరఁబోతే నెవ్వరికిఁ జనిగాదు
యిందరిలోఁ దనకొలఁ దెంచుకొనవలెను. ॥పల్లవి॥

మంచితనమే వలె మాటలాడేయప్పుడెల్లా
కొంచి కొంచి యుండవలె కోపపువేళ
వంచన యెప్పుడూవలె వరుస ఘనులఁ గంటే
చంచలము మానవలె సతతము దేహికి. ॥ఎందు॥

భ్రమయకుండఁగవలె పడఁతులఁగంటేను
తమకించకుండవలె తన్నుఁ దిట్టితే
సుముఖుఁడై యుండవలె చూచినవారికినెల్ల
అమరియుండఁగవలె సన్నిటాను దేహికి ॥ఎందు॥

కైవశమై యుండవలె ఘనపుణ్యములకెల్ల
దైవము నమ్మఁగవలె తను వెత్తితే
యీవల శ్రీవేంకటేశుఁ డితనికే శరణని
భావించి బ్రతుకవలె పనివడి దేహికి. ॥ఎందు॥ 158

మలహరి

సర్వేశ్వరా నీకు శరణుచొచ్చితి మిదే
వుర్విలోన నేమెంచేవుపమ లేమున్నవి. ॥పల్లవి॥

వెలయ నేమిటికైనా వెరవకుండేనంటే
యెలమి ధైర్యము నీపియ్యక లేదు
బలిమి చూపెద నేపట్టునన్నైనా నంటే
చెలఁగి నీవే లోనిచేతనాత్మకుఁడవు. ॥సర్వే॥

జగములోపల నేనెచ్చరికై వుండేనంటే
అగపడి బుద్ధి నీవియ్యక లేదు
పగటుసంసారముభ్రమ విడిచేనంటే
మగటిమిగల నీవు మాయానాథుఁడవు. ॥సర్వే॥

కేవల మీపుట్టుగును గెలిచివుండేనంటే
ఆవేళ నీవు ముక్తియ్యక లేదు
శ్రీవేంకటేశ్వర నీకు చేకానుకిచ్చేనంటే
లావుసంపదల నీవు లక్ష్మీనాథుఁడవు. ॥సర్వే॥ 159

భైరవి

అతఁడే యిన్నియు నిచ్చు నడిగినవల్లాను
చేతిలోనే వుండఁగాను చింతించరు హరిని. ॥పల్లవి॥

వలెనంటే సంపదలు వట్టి యలమటఁ బెట్టు
అలసి వోపనంటేను అండనే వుండు
తలఁచి యిందరు నీతరతీపులఁ జిక్కి
తలఁచ రెండును బరతత్వమైనవారిని. ॥ అతఁ ॥

ఆసపడితే సింతులు అన్నిటాను బిగుతురు
వాసితో నుంటేనే తామే వత్తు రొద్దికి
పోసరించి యిందరు నీపొందులభ్రమలఁ బడి
పాసివున్నారదే తమపతియైనవారని. ॥ అతఁ ॥

గట్టిగా రాతిరెల్లాను కలయై యుండు జగము
పట్టపగలైతే తమపాల నుండును
బట్టబయలు పందిలి పెట్టేరుగాని చే—
పట్టరు శ్రీవేంకటాద్రిపై నున్నవారిని. ॥ అతఁ ॥ 160

సాళంగనాట

పైకొని చూడరో వుట్లపండుగ నేఁడు
అకడ గొల్లెతలకు నానందము నేఁడు. ॥ పల్లవి ॥

ఆదికాలమునఁ గృష్ణుఁ డవతరించినయట్టి—
ఆదట శ్రావణబహుళాష్టమాయను
దాదాత రోహిణినక్షత్రము ౧గూడె నడురేయి
సాదించ లోకులకెల్లా జయంతియాయను. ॥ పైకొ ॥

వసుదేవునిని దేవకిని మన్నించి కృష్ణుఁ—
డెసఁగి రేపల్లెకు నేతెంచుటాయను
కొసరి యశోదానందగోపులకుఁబుత్రోత్సవ—
మసమున నిచ్చి మించె నన్నిటా మేలాయను. ॥ పైకొ ॥

౧. 'గూడినరేయి' పూ. ము. పా.

తొట్టినరాకాసులతోడఁ గూడ భువిమీఁద
నట్టె కంసునిమదము వాతమాయను
రట్టడి శ్రీవేంకటేశుఁ డిట్టె వీధులనెల్ల
జట్టిగా మెరసేయట్టిసంభ్రమము లాయను. ॥వైకొ॥ 161

రేకు 229 దేవగాంధారి

ఒకరి కొకరు వొద్దు దప్పులనే
పకపకనవ్వు పచరించేరు. ॥పల్లవి॥

కొట్టీ నుట్లదె గోవిందుఁ డంతలో
తిట్టేరు గోపసతీమణులు
పట్టీఁ జన్నులట్టే పైపై గోవిందుఁడు
మెట్టెలపాదాల మెట్టే రింతులు. ॥ఒక॥

వారవట్టీఁ జాలు వంచి గోవిందుఁడు
గోర గీరే రదే గొల్లెతలు
చీర లంటీ నట్టె చెంది గోవిందుఁడు
మేరతోఁ గొప్పు వంచి మించే రింతులు. ॥ఒక॥

కెలసి వెన్నారగించీ గోవిందుఁడు
తొలఁగఁ ద్రోసేరు దొడ్డివారు
కలసెను శ్రీవేంకటాద్రిగోవిందుఁడు
అలమేరు మరి నంగనలు. ॥ఒక॥ 162

శంకరాభరణం

మదనజనకునికి మజ్జనవేళ
పదివేలుభోగములు పరగీనదె. ॥పల్లవి॥

వున్నతివేదఘోషాల నుర్వీధరునిమీఁద
పన్నిటికాలువలు పారీనదె
మున్నిటిమునులహస్తములఁ గప్పురపుధూళి
కన్నులపండుగగాఁ గప్పీనదె. ॥మద॥

సేసలుగా నలువంక శ్రీసతివిభునిమీఁద
వాసన తట్టుపుణుఁగు వడిసీనదె
భాసురపుఁజంద్రగావిపట్టుదట్టి కాంతలెల్లా
ఆసల మొలఁ గట్టఁగా నమరీనదె ॥మద॥

చెలరేఁగి సొమ్ములెల్లా శ్రీవేంకటేశ్వరుమేన
నెలకొని కాంతులతో నిండీనదె
అలమేలుమంగ వురమందు నెలకొని యట్టె
సలిగె గృపారసము చల్లీనదె. ॥మద॥ 168

సాళంగనాట

భీకరపుచక్ర మదె పిడుగులు రాలీ నదె
పైకొని నిలువరాదు పారరో దిక్కులకు. ॥పల్లవి॥

బండికండ్లరవమదే బంగారు మెఱుఁగులవే
కొండవంటిరథమదె గొడుగులవే
మెండుగ దేవుఁడు వీధి మెరసి యేతెంచీ వాఁడే
బంటుబంటై యసురలు పారరో దిక్కులకు. ॥భీక॥

గరుడధ్వజమదే ఘంటారవములవే
సొరిది ముత్యాలకుచ్చులు నవే
విరుదుశంఖము మ్రోఁత బెరయించీ దేవుఁడదే
పరగ దానవులెల్లఁ బారరో దిక్కులకు. ॥భీక॥

ముంగిట బలములవే మొరసీ భేరులవే
సంగతిఁ బ్రతాపమదే సాకారమదే
కుంగ కలమేలుమంగఁ గూడి శ్రీవేంకటేశుఁడు
ఛంగవెట్టీ దైతేయులు పారరో దిక్కులకు. ॥ ధీర ॥ 164

శ్రీరాగం

భావించరే చెలులాల పరమాత్ముని
చేవదేరి చిగురులో చేఁగయై యుండెను. ॥ పల్లవి ॥

మలసి పన్నీట హరి మజ్జనమాడేవేళ
కలశాబ్ధిఁదేలేమాణికమువలె నుండెను
అలరి కప్పురకాపు అవధరించేటివేళ
మొలచినవెన్నెల మొలకయై యుండెను. ॥ భావిం ॥

అంచలఁ దట్టుపుణుఁగు అవధరించేటివేళ
యెంచ నంజనాద్రిపై యేనుగై వుండెను
మించినహారములెల్ల మేన నించుకొన్న వేళ
మంచి మంచి నక్షత్రమండలమై యుండెను. ॥ భావిం ॥

వున్నతి నలమేల్మంగ నురముననుంచువేళ
పెన్నిధై పూచినట్టి సంపెంగవలె నుండెను
వన్నె శ్రీవేంకటేశుఁడు వరములిచ్చేటివేళ
తిన్ననై యందరిభాగ్యదేవతయై యుండెను. ॥ భావిం ॥ 165

సామంతం

చెప్పరానిమహిమల శ్రీదేవుఁ డితఁడు
కప్పి కన్నులపండుగగాఁ జూడరో. ॥ పల్లవి ॥

అద్దుచుఁ గప్పురధూళి యట్టె మేన నలఁదఁగా
వొద్దిక దేవునిభావ మూహించితేను
ముద్దులు విరిచినట్టి మంచి బాలకృష్ణునికి
మద్దులకాంతి మేన మలసినటుండె. ॥చెప్ప॥

అమరఁ దట్టుపుణుఁగు అవధరించఁగాను
తమితోఁ బోలికెలెల్లఁ దచ్చిచూడఁగా
యమునానది నాఁగేట నండకుఁ దీసుకొనఁగా
యమునానదినలుపు అంటినయట్టుండె. ॥చెప్ప॥

అంగముల శ్రీవేంకటాధిపున కింతటాను
సింగారించి సొమ్ములెల్లఁ జెలరేఁగఁగా
బంగారపుటలమేలుమంగ నురాన నుంచఁగా
బంగారము మేననెల్లాఁ బరగినట్టుండె. ॥చెప్ప॥ 166

పాడి

నేరనైతి నింతేకాక నే నిన్నాళ్లు
యేరీతి విచారించినా నిదివో నిశ్చయము. ॥పల్లవి॥

నాకుఁగా వేరొకరు విన్నపము సేసేరా నీకు
వాకుచ్చి నేనే ఆడవలెఁగాక
యీకడ నాకంటే హీను నిఁక నీవు ౧గా(ం)చేవా
శ్రీకాంతుఁడ యిఁక నీచిత్త మింతే కాక. ॥నేర॥

నీవల్ల బతుకలేక నే నొకరి వేఁడేనా
వావిరి నిన్నే కొసరవలెఁగాక
నీవితరణగుణము నీలోనే దాఁచుకొనేవా
సోవ నావంటివారికిఁ జూపవలెఁగాక. ॥నేర॥

౧. 'గాచేవా' రక్షించేవా? అనునర్థమే బాగున్నది.

తల్లికలేనిముద్దు దాదికిఁ గలదా మరి
చెల్లుబడి నీవే దయసేయుటగాక
తొల్లె శ్రీవేంకటేశ్వర తూరి నాలో నున్నాఁడవు
చల్లఁగా నీచనవిచ్చి ఆరుపుటగాక. ॥ నేర ॥ 167

రేకు 280 లలిత

ఎట్టున్నదో నీచిత్త మెదురాడ నే వెఱతు
గట్టిగా హరి నీమాయ కడవఁగరాదు. ॥ పల్లవి ॥

నిచ్చ పతితులఁజూచి నేను సంసారినై యుందు
అచ్చుపుసన్యాసులఁ జూ చటువలె నయ్యేనందు
హెచ్చి మోచివచ్చితేను యెక్కడిగొడవ యందు
ఇచ్చట నిశ్చలబుద్ధి యెందూ నేఁ గానను. ॥ ఎట్టు ॥

కర్ములఁ జూచొకవేళ కర్మము నేఁ జేయఁబోదు
మర్మపుజ్ఞానులఁ జూచి మంచిదందును
అర్మిల రెండూఁ జూచి అంతలో సందేహింతు
నిర్మలమయినబుద్ధి నే నెందుఁ గానను. ॥ ఎట్టు ॥

నారదాసి వోఁజూచి వారివెంటఁ దగులుదు
తేరి కొంతదవ్వు వోయి తిరుగుదును
నేరిచి శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గాచితివి
యీరీతిఁ దేరినబుద్ధి యెందూ నేఁ గానను. ॥ ఎట్టు ॥ 168

లలిత

శ్రీపతి యీతఁడుండగాఁ జిక్కినవారి నమ్ముట
తీపని మీసాలమీఁదితేనె నాకుటసుండీ. ॥ పల్లవి ॥

తలఁచినంతటిలోనె దైవ మెదుటఁ గలఁడు
కొలువనేరనియట్టికొంతే కాని
ఇల నరులఁ గొలుచు టెందో కోకలు వేసి
బలుకొక్కెరలవెంటఁ బారాడుటసుండీ. ॥ శ్రీప ॥

శరణన్నమాత్రమున సకలవరము లిచ్చు
నిరతి మరచినట్టినేరమే కాని
పొరి నితరోపాయానఁ బోరలుట గాజుఁబూస
గరిమ మాణికమంటాఁ గట్టుకొంటసుండీ. ॥ శ్రీప ॥

చేత మొక్కితేఁ జాలు శ్రీవేంకటేశుఁడు గాచు
కాతరాన సేవించనికడమే కాని
యీతల నిది మాని మరెన్నిపుణ్యాలు సేసినా
రీతి నడవిఁగాసినరితవెన్నెలసుండీ. ॥ శ్రీప ॥ 169

బౌళి

కొండిపుణ్యాపాపాలే కొంగురొక్కములు వెట్టి
వెలదెంచి బేరమాడ వేగిరమే రారో. ॥ పల్లవి ॥

జననాలు మరణాలు సంసారభోగములును
అనిశము భూమిమీఁద నగ్గువలు
కొనేవారుఁ దినేవారు కూడి కూడి మూఁకలై
దినసంతలెక్కె నిదే దేహులాల రారో. ॥ కొలఁ ॥

౧ అంగనలవలపులఅంగళ్లు వెట్టి రదే
చెంగట వయసులనేచింతలకింద
సంగతిఁ గాయమనేసంచుల నించుకొందము
చెంగి పోరాదు మనకు జీవులాల రారో. ॥ కొలఁ ॥

---

౧. 'అంగనలు' కావచ్చు.

లంపటాలు సంపదలు లలి ౧ నంబారాసు లాయ
ఇంపుల ముంచి తలల కెత్తుకోరో
దింపక ఇందులోన నె తిరిగి శ్రీవేంకటేశు —
పంపున లాభము చేరె ప్రాణులాల రారో. ॥కొలు॥ 170

ముఖారి

దైవమా వో దైవమా నన్ను దయఁజూడఁదగదా
నే వెట్టివాఁడనైతే నీవు వెట్టివా. ॥పల్లవి॥

చవిగొంటి నెత్తురెల్లా చన్నుఁబాలనుచు నేను
భువిఁ దొల్లే నోచితి పుట్టె నంటాను
యివల గడుపులోన హేయమౌటాఁ గూడవుటా
నవిరి న న్నెరఁగను ని న్నెఱఁగేనా ॥దైవ॥

మొగిఁ జావుకు వెరతు ముందర గాన నేను
వెగటులంపటమైతే వేసరుకొందు
వగపును నగవును వడ నొక్క మొకమందే
తగులైనవాఁడ నీపై తలఁపు వాకున్నదా. ॥దైవ॥

మతి భ్రమసితిఁ గొంత మన్ను నాకు రాజ్యమని
సతులంటా సుతులంటా సంసారినైతి
గతియై శ్రీవేంకటేశ కాచితి వింతటికోనే
యీశ్వరుఁడ వంతే నీకు నేమి కాఁతి నేను. ॥దైవ॥ 171

లలిత

హరి నిను నెరఁగనియలమట లింతేకాయ
శరణంటి నిదె నీకే సర్వేశ కావవే. ॥పల్లవి॥

---

౧. 'అంబారాసులు' 'అంబార' మనే యర్థములోనేనా? అంబారము = ధాన్యరాశి అని శ-ర.

చొచ్చితి స్వర్గము దొల్లి సుకృతములెల్లాఁ జేసి
ఇచ్చఁ గొలిచితి సుర లిందరిని
గచ్చులఁ బుణ్యము దీరఁ గమ్మటిజన్మములకే
వచ్చితి పురుషార్థము వడి నెందూఁ గానను. ॥ హరి ॥

వెదకితి భూములెల్ల విశ్వకర్తెవ్వడోయంటా
చదివితిఁ బుస్తకాలు సారె సారెకు
తుద ననుమానమున దొమ్మి సీకలు దెల్లఁగా
మదిసితి నింతేకాని ముంద రేమీఁ గానను. ॥ హరి ॥

చింతలెల్ల నుడిగితి శ్రీవేంకటేశ్వర నిన్ను
వింత లేక శరణని వెలసితిని
చెంతల నివ్వాళ్లదాఁకా చిక్కి కర్మముల వట్టి
గంతులు వేసితిఁగాని కడ గాననైతిని. ॥ హరి ॥ 172

మాళవిగౌళ

నీకు నాకు నెట్టుగూడె నీ వెట్టు నన్నేలితివి
యీకరుణకే మొక్కితి నిందిరారమణా. ॥ పల్లవి ॥

కమలాక్ష నీ వనంతకల్యాణగుణనిధివి
అమితదుర్గుణరాసి నన్నిటా నేను
అమరఁగ స్వతంత్రుఁడ వటు నిన్ను నెంచితేను
తమి నించుకంతా స్వతంత్రుఁడ నేఁ గాను. ॥ నీకు ॥

దేవ నీవైతే సర్వదేవరక్షకుఁడవు నే
జీవుఁడ నింద్రియాలఁ బెంచేవాఁడను
ఆవల బ్రహ్మాండాల కన్నిటాఁ బొడవు నీవు
కావించ నేనణువై పరగేటివాఁడను. ॥ నీకు ॥

నానార్థసంపన్నుఁడవు నావల్ల నేమి గంటివి
అనుక నాయంతర్యామివై పాయవు
శ్రీనిధివి నీవైతే శ్రీవేంకటాద్రిపతివి
దీనుఁడ నొకఁడ నేను ద్రిష్టించి కాచితివి. ॥నీకు॥ 178

రేకు 231 ధన్నాసి

వెట్టిదెలిసి రోఁకలి వెసఁ జుట్టుకొన్నట్టు
యిట్టిదీముభోగముల నెనసేము. ॥పల్లవి॥

మురికి దేహము మోచి మూలల సిగ్గువడక
పోరిఁ బరిమళములు పూసేము
పరగ పునుకతల పావనము సేసేమంటా
నిరతితోడ దినము నీట ముంచేము. ॥వెట్టి॥

పుక్కట పంచేంద్రియపుపుట్టు వుట్టి యందరిలో
మొక్కించుక దొరలమై మురిసేము
అక్కర నజ్ఞానమనేఅంధకారముననుండి
దిక్కుల నెదిరివారిఁ దెలిపేము. ॥వెట్టి॥

దినసంసారమే మాకు దేవుఁడని కొలుచుక
వెనుకొని ఘనము శ్రీ వెదకేము
యెనలేక శ్రీవేంకటేశ మమ్ముఁ గావఁగాను
తనిసి తొల్లిటిపాటు దలఁచేము. ॥వెట్టి॥ 174

రామక్రియ

ఇంకా నో దైవమా యేల వెట్టి దవ్వించేవు
కొంకి తెంచి ముడిగొంటే కుట్టుచేకాదా. ॥పల్లవి॥

పైకొని నీదాసులు బ్రహ్మాదులఁ గొల్వమని
లోకులఁ గొల్చితే వారు లోలో నవ్వరా
కోక చాకియుఁట వేసి కొక్కెరాలవెంటఁ బోతే
అకడ పురుషార్థము నందీనా జీవుఁడు. ॥ఇంతా॥

వుమ్మడిఁ గర్మఫలము వొల్లమని పసిఁడికి
నమ్మిక చేయి చాఁచితే నవ్వరా అది
కమ్మి శిరసుండఁగా మోకాల సేసవెట్టఁబోతే
సమ్మతి నిందరిలోన జాణౌనా జీవుఁడు. ॥ఇంతా॥

సారెకు మాయాప్రపంచమునకు లోనుగాక
నారులకు లోనైతే నవ్వరా వారు
యీరీతి శ్రీవేంకటేశ ఇన్నిటా నీశరణని
కూరవండి కస వేఁగోరీనా జీవుఁడు ॥ఇంతా॥ 175

బౌళి

అమ్మే దొకటియును అసిమలోని దొకటి
ఇమ్ముల మాగుణములు యెంచఁ జోటేదయ్యా. ॥పల్లవి॥

యెప్పుడు నేము చూచిన నింద్రియకింకరులము
ఇప్పుడు నీకింకరుల మెట్టయ్యేమో
తప్పక ధనమునకు దాస్యము నేము సేసేము
చెప్పి నీదాసుల మన సిగ్గుగాదా మాకు. ॥అమ్మే॥

పడఁతుల కెప్పుడును పరతంత్రులము నేము
వడి నీపరతంత్రభావము మాకేది
నడుమ రుచులకే నాలుక అమ్ముడవోయ
యెడయేది నిన్ను నుతియించే అందుకును. ॥అమ్మే॥

తనువులంపటానకు తగ మీఁదె తిత్తిమిదె
వొనరి నీవూడిగాన కొదిగేదెట్టు
ననిచి శ్రీవేంకటేశ వాఁడే నీకు శరణంటి
వెనక ముందెంచక నీవే కావవయ్యా. ॥అమ్మె॥ 176

దేసాళం

వెట్టి దెలిసి మరియు వేఁడురు దవ్వేము నేము
ముట్టుఁబాలమంకు వాఁడ మూలమా శరణు. ॥పల్లవి॥

తోలు నెముకలు ముట్టి దోసమంటాఁ దీర్థమాడి
తోలు నెముకల మేనితోఁడ నున్నాఁడ
వాలినజీవహింస వద్దని చైతన్యముతో
తేలించి శాకపాకాల దిగమింగేము. ॥వెట్టి॥

బూతునఁ బుట్టినందుకు పుణ్యములెల్లాఁ జేసి
బూతులసంసారమే భోగించేము
పాతకములెల్లాఁ బోను బహుదానము లొసఁగి
ఆతల నోరులఁ బోయి అడిగేము నేము. ॥వెట్టి॥

కర్మము లన్నియుఁ దోసి ఘనముక్తిఁ బొందేనంటా
కర్మాచరణములే కడుఁ జేసేము
నిర్మించి శ్రీవేంకటేశ నేరాలు నన్ను నెంచక
ధర్మము దలఁచి నీవే దయఁ జూడవే. ॥వెట్టి॥ 177

దేసాళం

ఏమనఁగవచ్చునమ్మ ఇటువంటివారిఁ జూచి
కామించి గోపికలెల్లాఁ గాచుకున్నా రదివో. ॥పల్లవి॥

రోలఁ గట్టువడ్డవాఁడు రోఁకలివట్టినవాఁడు
వేళలేదు వెన్నలెల్ల ౧వెరఁజాడేరు
వేలఁ గొండెత్తినవాఁడు వేరే యేరుసేసేవాఁడు
బాలులవలెనే వీధిఁ బారాడేరు వారవో. ‖ఏమ‖

కాటుకమైచాయవాఁడు కప్పురపువన్నెవాఁడు
కూటము గూడుక జోడుకోడలైనారు
నీటుఁబైఁడికోకవాఁడు సిరికాళతోడివాఁడు
తేటలై దూడలఁ గాచి తిరిగేరు వారివో. ‖ఏమ‖

చేరి చీరలిచ్చువాఁడు చెలిఁ గుంగిఁచినవాఁడు
ధీరులై రేపల్లెలోనఁ దిరిగే రదే
యీరీతి శ్రీవేంకటాద్రి నిద్దరును నేకరూపై
కోరినవారివరాలు కొల్లలిచ్చే రదివో. ‖ఏమ‖ 178

పాడి

చేరి యందెలమోఁతతో చెన్నకేశవా
యీరీతి మాడుపూరలో నిట్లాడేవా. ‖పల్లవి‖

మున్ను యశోదవద్దను ముద్దు ౨గునిశాడితివి
వన్ని రేపల్లెవీధులఁ బారాడితివి
పిన్నవై గోపాలులతోఁ బిల్లదీపులాడితివి
యెన్నిక మాఁడుపూరిలో యిట్లాడేవా. ‖చేరి‖

కాళింగుపడిగెలపై కడు నాట్యమాడితివి
కేలి యమునలో రాసక్రీడ లాడితి
చేలంటి గోపికల చెట్టాపట్టాలాడితివి
యీలీల మాఁడుపూరిలో యిట్లాడేవా. ‖చేరి‖

---

౧. వెరఁజి+ఆడేరు.

౨. గునిసి+ఆడితివి=గునిశాడితివి-వ్యావహారికసంధి.

తగువిభాండకునితో దాఁగిలి ముచ్చులాడితి
అగడుగా బండివిరిచాటలాడితి
వొగి శ్రీవేంకటగిరినుండి వచ్చి మాఁడుఁపూర—
నెగనెగసి ౧గతుల కిటులాడే వా(?). ॥చేరి॥ 179

రేకు 282 లలిత

వెన్న చేతఁబట్టి నేయి వెదకనేలా
యిన్నిటా నెంచిచూచితే నిదియే వివేకము. ॥పల్లవి॥

నీదాసులున్నచోట నిత్యవైకుంఠ మిదె
వేదతో వేరొకచోట వెదకనేలా
అదిగొని వారిరూపు లవియే నీరూపులు
పోదితి నిన్ను మదిఁ దలపోయనేలా. ॥వెన్న॥

వారలతోడిమాటలు వడి వేదాంతపఠన
సారె వట్టిచదువులు చదువనేల
చేరి వారికరుణే నీచేపట్టినమన్ననలు
కోరి యింతకంటే ౨మిమ్ముఁ గొసర నేలా. ॥వెన్న॥

నావిన్నపము నిదె నారదకాదులును
యీవిధముననే ఆనతిచ్చినారు
శ్రీవేంకటేశ నీవు చేపట్టినదాసులకు
కైవశమౌ యీబుద్ధి కడమేలా. ॥వెన్న॥ 180

దేవగాంధారి

హీనుఁడై ననన్నుఁ దెచ్చి యింతగా మన్నించితివి
దానవారి నీవు సేసే తగ విట్టిదయ్యా. ॥పల్లవి॥

---

౧. 'గతుల' = నాట్యప్రక్రియలేమో?
౨. 'మమ్ముఁ' పూ. ము. పా.

విరతిబొందినయట్టివిమలచిత్తుఁడఁ గాను
ధరణి నెక్కుడయినతపసిఁ గాను
అరుదుగ గెంటులేనిఆచారవంతుఁడఁ గాను
హరి నీకరుణ నాపై నంటుటెట్లయ్యా. ॥హీనుఁ॥

చేముంచి యిందరిలోన జితేంద్రియుఁడఁ గాను
భూమెల్లా దానమిచ్చినపుణ్యుఁడఁ గాను
దోమటికర్మాలు సేసి తుదకెక్కేవాఁడఁ గాను
యేమిటికిఁ గాచితివో యిది సోద్యమయ్యా. ॥హీనుఁ॥

వివరించి తెలిసినవిజ్ఞాని తొలుతఁ గాను
తవిలి నీభక్తిగలధన్యుఁడఁ గాను
భవసాగరములోనిప్రాణిమాత్ర మింతే నేను
యివల శ్రీవేంకటేశ యెట్టేలితివయ్యా. ॥హీనుఁ॥ 181

మంగళకౌశిక

ఇదె నీకన్నులయెదిటికి వచ్చితి
కదియుచు నెట్టయినఁ గావకపోదు. ॥పల్లవి॥

పరమపురుష నీభక్తి దొరకకే
యిరవగుజన్మము లెత్తితిని
హరి నీకరుణకు నరుహము లేకే
దురితవిదులసందులఁ బడితి. ॥ఇదె॥

జగతీశ్వర నీశరణము లేకే
వొగి సంసారపువురిఁ బడితి
భగవంతుఁడ నీపదములు గనకే
తెగనిపాపముల తీదీపు లైతి. ॥ఇదె॥

గోవిందుఁడ నినుఁ గొలువఁగనేరకే
థావతి యాసలఁ దగిలితిని
శ్రీవేంకటేశ్వర చేరి నీవు నా—
దైవమవుగాఁగ ధన్యుఁడనయితి. ॥ ఆదె ॥ 182

దేసాళం

౧ ఈతఁడే ముక్తిదోవ యీతఁడే మాయాచార్యుఁ
డీతఁడు గలుగఁబట్టి ఇందరు బదికిరి. ॥ పల్లవి ॥

అదివో తాళ్లపాక అన్నమాచార్యులు
యిదె వీఁడె శ్రీవేంకటేశు నెదుట
వెదవెట్టి లోకములో వేదములన్నియు మంచి —
పదములు పేసి పాడి పావనము సేసెను. ॥ ఈతఁ ॥

అలరుచుఁ దాళ్లపాక అన్నమాచార్యులు
నిలిచి శ్రీవేంకటనిధియే తానై
కలిదోషములు వాప ఘనపురాణములెల్ల
పలుకుల నించి నించి పాడినాఁడు హరిని. ॥ ఈతఁ ॥

అంగవించెఁ దాళ్లపాక అన్నమాచార్యులు
బంగారు శ్రీవేంకటేశుపాదములందు
రంగుమీర శ్రీవేంకటరమణుని యలమేలు —
మంగను యిద్దరిఁ బాడి౨మమ్ముఁ గరుణించెను. ॥ ఈతఁ ॥ 183

లలిత

నేఁడు నిమహిమ నెరపెడిసమయము
వాఁడి మెరసి యిటు వరదుఁడ రావే. ॥ పల్లవి ॥

---

౧. ఈపాటకూడ పెదతిరుమలాచార్యులదో, చినతిరుమలాచార్యులదో కావలయును. 'మమ్ముఁ గరుణించెను' అనుదానితో ఇది ఇతరులదనుట స్పష్టము. ౨ "మమ్ముఁ" కావలెను.

అల చక్రపాణివై యసురలతల—
లిలఁ గూల్చిన జగదీశ్వరుఁడ
చలమున హిరణ్యాఁ జక్కాడి యిటు భూ—
వలయము నిలిపిన వరాహమా. ॥ నేఁడు ॥

పంచల నీదాసుఁ బఱచినకశిపునిఁ
ద్రుంచిన శ్రీనరసింహమా
యెంచి విభీషణు కిటు లంక యొసఁగి
కొంచనిప్రతాప కోదండరామా. ॥ నేఁడు ॥

నరకాసురు నటు నఱకి కామినుల
సిరులఁ జెఱగొన్న శ్రీకృష్ణ
పొరిఁబొరి బలిచే భూదాన మడిగి
సిరి నిటుగూడిన శ్రీవేంకటేశా. ॥ నేఁడు ॥ 184

శంకరాభరణం

కని ౧గుద్దును నదె విని చెవుడును నిదె
ననిచి జగత్తు నడచీనదివో. ॥ పల్లవి ॥

వుదయాస్తమయము లొకదినమున నే
యెదుటనె వున్నవి యెంచినను
యిదివో జీవులు యెంచక తమతమ—
బ్రదుకులు సతమని భ్రమసెదరు. ॥ కని ॥

వెలుఁగును జీఁకటి వెనఁ గనుఁగొనలనె
నిలిచీ నూరక నిమిషములో
కలవలె నుండినగతి సంసారము
బలువుగ సతమని భ్రమసెదరు. ॥ కని ॥

---

౧. 'గుడ్డియు' కావచ్చు.

కాంతలుఁ బురుషులు కాయ మొక్కటనె
పొంతనే పుట్టుచుఁ బొదలెదరు
యింతయు శ్రీవేంకటేశ్వరుమహిమల-
వంతము దెలియక భ్రమసెదరు. ॥కని॥ 185

రేకు 288 రామక్రియ

౧ఎదిరించి పోట్లాడ నెవ్వరితరము లేక
త్రిదశవంద్యుఁడు వారిఁ దేరిచూడఁగలరా. ॥పల్లవి॥

ఘాత మీస మదరితే గగ్గులకాడవుదురు
యీతఁడు దలచూపితే నెదిరించ రరులు
ఆతురాన గోరికరాయడికి నోపఁగ లేరు
చేతిగోరు మీటితేనే ఛిన్నభిన్న మవుదురు. ॥ఎది॥

పైపై నితఁ డడుగిడ పాతాళానఁ గుంగుదురు
కోపించినంత నెత్తురుగుండాలపాలౌదురు
తూపు చేత నంటితేనే తుత్తుమురై పారుదురు
రావుపిలికాళ గంటే రణభీతి గొందురు. ॥ఎది॥

మంతన మితఁ డాడితే మానముగోలుపోదురు
కొంత గుఱ్ఱ మెక్కితేనే గుంటఁగూలిపోదురు
యింతటా శ్రీవేంకటేశుఁ డెక్కడఁ జూచినఁ దానే
వింతప్రతాపముతోడ విట్టుపిఁగి నిదివో. ॥ఎది॥ 186

వరాళి

కలిమి గలిగియు నధమగతి యదేల
బలిమిగలిగియు లోఁగి బతిమాలనేల. ॥పల్లవి॥

---

౧. ఇందు దశావతారసమన్వయము కలదు.

ఇలువేలు పొకఁడు హరి ఇంటనే వుండఁగా
పలువేలుపులతోడి భ్రమతలేల
మెలఁగి సూర్యుఁ డొక్కఁడు మిక్కిలిని వెలుఁగఁగా
వెలలేని దీపములు వేయి నేమిటికి. ॥కలి॥

హరిభక్తి యొక్కటే ఆత్మలో నుండగా
పరయుక్తు లెంచేటిపనులేల
సిరులఁ జింతామణటు చేతిలో నుండఁగా
సరి గాజుఁబూస మెచ్చఁగ నదేమిటికి. ॥కలి॥

నాలుకను మంచి హరినామ మొకటుండఁగా
గాలిఁ బోయెటివూరగాథలేల
యీలీల శ్రీవేంకటేశుఁ డెదుటనె వుండగా
మూలలకుఁ జేచాఁచి మొక్క నికనేలా ॥కలి॥ 187

గుండక్రియ

నీవే యెఱిఁగి సేయు నీచిత్తము వచ్చినట్టు
కావులఁ గొసరేనన్నా తనివోదు నాకు. ॥పల్లవి॥

హరి నిన్ను నమ్మితి నే ౧ననన నెట్టు వచ్చు నాకు
అరవైన బుద్ధి నా ఇచ్చగాదు
వెరవున నొకటి నే విన్నవించెదనంటేను
సరి నీవు వెలిగాను స్వతంత్రుఁడఁ గాను. ॥నీవే॥

యిట్టె నీపై భారము నే నెట్టు వేయఁగవచ్చు
పట్టి నీకుఁ బురుషార్థపరుఁడఁ గాను
గుట్టుతోడ నే నిన్నుఁ గొలువఁగఁ గొలువఁగ
యెట్టైనాఁ గానిమ్ము యెఱఁగ నెవ్వరిని. ॥నీవే॥

౧. 'ననక' పూ. ము. పా.

యింతటిదైవమవు నిన్నుఁ గనెందు వెదకేను
చెంత శరణాగతులచేతి వాఁడవు
వింతగాదు నీకును శ్రీవేంకటేశ నాకును
అంతర్యామివి నీయానతిలో వాఁడను. ॥నీవే॥ 188

బౌళి

ఇట్టియవివేకబుద్ధి యేపనికివచ్చు నిఁక
జట్టిగొని నాగుణము చక్కఁజేయఁగదవే. ॥పల్లవి॥

హరి నీయిచ్చఁ బ్రపంచమంతా నీవు నడపఁగ
అరసి నీశక్తి దెలియక నమ్మక
౧వెర వెరఁగనియట్టి వెట్టివాఁడ నే నొక్క—
దొరనంటాఁ బనుల కుద్యోగించేను. ॥ఇట్టి॥

అంతరాత్మవై నీవు అన్నియుఁ జెరరేచఁగ
బంతినే నీమహిమెల్లా భావించక
చెంత నీసంసారము సేసేవాఁడ నే నంటా
దొంతులకోరికలతోఁ దూరపారేను. ॥ఇట్టి॥

ఆదినుండి స్వతంత్రుఁడవై యేలినట్టినిన్ను
సోదించి శరణు వాఁడే చొరఁగలేక
యీాదెస శ్రీవేంకటేశ యిప్పుడు నీదాసుఁడనై
నీదయకలిమితోడ నేఁడు మొక్కేను. ॥ఇట్టి॥ 189

లలిత

ఓపితేఁ దానే తగిలి వోపకున్నఁ దానే మాని
మాపు రేపునలయించేమాయ మా కేలా. ॥పల్లవి॥

---

౧. 'వెరపెరఁగని' పూ. ము. పా.

చింతాయకుఁడగు(?)హరి చిత్తములో నుండఁగాను
వింతవింతవిచారాలవెట్టి మాకేలా
చెంతల పరుసవేది చేతిలోనే వుండఁగాను
దొంతరవిద్యలతోడిదోవ మాకేలా. ॥ టపి ॥

తోడు నీడై యచ్యుతుఁడు తొలఁగక వుండఁగాను
జాడదప్పితిరిగేటిజాలి మాకేలా
యేడనో కోకలు వేసి యేమియు నెరఁగలేక
వేడుకతో కొక్కెరాలవెంట మాకేలా. ॥ టపి ॥

వెల్లవిరై యెదుట శ్రీవేంకటేశుఁ డుండఁగాను
బల్లిదుఁ డీతనిఁ బాసి భ్రమ మాకేలా
యెల్లధాన్యములు మాయింటిలో నుండఁగాను
పొల్లికట్టుదంచేమని బుద్ధి మాకేలా. ॥ టపి ॥ 190

గుజ్జరి

మాకేమి నీకరుణ మహాప్రసాదమనేము
నీకు నీదాసులచేతినింద బెట్టుగాదా. ॥ పల్లవి ॥

నమ్మి మిమ్ముఁ గొలిచినబంట్లఁ బరులు దమ—
సొమ్మనుచుఁ దియ్యగాఁ జూచేదా
వుమ్మడి నీవిందుకెల్లా నూరకున్నఁగన మిమ్ము
నమ్ముమన్న వేదాలయానతి కొంచెపడదా. ॥ మాకే ॥

నీముద్ర మోచినవారి నీచులు దడవఁగాను
యీమేర నడ్డమురాక యిట్లుండేదా
వోమక నీవీవేళ నూరకున్న నల్లనాఁటి —
సామజముఁ గాచినది సందేహించఁబడదా. ॥ మాకే ॥

మీరుమన్నించినవారు మీవాకిలి గావ కేడో —
వారివాకిలి గావఁగా వద్దనరాదా
నేరిచి శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గావకున్న
ధారుణి మీఁదయే మిమ్ముఁ దప్పులెంచుకొనరా. ॥మా కే॥ 191

రేకు 284 సాళంగనాట

౧నే నింతసేసినయట్టినేరమి మరవవయ్యా
అనుకొని తాళ్లపాక అన్నమయ్యఁ జూచి. ॥ పల్లవి ॥

నావొళ్లియపరాధా లెన్నక ౨నిన్ను సారె సారె
వేవేలు దూరితి విచారించక
కావించి కన్నులలోనికళంకు దెలియలేక
అవలఁ జందురు నలు పణఁకించినట్లు. ॥ నేని ॥

పాయక నేఁ జేసినట్టిపాపము లెంచుకొనక
ఆయాలు మోవనాడితి నదివో నిన్ను
మాయల నాదేహమిది మలినమే తలఁచక
చాయలేదని యద్దము సారెఁ దోమినట్లు. ॥ నేని ॥

మదమత్సరాలు నాలో మానకిట్టే వుండఁగాను
అదియే నీచేఁతంటా నాడుకొందును
యెదలో శ్రీవేంకటేశ యిరవై నీ వుండఁగాను
వెదకి వెదకి నీకే వెట్టిగొన్నయట్లు. ॥ నేని ॥ 192

లలిత

ఆదివిష్ణు వీతఁడే యటరమ్మా.
ఆదిగొని భూభార మణఁచీనోయమ్మా. ॥ పల్లవి ॥

---

౧. ఈపాటకూడ పెదతిరుమలాచార్యులదో చినతిరుమలాచార్యులదో కావలసి యున్నది. ౨. ఈ 'నిన్ను' పూ. ము. పా.లో తప్పిపోయినది.

చందురునుదయవేళ సవరేతిరి కాడ
  కందువ దేవకి బిడ్డఁ గనెనమ్మా
  పొందుగ బ్రహ్మాదులు పురుఁటింటివాకిటను
  చెంది బాలుని నుతులు సేసేరోయమ్మా. ॥ఆది॥

వనుదేవునియెదుట వైకుంఠనాథుఁడు
  [౧]సిసువై యవతరించి చెలఁగీ నమ్మా
  ముసిముసినవ్వులతో మునులకు ఋషులకు
  యిసుమంత వాఁడభయమిచ్చినమ్మా. ॥ఆది॥

కన్నతల్లిదండ్రులకు కర్మపాశము లూడిచి
  అన్నిటా రాకాసిమూఁక లణఁచీనమ్మా
  వున్నతి శ్రీవేంకటాద్రినుండి లక్ష్మిదేవితోడ
  పన్ని నిచ్చకల్యాణాలఁ బరగీనమ్మా. ॥ఆది॥ 198

సామంతం

పసిఁడియక్షంత లివె పట్టరో వేగమే రారో
  దెసలఁ బేరటాండ్లు దేవునిపెండ్లికిని. ॥పల్లవి॥

శ్రీవేంకటేశ్వరునికి శ్రీమహాలక్ష్మికి
  దైవికపుఁబెండ్లిముహూర్తము నేఁడు
  కావించి భేరులు మ్రోసె గరుడధ్వజం బెక్కె
  దేవతలు రారో దేవునిపెండ్లికిని. ॥పసిఁ॥

కందర్పజనకునికిఁ గమలాదేవికిఁ బెండ్లి
  పందిలిలోపలఁ దలఁబాలు నేఁడు
  గందమూ విడె మిచ్చేరు కలువడాలు గట్టిరి
  అందుక మునులు రారో హరిపెండ్లికిని. ॥పసిఁ॥

---

౧. ‘శిసువై’ రేకు.

అదె (శ్రీ) వేంకటపతి కలమేలుమంగకును
మొదలితిరుణాళ్లకు మొక్కేము నేఁడు
యెదుట నేఁగేరు వీరె యిచ్చేరు వరము లివె
కదలి రారో పరుష ఘనుల పెండ్లికిని. ॥ పసి ॥ 194

## శ్రీ

ఇందుకే కాలమందే యీతని శరణంటిమి
ముందు ముందే దయఁజూచి మొగిఁ గాచుఁగాక. ॥ పల్లవి ॥

పుడమి గుంగిన నెత్తె పురుషోత్తముఁ డితఁడు
యెడసి కొండ గుంగితే నెత్తె నితఁడు
అడరి సంసార వార్ధి నడఁగినదాసులను
యిడుమలఁ బొందకుండా యెత్తి కాచుఁగాక. ॥ ఇందు ॥

పట్టి ప్రహ్లాదుబాధలు పాపినదేవుఁ డితఁడు
రెట్టిగా వేదము లుద్ధరించె నితఁడు
వట్టిదుష్టులలో సహవాసమైతే దాసులను
దిట్టయై వెళ్లఁదీసి తా దిక్కై కాచుఁగాక. ॥ ఇందు ॥

లంకలో సీతఁదెచ్చినలావరి తానే యితఁడు
మంకు అహల్యాశాపము మాన్పె నితఁడు
అంకెల శ్రీవేంకటేశుఁ డతిథీతిఁ బాపి మమ్ము
గొంకక తనదాసులఁ గూడి కాచుఁగాక. ॥ ఇందు ॥ 195

## దేసాళం

ఒడవిడిచి వదర వూరకేల పట్టేవు
గోడ గదుగ నడుసే కురిసీ నోమనసా. ॥ పల్లవి ॥

చిత్తములోపలనున్న చింతామణి యీహరి
యిత్తలఁ గోరినవెల్లా నియ్యఁగాను
తత్తరించి తలఁచక దవ్వవోయి పరులకు
దెత్తివై యేల నోళ్లు దెరిచే వోమనసా. ॥ ఓడ ॥

కన్నులెదుటనే హరి కల్పవృక్షమై యుండి
మన్నించి లోకమెరఁగ మనుపఁగాను
యెన్నివలసిన మరి యీతనినే యడుగక
కన్నవారి నేలడుగఁ గటకటా మనసా. ॥ ఓడ ॥

శ్రీవేంకటేశుఁడే మనచేతిపరుసమై యుండి
తావున నిహపరాలు తా నియ్యఁగాను
భావించి మొక్కక వేరె బద్ధులైనజీవులను
దావతిపడుచు నేల తగిలే వోమనసా. ॥ ఓడ ॥ 196

## లలిత

మంగళసూత్ర మొక్కటే మగనాలికిఁ గట్టేది
అంగవించే మీఁదిపన్నులన్నియు విభునివే. ॥ పల్లవి ॥

తలఁపులోపల నిన్నుఁ దలఁచినానుఁ గలవు
తలఁచకున్నా నంతరాత్మవై కలవు
పలుపూజ లిఁకనేల భక్తిసేయనేల నీవు
గలవని నమ్మేదొక్కటే బుద్ధిగాకా. ॥ మంగ ॥

మొక్కినా రక్షింతువు మొక్కకున్నా జగములో
యిక్కువతో రక్షింతువు యెపుడు నీవు
పెక్కు విన్నపాలేల పిలిచి యలయనేల
తక్కక నమ్మేటిది నీదాస్య మొక్కటే. ॥ మంగ ॥

కడుసుజ్ఞానినైనా నీగర్భవాసమే వునికి
వెడ నజ్ఞానినైనాను విడిదక్కడే
బడినే శ్రీవేంకటేశ పలునావుద్యోగాలేల
నిడివి నిన్ను నుతించేనేమమే నాది. ॥ మంగ ॥ 197

రేకు 285 సామంతం

ఏడ ధర్మ మేడ కర్మ మిన్నియు నీసేవే కాక
యీడనే యిందుకు సాక్షు లిట్టె నిలిపితివి. ॥ పల్లవి ॥

తెగువసేసి నీకుఁ దెచ్చిరి బోనములు
మగండ్లమాటదోసి మౌనిసతులు
తగ నిన్నుఁ జేపట్టుటే ధర్మముగా నిలిపి
జగ మెరఁగఁగ వేదసమ్మతి సేసితివి. ॥ ఏడ ॥

బల్లిదాన నిన్నుఁ బొందే బలుసాహసము సేసి
తల్లిదండ్రిమాట దోసి తానే రుక్మిణి
యెల్లగా నీకు మోహించు టెక్కుడుతగవు సేసి
వెల్లవిరి నాపె నీవు వీధుల నేఁగితివి. ॥ ఏడ ॥

శ్రీవేంకటేశ నిన్ను సేవించవచ్చితేఁ జాలు
భావించి రక్షింతువు నీపరుషలను
యీవల నీకు మొక్కుటే యిన్ని పుణ్యములూఁ ౧జేసి(?)
కావించి హీనుల మమ్ము ఘనులఁ జేసితివి. ॥ ఏడ ॥ 198

లలిత

నమో నారాయణ నావిన్నప మిదివో
సమానుఁడఁ గాను నీకు సర్వేశ రక్షించవే. ॥ పల్లవి ॥

---

౧. ఈ 'చేసి' క్త్వాంతము హేత్వర్థకము కావచ్చు.

మనసు నీయాధీనము మాటలు నీ వాడేటివే
తనువు నీపుట్టించినధన మిది
మును నీపంపున నిన్ని మోచుకున్నవాఁడ నింతే
వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే. ॥నమో॥

భోగముతెల్లా నీవి బుద్ధులు నీ విచ్చినవి
యీగతి వాలతుకు ౧నీవిరవైనది
చేగదేర నీవు నన్నుఁ జేసినమానిసి నింతే
సోగల నాయజ్ఞానము చూడక రక్షించవే. ॥నమో॥

వెలి నీవే లో నీవే వేడుకలెలా నీవే
కలకాలమును నీకరుణే నాకు
యిల శ్రీవేంకటేశ నీవేలుకొన్నబంట నింతే
నెలవు దప్పించక నీవే రక్షించవే. ॥నమో॥ 199

ఆహిరి

ఏమి సేయఁగలవాఁడ నిదివో నేను
నీమరఁగు చొచ్చితిఁగా నీచిత్త మిఁకను. ॥పల్లవి॥

పుట్టినవాఁడను నేను భోగించేవాఁడను నేను
గట్టిగా నిప్పుడు నాకుఁ గర్తవు నీవు
పట్టరాదు జవ్వనము పాయరాదు సంసారము
యిట్టివెల్ల నీమాయ యేమీ ననరాదు. ॥ఏమి॥

కడుఁగాంతలు నాసొమ్ము కర్మములు నాసొమ్ము
నడమ నంతర్యామివి నాకు నీవు
వుడివోవు కోరికలు వొడుగదు కోపము
కడదాఁకా నీమహిమ కాదనరాదు. ॥ఏమి॥

---

౧. 'నీకిరవైనది' పూ. ము. పా. నీవిరవైనది=నీవే విందుకొన్నది లేక, నీవే స్థానముగాకలది కావచ్చు.

భావించలేనివాఁడను ప్రకృతిలోనివాఁడను
శ్రీవేంకటేశ దయసేసితివి నీవు
తోవదప్పదు జ్ఞానము తొలఁగదు వివేకము
దేవుఁడవు నీమర్మము తెలియఁగరాదు. ॥ఏమి॥ 200

కాంబోది

ఏమిసేయఁగలవార మెందుకు నోదుము నేము
శ్రీమాధవ నీవే దయఁ జిత్తగించు మమ్మును. ॥పల్లవి॥

వేపరక పుణ్యాలు గావించేదే యరుదుగాని
నీసేసనంటే పాపములు చేతిలోనివే
గాసిలక చూచితేఁ జీఁకటైనా వెలుఁగౌఁగాని
వీసమంత మఱచినా వెలుఁగైనాఁ జీఁకటే. ॥ఏమి॥

తెలివితో మోక్షము సాధించేదే యెక్కుడుగాని
అలయించేలోకము లెన్నైనా గలవు
తలఁచితే నీరూపము తానే యెదుట నుండు
యిలఁ బరాకై వుండితే నెచ్చోటాఁ జిక్కదు. ॥ఏమి॥

యీవల నీదాసుఁ డయ్యేది ఘనముగాని
దావతి రాజసా లంతటా నున్నవి
శ్రీవేంకటేశ్వర నీసేవే ధ్రువపదము
దేవతాంతరమెల్లా దిగ్గుడుకు దిగ్గుడు. ॥ఏమి॥ 201

నాట

కాదనేటివా రెవ్వరు కడలనుండి
సేదదేరిచి నీవేమి సేసినాను జెల్లును. ॥పల్లవి॥

తక్కక బ్రహ్మాదిదేవతలకు నాయకుఁడవు
మక్కువ శ్రీసతికి మగఁడవు
చక్కనివాఁడవు మరి చంద్రసూర్యనేత్రుఁడవు
వుక్కుమీరి నీవెట్లానుండినా నమరును. ॥ కాద ॥

కామునిఁ గన్నతండ్రివి కడుఁజక్కఁదనమున
అముకొన్నయట్టిచక్రాయుధుఁడవు
కామించి యెందుఁజూచినా గరుడవాహనుఁడవు
వేమరు నీవెటువలె వెలసినా నమరును. ॥ కాద ॥

అందరిలోపల నుండే అంతర్యామివి నీవు
చందమైనపరబ్రహ్మస్వరూపుఁడవు
యెందును శ్రీవేంకటాద్రి నిరవైనవాఁడవు
అంది మమ్ము నేలితేను అన్నిటా నమరును. ॥ కాద ॥ 202

### లలిత

తెగక పరమునకుఁ దెరువులేదు
పగయెల్లా విడువక భవమూఁ బోదు. ॥ పల్లవి ॥

కన్నులయెదుటనున్న కాంచనముపై మమత
వున్నంతదడవు మోక్ష మొనగూడదు
అన్నముతోడిరుచులయలమట గలదాఁకా
పన్నినసుజ్ఞానము పదిలము గాదు. ॥ తెగ ॥

పక్కనున్న కాంతలభ్రమగలకాలము
మిక్కిలి శ్రీహరిభక్తి మెరయలేదు
వెక్కసపుసంసారవిధి నున్నంతదడవు
నిక్కి పరమధర్మము నిలుకడ గాదు. ॥ తెగ ॥

చిత్తములోపలిపలుచింతలు మానినదాఁకా
సత్తుగా వైరాగ్యము సమకూడదు
యిత్తల శ్రీవేంకటేశుఁ దెలినదాసులకైతే
హాత్తి వైకుంఠపదవి అప్పుడే కలదు. ॥తెగ॥ 203

రేకు 236 వరాళి

ఎన్నఁడు వివేకించే దీడేరే దెన్నఁడు
యెన్నిలేవు జీవిపా ట్లేమిచెప్పే దిఁకను. ॥పల్లవి॥

నరజన్మమునఁ బుట్టి నానాభోగాలు మరిగి
హరి నెరఁగక మత్తుఁడై వుండును
సురలోకము చొచ్చి సుకృతఫలములంది
గరిమ విజ్ఞానమార్గము విచారించఁడు. ॥ఎన్నఁ॥

పెక్కుగాలము బ్రతికి పెనుఁగోరికలే కోర
అక్కడ విష్ణుఁ గొల్వక అలసుఁడౌను
మిక్కిలిఁ దపము చేసి మించైనఘనత కెక్కి
తక్కక పరమమైనతత్వము దెలియఁడు. ॥ఎన్నఁ॥

వేవేలుబుద్ధులు నేర్చి వేడుకసంసారియై
శ్రీవేంకటేశుఁ జెందక చింతఁ గుందును
దైవ మాతడే దయదలఁచి మన్నించుఁగాని
భావించి తనంతనైతే భవములఁ బాయఁడు. ॥ఎన్నఁ॥ 204

దేశాళి

నీవొక్కఁడవే యిత్తువు నిన్నుఁ గొల్చినవారికి
శ్రీవల్లభుఁడవు రక్షించవే నారాయణా. ॥పల్లవి॥

పెక్కుజీవులు భువినిఁ బెరిగేరు మోతము
వొక్కరునుఁ దెచ్చి యియ్యనోప రెవ్వరు
అక్కజపుధనరాసు లంగళ్లలో నున్నవి
గక్కనఁ గొనేమంటే మోతము గొనరాదు. ॥నీవొ॥

వున్నవి పుణ్యకర్మాలు వొడ్డి యందే మోతము
మిన్నక యెక్కేమంటే మెట్లు గావు
యెన్నఁగ సంసారధర్మ మిదివో మోతము చూప
చన్నమన్నవారికెల్లా సాధనము గాదు. ॥నీవొ॥

పదునాల్గులోకములు పన్నివున్నవి మోతము
తుదకెక్కించ నవైనాఁ దోడుగావు
యిదివో శ్రీవేంకటేశ యిహాపరము లోనఁగి
హృదయములో నున్నాఁడ వింకనేల చింత. ॥నీవొ॥ 205

ఆహిరి

అక్కటా నీమాయ కగపడె జీవుఁడు
యెక్కువ తక్కువ లివి యేమీఁ దలపోయఁడు. ॥పల్లవి॥

గొందినున్న స్వర్గము గోరి పుణ్యము సేయును
యెందో తనప్రాఁతఫల మెరఁగడు
సందడించి మరునాఁటిచవులకే కూడపెట్టు
పొంది మింగినకళ్ళపులుసర మెంచఁడు. ॥అక్క॥

అప్పటిదేహసమ్బంధపాలికే మనసు పెట్టు
తప్పిపోయినవారలఁ దగులఁడు
కప్పుకొనేకోకలకే కడఁగి చేతులు చాఁచు
చిప్పిలఁ దొల్లి చించివేసిన వెనో్న యెంచఁడు. ॥అక్క॥

యెదిటిగృహారామా లివే తనకాణాచను
చెదరి కలలోనివి చేపట్టఁడు
వెదకు వైకుంఠపువిష్ణుమూర్తిఁ గనేనని
హృదయములో శ్రీవేంకటేశుఁ జూడనెంచఁడు. ॥అక్క॥ 206

దేవగాంధారి

నీవే నన్ను దయఁ గావు నీవు స్వతంత్రుఁడవు
జీవుఁడ నింతే నేను శ్రీమన్నారాయణా. ॥పల్లవి॥

నిను నామనసుఁ గొని నేఁ దలఁచేనంటినా
మనసు ప్రకృతిఁ బుట్టె మరి నిన్నెట్టు దలఁచీ
తనువుఁ గొని నీసేవ తగిలి సేసేనంటినా
తనువు కర్మాధీనము తగిలీనా నిన్నును. ॥నీవే॥

గరిమ నర్థమిచ్చి నీగతి గనేనంటినా
హిరణ్య మజ్ఞానమూల మెట్లు నీకు నియ్యనిచ్చీ
సిరుల వాజన్మము నీసెలవు సేసేనంటినా
సరిఁ బుట్టుగు సంసారసాధ్యము నిన్నంటీనా. ॥నీవే॥

యిలఁ బుణ్యఫలము నీకిచ్చి మెప్పించేనంటినా
ఫలము బంధమూల మేర్పడనియ్యనిచ్చీనా
నిలిచి శ్రీవేంకటేశ నే నీశరణు చొచ్చితి
యెలమి నీకరుణ నన్నెడయనిచ్చీనా. ॥నీవే॥ 207

సామంతం

మాయామయము లివి మాయకు నీ వేలికవు
చాయకుఁ దెచ్చేనంటే స్వతంత్రుఁడ నయ్యేనా. ॥పల్లవి॥

తెగనికోరిక తానే తీఁగెవలె నల్లుకోఁగా
తగదని మానుప నాతరమయ్యీనా
వగలఁ గోపము పామువలె నాలుక చాఁచఁగ
పగటుతోడఁ దొడికి పట్టఁగనేరుతునా. ॥మాయా॥

వయసు తానే మేఘమువలె సోన గురియఁగా
బయించి నే దాని నణఁచఁగ నోపేనా
లయించక లోభము బలఁగవలెఁ బీరుచఁగా
నియమించి మట్టుపెట్ట నేఁడు నాకు వసమా. ॥మాయా॥

యేపున గర్వము దానే యేనుగవలె మీరఁగా
చేపట్టి చిక్కించుకో నాచేత లోనౌనా
యేపొద్దు శ్రీవేంకటేశ యివి వానిస్వభావాలు
కాపాడవే నన్ను నే నెక్కఁడా నీదాసుఁడను. ॥మాయా॥208

శ్రీరాగం

చిత్తగించవే దేవ శ్రీపతి నావిన్నపము
హత్తి నీదాసుఁడనైతి నపరాధా లున్నవా. ॥పల్లవి॥

జగములునడచేటిసహజ మింతేకాక
వెగటు నాచేఁతలు వేరే వున్నవా
జిగిఁ గర్మమిలఁ జేయించేకాఁపురమేకాక
నిగిడి నావల్ల వేరే నేర్పునేరా లున్నవా. ॥చిత్త॥

పంచమహాభూతాలస్వభావము లింతేకాక
అంచెల నాకు వేరే జన్మాదు లున్నవా
కొంచక పనిగొనేటిగుణత్రయ మింతేకాక
వంచివేయ నాకు వేరేపాపపుణ్యా లున్నవా. ॥చిత్త॥

సరిఁ గౌమారయవ్వనజరాలచందాలే కాక
గరిమ నాకు వేరేవికారా లున్నవా
నురవై శ్రీవేంకటేశ యింతా నీకల్పితమే
కరుణించు మీయాత్మ కౌఁగాము లేఁక నున్న వా. ॥చిత్త॥ 209

రేకు 237 ధన్నాసి

ఇది కల్లయనరాదు యిది నిశ్చయింపరాదు
పదిలానఁ గొలువఁగా ప్రత్యక్షమయ్యేవు. ॥పల్లవి॥

యెదలో నుండుదువని యిన్ని వేదాలు చెప్పఁగా
వెదకి ధ్యానము సేతు వెసఁ గనుఁగొంట లేదు
చెదర కందే మరి జీవుఁడు నున్నాఁ డందురు
పదిలముగాఁ జూతు భావించరాదు. ॥ఇది॥

అంతటా నుందువని ప్రహ్లాదుఁడు చెప్పెనఁగా
చింతించి పట్టఁదలఁతు చేతికిఁ జిక్కుట లేదు
సంతతజ్ఞానాన నీసాకారమున్న దందురు
మంతనానఁ బిల్తు నొకమాట వినఁబడదు. ॥ఇది॥

రవిలో నుందువని సురలు నిన్నుఁ గొలువఁగా
తవిలి పూజించేనంటే దగ్గరి వచ్చుట లేదు
యివల శ్రీవేంకటాద్రి నిరవై నీవున్నాఁడవు
తివిరి సేవించితిమి ద్రిష్టమాయ మాకు. ॥ఇది॥ 210

దేసాళి

ఇట్టె జ్ఞానమాత్రమున నెవ్వరైనా ముక్తులే
పుట్టుగులు మరి లేవు పొందుదురు మోక్షము. ॥పల్లవి॥

అతిసూక్ష్మ మీయాత్మ అందులో హరి యున్నాఁడు
కతలే వినుటగాని కానరాదు
తితి దేహాలు ప్రకృతిఁ జెందినవికారములు
మతి నిది దెలియుటే మహితసుజ్ఞానము. ॥ ఇట్టె॥

లోకము శ్రీపతియాజ్ఞలో తత్వా లిరువదినాల్గు
కైకొని సేఁతలు సేసీఁ గర్తలు లేరు
సాకిరింతే జీవుఁడు స్వతంత్రుఁడు దేవుఁడు
యీకొలఁది గని సుఖయించుటే సుజ్ఞానము. ॥ ఇట్టె॥

కాలము దైవముసృష్టి కలి మన్ష్యులభాగ్యము(?)
వాలాయించి యెవ్వరికి వచింపరాదు
యీలీలలు శ్రీవేంకటేశునివి ఆచార్యుఁడు
తాలిమిఁ జెప్పఁగా విని తలఁచుటే సుజ్ఞానము. ॥ ఇట్టె॥ 211

భూపాళం

పరమయోగీశ్వరులపద్ధతి యిది
ధరణిలో వివేకులు దలపోసుకొనుట. ॥ పల్లవి॥

మొదల నాత్మజ్ఞానము దెలిసి పిమ్మట
హృదయములోనిహరి నెరుఁగుట
వుదుటైనయింద్రియాల నొడిసి వంచుకొనుట
గుదిగొన్నతనలో కోరికె లుడుగుట. ॥ పర॥

తనపుణ్యఫలములు దైవము కొసగుట
పనివడి యతనిపై భక్తిచేసుట
తనివితో నిరంతరధ్యానయోగపరుఁడౌట
మనసులోఁ బ్రకృతిసమ్మంధము మరచుట. ॥ పర॥

నడుమ నడుమ విజ్ఞానపుకథలు వినుట
చిదుముడి నాచార్యసేవసేయుట
యెడయక శ్రీవేంకటేశుపై భారము వేసి
కడు వైష్ణవులకృప గలిగి సుఖించుట. ॥పర॥ 212

శుద్ధవసంతం

లేదు దండువల్లఁ దెలివి యెన్నటికిని
నీదయ నాపై నించినఁ గాని. ॥పల్లవి॥

అరయఁగఁ బ్రపంచ మలవడినటువలె
అరుదగువైరాగ్య మలవడదు
తరుణులరతి మతిఁ దలఁచినయటువలె
ధర నీసాకారము దలఁచదు మనసు. ॥లేదు॥

గోనకొన్నయర్థము గోరినయటువలె
కొనయగు మోక్షము గోరదు
తనుభోగములకుఁ దగిలినయటువలె
తనిసి నీకథలకుఁ దనియదు మనసు. ॥లేదు॥

చలమును బాపము చవియైనటువలె
సలలితపుణ్యము చవి గాదు
సులభ శ్రీవేంకటేశుఁడ నీమహిమిది
గలిగితివి నాకుఁ గలఁగదు మనసు. ॥లేదు॥ 213

ముఖారి

పామరుల కెంతైనా ఫలియించనేరదు
శ్రీమాధవ నీవు దయసేసితే నీడేరును. ॥పల్లవి॥

అన్నిటా దైవముఁ దమ్మ నందరు నెరుఁగుదురు
ఎన్నిక భావవర్తన లెరుఁగుదురు
పన్ని జననమరణభయము లెరుఁగుదురు
వన్నెల నెరిఁగెరిఁగి వలలఁ జిక్కుదురు. ॥ పాము ॥

విందురు పురాణాలు విందు రుపదేశాలు
విందురు తొల్లిటివారివిచారాలు
విందురు స్వర్గనరకవిభవము లన్నియును
మందలించి విని విని మాయకు లోనౌదురు. ॥ పాము ॥

నడతు రాచారమున నానాదానాలుఁ జేతురు
విడువక తీర్థయాత్ర వెసఁ జేతురు
యెడయక శ్రీవేంకటేశ నీవుండఁగఁ దప-
మడవులఁ జేసి చేసి అలయుచుండుదురు. ॥ పాము ॥ 214

నాగవరాళి

ఎట్టు వేగించీ జీవుఁ డిన్నిటిలోనా చే—
పట్టిరక్షింతువు గాక పరమేశ్వరా. ॥ పల్లవి ॥

బల్లిదుఁడై వైరాగ్యాన పదార్థము లన్నియును
వొల్లనంటేనే నోరూరించును
వొల్లనే కావలెనని వొడిసి పట్టఁజూచితే—
నల్లంతనుండి యాసల నలయించును. ॥ ఎట్టు ॥

యించుక మొదలువెట్టు యిచ్ఛాద్వేషాలు ముందు
మించు రాఁగా రాఁగా ౧ బెట్టిమీఁదఁ గప్పును
పొంచి యంతలోఁ దెలిసి పొంగణఁగి వుండితేను
వంచిం చొక్క-కారణాన వచ్చి ప్రవేశించును. ॥ ఎట్టు ॥

---

౧. 'బెట్టిమీఁదఁ' పూ. ము. పా. 'మీఁదఁబెట్టి' అని యుంటే సందేహమే గలిగియుండదు.

వేసరి యడవినున్నా వెంటనే సుఖదుఃఖాలు
పాసిపోక కొంత యనుభవింపించును
రోసి పాయలే రెవ్వరు రుమలయ్యో తోఁచు నివి
శ్రీసతీశ కనుఁగొను శ్రీవేంకటేశ్వరా. ॥ఎట్టు॥ 215

రేకు 288 ౧కన్నడగౌళ

ఏమిసేతు నాభాగ్య మిట్లున్నది
నేమమేమీ నెరఁగను నీవే గతి యిఁకను. ॥పల్లవి॥

అగపడి నిరంతర మలవాళైనజగత్తు
మొగమునఁ గట్టినట్టు మొగి మరపనీదు
తగిలి నిన్నెటువలె ధ్యానముసేతు నేను
అగడుసేని సహాయముగాదు మనసు. ॥ఏమి॥

విడువక యెల్లప్పుడూ విడిదలైనదేహము
మెడఁగట్టినట్టున్నది మెలఁగీ నురులదు
వొడయఁడ నీవూడగె మొదిగి నే నెట్టుసేతు
అడరి కప్పిననీమాయాఁ దోడుగాదు. ॥ఏమి॥

వొద్దనే పెక్కుగాలము వూనినపురాకృతము
చద్దిమూఁలై యనుభవించఁగజేసీ మానదు
అద్దుక శ్రీవేంకటేశ అంతర్యామివి నీవు
వొద్దికతో రక్షించు నావోజాఁ దోడుగాదు. ॥ఏమి॥ 216

రామక్రియ

ఏలితె విందరికి యీదేహభూమి నీది
మేలు అన్ని మట్టుపెట్టి మించరాదా జీవుఁడ. ॥పల్లవి॥

---

౧. 'రామక్రియ' పూ. ము. పా.

వెలిఁబడ్డయింద్రియాల వెలయ లోనికిఁ దిప్పి
కొలువులు సేయించుకొనరాదా
కలఁచెడిలోలోని కామాదిశత్రువుల
బెళకనీ కడ్డపెట్టింపించరాదా జీవుఁడ. ॥ పలి ॥

అట్టె పరువుదోలినఆసలనేగుఱ్ఱముల
గట్టిగ లోలాయమునఁ గట్టుకోరాదా
వొట్టి యెదుట పోఁజులై వుండినభోగములను
ముట్టి యంతర్యామి కిచ్చి మొక్కరాదా జీవుఁడ ॥ పలి ॥

పంపువెట్టి దండంపినబలునీవుద్యోగాల—
గుంపు గూర్చి ముక్తి చూరగొనరాదా
ఇంపుల శ్రీవేంకటేశుఁ డితఁడే సర్వకర్త
సొంపుగ భావించి చక్కఁజూడరాదా జీవుఁడ. ॥ పలి ॥ 217

ధన్నాసి

తప్పించుకోరా దిఁక దైవమే గతి
యెప్పుడు నుద్ధరించేవా రెవ్వరును లేరు. ॥ పల్లవి ॥

మలసి దేహానందమే మరిగినయాత్మకు
తొలుత బ్రహ్మానందము దొరకదు
అలవాటై తుద్రభోగాలందుఁ జిక్కినయాత్మకు
బలిమి విరతిఁబొంద బలపడదు. ॥ తప్పి ॥

సర్వదా బ్రహ్మాండములోఁ జరియించేయాత్మకు
నిర్వహించి వెడలఁగ నేరుపు లేదు
వుర్విలోపలిచింత లుడుగనియాత్మకు
నిర్వికారభావము నెలకొనదు. ॥ తప్పి ॥

విరసవర్తనలనే వెలసేటియాత్మకు
పరగఁ ౧ బేదలమీఁది భక్తి పుట్టదు
ధరలో శ్రీవేంకటేశుదాసుఁడుగానియాత్మకు
వెర పేమిటా లేదు వెదకి చూచినను. ॥తప్పి॥ 218

సాళంగనాట

నీవారైనవారికి నీపై భక్తేకాక
భావించనేరక వట్ట్రిభమఁ బడవలెనా. ॥పల్లవి॥

కరుణానిధి నీవు గలిగివుండఁగాను
తిరుమంత్రమే నాకు దిక్కయివుండఁగా
వరుస నాచార్యుఁడు వహించుక వుండఁగాను
పరగఁ దపము చేసి బడలఁగవలెనా. ॥నీవా॥

కమలాక్ష నీముద్రలే కాచుక నాకుండఁగాను
అమరి దాస్యము కాణాచై వుండఁగా
తమితోడ వైష్ణవులు దాపుదండై వుండఁగాను
తెమలి తీర్థాలెల్లా ద్రిష్టించవలెనా. ॥నీవా॥

శ్రీవేంకటేశ్వర నీసేవే గతియై యుండఁగా
ఆవటించి నుతి వుపాయమై వుండఁగా
తావులనే శరణనేధర్మము రక్షించఁగాను
వేవేలు దానాలు చేసి వేఁడుకొనవలెనా. ॥నీవా॥ 219

ముఖారి

పరమాత్మ నిన్ను గొల్చి బ్రదికేము
విరసపుజాలిఁ జిక్కి వెతఁబడనోపము. ॥పల్లవి॥

---

౧. 'బెద్దల' కావచ్చు.

మగఁడు విడిచినా మామ విడువనియట్లు
వగి నామనసు రోసినా లోకులు మానరు
తగిలేరు పొగిలేరు దైన్యమే చూపేరు
మొగమోటలను నేను మోసపోవనోవను. ॥పర॥

పొసఁగ దేవుఁ డిచ్చినా పూజరి వరమీఁడు
విసిగి నే విడిచినా విడువరు లోకులు
కొసరేరు ముసరేరు కోరికదీర్చుమనేరు
వసలేనివనులకు బడల నే నోవను. ॥పర॥

నుడుగులు దప్పినా నోముఫల మిచ్చినట్టు
కడఁగి వేఁడుకొన్నాఁ గానిమ్మనరు లోకులు
తడవేరు తగిలేరు తామే శ్రీవేంకటేశ
బుడిబుడి సంగాతాలఁ బొరల నే నోపను. ॥పర॥ 220

భైరవి

కరుణానిధి నీవే కనుఁగొంచు నున్నాఁడవు
యిరవై వాలో నున్నాఁడ వేది గతి యిఁకను. ॥పల్లవి॥

పేరుచున్నవి నాలోనఁ బెక్కువికారములు
వూరుచున్న వెన్నైనా వూహాలెల్లాను
చేరుచున్న వొక్కొక్కటే సేనాసేనకోరికలు
యీరీతి నున్నాఁడ నాకు నేది గతి యిఁకను. ॥కరు॥

పట్టుచున్నవి నానాప్రకృతులవోజలు
పుట్టుచున్నవి యనేకభోగేచ్ఛలు
చుట్టుకొనుచున్నవి సులభపువేడుకలు
యిట్టివి నానడతలు యేది గతి యిఁకను. ॥కరు॥

సందడింపుచున్నవి సారెకు నామమతలు
ముందువెనకై వున్నవి మోహాలెల్లా
చెంది నీపై భక్తి నేఁడు శ్రీ వేంకటేశ్వర
యెందునూ నీవే కాక యేది గతి యిఁకను. ॥కరు॥ 221

రేకు 239 బౌళి

నీ వొక్కఁడవే సర్వాధారము నిన్నే యెరిఁగిన నన్నియు నెఱుఁగుట
భావించి యింతయుఁ దెలియఁగవలసినబ్రహ్మవేత్తలకు నిది దెరువు. ॥పల్లవి

నీయందె బ్రహ్మయు రుద్రుఁడు నింద్రుఁడు నీయందె దిక్పాలకులు
నీయందె మనువులు వసువులు రుషులు నీయందె విశ్వాఖ్యదేవతలు
నీయందె వురగులు యక్షరాక్షసులు నీయందె గరుఁడగంధర్వులు
నీయందె ౧పితరలు సిద్ధసాధ్యులు నీయందె ద్వాదశాదిత్యులు. ॥నీవొ॥

నీవలననె కిన్నరకింపురుషులు నీవలననె విద్యాధరులు
నీవలననె యచ్చరలు చారణులు నీవలననె నక్షత్రములు
నీవలననె గ్రహములు చంద్రుఁడును నీవలన(నె?) నభోంతరిక్షములు
నీవలననెజలధులు పవమానుఁడు నీవలననెగిరులునుభూమియును.॥నీవొ

నీలోననె నదులును నగ్నియు నీలోననె సచరాచరములును
నీలోననె వేదశాస్త్రముమొదలుగనిఖిలశబ్దమయము
నీలోననె అన్నియు నిన్నర్పించిన నిఖిలతృప్తికరము
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర శ్రీవైష్ణవులకు నిది మతము. ॥నీవొ॥222

మలహరి

దేహముసమ్మంధము యివి దేహికిఁ బనిలేదు
వూహించనేర్చినవారలే వోరుచుకుందురయ్యా. ॥పల్లవి॥

---

౧. 'పితరులు' కావచ్చు.

విడువవు శీతోష్ణంబులు విడువవు సుఖదుఃఖంబులు
వెడ వెడ మరణభయంబులు విడిచినయందాఁకా
వుడుగవు కాంతులు మమతలు నుద్యోగంబులు చింతలు
పొడవగువిరక్తి తనలోఁ బొడమినయందాఁకా. ॥ దేహ ॥

మానదు చిత్తవికారము మానదు దుర్గణదోషము
మానదు భోగములన్నియు మానినయందాఁకా
పోనీదు సేసినదురితము పోనీదు ప్రాఁతఫలంబును
పూనినతనయజ్ఞానము పోయినయందాఁకా. ॥ దేహ ॥

తెగవటు భవబంధంబులు తెగ వెడయనిగర్వంబులు
నిగిడినయీయాత్మజ్ఞానము నీవిచ్చినయందాఁకా
జగదేకవిభుఁడ శ్రీవేంకటేశ్వర సర్వము నీయానతికొలఁదే
తగులుచుండు నివి నిశ్చలముగ నీదాస్యము గలిగినయందాఁకా ॥228॥

దేవగాంధారి

చూడవే గోవింద సోద్యము లిన్నియు
యేడాఁ గర్తవు యిన్నిట నాకు. ॥ పల్లవి ॥

చీరినఁ దునుఁగక చేసినదురితము
నారవలెనే కడు నారటిలీ
కారుకొని తలఁపు కలఁకగుణంబుల
వారక పెనునదివలెఁ బారీని. ॥ చూడ ॥

యెట్టిఁగాఁ గ్రూరత్వ మెప్పుడుఁ గొలిమిలో
కట్టువలెనే కడుఁగాఁగీని
వొట్టియై ప్రకృతి వొరసి వేఁటలో
యిట్టివలెనే యెలయించీని. ॥ చూడ ॥

వీడక నీమూర్తి వెంటవెంటనే
తోడునీడయై తొరలీని
యీడనే శ్రీవేంకటేశ నీమహిమ
వాడనివనములవలెఁ జిగిరించీని. ॥ చూడ ॥ 224

ముఖారి

ఎవ్వరివసము గెల్వ నింతా వీనిమయమే
యివ్వల నీవు గాచితే నేమో కాని. ॥ పల్లవి ॥

వొక్కలోభము వెంచితే వొగి లోకమెల్లాఁ దానే
యెక్కడ చూచినాఁ దానే యీదీపనము
వెక్కసమైనది తానే వేగిలేచి సేసేపని
తక్కక యిన్నిటా నెట్టు తప్పించుకోవచ్చును. ॥ ఎవ్వ ॥

పలుమారు వచ్చీఁ దానే పనిలేనిపరాకు
వళచుకొన్నది తానే వట్టిభీతి
నిలుచుకున్నది తానే నిలువుననే సిగ్గు
మెలుపున నెటువలె మెదలఁగవచ్చును. ॥ ఎవ్వ ॥

కనుగొంటే నెందూఁ దానే కార్పణ్యము దైన్యము
అనిశము మించీఁ దానే యాచకత్వము
నను నేలుకొంటి విదే నమ్మితి శ్రీవేంకటేశ
జనుఁడను యివి నేను సాధించుటెట్టు. ॥ ఎవ్వ ॥ 225

మాళవిగౌళ

ఇంద రెరిఁగినపని కిఁకఁ దప్పించుకోరాదు
పొందుగానివాయలఁ బొరలఁగనేఁటికి. ॥ పల్లవి ॥

గతివై బ్రహ్మాండాలు కల్పించ నేరిచి
సుతులై బ్రహ్మాదులు చూపట్టఁగా
శ్రుతి వేదశాస్త్రాలచేతఁ బొగడించుకొంటా
నితరు లెఱఁగకుండా నింత దాఁగనేఁటికి. ॥ఇంద॥

వున్నతపరమపద మొసఁగ నీవు గర్తవై
అన్నిటా లక్ష్మీనాథుఁడవనఁ బెంపొంది
పన్నుక యిన్నివిద్యలాఁ బ్రసిద్ధుఁడై వుండి
కన్నులకుఁ బ్రత్యక్షము గాకుండనేఁటికి. ॥ఇంద॥

సురల యాపదలెల్లా సులభాననే తీర్చి
పరగ ధర్మములెల్లాఁ బరిపాలించి
పరుషలకు వరాలు పలుమారుఁ గృపచేసి
మరిగి శ్రీవేంకటేశ మాటాడ వదేఁటికి. ॥ఇంద॥ 226

రేకు 240 సామంతం

ధర నీవే తల్లియును దండ్రియునై యుండఁగాను
యిరవుగ నెవ్వరూ వహించుకోనేమిటికి. ॥పల్లవి॥

పుట్టినజీవులు తొల్లి భువిపై ననేకులు
అట్టె వారిచరితలు ననేకములు
వట్టిజాలిఁ దమతమవారలంటాఁ దలఁచుక
బట్టబయలే నానాభావాలఁ బొందుదురు. ॥ధర॥

సరవి నందరుఁ జేసేసంసారములు పెక్కు
సిరులవారిగుణాలు చేష్టలు పెక్కు
అరసి తమవారితో నవి యెల్లాఁ జెప్పుకొంటా
దరినుండే వగరించి తమకింపుచుందురు. ॥ధర॥

వడి నెన్నైనాఁ గలవు వావు తెంచిచూచుకొంటే
గడియించేపదార్థాలు కల వెన్నైనా
యెడయక శ్రీవేంకటేశ నీదయ ౧గలి(గి?)తే
జడియక నీదాసులు సంతసమందుదురు. ॥ధర॥ 227

దేశాక్షి

నారాయణ నీదాసుల నడకలివి
ధారుణి నిదేపనై తగులఁగవలెను. ॥పల్లవి॥

ఆతుమలో హరిమీఁది అందోళమే వలె
చేతికి లోఁగాకుంటేను చింతించవలె
ఆతనిఁ జూచేయందుకు నాసలఁ బొరలవలె
రీతి నివెప్పుడు విచారించుకొనవలెను. ॥నారా॥

నీలవర్ణుకథలకు నివ్వెరగు నొందవలె
ఆలకించి యందు భ్రమయఁగవలెను
తాలిమితో మహిమలు దలపోసుకొనవలె
వేళ వేళ ధ్యానించి వెదకఁగవలెను. ॥నారా॥

చేరి శ్రీవేంకటేశు సేవించుకుండఁగవలె
గారవాన సదా మరుగఁగవలెను
ఆరసి పెద్దల నన్ని నడుగుచుండఁగవలె
నోరునిండా నేపొద్దూ నుతియించవలెను. ॥నారా॥ 228

ముఖారి

జగము లేలేవాఁడవు జనార్దనుఁడవు
తగ నీవారమై(మే?) నేము ధర నెట్టుండినాను. ॥పల్లవి॥

---

౧. 'కలుగు' ధాతువుకు బదులు 'కలు' ధాతువు ఈవాఙ్మయమున పలుతావుల కలదు. ఈనాటికి పామరులనోట కడపజిల్లాలో వినవచ్చు.

గతి నీవు మతి నీవు కాణాచిచోటు నీవు
సతమై యన్నిటికిని సాక్షివి నీవు
చతురత వలసితే జరతుము కొలుతుము
తతి నేము సేసినతప్పులు లోఁగొనవే. ॥ జగ ॥

తల్లియుఁ దండ్రివి నీవు దాత దైవమవు నీవు
యెల్లవారికిఁ బగము నిహము నీవు
మల్లడి నొక్కొకవేళ మఱతుము తలఁతుము
చల్లఁగా మానేరములు సైరించుకొనవే. ॥ జగ ॥

దరి నీవు దాపు నీవు దయామూర్తివి నీవు
పరగ శ్రీవేంకటేశ పతివి నీవు
విరివిగా నేమైనా వేఁడుదుము నుతింతుము
శరణుచొచ్చితి మిఁక క్షమియించుకొనవే. ॥ జగ ॥ 229

పాడి

ఏకాలము నామనే యెరిఁగినదాసులకు
దాకొని శ్రీహరి భక్తిధారణ గలిగితేను. ॥ పల్లవి ॥

తొడుకు మేయఁగరాదు తూర్పెత్తితేఁ బొల్లు వోదు
బడినే శ్రీహరిభక్తి పంట పండితే
వుడివో దేకాలము ౧వొకతతి రావద్దు(?)
చెడని శ్రీహరిభక్తి చెట్టుకట్టితేను. ॥ ఏకా ॥

వలువదీసితేఁ బోదు వాడుకొంటే వెత్తిగాదు
కొలచి శ్రీహరిభక్తి కుప్పచేసితే
యెలుకకుఁ దినరాదు యెన్నాళ్లున్నాఁ జివుకదు
తలఁచి హరిభక్తి చిత్తపుగాదెఁ బెట్టితే. ॥ ఏకా ॥

---

౧. ఒకతతి రావద్దు = పూచుటకో, కాచుటకో ఒక ఋతువే కావలెనను పద్ధతివద్దు అని కావచ్చునేమో.

కలవుకుఁ లోఁగాదు సుంకరవాని కబ్బదు
యెలుకతో హరిభక్తి యిల్లు నిండితే
నెలవై శ్రీవేంకటేశ నీకృపగలవారికి
గుటిగాఁగ హరిభక్తి కూడబెట్టుకొంటేను. ॥ఏకా॥ 280

దేసాళం

విశ్వరూప [1]నీమూర్తి వివేకించలేను నేను
శాశ్వతుఁడ నీవున్నచందమేమీ నెఱఁగ. ॥పల్లవి॥

నిబ్బరమై లోకమెల్లా నిండుక వుండుదువట
దొబ్బుకొంటాఁ దిరిగేము తోవల నిన్ను
వుబ్బి సముద్రమువలెనున్న నీప్రకృతియందు
గబ్బినై యీఁదుచున్నాఁడఁ గలఁగకుమీ. ॥విశ్వ॥

కడయు మొదలులేనికాలము నీతనువట
నడుమ నందుతోనే పెనఁగుచున్నాఁడ
అడరి నీసొమ్ములైనఆత్మలలో నొకఁడనై
చిడుముడి నున్నవాఁడ చిక్కువఱచకుమీ ॥విశ్వ॥

పరమున నిహమునఁ బ్రబలియున్నాఁడవట
గరిమ సోదించేము కమ్మటి నిన్నుఁ
ఇరవై శ్రీవేంకటేశ నిన్నిటా నిన్ను నేము
శరణు చొచ్చితి మిఁక చనవిచ్చి కావుమీ. ॥విశ్వ॥ 281

నాట

కొలిచినవారికిఁ గొమ్మని వరములిచ్చీ
వెలయఁ గలశాపురవీధిహనుమంతుఁడు. ॥పల్లవి॥

---

[1]. ఈ 'నీమూర్తి' పూ. ము. పా. లో తప్పి పోయినది. ఇదిలేకుంటే వాక్యములో కర్మ కుదురదు.

చెట్టుగా నొకచేతఁ జూపెడి తనప్రతాపము
పట్టుకున్నాఁ డొకచేతఁ బండ్లగొల
మెట్టుకొన్నవి రాకాసిమెదడుతోడితలలు
రట్టడి కలశాపురదిట్టహనుమంతుఁడు. ॥కొలి॥

చెచ్చెర వీనుల నాలించేది సురలనుతులు
కొచ్చి కొచ్చి తోఁకఁ జుట్టుకొన్నది నింగి
తచ్చి చూచేది కన్నుల దాసులమీఁదికరుణ
రచ్చ కెక్కెఁ గలశాపురముహనుమంతుఁడు ॥కొలి॥

వసుధ మతిలోనిది స్వామికార్యవిశ్వాసము
వెసఁ దనవశైనది విష్ణుభక్తి
పసగా శ్రీవేంకటేశ బలు నీబంట్లలోన
రసికుఁడు కలశాపురముహనుమంతుఁడు. ॥కొలి॥ 282

రేకు 241 రామక్రియ

రాముఁడు లోకాభిరాముఁడు
ఆముక విజనగరమందు నున్న వాఁడు. ॥పల్లవి॥

చక్కఁదనములవాఁడు జానకీవల్లభుఁడు
గక్కన శబరిపూజ గైకొన్న వాఁడు
వెక్కసమైన పైఁడివిల్లునమ్ముల వాఁడు
రక్కసులవైరి దశరథనందనుండు. ॥రాముఁ॥

శరధిగట్టినవాఁడు ఛాయనల్లనివాఁడు
యిరవై సుగ్రీవాదుల నేలినవాఁడు
సరి భరతశత్రుఘ్నసౌమిత్రిసేవితుఁడు
అరిది మునుల కభయమిచ్చినవాఁడు. ॥రాముఁ॥

అట్టె కౌసల్యాత్మజుఁడు అయోధ్యాపతైనవాఁడు
వొట్టి తారకబ్రహ్మమై వుండేటివాఁడు
గుట్టుతో వరములిచ్చేకోనేటిదండవాఁడు
పట్టపుశ్రీవేంకటాద్రిఁ బరగినవాఁడు. ॥రాముఁ॥ 283

సాళంగనాట

కంటిరా వో జనులాల కరుణానిధి యితఁడు
జంట లక్ష్మీదేవితోడ సరుస నున్నాఁడు. ॥పల్లవి॥

వాఁడివో ప్రతాపసుగ్రీవనరసింహుఁ డట్టె
మూఁడుమూర్తు లోకరూపై ముంచివున్నాఁడు
వేఁడిరక్కసులనెల్ల విదళించివేసినాఁడు
పోఁడిమి సురలఁ గాచీ భువనాధీశుఁడు. ॥కంటి॥

అరవై నరవిచంద్రు లితనికన్ను లివిగో
ధరణి వనంతవేదము లూర్పులు
అరుదై చెలఁగె బ్రహ్మాండ మీతనినెలవు
నిరతి సనకాదులు నిత్యసేవకులు. ॥కంటి॥

ఘనమైనశంఖుచక్రములతో మెరసీని
మనిపె ప్రహ్లాదుని మన్నించె నిదె
యెనలేనిశ్రీవేంకటేశుఁడై వున్నవాఁడు
అనిశము సకలాంతరాత్మ తానైనాఁడు. ॥కంటి॥ 284

ముఖారి

ఉవిదలాల చూడరే వుద్దగిరికృష్ణుఁడు
నవకపుసెలవుల నవ్వుచున్నాఁడు. ॥పల్లవి॥

అచ్చపుబాలుఁడై శకటాసురు మర్దించినాఁడు
కుచ్చి కాఁగిళ్ల నింతులఁగూడినాఁడు
మచ్చిక ౧ దోఁగెడుతాను మద్దులు విరిచినాఁడు
పిచ్చిలఁ బూతకిచన్ను పీరిచినాఁడు. ॥ ఉవి ॥

పిన్న నాఁడే కోడెలతోఁ బెనఁగి గెలిచినాఁడు
యెన్నికగా వేలఁ గొండ యెత్తినాఁడు
వెన్నడిని కొండపాము వెస రెండు సేసినాఁడు
పన్ని కంసునిమదము ఖండించినాఁడు. ॥ ఉవి ॥

పొంచి పెద్దవాఁడై భూభారము దించినాఁడు
అంచెఁ బాండవులకు దిక్కైనవాఁడు
మించి శ్రీవేంకటగిరిమీఁద నిదె వున్నవాఁడు
వంచించక దాసులకు వరాలిచ్చేవాఁడు ॥ ఉవి ॥ 285

ఆహిరినాట

అరుదరు దీగతి యహోబలేశ్వర
పొరిఁబొరి దాసులు పొగడుట యెట్టు. ॥ పల్లవి ॥

యెదుటఁ జించితివి హిరణ్యకశిపుని
అదె ప్రహ్లాదుఁడు బంటగుటెట్లు
కదిసినరుద్రునిగర్వ మడఁచితివి
గుదిగొనిదివిజులు కొలుచుట యెట్టు. ॥ అరు ॥

ఘనసింహాకృతి నైకొనివుంటివి
యెనయఁగఁ గరిఁ గాచినదెట్లు
పనివడి కంబమువగుల వెడలితివి
మనుజులు పూజించి మరుగుట యెట్లు ॥ అరు ॥

---

౧. 'దొంగెడు' రేకు. "తొంగు తోఁగు" ధాతువులు ఈ వాఙ్మయమున నున్నట్లే, 'దోఁగు దొంగు' ధాతువులుకూడ ఉండవచ్చు.

సరవితో వీరరసమున మించితివి
అరయఁగ శృంగారి వౌటెట్టు
సిరి వుర మెక్కను శ్రీవేంకటాద్రిని
యిరవుగ నీతోడ యెక్కుట యెట్టు. ॥ అరు ॥ 286

దేసాళం

నిండు కంతటా నున్నది నీమాయ
వొండొకరు జనులకు నుపదేశించ నేలా. ॥ పల్లవి ॥

నేరకుంటే సంసారను నేరుపును నీమాయ
చేరకుంటే గడులోనుచేసుకొను నీమాయ
వూర కొడఁబడకుంటే వొడఁబరచు నీమాయ
పోరి బిడ్డలకు తండ్రి బుద్ధి చెప్పవలెనా. ॥ నిండు ॥

నాలికె కారురుచులు నలిఁ దెలుపు నీమాయ
బేలుఁడై విరక్తుఁడై భిక్షమెత్తించు నీమాయ
పాలుమాలేమంకునైనా పనిసేయించు నీమాయ
రేలుఁబగ శ్లోకరు ప్రేరేఁపుచుండవలెనా. ॥ నిండు ॥

చొక్కించి నోరుఁ జేతికి సూటి చూపు నీమాయ
పెక్కులాగుల నన్నిటాఁ బెనగించు నీమాయ
వెక్కనవలమేల్మంగవిభుఁడ శ్రీవేంకటేశ
తక్కక నీమహిమిది తలపించవలెనా. ॥ నిండు ॥ 287

లలిత

మనుజు లూరకే తాము మరఁగులంటా నుందురు
యెనసి దేవుఁడు సేసే నిందరికి మాయ. ॥ పల్లవి ॥

విని కందరి కొక్కటే వివరములే వేరు
కనుచూపులు నొక్కటే కాంతులే వేరు
మనసూ నొక్కటే లోనిమర్మములే వేరు
తనివియు నొక్కటే తనువులే వేరు. ॥ మను ॥

లోకమును నొక్కటే లోనువెలుపల వేరు
వాకు లొక్కటే భాషలవరుసే వేరు
జోక నాహార మొక్కటే సారిది రుచులే వేరు
కైకొన్నరతి యొక్కటే కందువలే వేరు. ॥ మను ॥

పరిమళ మొక్కటే భాగించుకొనుటే వేరు
యిరవైన దొక్కటే యింపులే వేరు
అరిది శ్రీవేంకటేశ అన్నిటా నీదాసుఁడు(ల?)
శరణాగతి యొక్కటే జాతులే వేరు. ॥ మను ॥ 288

రేకు 242 సాళంగనాట

శరణని బ్రదుకరో జనులాల
గరిమ మెరసె నిదె కనకసంహము. ॥ పల్లవి ॥

అహారహమునుఁ బ్రహ్లాదుఁడు దొరకొని
బహువిధముల హరిమహిమలు వొగడఁగ
కహకహ హిరణ్యకసిపుఁడు నగి హరి
సహజ మేదియని చలశెఁ గంభము. ॥ శర ॥

అటమరి పెటపెటమని బేంట్లెగసి
చిటచిటరవములఁ జిరుతపొగ లెగసి
తటతట మనుచును తరలి బ్రయ్యాలై
పటపమనుచును పగిలెఁ గంభము. ॥ శర ॥

బెడిదపుచూపులమిడుఁగురు లెగయఁగ
పుడమి యదర నూర్పులు చెలఁగ
గడగడ వడఁకి దిక్తటము లల్లాడఁగ
వెడలెఁ గంభమున విజయసింహము. ॥శర॥

నగవుల సుడివడె నభోంతరంబులు
పొగ లెగసెను పెనుబొమముళ్ళ
పగటునార్పులను పగిలెనుఁ గొండలు
వెగటుగ వెడలెను వీరసింహము. ॥శర॥

తెఱచిననోరఁ బ్రతిధ్వను లెసగఁగ
కఱకుగతుల చుక్కలు చెదర
నెఱిహుంకృతులను నిఖిలము బెదరఁగ
వెఱచఱవఁ గెరలె విమలసింహము. ॥శర॥

పటువిహారముల బ్రహ్మాండ మగల
గుటగుటరవళి నాకులు వొగడ
నిటలనేత్రమున నెఱమంట లడర
పటుగతి మెరసెను భయదసింహము. ॥శర॥

పెదపెదకోఱల పిడుగులు రాలఁగ
తుదనఖముల నెత్తురు దొరుగ
గుదిగొనుకసరుల కులగిరు లూఁటాడ
వుదయించె నదివో వుగ్రసింహము. ॥శర॥

అట్టహాసమున నసురలు వారఁగ
ముట్టి వాయువులు మొగతిరుగ
దట్టములై జలధరములు ముసరఁగ
దిట్టయై వెడలె ధీరసింహము. ॥శర॥

జలధులు గలఁగెను జడిసె లోకములు
తలఁకె సప్తపాతాళములు
పులికిపడఁదొడఁగె నూర్ధ్వలోకములు
కొలువున నిలిచెను ఘోరసింహము. ॥శర॥

అచ్చట హిరణ్యా నదరంటఁబట్టి
యిచ్చలఁ దొడపై నిడి చించి
కుచ్చి వానిపేగులు జంద్యములుగ
విచ్చి వేసుకొనె విష్ణుసింహము. ॥శర॥

పొగడిరి దివిజులు భువనములు వెలసె
పగయుడిగి చెలఁగెఁ బ్రహ్లాదుఁడు
మిగులశాంతమున మించె శ్రీవేంకట-
నగమున నహోబలనారసింహము. ॥శర॥ 239

బౌళ

దేవా నీవే యిన్నిచందముల తిరముగ మహోపకారి వై తివి
యేవలనైనా నీవేకాక భువి నింతటివారలు యిఁకఁ గలరా. ॥పల్లవి॥

జనులకు నీవే వాక్యోకచోటను శాస్త్రార్థములై కడఁగుదువు
తనియక నీవే మరి వారికి బోధకులఁ గొందరినిఁ గల్పింతువు
మనసులో నంతలో వొడఁబడికె చేసి మలయుచు నీవే నిలుతువు
కనుఁగొన నీవే సుజ్ఞానమార్గము ౧కై వసముగాఁ దెలుపుదువు. ॥దేవా

కడఁగి యప్పటి నీవే యజ్ఞాదికర్మఫలములై వుండుదువు
తడయక నీవే తిరుపతుల దేవతామూర్తులై పొడచూపుదువు
యెడయక నీవే తపోమహిమలై యెదుటనే తార్కాణ లౌదువు
వొడలై నీవే యిహపరములకును వొడిగట్టి సాధింపింతువు. ॥దేవా॥

౧. 'కైవశము' రేకు.

ఆవేళ నీవే తత్వనిర్ణయము నాధారముసై యేర్పరతువు
నీవే కమ్మటి ఆచారవిధులకు నియమములెల్లా నేర్పుదువు
భావింప నీవే అలమేల్మంగకుఁ బతివై శ్రీవేంకటేశ రక్షింతువు
జీవుల కంతర్యామివై నీవే శిష్టుఁ బరిపాలింతువు. ॥ దేవా॥ 240

ధన్నాసి

విచారించుకోరో యిది వివేకులాల మెందు-
వచారాలు చూచి మీరు భ్రమయకురో. ॥ పల్లవి ॥

భావింప వారదునికి బ్రహ్మపట్ట మరుదా
వేవేలైనాఁ గొంచెమని విడిచెఁగాక
దేవతలు తన్నుఁ జూచి దిగ్గన లేచి మొక్కేటి-
ఆవైభవపుపద మందెఁగాక. ॥ విచా ॥

మిక్కిలి జ్ఞానము గల్గి మించి తమనేరుపెల్లా
చిక్కు సంసారముపాలు సేయవలెనా
యెక్కువ హరిదాసుఁడై యిట్లానే వైకుంఠ-
మెక్కేడితోవ సాధించే దిది మేలుగాక. ॥ విచా ॥

మూలమని నుడిగితే ముంచి యెవ్వఁడు గాచెను
పోలించ నెవ్వనినాభిఁ బుట్టె లోకాలు
చాలి యెవ్వనికుక్షి నీజగము లున్నవి మరి
కాలమందే ఆదేవునిఁ గానవలెఁగాక. ॥ విచా ॥

యిదియే శ్రీవైష్ణవులు యిలఁ బూర్వాచార్యులు
వెదకి చదివి కన్నవివరమెల్లా
తుదమొద లెరఁగనిదుష్టులకతలు మాని
వదిలమై యిట్టే నమ్మి బ్రదుకుటగాక. ॥ విచా ॥

సంకుఁజక్రములు మా (నూ?)ని సమానభోగముతోడ
అంకెల శ్రీవేంకటేశునండ నుండరో
పొంకపుబుద్ధు లిమ్మని పొంచి గాయత్రి జపించి
ఇంక బ్రహ్మవేత్త లెంచే దిందుకే కాక. ॥ విచా ॥ 241

రేకు 248 శంకరాభరణం

కలిగినమీఁదాఁ గడమేలా
పలులంపటములఁ బడుటే కాక. ॥ పల్లవి ॥

దురిత మణఁగె నిటు తుదకెక్కె సుఖము
హరి యొక్కఁడె గతియన్నపుడే
పోరి నీఁకఁ జేసెటిపుణ్యములెల్లా
వరుసతోడ నెవ్వరికో కాని. ॥ కలి ॥

సార మెరిఁగె తనజన్మము గెలిచెను
శ్రీరమణునిఁ దలఁచినయపుడే
సైరణతో నీఁకఁ జదివేటిచదువు
మేరమీఁద నేమిటికో కాని. ॥ కలి ॥

శ్రీవేంకటపతి చిత్తాన నిలిచెను
కావించి గురువిఁ గన్నపుడే
భావించి యితరప్రార్థన లన్నియు
యీవలావలను యెందుకో కాని. ॥ కలి ॥ 242

వసంతవరాళి

వట్టిస్వతంత్ర మిందు లేదు వావాద మిందు లేదు
గుట్టు దెలియక లోలో గునిసేరు వీరివో. ॥ పల్లవి ॥

నేరిచి బ్రదుకువారు నేరక వీఁగేటివారు
యేరీతిఁ జూచినాను యెవ్వరు లేరు
తీరుగాఁ దమలో నుండేదేవుఁడు పెరరేఁచఁగా
మేరతోనే జీవులెల్లా మెరసేరు వీరివో. ॥వట్టి॥

కొందరు గొప్పజీవులు కొందరు చిన్నజీవులు
యెందుఁ జూచినా భూమి నెవ్వరు లేరు
అందులే వేరు వేరుగాఁ బుట్టించె దేవుఁడే
అందాలు సేయఁగ లోకు లమరేరు వీరివో. ॥వట్టి॥

అసురకాణాచివారు అమరకాణాచివారు
యెసఁగ విచారించుకో నెవ్వరు లేరు
వెస శ్రీవేంకటేశుఁడు వినోదించినయట్లు
వసుధమీఁదటఁ గానవచ్చేరు వీరివో. ॥వట్టి॥ 243

కన్నడగౌళ

సరవులు దెలియఁగఁ జనుఁగాకా
పరమార్థములో భంగము గలదా. ॥పల్లవి॥

హరి స్వతంత్రుఁడట హరిసంకల్పము
విరసంబౌనా విశ్వమున
సరవిఁ బ్రపంచపుసకలమతంబులు
వరుస నెంచఁ గొదువలు మఱికలవా. ॥సర॥

యితఁడు పూర్ణుఁడట యితనివిహారము
వెతకఁగవలెనా వేమరును
కతకరచినయీకన్ను లెదిటివే
మతిఁ దోఁచీ నిఁక మఱఁగులు గలవా. ॥సర॥

అంతరాత్మయట ఆతని వేరే
చింతించవలెనా సిలుగులను
చెంతనే యిదివో శ్రీవేంకటేశుఁడు
యెంతదెలిసినా యితరము గలదా ॥ సర ॥ 244

దేసాళం

అచ్యుతుకృపాలబ్ధ మతియుఁగాక
మచ్చిక నాతఁడు నేసేమతకముగాక. ॥ పల్లవి ॥

నానాపాట్లఁ బడె నాఁడు కరి మకరిచే
హీనదెస ప్రహ్లాదుఁడు హిరణ్యుచేఁ బాటువడె
పానిపట్టి హరి యది పరిహరించని వాఁడా
ఆనుక హరిదాసుల కంకటనే భంగమా. ॥ అచ్యు ॥

తగిలి భీష్ముఁడు శరతల్పమందు నుండఁడా
అగడై విభీషణుఁడు అన్నచేఁ దన్నువడఁడా
వగపాడే చూచుచుండ భాగవతులను ౧ హరి(?)
తగినపుణ్యుల నిందు తప్పు లెంచవచ్చునా. ॥ అచ్యు ॥

మంతనాన నారదుఁడు మాయలకుఁ లోనుగాఁడా
చెంతల నర్జునునకు చేతులు దెగిపడవా
ఇంతలో శ్రీవేంకటేశుఁ డిట్టె వీని మన్నించఁడా
ఇంతటిమహానుభావు లిందుకు ఇడుతురా. ॥ అచ్యు ॥ 245

దేసాళి

పుట్టుగు నీయాధీనమే భోగము నీయాధీనమే
అట్టె యీభావనకు నరుదయ్యీ నాకు. ॥ పల్లవి ॥

---

౧. ఈ 'హరి' సంబోధనమా?

కాననట్టుండి వచ్చు నీకల్పితసుఖదుఃఖాలు
మేను మోచి మీయాజ్ఞ మీరవచ్చునా
నానాజీవులు వడేనాలిఘోరములు చూచి
దీనికెంత వగతువో దేవ నీచిత్తానను. ॥ పుట్టు ॥

తొట్టినపాపపుణ్యాలు తొల్లె నీపంపులే
పుట్టినమీమాయలెల్లాఁ బోదొబ్బేమా
వొట్టుకొన్నజీవులు వొరలుచుండఁగఁ జూచి
యెట్టు నీవోరిచేవో యీవేదన కిపుడు. ॥ పుట్టు ॥

చెచ్చెర యీజన్మములు శ్రీవేంకటేశ్వర నీవే
యిచ్చినవి నీతోడ నెదురాడేమా
నిచ్చలు మావంటివారినేరుపునేరాలు చూచి
వచ్చి నే శరణనఁగా వహించుకోవలనె. ॥ పుట్టు ॥ 246

దేవగాంధారి

అంతటిదైవము వటుగాఁగా
చెంత నిన్నుఁ గూర్చినదే ఘనము. ॥ పల్లవి ॥

వెరవునఁ బంచమవేదసారములు
సిరుల నినునుతించిననుతులు
సరవితోడి బహుశాస్త్రసంతతులు
నిరతిఁ జెప్పెడిని నీకథలు. ॥ అంత ॥

కొంగుపైఁడియగుగురుమంత్రంబులు
సంగడి వైష్ణవసంభాషలు
నింగికి భూమికి నిజపురాణములు
సంగతిగల నీసంకీర్తనలు. ॥ అంత ॥

పూనినవిధుల మహోపనిషత్తులు
నానాగతి నీనామములు
పీనులకును శ్రీవేంకటేశ మీ—
జ్ఞానార్థములు మిముఁజదువుచదువులు. ॥ అంత ॥ 247

రేకు 244 భైరవి

ఏపాటిగలవాఁడ నిదివో నేను
నాపాటు చూచి హరి నన్నుఁ గావఁగదవే. ॥ పల్లవి ॥

౧నిలువు నూరు వండీని(?)నిచ్చలు నీదేహమైతే
వొలిసీ దుఃఖములకు నోరువ లేదు
కులము గోటిసేసును గుంపుల జన్మాదులైతే
అలరి వోరులఁబోయి అడిగేదే యెపుడు. ॥ ఏపా ॥

వట్టితే పసిఁడి రాలీ బచ్చనసంసారము
గుట్టుదెలియఁ బ్రాణము కూటిచేతిది
వుట్టిపడీ మానుషము వొకనాటి కొకనాఁడు
పట్టికాంతలయెదుట భంగపడే మిదివో. ॥ ఏపా ॥

చేరి చెట్టడిచితేను చేటఁడు చుట్టరికాలు
యీరీతి నివ్వాళ్లదాఁకా నెందుండిరో
ఆరిచితే మూరెఁడెక్కెనదే నామకీర్తనము
కూరిమి శ్రీవేంకటేశ కొననాలికెకును. ॥ ఏపా ॥ 248

వరాళి

దైవమా నీచేతిదే మాధర్మపుణ్యాము
పూవువంటికడులేఁతబుద్ధివారము. ॥ పల్లవి ॥

---

౧. 'నిలువు నూరువండీని' మనిషిపొడవే నూరువిధములపంటలు పండుతుంది అని యర్థమా?

యేమిటివారము నేము యిదివో మాకర్మ మెంత
భూమి నీవు పుట్టించఁగఁ బుట్టితిమి
నేమముతో నడచేటనేరుపేది మావల్ల
దీముతో మోచిన తోలుదేహులము. ॥దైవ॥

యెక్కడ మాకిఁక గతి యెరిఁగే దెన్నఁడు నేము
చిక్కినట్టినీచేతిలో జీవులము
తక్కక నీమాయలెల్లఁ దాఁటఁగలమా మేము
మొక్కలపుటజ్ఞానపుముగ్ధలము. ॥దైవ॥

యేది తుద మొదలు మాకిఁక నిందులో నీవే
ఆదిమూర్తి నీకు శరణాగతులము
యీదెస శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నీదయ గలుగఁగాను నీ వారము. ॥దైవ॥ 249

బౌళి

శరణు నేఁ జొచ్చినది సరి నీవు మన్నించేది
యిరవై నగురుతుగా కిందుఁ గూడ పెట్టేవా. ॥పల్లవి॥

యెంగిలినోరు వెట్టుక యేమాటలాడినాను
సంగతిగా నవి నేఁడు సత్యమయ్యీనా
అంగనలమోహము నాయంతరంగానఁ బెట్టుక
ముంగిటిఆచారాలు ముఖ్యమయ్యీనా. ॥శర॥

ఆసలు మెడఁగట్టుక అన్నియుఁ జదివినాను
దోసములెల్లా మాని దొరనయ్యీనా
రోసాలు మదిఁ బెట్టుక రోఁత మేను గడిగితే
వేసాలయ్యీ తోఁచుఁగాక వేరేపుణ్య మున్నదా. ॥శర॥

ఘనసంసారము మోచి కర్మ మెంత సేసినాను
తను దా జన్మించినట్టితప్పు దీరినా
యెనలేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
తనిసితి నిఁక నేను తమకించేనా. ॥ తర ॥ 250

సాళంగనాట

ఇంక నేల నాకు వెర పింతమాట గలిగియు
సంకెలెల్లఁ బాసె నాస్వతంత్రము లొక్కటే. ॥ పల్లవి ॥

నే నెంతపాపబుద్ధినై నేర మెంత సేసినాను
కానీలే వన్నె లేవాఁడు కావఁగలఁడు
ఆనతిచ్చెఁ దొల్లె యాతఁ డదె చరమార్థమందు
మేనిదోసమెల్లఁ బాపి మే లొసఁగేననుచు. ॥ ఇంక ॥

మట్టు లే కతని నెంతమరచి నే వుండినాను
పుట్టించినదేవుఁడే ప్రోవఁగలఁడు
గుట్టు చూపె తొల్లె తనగుణము పాండవులందు
గట్టిగాఁ దనవారై తే కాచుకుందు ననుచు. ॥ ఇంక ॥

తప్ప నే నడచినాను తగిలి శ్రీవేంకటేశుఁ—
డొప్పులు సేసి రక్షింప నొద్దఁగలఁడు
చెప్పనేల గోపికలు సేసినదోసాలు దొల్లి
కప్పుక పుణ్యాలు సేసె ఘనుఁడఁ దాననుచు. ॥ ఇంక ॥ 251

భూపాళం

నిత్యానందులము నిర్మలుల మిదే నేము
సత్యముగ మమ్మాతఁడు సరిఁ బుట్టించఁగను. ॥ పల్లవి ॥

యెక్కడవోయి వెదకే మిటమీఁద దైవమును
వొక్కట నంతర్యామై వున్నాఁడదె
ఇక్కడ నాతనిగుణా లెన్నేసి చదివే మిఁక
పక్కన తనదాసులభక్తికి సులభుఁడు. ॥ నిత్యా ॥

యేమేమి వేఁడుకొనేము యిటమీఁద నాతని
నామములు నాలికపై నటించీనదే
నేమమున నింకా నెట్టు నిచ్చలు భుజించేమో
కామించి సంసారపుకైంకర్య మాతనిదే. ॥ నిత్యా ॥

ధ్యాన మేమని సేసేము తలఁచినందెల్లాను
పూని శ్రీవేంకటేశుఁడే వుండఁగాను
నానాఁట నిఁక నేమి నమ్మికతి మనేదేమి
పేని మమ్ముఁ దనకుతుఁ బెట్టి పెంచఁగాను. ॥ నిత్యా ॥ 252

మాళవిగౌళ

ఏమని చెప్పఁగవచ్చు నీసంతోషపుసుద్ది
నామము శ్రీకృష్ణుఁడట నారాయణునికి. ॥ పల్లవి ॥

జనని దేవకిదేవి జనకుఁడు వసుదేవుఁ—
డనఘుఁడై నయట్టిఆదిమూర్తికి
ఘనలోకరక్షణ కంసుమామగండమును
తనకుఁ గారణమట దైవశిఖామణికి. ॥ ఏమ ॥

పుట్టినది మధుర పెంపుడుఁజోటు రేపల్లె
వొట్టినమాయలపురుషోత్తమునికి
పట్టినపాండవపక్షపాతము కౌరవవైర—
మిట్టె వ్రాఁతఫలమట యీశ్వరేశ్వరునికి. ॥ ఏమ ॥

గోవులఁ గాచేదియు గొల్లెతలఁ బొందేదియు
ఆవేళ గుణము యీయచ్యుతునికి
శ్రావణబహుళాష్టమి చంద్రోదయము రోహిణి
కావింప జన్మమిదివో శ్రీవేంకటపతికి. ॥ పము ॥ 253

రేకు 245 గుజ్జరి

వెనుబల మైననుఁ గావఁగ వేరీ విష్ణుఁ డొకఁడే కాక
అనుమానములన్నియు నుడిగితిని అలసితి నిఁక నేను ॥ పల్లవి ॥

పట్టినచలము మానదు ప్రకృతి స్వతంత్రమున
పెట్టెడి మాయలనే కమ్మర పెట్టదు వివేకము
పుట్టితి నిన్నాళ్లాయను పొదలితి ౧ బుద్దెరిఁగి
దిట్టనై అదికాదని తోసేటిదీమసమూ లేదు. ॥ వెను ॥

తగిలెడిఅనుబంధము మానదు తలఁపును నొకవంక
తెగనియ్యదు కర్మము లేమిటిని తెగించుఁ బుణ్యముల
నగుచునే ముదిమికి లోనైతి నానాఁటికి నేను
మగటిమి నే దాని నణఁచను మరిగెడిదేకాని. ॥ వెను ॥

చేసినఅలవాటు మానఁడు జీవుఁడు తనగుణము
వేసరదు అనుభవించుటకు వేసరు ముక్తికిని
దాసునిఁగా శ్రీవేంకటేశుఁడు దయఁజూచెను నను నీవేళ
మోసములన్నియును దీరెను మునుపు వెనక యేదో. ॥ వెను ॥ 254

సామంతం

హరియే యెరుఁగును అందరిబ్రతుకులు
యిరవై యీతని యెరుఁగుటే మేలు. ॥ పల్లవి ॥

---

౧. 'బెద్దెరిఁగి' పూ. ము. పా.

వెనకటిబ్రహ్మలు వేవేలసంఖ్యలు
యెనసి బ్రహ్మాండము లేలిరట
పెనగొని వారలపేరులు మరచిరి
మనుజకీటముల మరెవ్వఁ డెరుఁగు. ॥ హరి ॥

ఆసఁ దొల్లి మును లనంతకోట్లు
చేసిరి తపములు సేనలుగా
యేసిరు లందిరి యెరఁగ రెవ్వరును
వేసపునరులకు విధి యేదో. ॥ హరి ॥

కల వనేకములు కర్మమార్గములు
పలుదేవత లిటు పాటించిరి
బలిమి శ్రీవేంకటపతికి మొరఁగఁడి
తెలిసిరి తుద నిదే వెర విందరికి. ॥ హరి ॥ 265

పాడి

వారివారిసహజపువరుస లివి
కారణము తొల్లే హరికల్పితమిది. ॥ పల్లవి ॥

వేరే విరుద్ధము లేదు వివేకించిచూచితేను
కూరుఁడై వుండిన మహాసుజ్ఞానికి
యేరీతిఁ జూచినాను యేకసమ్మతి లేదు
సారము దెలియరానిసంసారికి. ॥ వారి ॥

సకలభావములును చక్కనయ్యేతోఁచివుండు
ప్రకటించి నేరచినప్రౌఢలకును
అకటా జగడములే అన్నిటా వెంటనేవచ్చు
వికలులై నమూఢవిచారులకు. ॥ వారి ॥

సేయఁగలకర్మమెల్లా సేసి తొల్లె ఫలించెను
దాయిదండగల వారిదాసులకును
రాయడిఁ బుణ్యపాపాలు రారాఁపులై యుండు
యేయెడ శ్రీవేంకటేశు నెరఁగనివారికి. ॥వారి॥ 256

బౌళి

కమ్మరను జీవునికిని ఇది కారణ మేమియు లేదట
ఇమ్ముల రాజూ నెరఁగని ౧వెట్టెట యెవ్వరికెక్కును నారాయణా.
॥ పల్లవి ॥

యిలలో జీవునివిషయభోగమున నెందునుఁ బోరయనివాఁడవట
చలమా యేల పుట్టించితి వీసంసారవారిధిని
కలకాలము నీగర్భగోళమునఁ గాఁపురముండఁగ నిటు చేసి
ఫల మేమిగట్టుకొంటివి భావము దెలుపవే నారాయణా. ॥కమ్మ॥

నడపెడి యీజగము లన్నియును నటనలు నీవట తొలుతనే
యెడయక యుండే వినోదించెదవు యెడ్డతనంబా నీ కేమి
జడియక నీవే సేసినచేఁతలు సర్వమును నిలుపఁగవలదా
కడుగఁగ నేఁటికి నెంగిలిబూరెట౨కడవేయనేల(?)నారాయణా. ॥కమ్మ॥

పరగినయీకర్మమార్గములు బంధహేతువని చెప్పితివి
యిరవుగను వేదమార్గములు నేలా కాచుక తిరిగెదవు
గరిమల శ్రీవేంకటేశ్వర యిచ్ఛాకల్పితములు యిన్నియు నీకు
సరి నెరిగించితి విఁకనీచిత్తము సర్వేశ్వర వోనారాయణా. ।కమ్మ।257

పాడి

శిష్టరక్షణమును దుష్టనిగ్రహమును
౩సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాఁడు. ॥ పల్లవి ॥

---

౧. వెట్టి+అట=వెట్టెట. ౨. కడవేయుట=పారవేయుట ౩. 'సృష్టించ' రేకు.

హార కృష్ణావతార మందినయంతలోనే
పరమమునులకెల్ల భయముడిగెను
తెరలి దైత్యులగుండె దిగులువొొచ్చె నత్తరి
సిరులమించినయట్టి శ్రీజయంతినాఁడు. ॥ శిష్ట ॥

గోవిందుఁడు వసుదేవుకొొడుకై నయప్పుడే
గోవులు రంకెలువేసె గొొల్లపల్లెను
నోవితోఁడఁ గంసునికి నూరునిండెఁ జూడఁగానె
చేవలుమీరినయట్టి శ్రీజయంతినాఁడు. ॥ శిష్ట ॥

నారాయణుఁడు భువి నరుఁడు దాఁ గాఁగానే
మేరఁ బాండవు తెచ్చిరి మేనవావిని
కౌరవులపని దీరె కమ్మి శ్రీవేంకటేశుఁడు
చేరువనే మెరయఁగ శ్రీజయంతినాఁడు. ॥ శిష్ట ॥ 258

సామంతం

ఇంతకంటె ఘన మిఁక లేదు
సంతతసౌఖ్యము జనార్దనుఁడే. ॥ పల్లవి ॥

భయనివారణము పరమాత్మునినుతి
జయకారణ మీశ్వరచింత
అయుతపుణ్యఫల మచ్యుతునిసేవ
క్రియతో నిజ మెరిఁగినవారికిని. ॥ ఇంత ॥

కర్మహరము శ్రీకాంతుదరిశనము
ధర్మరాసి మాధవుశరణు
అర్మిలిసంపద లనంతునితగులు
నిర్మలముగఁ బూనినదాసులకు. ॥ ఇంత ॥

ఆగమోక్త మీహరికైంకర్యము
భోగము విష్ణునిపూజ యిది
యోగము శ్రీవేంకటోత్తమునికొలువు
బాగులు నేర్చినప్రపన్నులకును. ॥ ఇంత ॥ 259

రేకు 246 దేసాళి

ఎటువంటివెఱ్ఱినో యేమని విన్నవింతును
ఘటనలు నావంటా గర్వింతునయ్యా. ॥ పల్లవి ॥

తలఁచేతలఁపు నీది తనువు నీ విచ్చినది
నిలిచినజగమెల్లా నీమయము
వలవంత నే నిందులో వట్టియహంకారినై
తెలియక నేనేయంటాఁ దిరిగేనయ్యా. ॥ ఎటు ॥

సేసేచేఁత నీయాజ్ఞ చిత్తమెల్లా నీయిచ్చ
రాసులకర్మములు నీరపము లివి
ఆసపడి నే నిందులో అన్నియు నావనుచును
పోసరించి మాయలలోఁ బొరలెదనయ్యా. ॥ ఎటు ॥

ఇహము నీవినోదమే యెన్నఁ బరము నీసొమ్మే
సహజము నీకు మాలోచైతన్యాలు
మహిలో శ్రీవేంకటేశ మరి నీదాసుఁడనై తి
బహుభక్తి నీమీఁదఁ బచరించేనయ్యా. ॥ ఎటు ॥ 260

లలిత

ఇందరు నెఱుఁగుదు రీయర్థమే భువి
కందువఁ దగులుట కర్మముకొలఁది. ॥ పల్లవి ॥

ఆదికి ననాది హరిదాస్యం బిది
వేదాంతంబుల వెలసినది
సోదించి కనిరి శుకనారదాదులు
పాదుగ నిందఁ దమభాగ్యముకొలఁది. ॥ ఇంద ॥

అతిరహస్య మిది అచ్యుతుపై భక్తి
ప్రతిలేనిపరమపావనము
చతురులై తెలిసిరి సనకాదిమునులు
తతి దొరకుట సుకృతఫలముకొలఁది. ॥ ఇంద ॥

పరము శ్రీవేంకటపతిసంకీర్తన
సొరిది గురుఁ డొసఁగుసూత్మ మిది
చిరపుణ్యులు మును చేకొన్ననిజ మిది
మరిగి మనుట తమమనసులకొలఁది. ॥ ఇంద ॥ 261

## హిందోళవసంతం

ఎన్నికై శ్రీ వేంకటేశుఁ డితడు గలుగఁగానె
అన్నిటా నందరిలోనిఅజ్ఞానాలుఁ బాసెను. ॥ పల్లవి ॥

సకలశాస్త్రములందు సందేహమే కాని
వొకరు దైవమహిమ కొడఁబడరు
అకటా బాసచేసినయందుకైనా నమ్మరు
వికలచిత్తులెల్లాను విష్ణుదాస్యమునకు. ॥ ఎన్ని ॥

గక్కనఁ గర్మము చేసి కడునలయుటే కాని
వొక్కమాటు హరిఁ బాద నొడఁబడరు
తక్కక పెద్దలుగాఁగ తలవణఁకుటే కాని
పుక్కటికాండ్లు హరిఁ బూజించనేరరు. ॥ ఎన్ని ॥

చిత్తములో వివేకించి చింతఁ బొరలుటే కాని
వొత్తి హరిపై భార మొప్పగించరు
హత్తిన శ్రీవేంకటేశుఁ డటు దయదలఁచఁగా
మత్తిలి ప్రపన్నులెల్లా మరేమిటాఁ దప్పరు. ॥ఎన్ని॥ 262

దేసాళం

వానివానిసహజము వద్దనసేల
యీనేటిప్రపంచ మది యేమిసేయఁగలదు. ॥ పల్లవి ॥

హరి పుట్టించినయట్టిఆయాప్రకృతులను
విరసాలఁ దిప్పేమంటే వేరొకటౌనా
పరమజ్ఞాన మొక్కటే పాటించితేఁ జాలు
యెరవుల పుణ్యాపాపా లేమిసేయఁగలవు. ॥ వాని ॥

బలువుగ విష్ణుమాయఁ బ్రబలేసంసారమును
చలమున దిద్దఁబోతేఁ జక్కనౌనా
తెలివితో హరిభక్తి తెగక వుండితేఁజాలు
యిలపైఁ బంచేంద్రియము లేమిసేయఁగలవు. ॥ వాని ॥

శ్రీవేంకటేశుఁ డాత్మఁ జేకొని వుండినది
భావించకున్న నాతఁడు బడివాసీనా
సావధానాన నితని శరణనుకొంటేఁజాలు
యేవిధులు భవములు నేమి సేయఁగలవు. ॥ వాని ॥ 263

రామక్రియ

నారాయణుఁడే సర్వనాయకుఁడు
వేరేదురాశలు వెదకఁ బోటేదయ్యా. ॥ పల్లవి ॥

ఆకస మొకపాదము అట్టె భూమొకపాదము
పైకొని యొకపాదము పాతాళము
యేకమైనాఁ డేడనున్నాఁ డిందులో వారే జీవులు
ఆకడఁ బరులఁగొల్చేమనఁబోలేదయ్యా. ॥ నారా ॥

కడుపులో జగములు కాయ మిన్నిటాధారము
యెడగలచోటనెల్లా యీతనిమాయే
కడుఁబోరా దీతఁడే కారణ మందరికి
తడవి మరుపాయాలఁ దగులఁబోలేదయ్యా. ॥ నారా ॥

౧ చేతన్య మీతనిది సృష్టి యీతనిఘటన
ఆతుమ శ్రీవేంకటేశుఁ డంతర్యామి
రాతిరిఁబగలుఁ దానే రక్షకుఁడు మనలకు
పోతరించి ఇఁక మెచ్చి పొగడఁబోట్లేదయ్యా. ॥ నారా ॥ 264

## ఆహిరి

ఇంక నాదైన్యము చూచి యెట్టు రక్షించేవో కాని
సంకెదీరఁ బులిసితి సర్వేశ్వరా. ॥ పల్లవి ॥

తపమునేసి నీమాయ దాఁటేననుచుఁ బెనఁగి
అపుడే యలసితిని అదివో నేను
కృపఁ జూచి నీవింక గెలిపించే దెట్టోకాని
వుపమల సరివోరి వోడితి నే వానికి. ॥ ఇంక ॥

పంచేంద్రియములను పారఁదోలేనని చూచి
వంచఁగ సత్వలేక వసమైతిని
అంచె ౨ నాపాటు చూచి నీవడ్డమౌటెప్పుడోకాని
దించని వీరములాడి దిగితి నే వానికి. ॥ ఇంక ॥

---

౧. 'చైతన్య' కావచ్చు. ౨. 'అంచనాపాటు' పూ. ము. పా.

మోహాంధకారముపై మొనచూపేనని పోయి
సాహసములేక నే జడిసితిని
వూహల శ్రీవేంకటేశ వున్నతి నన్నేలితివి
బాహుబలమున తుదిపదమయితి వానికి ॥ ఇంక ॥ 265

రేకు 247 దేసాళి

నీదాసులభంగములు నీవు చూతురా
యేదని చూచేవు నీకు నెచ్చరించవలెనా. ॥ పల్లవి ॥

పాలసముద్రముమీఁదఁ బవ్వళించినట్టి నీకు
బేలలై సురలు మొరవెట్టినయట్టు
వేళతో మామనవులు విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మమ్మిట్టే రక్షించరాదా. ॥ నీదా ॥

ద్వారకానగరములో తగ నెత్తమాడేనీకు
కీరాన ద్రౌపది మొరవెట్టినయట్టు
ఘోరపురాజసభలఁ గుంది విన్నవించితిమి
యేరీతి పరాకు నీకు నిఁక రక్షించరాదా. ॥ నీదా ॥

యెనసి వైకుంఠములో నిందిరఁగూడున్ననీకు
పెనఁగి గజము మొరవెట్టినయటు
చనవుతో మాకోరికె సారె విన్నవించితిమి
విని శ్రీవేంకటేశుఁడ వేగ రక్షించరాదా. ॥ నీదా ॥ 266

సామంతం

దాసవర్గములకెల్లా దరిదాపు మీరె కాన
వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును. ॥ పల్లవి ॥

సేనాధిపతి నీవు చేరి విన్నవించరాదా
శ్రీనాథునికి నేము సేసేవిన్నపము
అనుక భాష్యకారులు అట్టె మీరుఁ జేయరాదా
మానక విన్నపము మామనవిచనవులు. ॥ దాస ॥

వేయినోళ్లభోగి నీవు విన్నపము సేయరాదా
వేయేసిమావిన్నపాలు విష్ణునికిని
ఆయితమై గరుడఁడ అట్టె మీరుఁ జేయరాదా
యేయెడ విన్నపము మా కేమివలసినాను. ॥ దాస ॥

దేవులమ్మ యిందిర మాకై విన్నవించరాదా
శ్రీవేంకటపతికి చిత్తమందను
ఆవేళ శేషాచలమ అట్టె మీరుఁ జేయరాదా
యీవేళ మావిన్నపము లిదేరె నీఁకను. ॥ దాస ॥ 267

లలిత

ఒక్కఁడే యీజీవుఁడు వొడలు మోపనినాఁడు
యెక్కడి కెక్కడిమాయ యేమిగట్టుకొనెనో. ॥ పల్లవి ॥

పొంచి గర్భమున మాసు పొదిగి వుండిననాఁడు
యెంచుకొని ముచ్చటాడ నెవ్వరున్నారు
అంచలఁ ౧ బరఁదు(?)కొవేయట్టిసంసారమిదియు
అంచుమోచి తానెందు అణఁగుండెనో. ॥ ఒక్కఁ ॥

నిచ్చ నిచ్చ రాతిరులు నిద్దురవో యేవేళ
యిచ్చలఁ దాఁ జేసేపను లేమున్నవి
కచ్చుపెట్టి తనమేనఁ గాచుకున్నకర్మములు
యెచ్చుకుందుల నాచోట నెందు వోయనో. ॥ ఒక్కఁ ॥

---

౧. 'పరఁగు' కావచ్చు.

బుద్దెరఁగక బాలుఁడై పొత్తులలోనున్నపుడు
కొద్దిలేక తా నెవ్వరి గురుతెరుఁగు
అద్దుక శ్రీవేంకటేశుఁ డంతర్యామై వుండి
తిద్దుకరాఁగానే కాక తెలివెందు నున్నదో. ॥ ఒక్క ॥ 268

కన్నడగౌళ

ఈయపరాధములు సహించవయ్యా
పాయక మమ్మురక్షించేపని నీదే కాదా. ॥ పల్లవి ॥

అకడ నీకడ మాలో నంతర్యామివి నీవు
నీకుఁ జేసేవిన్నపాలు నీవెరఁగవా
పైకొని వోరువలేక పదరితి మింతేకాక
రాకపోక నీవు మమ్ము రక్షించకుండేవా. ॥ ఈయ ॥

అట్టు కెక్కి దాసుల మఱవక రక్షించేనీవు
గుట్టుతో మమ్ము వహించుకొనకుండేవా
పట్టలేక వేగిరించి పైపై దూరితిమిగాక
ఇట్టె మా కిసిరులు నీ విచ్చినవే యెపుడు. ॥ ఈయ ॥

యిదె శ్రీవేంకటేశ మమ్మేలినవాఁడవు నీవు
వదలకుండ నీవు నావాఁడవే కావా
అదన మన్నించఁగానే అసఁ జే చాఁచితిఁగాక
చెదరక నాఁడే నాకుఁ జేతిలోనివాఁడవు. ॥ ఈయ ॥ 269

నారాయణి

౧ ఇందాఁకా వచ్చెఁ జేఁతలు యిఁకనో బుద్ధి
యెందుకు నీవే కర్తవు యిఁకనో బుద్ధి. ॥ పల్లవి ॥

---

౧. ఈపాటలో పూర్వముద్రితపాఠమున 'ఓబుద్ధి' అని సంబోధనాంతముగ విరువబడినది. కాని 'యిఁకనో బుద్ధి' = ఇంక మీఁద బుద్ధి(వచ్చెను)అను నర్థముగా తోఁచుచున్నది.

పుట్టితి నీయాజ్ఞను భుజించితిఁ గర్మమెల్లా
ఇట్టె జీవుఁడ నాకు నిఁకనో బుద్ధి
కట్టుకొంటి సంసారము కలిగెఁ బంచేంద్రియాలు
యెట్టనెదటిపనుల కిఁకనో బుద్ధి ॥ఇందాఁ॥

వున్నాఁడ నీమాయలోనె వొట్టుకొంటి ఆసలెల్లా
యెన్నికె యీప్రాణికి నిఁకనో బుద్ధి
పన్నుకొంటి సంపదలు ౧పంచభూతాల లోనైతి
యిన్నిటా నీపంపుననే యిఁకనో బుద్ధి. ॥ఇందాఁ॥

భూమిపై నన్నేలితివి భోగములకు గురైతి
యేమనేవు యీదేహ కిఁకనో బుద్ధి
శ్రీమంతుఁడ విన్నిటాను శ్రీవేంకటేశ్వర నీవు
యీమహిమలెల్లా నీవే యిఁకనో బుద్ధి, ॥ఇందాఁ॥ 270

పాడి

ఈతఁడు బలువుఁడౌట కివియే సాక్షి
యీతఁడు బ్రహ్మమౌట కీతఁడే సాక్షి. ॥పల్లవి॥

అమరుల మొరాలించి అసురబాధలు మాన్పె
అమరుల కెక్కుడౌట కదియే సాక్షి
అమృతము పంచిపెట్టి యాదిలక్ష్మిఁ గైకొనె
అమృతమథనమే అన్నిటికి సాక్షి ॥ఈతఁ

యిందరుండే బ్రహ్మాండాలు యిదె కుక్షి నించుకొనె
యిందరి కెక్కుడగుట కిదియే సాక్షి
కందువ వరములిచ్చు కడ నెన్నఁడు తెడవు
కందువ పురాణాలలో కథలే సాక్షి. ॥ఈతఁ॥

---

౧. 'పంచభూతాలకు' కావచ్చు.

ఆదిబ్రహ్మఁ బుట్టించె మత్తానుమీఁదఁ దుదఁ దేలె
ఆదినంత్య మీతఁడౌట కదివో సాక్షి
పాదుగా శ్రీవేంకటాద్రిపై మహిమ వెదచల్లె
పాదుకొన్న యీతనిశ్రీపాదములే సాక్షి. ॥ఈతఁ॥ 271

రేకు 248 ధన్నాసి

అంతరాత్మ నీయాధీన మింతయు
చింతలు సిలుగులు జీవులకెల్లా. ॥పల్లవి॥

చిత్తంబని యెడిసింహాసన మది
వుత్తమపురుష నీవుండెడిది
హత్తి యింద్రియము లందుఁ బ్రధానులు
ప్రత్తెకరాజ్యము ప్రకృతియుఁ గలిగె. ॥అంత॥

కన్నులుఁ జెవులును ఘ్రాణము నాలికె
వన్నె మేను నీవాహములు
పన్నినకోర్కులు భండారంబులు
సన్నుతి సంసారసంపద గలిగె. ॥అంత॥

పుట్టినపుట్టుగు భోగపుకోటారు
పట్టము కర్మానుబంధంబు
గట్టిగ శ్రీవేంకటపతి వేలిక—
విట్టినీమహిమ లిన్నిటఁ గలిగె. ॥అంత॥ 272

ముఖారి

మొదలెతెలియవలె మోసపోక మానవలె
పదిలపుయోగికైనా బ్రహ్మకైనాను. ॥పల్లవి॥

అలుగులపైఁ బడితే నాయాలు దాఁకకుండునా
కలికిసతులచూపు కాఁడకుండునా
యిలఁ ౧దోఁడుదొక్కితేను యెండించకుండునా(?)
చెలులయిండ్లకుఁ బోతే చిక్కించకుండురా. ॥ మొద ॥

చిచ్చు గాఁగిలించుకొంటే చిమిడించకుండునా
గచ్చుఁబరస్త్రీలపొందు కాఁచకుండునా
తచ్చి విషముమింగితే తలకెక్కకుండునా
పచ్చిసతులవలపు భ్రమయించకుండునా. ॥ మొద ॥

తెగి సముద్రము చొచ్చితే లోఁబడకుండునా
మొగి నింతులమాటలు ముంచకుండునా
తగు శ్రీవేంకటేశ్వరుదాసుఁడై గెలిచితేనే
పగటున నివి యెల్లాఁ ౨బంపుసేయకుండునా. ॥ మొద ॥278

నాట

వీది వీది వాఁడే వాఁడే వీఁడే వీఁడే చెలఁగీని
ఆదిదేవుఁడు శ్రీవేంకటాద్రిమీఁదటను. ॥ పల్లవి ॥

గరుడధ్వజంబదె ఘనవిష్ణురథమదె
సరి శంఖచక్రములు ౩శార్ఙ్గమునదె
హరి యందుమీఁదటను ఆయిత్తమై యున్నాఁడదె
అరులనెల్ల గెలిచి అమరులఁ గావను. ॥ వీది ॥

౧. చేతబడికి తోడుబోతు అని వ్యవహారముగలదు. ఆ తోడుబోతు చేసి నాలుగు వీథులు కలిసేచోట నిమ్మకాయలు, అక్షతలు, బొగ్గులు, వెంట్రుకలచుట్టవగైరా తీసివేసినవదార్థములు పారబోయుదురు. దాని నెవరైన తొక్కితే వారెండిపోవుచుందురు. వారికి ఏవైద్యమూ కుదురదు. దీవినే తోడుశబ్దముతో వాడినాడా?

౨. 'బంపుసేయకుండును' కావచ్చు ౩. "శార్ఙ్గ" రేకు పూ. ము. పా.

సారథి యల్ల వాఁడె చాలి రణభేరి యదె
ఆరయ నిరుమేలా బ్రహ్మాదులు వారే
పేరుకొన్న వేదములబిరుదుపద్యము లవె
శ్రీరమణుఁడు మెరసె చిక్కులు వాపఁగను. ॥వీది॥

ఆటలుఁ బాటలు నవె అచ్చరలేమలు వారె
చాటువ నలమేల్మంగసంగడి నదె
యీటులేని శ్రీవేంకటేశుఁ డేఁగీ నల్లవాఁడె
కోటానఁగోటిదాసులకోరిక లీడేర్చను. ॥వీది॥ 274

భైరవి

జీవుఁడ నేనొకఁడను సృష్టికిఁ గర్తవు నీవు
యీవల ధర్మపుణ్యము లివివో నీచేతివి. ॥పల్లవి॥

పుట్టినయట్టిదోషాలు పురుషోత్తమా నీవు
పట్టి తెంచివేయక పాయనేరవు
గట్టిగా సంసారములోఁ గలిగినలంపటాలు
ముట్టి నీవల్ల నేకాని మోయరావు. ॥జీవుఁ॥

పంచభూతవికారాలు పరమాత్ముఁడా నీవే
కొంచక నీయాజ్ఞఁగాని కొద్ది నుండవు
అంచెల జగములోనిఆయాసవాజములు
వంచుక నీవల్లఁగాని వైపుగావు. ॥జీవుఁ॥

చిత్తములో విజ్ఞానము శ్రీవేంకటేశ నీవె
హత్తించి చూపినఁగాని యంకెకురాదు
సత్తుగా నిన్నిటికి నీశరణుచొచ్చితి మిదె
నిత్తెముఁ గావఁ బ్రోవ నీయిచ్చే యిఁకను. ॥జీవుఁ॥ 275

లలిత

వెఱవకు మనసా విష్ణునియభయము
నెఱవుగ నెదుటనె నిలిచినది. ॥ పల్లవి ॥

(శ్రీ)పతికరుణే జీవరాసులకు
దాపును దండై తగిలినది
పైపై దేవునిబలుసంకల్పమే
చేపట్టి రక్షించఁ దెలఁగేది. ॥ వెఱ ॥

నలినోదరునిజనామాంకితమే
యిలపై దాసుల నేలేది
కలిభంజనుశంఖచక్రలాంఛన —
మలవడి శుభముల నందించేది ॥ వెఱ ॥

(శ్రీ)వేంకటపతిపేసినచేఁతలే
వేవేలువిధుల వెలసేది
భావిఁపఁ డీతఁడు పూఁచినమహిమలే
కైవశమై మముఁ గాచేవి. ॥ వెఱ ॥ 276

బౌళి

కనియుఁ గానరు నీమహిమ కౌరవకంసజరాసంధాదులు
మనుజులు దనుజులఁ జంపిరనఁగ విని మరి నీశరణము చొరవలదా. ॥పల్లవి

పుక్కిటనే లోకములు చూపితి పూతకిచ న్నటు దాగితివి
పక్కనవనే బండి దన్ని విరిచితివి బాలులుసేసేటిపను లివియా
అక్కరతో తృణావర్తు నణఁచితివి అఁటోతులకి టణఁచితివి
చిక్కించి యనలము చేత మింగితి శిశువులుసేసేటిపను లివియా, ॥కని॥

తొడిఁబడ మద్దులు భువిపైఁ గూలఁగదొబ్బి యఘాసురుఁ జంపితివి
బడినే గోవర్ధనగిరి యెత్తితి పడుచులు సేసేటిపను లివియా
అడరి బ్రహ్మమాయకుఁ బ్రతిమాయలు అట్టే గడించి నిలిచితివి
పిడికిట చాణూరు నేనుగఁ గొట్టితి పిన్నలు సేసేటిపను లివియా. ॥కని॥

కాళింగునిమద మణఁచి దివ్యగా కడగడలకుఁ బోఁదోఁచితివి
గోలవై యజ్ఞఫలము లిచ్చితివి ౧గోవాళ్లు సేసేటిపను లివియా
యీలీల శ్రీవేంకటాద్రిమీఁదనే యిందరికిని పొడచూపితివి
బేలుదనంబుల నెంచిచూడ పసిబిడ్డలు సేసేటిపను లివియా. ॥కని॥ 277

రేకు 249 దేవగాంధారి

ఎదుటనే వున్నవి యిన్నియును
యిది కైవసమగు టెన్నఁడో కాని. ॥పల్లవి॥

ఆకస మొకటే అలభూ మొకటే
లోకములు పెక్కు లోలోనే
శ్రీకాంతుఁ డదివో చిత్తములోననె
యేకచిత్త మగు టెన్నఁడో కాని. ॥ఎదు॥

యిరవగుకాలం బెప్పటిసహజమె
అరుదగుదినములు అనంతము
పరమాత్ముఁడు లోపల వెలుపల నిదె
యెరవుమాని చేరు టెన్నఁడో కాని. ॥ఎదు॥

భావించఁగ నొకబ్రహ్మాండంబే
జీవరాసులే నేనలివే
శ్రీవేంకటేశుఁడు సృష్టించినవాఁడు
యీవిధిఁ గని మను టెన్నఁడో కాని. ॥ఎదు॥ 278

---

౧. 'గోవాళ్లు' శబ్దము అమాయకుడు, పసివాడు అనునర్థములో ప్రయోగించినట్టున్నది.

ముఖారి

సులభపుమార్గములు చుట్టిరానే వుండఁగాను
బలుప్రయాసపుకర్మబద్ధులైరి జీవులు. ॥పల్లవి॥

శ్రీపతిభక్తియనేటిచింతామణి వుండఁగాను
యేపున మోసపొయ్యేరు యేలో జీవులు
చేపట్టి నామాంకితపుసిద్ధరసము గలిగి
కోపుల నుడిగి పనిగొనరేలో జీవులు. ॥సుల॥

అక్కడనే శరణాగతనేవోడ వుండఁగాను
యెక్కి భవవార్ధి దాఁటరేలో జీవులు
తక్కక దాస్యమనేటిధనము దమకుండఁగా
లెక్కించి కూడపెట్టుకోలేరు యేలో జీవులు. ॥సుల॥

అదె శ్రీవేంకటేశుఁ డంతరాత్మై వుండఁగాను
పట్టి కొలువరేలో పైపై జీవులు
పట్టపుహరిదాసులు ప్రత్యక్షమై వుండఁగాను
యిట్టె వారికృప చేరుకొన్నఁడో యీజీవులు. ॥సుల॥ 279

శంకరాభరణం

ఆడరో పాడరో ఆనందించరో
వేడుక మొక్కరో విజ్ఞానులు. ॥పల్లవి॥

హరి రక్షకుఁడై యందరి కుండఁగ
పరగఁగ బదికేరు బ్రహ్మాదులు
గరిమ నతఁడే చక్రము చేఁబట్టఁగ
సురిగి పారి రదెం చూడుఁడు సురలు. ॥ఆడ॥

---

౧. 'చూఁడు దసురలు' కావచ్చు

పదిలపువిష్ణుఁడె ప్రాణమై యుండఁగ
యిదివో మెలఁగేరు యీజీవులు
మొదలను యితఁడే మూలమై యుండఁగ
పొదలె నీతనివంపున లోకములు. ॥ అడ ॥

శ్రీ వేంకటాద్రిని శ్రీపతి యుండఁగ
తావుల నిలిచెను ధర్మములు
యీవల నితఁడే యిచ్చేటివరముల
పావనులై రిదే ప్రపన్నులు. ॥ అడ ॥ 280

మాళవి

అందరికి సులభుఁడై అంతరాత్మ యున్నవాఁడు
యిందునే శేషగిరిని యిరవై విష్ణుఁడు. ॥ పల్లవి ॥

యోగీశ్వరులమతినుండేటిదేవుఁడు శీత—
సాగరశాయియైనసర్వేశుఁడు
భాగవతాధీనుఁడైనపరమపురుషుఁడు
ఆగమోక్తవిధులందు నలరిననిత్యుఁడు. ॥ అంద ॥

వైకుంఠమందునున్న వనజనాభుఁడు పర—
మాకారమందునున్న ఆదిమూరితి
ఆకడఁగసూర్యకోట్లందునున్నపరంజ్యోతి
దాకొన బ్రహ్మాండాలుధరించినబ్రహ్మము. ॥ అంద ॥

నిండువిశ్వరూపమై నిలిచినమాధవుఁడు
దండివేదాంతములు వెదకే ధనము
పండినకర్మఫలము పాలికివచ్చినరాసి
అండనే శ్రీ వేంకటేశుఁడైనలోకబంధుఁడు. ॥ అంద ॥ 281

౧. 'సూరియ' రేకు

సాళంగనాట

నమో నమో దానవవినాశచక్రమా
సమరవిజయమైనసర్వేశుచక్రమా. ॥పల్లవి॥

అట్టె పదారుభుజాల నమరినచక్రమా
పట్టినఆయుధముల బలుచక్రమా
నెట్టన మూఁడుగన్నుల నిలిచినచక్రమా
అట్టుగా మన్నించవే మెఱయుచు చక్రమా. ॥నమో॥

అరయ నారుగోణాల నమరినచక్రమా
ధారలు వేయిటితోడితగుచక్రమా
అరక మీఁదికివెళ్లేంఅగ్నిశిఖలచక్రమా
గారవాన నీదాసులఁ గావవే చక్రమా. ॥నమో॥

రవిచంద్రకోటితేజరాసియైనచక్రమా
దివిజసేవితమైనదివ్యచక్రమా
తవిలి శ్రీవేంకటేశుదక్షిణకరచక్రమా
యివల నీదాసులము యేలుకోవే చక్రమా. ॥నమో॥ 282

వరాళి

హరి హరి నాబదుకు ఆశ్చర్యమాయ నాకు
శరణంటి నిన్నిటికి సెలవుగా నీకును. ॥పల్లవి॥

వున్నతి జలధిఁగలవుప్పెల్లాఁ దింటిఁగాని
యెన్నిక సుజ్ఞానమింతా నేఱఁగనైతి
దిన్నగా భూమి వేరుగ దేహముఎత్తితిఁగాని
పన్నిన నాభోగకాంతఁ బాయఁగలేనైతిని. ॥హరి॥

---

౧. 'అజ్ఞి' రేకు.

నాలికఁ బేలితిఁ గాని నానాభాషలెల్లా
తాలిమి హరినామము దడవనై తి
నాలిసంసారము బ్రహ్మనాఁటనుండిఁ జేసేఁగాని
మేలిమి మోక్షముతోవ మెలఁగఁగనై తిని. ॥హరి॥

వూరకే దినదినాలయుగాలు దొబ్బితిఁగాని
నేరిచి వివేకము నిలుపనై తి
మేరతో శ్రీవేంకటేశ మీరే దయఁజూడఁగాను
దారదప్పి కిట్టె మీదాసుఁడ నైతిని. ॥హరి॥ 283

రేకు 250 సామవరాళి

దైవమా నీవెలితేది తమవెలితేకాని
౧జీవుల(లు?)పట్టినకొల్ల చేతిలోనే వున్నది. ॥పల్లవి॥

నిండినవి జగముల నీనామము లనంతము—
లండఁ దలఁచేవారిభాగ్యమే కాని
పండియున్న దిదె దేవభక్తి యెందు చూచినాను
దండితోడఁ బనిగొనే తమనేర్పేకాని. ॥దైవ॥

మనసులలో నున్నది మరి నీపైజ్ఞానము
వొనరఁ దెలిసేవారివోపికేకాని
ఘనమైనమున్నిటినీకథలెల్లా నున్నవి
విననేరిచినవారివివేకమే కాని. ॥దైవ॥

శ్రీవేంకటేశ మీముద్ర చెల్లుబడై వున్నది
వేవేగ ధరించేవారివేడుకే కాని
తావుకొని చేరువ నీదాస్య మిట్టే వున్నది
భావించి నమ్మేటివారిపని యింతేకాని. ॥దైవ॥ 284

౧. 'జీవులయొక్కపట్టినకొల్ల' అను విగ్రహవాక్యముతో సమాసము కావచ్చు.

దేవగాంధారి

ఎన్నఁడొకో బుద్దెరిఁగి యీడేరేది జంతువులు
యిన్నిటా నీమహిమలు యెదిరించి వున్నవి. ॥పల్లవి॥

కావించి నీపాదతీర్థగంగ ప్రవాహమైనది
పావనులై యిందరిని బ్రదుకుమని
లావుగా నీప్రసాదతులసి నారువోశున్నది
వేవేలు పాతకాలెల్ల విదలిఁచుమనుచు. ॥ఎన్నఁ॥

చెంతల నీమూర్తులు శిలాశాసనాలైనవి
పంతముతోఁ గొలిచిట్టె బ్రదుకుమని
బంతినే నీనామములు ప్రతిధ్వనులై వున్నవి
దొంతులై నభవములతుద గనుమనుచు. ॥ఎన్నఁ॥

అందరికి నీసేవలు హస్తగతాలై వున్నవి
బందెదీర నీకు మొక్కి బ్రదుకుమని
అందపు శ్రీవేంకటేశ అంతరాత్మవై వున్నాఁడ—
వెందు చూచిన విజ్ఞాన మింద కొండో యనుచు. ॥ఎన్నఁ॥ 285

బౌళి

మమ్ముఁ జూడ నేమున్నది మావంక నీకేలాభము
కమ్మక దయదలఁచి కరుణింతుగాక. ॥పల్లవి॥

శ్రీకాంతుఁడ నీపాదసేవకులయినవారు
పాకశాసనాదులును బ్రహ్మాదులు
పైకొని నరుఁడ నేను బంటఁగాఁగ నెంతవాఁడ
కైకొని నీపుణ్యానకుఁ గాచుటింతేకాక. ॥మమ్ముఁ॥

నారాయణుఁడ నిన్ను నమ్మినట్టిదాసులు
నారదాదిసనకసనందనాదులు
వీరిలో నే నెంతవాఁడ వికటపుజీవుఁడను
యీరీతి నీమూఁకఁ గూడ నేలుటింతే కాక. ॥ మమ్ము ॥

శ్రీవేంకటేశ నీపై చేరి భక్తిసేసేవారు
కావించి యనంతముఖ్యగరుడాదులు
దేవ నేనొక్కనీచుఁడ దీనరక్షకుఁడవు నీ—
వీవిధ మెంచక మమ్ము నీడేరింతుగాక. ॥ మమ్ము ॥ 286

దేసాళం

కాదన్న వారికి వారికర్మమే సాక్షి
యేదెస చూచిన మాకు నీతఁడే సాక్షి. ॥ పల్లవి ॥

వేదాలు సత్యమౌటకు విష్ణుఁడు మత్స్యరూపమై
ఆదటఁ దెచ్చి నిలిపె నదె సాక్షి
ఆదిఁ గర్మములు సత్యమౌటకు బ్రహ్మయఁగాన
పోదితో నీతఁడు యజ్ఞభోక్తౌటే సాక్షి. ॥ కాద ॥

అదె బ్రహ్మము సాకారమౌటకు పురుషసూక్త—
మెదుట విశ్వరూపము యిది సాక్షి
మొదలనుండి ప్రపంచమును తథ్యమగుటకు
౧పొదిగొన్న యాగములే భువిలో సాక్షి. ॥ కాద ॥

తెరసి జీవేశ్వరులభేదము గలుగుటకు
పొరి బ్రహ్మాదులవారిపూజలే సాక్షి
యిరవై దాస్యాన మోక్షమిచ్చు నీతఁడనుటకు
వరమిచ్చే శ్రీవేంకటేశ్వరుఁడే సాక్షి. ॥ కాద ॥ 287

౧. అన్నమయ్య వడగలవారనుటకు సాక్షి.

దేసాళి

దాఁటలేను యీమాయ దైవమా నేను
నీటునఁ జేసేవాఁడవు నీవె నీవెకా. ॥పల్లవి॥

యీమురికిదేహమేకా యెంతగాలమైన నేను
వోముకొంటా భువిమీఁద నుండఁగోరేది
దోమటినింద్రియాలేకా తోడునీడయై నన్ను
వేమరు భోగించఁజేసి వెనుబలమైనవి. ॥దాఁట॥

పొంచిన నాకర్మమేకా పుట్టించి పుట్టించి
పంచల సంసారముపాలు సేసేది
అంచెల నీచిత్తమేకా ఆసలాసలనుఁ దిప్పి
చంచుల నా కేపొద్దు చనవరియయ్యేది. ॥దాఁట॥

చుట్టుకొన్న సంపదేకా సూటియైననాఁటికి
జట్టిగొని లోలోనే చవిసేసేది
అట్టె శ్రీవేంకటేశ అంతరంగాన నీవెకా
పట్టుఁగొమ్మవై యుండఁగ బదికేది నేను. ॥దాఁట॥ 288

శంకరాభరణం

ఇతరము లేదిఁక నెంచి చూచితేఁ
బ్రతివచ్చు నితఁడు ప్రత్యక్షమై. ॥పల్లవి॥

సకలలోకములు చర్చించి వెదకిన
వొకఁడేపో పురుషోత్తముఁడు
ప్రకటము బహురూపములయి నాతఁడు
అకుటిలమహిమలయనంతుఁడే. ॥ఇత॥

పర్వినజీవుల భావించిచూచిన
సర్వాంతరాత్ముఁడు సర్వేశుఁడే
పుర్విని వెలుపల నుండినయాతఁడు
నిర్వహించె నీనీరజాతుఁడే. ॥ఇత॥

చన్నకాలమున మన్నకాలమున
నున్నవాఁడు యీపువేంద్రుఁడే
కన్నులెదుట నిఁకఁ గలకాలంబును
అన్నిటా శ్రీవేంకటాధీశుఁడే. ॥ఇత॥ 289

రేకు 251 ముఖారి

హేయము తనవాసన లేలమానును
చీయన్న మాన దిదే చెప్పరానిమాయ. ॥పల్లవి॥

జంగిలిమనుజునకు సరుసఁ బావమే చవి
అంగవించవలదంటే నగ్గలమౌను
ముంగిట నిల్లాలుండఁగ ముట్టఁగోరుఁ బరస్త్రీల
యెంగిలి కిరెండు సరె యిదివో మాయ. ॥హేయ॥

పరగినజీవునికి పంచేంద్రియాలే సుఖము
ధర నెంతగాలమైన తనివిలేదు
సిరులు దనకుండినాఁ జేయిచాఁచుఁ బరులకు
యిరువు లెరఁగరాదు యిదివో మాయ. ॥హేయ॥

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యాత్మలో నుండఁగ
భావించు నితనికృప ఫలించునాఁడు
పూవువంటి సంసారము పొదుగుకవుండఁగాను
అవటించుఁ బుణ్యఫలా లదివో మాయ. ॥హేయ॥ 290

రామక్రియ

అతఁడు సేసేచేఁత లన్నలు సేయఁగలరా
జాతుల మనుజులెల్లా సతమయ్యేరా. ॥ పల్లవి ॥

దిక్కులేనివారికెల్లా దేవుఁ డొక్కఁడే దిక్కు
చిక్కినవారికినెల్లా శ్రీపతే గతి
తక్కినఅనాథులకు దైవమే రక్షకుఁడు
యెక్కడా నాతఁ డుండఁగా నేఁటి కిఁక చింత. ॥ అతఁ ॥

బలిమిలేనివారికి పరమాత్ముఁడే బలిమి
కలిమిచాలనివారికలిమి హరే
యిల నేరనివారికి నిందిరానాథుఁడే నేర్పు
వెల సీతనికే విన్నవించు టింతే కాక. ॥ అతఁ ॥

పొందులేనివారికెల్లాఁ బురుషోత్తముఁడే పొందు
విందును వేడుకయు శ్రీవేంకటేశుఁడే
యెంద రెందరుండినాను ౧యీతఁడు గలఁడు మాకు
సందడి నాతఁడే అన్ని చక్కఁబెట్టీఁ బనులు. ॥ అతఁ ॥ 291

సామంతం

ధ్రువవిభీషణాదులు సాక్షి
వివరపుజీవులు వెదకేదిది. ॥ పల్లవి ॥

దేవేంద్రసంపద దిక్కులకెక్కుడు
కావిరినది యొక కాలముది
తావున శ్రీహరిదాసులసంపద
తేవల నెన్నఁడుఁ దీరనిది. ॥ ధ్రువ ॥

౧. 'యీతఁడు' పూ. ము. పా. యతిభంగము.

బలువుగ నడచేటి బ్రహ్మావట్టమును
తొలుబ్రహ్మాండముతోడిది
జలజాతునినిజళరణాగతి యిది
కలకాలమునకుఁ గాణాచి. ॥ ధ్రువ ॥

వైకుంఠమున కివ్వలిలోకంబులు
రాకల పోకల రచనలవి
యీకడ శ్రీవేంకటేశ్వరుసన్నిధి
పైకొని దొరకిన బ్రదికేదిది. ॥ ధ్రువ ॥ 292

వరాళి

బయలీఁదించీ నదివో ప్రాణులను హరిమాయ
క్రియదెలునుకొనేటి కీలింతే కాని. ॥ పల్లవి ॥

పెక్కుపురుషులలోన బెరకొకసతి యుంటే
యిక్కువై యుందే నాఁటు నిందరిచూపు
దక్కి యందరికాఁగిళ్ల తరుణి యుండుట లేదు
గక్కన వట్టియాసలఁ గరఁగుటే కాని. ॥ బయ ॥

చింతకాయకజ్జాయము చేరి యిసుమంతవుంటే
అంతటనే నోరూరు నందరికిని
పొంతనే నాలుకలకు పులుసై యుండుటే లేదు
కొంత భావించి మింగేటి గుటుకలే కాని. ॥ బయ ॥

శ్రీవేంకటేశు తేరు దీసేటిమనుజులెల్లాను
సేవగా నేమే తీసితిమందురు
ఆవల నాతఁడే తమఅంతరాత్మయైయుండి
కావించుట యెరఁగరు గర్వములే కాని. ॥ బయ ॥ 293

## పూర్వగౌళ

ఏమని చెప్పేనోకాక యిలఁగలశాస్త్రిలు
కామించి వాదించేవారికడమేదో. ॥పల్లవి॥

అంచెల నిగములకు హరియే ఆధారము
యెంచఁగ నాధారము యితనికేదో
పొంచిన వేదార్థములపురుషార్థ మీతఁడు
నించినయర్థము యీతనికి నేదో. ॥ఏమ॥

పొందినప్రాణులకెల్లా పుట్టుగైనాఁడితఁడు
యెందును తనకుఁ బుట్టుగిఁక నేదో
చందపుఁగర్మములకు సాధన మీదేవుఁడు
మందలించ సాధనము మరి తనకేదో. ॥ఏమ॥

కలయన్ని మాయలకుఁ గారణ మీమూరితి
తలపఁగ కారణము తనకేదో
యెలమి శ్రీవేంకటేశుఁ డితఁడే సర్వసాక్షి
మలసి యీతనికిఁక మరి సాక్షి యేదో. ॥ఏమ॥ 294

## సామంతం

ఎక్కడఁ గడచే రినరులు
తక్కులఁ బెట్టేరు తరుణులు భువిని. ॥పల్లవి॥

కన్నులచూపులు గాలపుచిలుకులు
వెన్నెలనవ్వులే వెలితెరలు
మిన్నక పురుషామృగములవేఁటలు
వన్నక యాడేరు వడఁతులు భువిని. ॥ఎక్క॥

ముంచినమాటలే మోహనఘంటలు
మంచియధరములే మచ్చులవి
మించినపురుషామృగములవేటలు
అంచెల నాడేరు అతివలు భువిని. ॥ ఎక్క ॥

కట్టువగట్లు కందువకుచములు
పట్టు శ్రీవేంకటపతిమాయ
మెట్టుగ పురుషామృగములవేటలు
నెట్టన నాడేరు నెలతలు భువిని. ॥ ఎక్క ॥ 295

రేకు 252 మలహరి

ఇన్నిటిమూలం బీశ్వరుఁ డాతని —
మన్ననకొలఁదినె మలయుటగాక. ॥ పల్లవి ॥

మాయామయమై మనియెడిజగమిది
చాయల నిందు నిజము గలదా
కాయము సుఖదుఃఖములకుఁ బొత్తిది
రేయిఁ బగలు నొకరీతే కలదా. ॥ ఇన్ని ॥

దైవాధీనము తగుసంసారము
వావిరి జీవులవసమవునా
భావతి మనసిది తన కర్మమూలము
వేవేలైనా విడువఁగవశవమా. ॥ ఇన్ని ॥

పంచేంద్రియములఁ బరగేటిబ్రదుకిది
చంచలంబు విశ్చలమవునా
యెంచఁగ శ్రీవేంకటేశ్వరుకృపతో
సంచయమయితే సతమవుఁగాక. ॥ ఇన్ని ॥ 296

ధన్నాసి

ఎందుకుఁ బనిగొందము యేమి సేత మివియెల్లా
చెందిన మా కిఁక బుద్ధి చెప్పవే నారాయణా. ॥పల్లవి॥

హరినామమొకటనే అణఁగెఁ బాపములు
వొరసి యన్నినామము లూరకున్నవి
సిరు లిచ్చెఁ గలవెల్లా శ్రీపతినామ మొకటే
పెరనామములెల్లా పెట్టెలలో నున్నవి. ॥ఎందు॥

గోవిందనామ మొకటే కూడవోసెఁ బుణ్యములు
వేవేలు నామములకు వెలలున్నవా
శ్రీవిష్ణునామ మొకటే చేతికిచ్చె వైకుంఠము
తావై యున్న నామములు ౧తమకించీ నీవికి ॥ఎందు॥

ఇత్తల కేశవునామ మియ్యఁగలవెల్లా నిచ్చె
పొత్తులనామములెల్లాఁ బొంచుకున్నవి
చిత్తమున నిన్నుఁ జూపె శ్రీవేంకటేశనామమే
హత్తిననామములెల్లా నందులోనే వున్నవి. ॥ఎందు॥ 297

భూపాళం

వేఁకునఁ దిరుపళ్ళచ్చి విష్ణునికిఁ జేయరో
ఆఁకటికొదగినట్టిఅరగింపులు. ॥పల్లవి॥

అతిబ్రహ్మాండాలు గుక్షి నటు ధరించినయట్టి—
అతనికిఁ జేయరో అరగింపులు
ప్రతిలేని క్షీరాబ్ధిఁ బవళించి లేచినట్టి—
చతురునికిఁ జేయరో చవి నారగింపులు ॥వేఁకు॥

౧. "తమకించివివికి(?)" పూ. ము. పా. ఈవికి తమకించీని=ఇచ్చుట కుబలాటపడుచున్నవి.

యేడుదినములదాఁకా నెత్తెను గోవర్ధనము
అడివచ్చేబాలునికి నారగింపులు
మేడెపుగోపికలతో మిక్కిలిఁ బెనఁగినట్టి—
వేడుకకానికిఁ దేరో విందు లారగింపులు. ॥ వేఁకు ॥

పట్టపుదేవుళ్లుఁ దాను బంతి సాగి వున్నవాఁడు
అట్టె సేయరో పులుఁగ మారగింపులు
నెట్టన శ్రీవేంకటాద్రినిలయుఁ డారగించీని
మట్టులేక వడ్డించరో మంచియారగింపులు. ॥ వేఁకు ॥ 298

దేసాళి

ఏపొద్దు చూచిన దేవుఁ డిటానే యారగించు
రూపులతోఁ బదివేలు రుచులై నట్లుండెను. ॥ పల్లవి ॥

మేరుమందరాలవలె మెరయు ౧నిద్దెనలు
సూరియ చంద్రులవంటి చుట్టుఁబళ్ళేలు
ఆరనిరాజాన్నాలు అందుపై వడ్డించఁగాను
బోరన చుక్కలు రాసివోసినట్లుండెను. ॥ ఏపొ ॥

పలుజలధులవంటి పైఁడివెండిగిన్నెలు
వెలిఁగొండలంతలేసివెన్నముద్దలు
బలసినచిలుపాలు పంచదార గుప్పఁగాను
అలరువెన్నెలరస మందిచ్చినట్లుండెను. ॥ ఏపొ ॥

పండినపంటలవంటిపచ్చళ్ళుఁ గూరలును
వండ యలమేలుమంగ వడ్డించఁగా
అండనే శ్రీవేంకటేశుఁ డారగించీ మిగులఁగ
దండిగా దాసులకెల్ల దాఁచినట్లుండెను. ॥ ఏపొ ॥ 299

---

౧. 'నద్దెనలు' రేకు.

గుండక్రియ

జయజయ రామా సమరవిజయ రామా
భయహర నిజభక్తపారీణ రామా ॥ పల్లవి ॥

జలధిబంధించినసౌమిత్రిరామా
సెలవిల్లువిరచినసీతారామా
అలసుగ్రీవునేలినఅయోధ్యరామా
కలిగి యజ్ఞముగాచేకౌసల్యరామా. ॥ జయ ॥

అరిరావణాంతక ఆదిత్యకులరామా
గురుమౌనులనుఁ గాచేకోదండరామా
ధర నహల్యపాలిటిదశరథరామా
హరురాణినుతులలోకాభిరామా. ॥ జయ ॥

అతిప్రతాపముల మాయామృగాంతక రామా
సుతకుశలవప్రియ సుగుణ రామా
వితతమహిమలశ్రీవేంకటాద్రిరామా
మతిలోనఁబాయనిమనువంశరామా. ॥ జయ ॥ 300

సాళంగనాట

మొక్కరో మొక్కరో వాఁడె ముందర నిలుచున్నాఁడు
యెక్కువ రామునిబంటు యేకాంగవీరుఁడు. ॥ పల్లవి ॥

పెట్టిన జంగతోడి పెద్ద హనుమంతుఁడు
పట్టెను ౧యెడమచేతి బలుముష్టి
మెట్టినాఁడు పాదముల మించు రాకాశితలలు
కొట్టేననుచు నెత్తె గొప్ప వలకేలు. ॥ మొక్క ॥

౧. 'యడమ' రేకు.

వంచెను శిరసుమీఁద వాలుగాఁ దనతోఁక
పెంచెను మిన్నులుమోవ పెనుదేహము
నించినాఁడు రౌద్రము నిడుపాటిదవడల
కాంచనపు౧పుట్టుకాశ కడు బిగిఇంచెను॥ ॥మొక్క॥

పెనచి తొడలుదాఁక పెద్దపదకము వేసె
తనువుపై వేలాదేదండలతోడ
అనయము శ్రీవేంకటాద్రిదేవునిబంటు
వెనుబలమై యున్నాఁడు విట్ఠలములోనను. ॥మొక్క॥ 801

రేకు 253 గుండక్రియ

ఘనుఁడాతఁడా యితఁడు కలశాపురముకాడ
హనుమంతుఁడితఁడా అంజనాతనయుఁడు. ॥పల్లవి॥

పెడచేత లోఁచేత బెరసి కొందరిఁ గొట్టె
అడరి దానవుల హనుమంతుఁడు
బెడిదంపుఁబెనుదోఁక బిరబిరఁ దిప్పి మొత్తె
అడఁగ మాల్యవంతు హనుమంతుఁడు. ॥ఘనుఁ॥

దాకాల మోఁకాలఁ దాటించెఁ గొందరి
ఆకాశవీధినుండి హనుమంతుఁడు
పైకొని భుజములఁ బడఁదాఁకెఁ గొందరి
అకడ జలధిలోను హనుమంతుఁడు. ॥ఘనుఁ॥

అరుపుల నూరుపుల నందరిఁ బారఁగఁ దోలె
ఔరా సంజీవికొండహనుమంతుఁడు
మేరతో శ్రీవేంకటాద్రిమీఁదిదేవునిబంటు
అరితేరినబిరుదు హనుమంతుఁడు. ॥ఘనుఁ॥ 802

---

౧. 'పట్టుకాశ' పూ. ము. పా. పుట్టుకతో వచ్చినకాశకావచ్చు. సహజ కవచమువలె.

బౌళి

హరి దగ్గరనే వున్నాఁ డందాఁకాఁ బారనీదు
కురుచలోనే మగుడు గోవిందుమాయ. ॥పల్లవి॥

చెనకిపంచేంద్రియపుచెరువు లై దింటికి
మనసనెడి దొకటి మహాప్రవాహము
దినముఁ బారుచునుండు దిగువకు వెళ్లలేదు
తనలోనే తానిగురు దైవమాయ. ॥హరి॥

తూలనిపంచభూతాలతోఁట లై దింటికి
కాలమనియెడి దొక్కకాలువ వారుచునుండు
నేలాఁ దడియదు నీరూఁ దివియదు
తోలుఁది త్తికే కొలఁది దొరకొన్న మాయ. ॥హరి॥

ముట్టి పంచప్రాణముల మొలక లై దింటికి
పుట్టుగులని యేటియేరు పొదలి పారుచునుండు
చెట్టు చెట్టుకే కొలఁది శ్రీవేంకటేశ్వరుఁడు
నట్టనడుమ నున్నాఁడు నాననీదు మాయ. ॥హరి॥ 308

పాడి

రామభద్ర రఘువీర రవివంశతిలక నీ౧-
నామమే కామధేనువు నమో నమో. ॥పల్లవి॥

కౌసల్యానందవర్ధన ఘన దశరథసుత
భాసురయజ్ఞరక్షక భరతాగ్రజ
రాసికెక్క(క్కు?)కోదండరచనవిద్యాగురువ
వాసితో సురలు నిను వడి మెచ్చేరయ్యా. ॥రామ॥

---

౧. పూ. ము. పా. లో ఈ 'నీ' తప్పిపోయినది.

మారీచసుబాహుమర్దన తాటకాంతక
దారుణవీరశేఖర ధర్మపాలక
కారుణ్యరత్నాకర కాకాసురవరద
సారెకు వేదవిదులు జయవెట్టేరయ్యా. ॥ రామ ॥

సీతారమణ రాజశేఖరశిరోమణి
భూతలపుటయోధ్యాపురనిలయా
యీతల శ్రీవేంకటాద్రి నిరవయినరాఘవ
ఘాత నీప్రతాపమెల్లాఁ గడు నిండెనయ్యా. ॥ రాము ॥ 804

బౌళి

ఎట్టువలసినాఁ జేయు మేమీ ననసేరమయ్యా
వొట్టిననామనసు నీ కొప్పనసుమ్మయ్యా. ॥ పల్లవి ॥

అదిగో శ్రీహరి నీవంపినయింద్రియాలకు
చెదరక నేము పంపు సేతుమయ్యా
వెదకి యాసలకెల్లా వెట్టియుఁ జేతుమయ్యా
మదిమది నేనీమాయకు లోనయ్యా. ॥ ఎట్టు ॥

దేవ నీవిచ్చినయట్టిదేహపుటూరిలోన
చేవమీరఁ గాఁపురము సేసేమయ్యా
ఆవల నీకర్మముల కప్పనము నత్తుమయ్యా
ఆవటించి కామాదుల కాన మీరమయ్యా. ॥ ఎట్టు ॥

నిన్నుఁ దలచుటకంటే నీవుచెప్పినపనులే
యెన్నికఁ జేసినదే యెక్కుడయ్యా
అన్నిటా శ్రీవేంకటేశ ఆత్మలో నున్నాఁడవు
విన్నపములేల యిది విడుపమయ్యా. ॥ ఎట్టు ॥ 805

గుజ్జరి

ఇతని మఱచితిమి యెదుటనే యుండఁగ యిన్నాళ్లును నే మెరఁగక
ప్రతిలే దితనికి జీవకోట్లకుఁ బ్రాణబంధుఁ డితఁడు. ॥ పల్లవి ॥

ముందు నేను ఘనగర్భనరకమున మునిఁగియున్నవాఁడు
పొందితోడనే సుఖదుఃఖంబులఁ బొరయు తోడునీడితఁడు
అంది స్వర్గనరకాదులు చొచ్చిన అక్కడఁ దా వెనువెంటనే
చందపునాయాతుమలోఁ బాయనిసర్వాత్మకుఁ డితడే. ॥ ఇత ॥

ఆనిపట్టి నేఁ బాపపుణ్యములు అనుభవించవలెనన్నప్పుడు
మానుపనొల్లఁడు తాఁ బెరరేఁచును మతి కనుకూలం బితఁడు
నానావిధులనుఁ బొరలి యలపుతో నలి నే నిద్రించేటప్పుడు
తానును ఆపరిణామంబులకు తగులై వుండును యీతఁడు. ॥ ఇత ॥

తలఁచిన దగ్గరుఁ దడవక యుండిన దవ్వయివుండు నితఁడు
కలసి మెలసి ఇహపరము లొసంగఁగఁ గాచుకవుండును యీతఁడు
మెలఁగుచు సాకారముతో నున్నాఁడు మేటిశ్రీవేంకటపతి యితఁడు
వలసిన వావులయావులు దాల్చినవాఁ డొకఁడేపో యీతఁడు. ॥ఇత॥306

గుండక్రియ

కడనుండి రావు కానివి నైనవి
పుడుగనిదయ నీదొకచే కలది. ॥ పల్లవి ॥

హరి నీచక్రంబంటినయపుడే
సొరిది నసురలే సురలైరి
నిరతపుచీఁకటినిండినమింటను
వెరవున రవిచే వెలుఁగైనట్లు. ॥ కడ ॥

తతి నీనామముదలఁచినవారి —
అతిపాపమె పుణ్యంబాయ
గతియై పరుసముఁగదిసినలోహమె
ప్రతిలేక ధరణిఁ బసిఁడియైనట్లు. ॥కడ॥

కొంకక నిను నిటు గొలిచినమనుజులె
అంకెల కుకాదులైనారు
యింకను శ్రీవేంకటేశ నీజగము(?)—
సంకల్పమే మోక్షంబై నిలిచె. ॥ కడ ॥ 307

రేకు 254 లలిత

ఇవ్వల వెదకితేనే యేమి లేదు
అవ్వలికి దాఁటి మీరు అందుకోరో శుభము ॥పల్లవి॥

కనురెప్పలతుదలఁ గట్టువడెఁ గాలము
ఘనమై చేతులతుదఁ గర్మమున్నది
మనసుకొట్టఁగొననే మరి దైవమున్నాఁడు
చెనకి యిఁక నెన్నఁడు సేయరో పుణ్యములు. ॥ ఇవ్వ ॥

కనకము దాఁటితేనే ఘనసుఖమున్నది
వెనక చీఁకటికొన వెలుఁగున్నది
వనితలఅవ్వలనే వరవిజ్ఞానమున్నది
పనిగొని యితవైతే బ్రదుకరో జీవులు. ॥ ఇవ్వ ॥

కాయముకొట్టఁగొననే ఘనవైకుంఠమున్నది
బాయట శ్రీవేంకటపతి వున్నాఁడు
మాయలకొనలవెల్లా మనము నున్నారము
పాయక తెలుసుకొని పట్టరో యీతెరువు. ॥ ఇవ్వ ॥ 308

దేసాళం

ఇంతగా మన్నించి నన్ను నేలుకొంటి విలలోన
వింతగా నెవ్వరినిఁక వేడఁబోయ్యేనయ్యా. ॥పల్లవి॥

కలవారిలోన నీవు గలవాఁడవని నేను
కలసి లేనివారిలో కర్మములేనివాఁడను
బలువులలో నీదాస్యబలవంతుఁడ నేను
యెలమి మాకిఁకఁ జూడ నేమిగడమయ్యా. ॥ఇంత॥

నెమ్మదిలోనివారిలో నీకుతిలోపలివాఁడ
నమ్మనివెలివారిలో నాస్తికులవెలివాఁడ
పమ్మి పదస్థులలోన పరమపదమువాఁడ
ఇమ్మని నిన్నడిగేది ఇఁక నేఁటిదయ్యా. ॥ఇంత॥

ధర్మపువారిలో నీదయాధర్మపువాఁడ
మర్మపువారిలో నీమాయలమర్మముఁవాఁడ
అర్మిలి శ్రీవేంకటేశ అంతర్యామివి నీవు
నిర్మించినవాఁడ నేను నెలకొంటివయ్యా. ॥ఇంత॥ 809

గుండక్రియ

అందాఁకా వైష్ణవ మటకటకే
నిందకుఁజాసిన నిర్మలుఁ డగును. ॥పల్లవి॥

పాపపురాసులు పరిహారమైతే
దీపించుహరిభక్తి వొడమును
చేపట్టి పుణ్యము చేరువలయితే
శ్రీపతిదాసులసేవే దొరకు. ॥అందాఁ॥

కొట్టఁగొనకు మతి గోరి పారితే
జట్టిగ హరికథ చవిగలుగు
పట్టినజన్మము పావనమైతే
మట్టులేనితిరుమంత్రము దొరకు. ॥ అందాఁ ॥

గురుకటాక్ష మొకకొంత సోఁకితే
శరణాగతి నిశ్చలమవును
యిరవుగ శ్రీవేంకటేశ్వరుఁ గొలిచితే
పరమపదమునకుఁ బాత్రుండవును ॥ అందాఁ ॥ 310

ఆహిరి

సేయరానిచేఁతలెల్లాఁ జేసితి నేను ౧నీ-
గా(కా?)యగంటివాఁడ నేను గతిచూపవయ్యా. ॥ పల్లవి ॥

శరణాగతులఁ గూడి జ్ఞానము దొంగిలినాఁడ
అరిది నీకర్మపుటానాజ్ఞలు మీరినవాఁడ
సరిఁ బ్రపంచకులముజాడ వాసినవాఁడ
ధరణి నీతప్పులకు దండన యేదయ్యా. ॥ సేయ ॥

బహుసంసారములెల్లఁ బంచలఁ దోసినవాఁడ
సహజపింద్రియముల జారినవాఁడ
మహి నాపుట్టుగులకే మరి బొమ్మఁబెట్టినాఁడ
విహిత మిందుకు నేది విధి చెప్పవయ్యా. ॥ సేయ ॥

గురుమంత్రమునకుఁ గొండెము చెప్పినవాఁడ
పరకాంతఁగూడేలోకభయము మానినవాఁడ
సిరులమించినయట్టిశ్రీవేంకటేశ నిన్ను
మరిగి శరణంటిని మన్నించవయ్యా. ॥ సేయ ॥ 311

---

౧. నీగాయగంటి = "నీయొక్కగాయముస్థానమున మచ్చకావచ్చు" లేక, నీకాయకము=నీవనిన్నే, కంటివాఁడ=కన్నుగాగలవాడ ననియా?

గుండక్రియ

ఇదిగా దదిగా దిన్నియు నింతే
పదిఁబది హరి నీపదమే నిజము. ॥ పల్లవి ॥

సురలును నసురలు చూపట్టు రాజులు
అరసి కనక(ఁగ?) గతమగువారె
సిరుల వీరిఁ గొలిచెద మంటే మఱి
కెరలి పరుల రక్షింపఁగఁగలరా. ॥ ఇది ॥

పదునాలుగవది బ్రహ్మలోకమును
కదిసి వీరుమునుకలపొలము
చెదరక యిఁకఁ దముఁ జేరినవారల
వుదుటున నిముడుక వుండఁగఁగలరా(దా?). ॥ ఇది ॥

అచ్చుతుఁడవు నీయచ్యుతపద మది
యిచ్చట శ్రీవేంకటేశుఁడవు
చొచ్చిరి నీశరణు శుకసనకాదులు
మచ్చిక నిదిగని మరిగితిమయ్యా. ॥ ఇది ॥ 812

వరాళి

పెట్టినదైవ మెరుఁగు బీరకాయలోనిచిక్కు
దిట్ట కూళప్రాణులమై తిరుగుతగాకా. ॥ పల్లవి ॥

కాయము మోచి పుట్టి కర్మమున కొడిగట్టి
రోయఁబోతే మేనిలోనిరోఁత వోయీనా
పాయపువలఁ దగిలి పాపపుణ్యములఁ జిక్కి
తీయఁబోతే వచ్చునా తెగరానిబంధము. ॥ పెట్టి ॥

జగములోఁ గటువడి సంసారదుఃఖమంది
నగఁబోతేఁ గొంతైనా నవ్వు వచ్చీనా
చిగురుటాసఁ దగిలి చింతాజలధిఁ బడి
యెగదిగఁ జూడఁబోతే యెందుకు నెక్కీనది. ॥పెట్టి॥

పరమాత్మమతిఁ గని భవములెల్లఁ గడచి
ధరణి మాయలతోడితగు లున్నదా
సిరుల మించినయట్టి శ్రీవేంకటేశ్వరుని
మఱిగి కొల్చిన మాకు మరి చింతలేలా. ॥పెట్టి॥ 313

రేకు 255 లలిత

ఏల వెట్టిసేయించే విందున నీకేమివచ్చె
కాలముఁ గర్మముచేతఁ గప్పేవు లోకులను. ॥పల్లవి॥

బద్ధులమాటలాడి భ్రమయించి రేపల్లెలో
ముద్దులు చూపి వెన్నలు ముచ్చిలినట్టు
కొద్దిమాలినకర్మము కొంత మాకు గడియించి
వద్ద నిన్నుఁ[1]గానివాని(?)వలె దాఁగవలెనా. ॥ఏల॥

మఱి పాండవులకు నెమ్మది వావులటు చెప్పి
మొఱఁగి యిందరిలోన మొక్కినయట్టు
కుఱకుఱై వాలఁ గొందరను గడియించి
యెఱిఁగి నెఱఁగనట్టె యేమి సేసేవయ్యా. ॥ఏల॥

వర మడుగఁగఁబోయి వడి ఘంటాకర్ణునికి
యిరవుగ మోక్షవరమిచ్చినయట్టు
తిరమై శ్రీవేంకటాద్రిఁ దిరువారాధన గొని
వరుస నీదాసులకు వరమిచ్చేవయ్యా. ॥ఏల॥ 314

1. నిన్నుఁగానివానివలె='నీకుసంబంధములేనివానివలె' కావచ్చు.

ధన్నాసి

తగు మునులు ౧ఋషులు తపములు సేయఁగ
గగనము మోచియుఁ గర్మము దెగదా. ॥ పల్లవి ॥

ధరణీధర మందరధర నగధర
చిరకౌస్తుభధర శ్రీధరా
కరిఁ గాచితి కాకముఁ గాచితి నీ-
కరుణకుఁ బాత్రము గలదిదియా. ॥ తగు ॥

భవహర మురహర భక్తపాపహర
భువనభారహర పురహరా
కవిసినపురుతనుగద్దను మెచ్చితి—
వివల నీదయకు నివియా గురుతు. ॥ తగు ॥

శ్రీవేంకటపతి శేషగరుడపతి
భూవనితాపతి భూతపతి
గోవుల నేలితి కోఁతుల నేలితి
పావనపుఁగృపకుఁ బాత్రము లివియా. ॥ తగు ॥ 315

శంకరాభరణం

ఎవ్వరుఁ గాననివాఁడు యశోద గనె నట్టె
పవ్వళించేబ్రహ్మతండ్రి బాలుఁడయ్యె నట్టె ॥ పల్లవి ॥

ఘనయోగీంద్రులమతిఁ గట్టువడనట్టివాఁడు
పనిలేక రోలఁ గట్టువడినాఁడట్టె
తనియ సురలకు పాదము చూపనట్టివాఁడు
మొనసి బండిమీఁద మోపినాఁ డట్టె. ॥ ఎవ్వ ॥

౧. 'ఋషులు' రేకు.

అమృతము చేతఁ దచ్చి అందరికిచ్చినవాఁడు
తమితో వెన్న దొంగిలెఁ దానె యట్లై
గుముర్రై దేవదానవకోటికిఁ జిక్కనివాఁడు
భ్రమసి గోపికలపాలఁ జిక్కినాఁ డట్టె. ॥ఎవ్వ॥

యిందుఁ గలఁ డిందులేఁడనెంచి చూపరానివాఁడు
అందమై రేపల్లెవాడ నాడీనట్టె
అంది కృష్ణావతారమయినట్టిదేవుఁడే
యిందున శ్రీవేంకటాద్రి యెక్కి నిలిచె నట్టె. ॥ఎవ్వ॥ 316

రామక్రియ

పెరిగి పెద్దఁగాను మరి పిన్న వాఁడఁగాను
యిరవుగ నే బుదెరిఁగెడి దెపుడు. ॥వల్లవి॥

కంటిగ బహునరకంబులు చొచ్చితి—
నింకా భయ మది యెరఁగను
జంకెనలనే పలుచదువులు చదివితి
మంకుఁదనం బిది మానదు. ॥పెరి॥

తియ్యక కడుఁ బెనుదేహాలు మోచితి-
నయ్యో యింకా నలయను
నెయ్యపు హేయము నిచ్చలుఁ గడిగెద
చియ్యని రోయను సిగ్గూఁ బడను. ॥పెరి॥

ధర్మము సేసితి దానము లొసఁగితి
కర్మము లింకాఁ గడపను
అర్మిలి శ్రీవేంకటాధిప నీకృప
నిర్మల మైతిని నే నిపుడు. ॥పెరి॥ 317

బౌళి

కన్న దేఁటిదో విన్న దేఁటిదో కాఁగలదిఁక నేదో
నన్నుం గానను నిన్నుం గానను నడుము బట్టబయలు. ॥ పల్లవి ॥

నీమాయమహిమో నే నేరనికడమో
భూమిలోన నీవున్నాఁడవు నా పుట్టుగులుఁ గలవు
యేమి గాఁగలనో యింకా మీఁదట నిటకతొల్లి యేమైతినో
సోమార్కులవుదయాస్తమయంబులు చూచుచునున్నాఁడను నేను ॥కన్న

జ్ఞానము నీవో అజ్ఞానంబే బలువో
నీనామంబులు అనంతకోట్లు నిలుకడ గాఁగాను
కానఁగల యీ ప్రపంచమెల్లా కలయో యిది నిజమో
కానరాని యీ ముక్కున నూర్పులు కాలముఁ గొలచేటికుంచములు॥కన్న

నీకు నీవే నను దయ దలఁచితివో నేనాచార్యుని నమ్మితినో
కైకొని నాయంతర్యామివి నినుఁ గంటి నివుడే నేను
శ్రీకాంతుఁడవో శ్రీవేంకటేశ్వర శ్రీవైకుంఠమే యీజగము
యేకడ చూచిన నీదాసులు నాయెదుటనే వున్నారు. ॥కన్న ॥318

దేసాళి

కానరు నాలుగుకరములవానిని
శ్రీనాథుండని చేరఁగవలదా. ॥ పల్లవి ॥

ఘనచక్రముతో గరుడనినెక్కుక
కినిసి మెరయు నలకృష్ణునిని
ఘనులై యిప్పటికాలపుమనుజులు
మునుప విష్ణుఁడని మొక్కఁగవలదా. ॥ కాన ॥

పలుదేవతలకు భయములు మాన్పుచు
అలవిశ్వరూపమైనపుడు
చలము మాని యచ్చటికౌరవులును
తెలిసి దేవుఁడని కొలువఁగవలదా. ॥ కాన ॥

చెప్పినయితఁడే శ్రీవేంకటమున
యెప్పుడు వరములు ఇయ్యఁగను
తప్పక యీతని దాసులవలెనే
యిప్పటివారలె యెరఁగఁగవలదా. ॥ కాన ॥ 319

రేకు 256 బౌళి

నిండుమననే నీపూజ
అండఁ గోరకుండు టదియు నీపూజ. ॥ పల్లవి ॥

యిందు హరి గలఁ డందు లేఁడనేటి-
నిందకుఁ బాయుటే నీపూజ
కొందరు చుట్టాలు కొందరు పగనే-
అందదుకు మాను టదియే నీపూజ. ॥ నిండు ॥

తిట్టులు గొన్నని దీవెనె గొంతని
నెటుకొనిదే నీపూజ
పెట్టినబంగారు పెంకును నినుమును
అట్టే సరి యనుటదియు నీపూజ. ॥ నిండు ॥

సర్వము నీవని స్వతంత్రముడిగి
నిర్వహించుటే నీపూజ
పర్వి శ్రీవేంకటపతి నీదాసు ల-
పూర్వమనియెడిబుద్ధి నీపూజ. ॥ నిండు ॥ 320

రామక్రియ

పలుదెరువులు నీకుఁ జాటించఁ జెల్లును
వొలిసి మీదాసు లవుటొక్కటే మాతెరువు. ॥పల్లవి॥

హరి నీకు జీవరాసులందరును సరియే
సురల కెక్కుడు నీవు చూడ మాకైతే
యిరవులు గలవు నీ కెక్కడ చూచినను
అరిదినీ(శ్రీ)పాదాలందె మాయిరవు. ॥పలు॥

నందగోపాదుల కెల్ల నందనుఁడవు నీవు
యిందరికిఁ దండ్రివి మా కిటు నీ వైతే
అందిన కబరివిందు అఖిలభాగ్యము నీకు
చిందిననీప్రసాదమే సిరు లిచ్చె మాకును. ॥పలు॥

అచ్చుగ మునులు రు(ఋ?)షులందరును నీబంట్లే
తచ్చినయేలికలు నీదాసులు మాకు
యిచ్చల (శ్రీ)వేంకటేశ యిహపరమెల్లా నీవు
చొచ్చితిమి నీమరఁగు సూదివెంట దారమై. ॥పలు॥ 321

శుద్ధవసంతం

భక్తి నీపైదొకటె పరమసుఖము
యుక్తిచూచిన నిజం బొక్కటే లేదు. ॥పల్లవి॥

కులమెంత గలిగె నది కూడించు గర్వంబు
చలమెంత గలిగె నది జగడమే రేఁచు
తలఁపెంత పెంచినాఁ దగిలించు కోరకలు
యెలమి విజ్ఞానంబు యేమిటా లేదు. ॥భక్తి॥

ధన మెంత గలిగె నది దట్టమౌ లోభంబు
మొనయుఁ జిక్కందనంబు మోహములు రేఁచు
ఘనవిద్య గలిగినను కప్పుఁ బైపై మదము
యెనయఁగఁ బరమపద మించుకయు లేదు. ॥భక్తి॥

తరుణు లెందరునయిన తాపములు సమకూడు
సిరులెన్ని గలిగినను చింతలే పెరుగు
యిరవయిన శ్రీవేంకటేశ నినుఁ గొలువఁగా
పెరిగె నానందంబు బెళకు లేక లేవు. ॥భక్తి॥ 322

లలిత

ఇంతగాలమాయ నన్ను నేమీనన్నవారు లేరు
చింతసంసారపుమాయఁ జిక్కించనే కాని. ॥పల్లవి॥

యెందరు బ్రహ్మలో నన్ను యిటు పుట్టించినవారు
యెందరు యములో హరియించినవారు
యిందుకు నందుకే కాని యిల నేఁ జేసినపాప—
మంది వహించుక కాచినట్టివారు లేరు. ॥ఇంత॥

తల్లిదండ్రు లెందరో తనువు పెంచినవారు
కొల్లగా సతు లెందరో కూడినవారు
చిల్లరపనికే కాని చేరఁబిలిచి వైకుంఠ—
ముల్లసాన నిచ్చేవారు వొకరూ లేరు. ॥ఇంత॥

కాలమును వీటఁబోయె కర్మమునుఁ దెగదాయ
మూలనుండి యెవ్వరికి మొరవెట్టేను
ఆలించి శ్రీవేంకటేశ అంతరాత్మవై నన్ను—
నేలితివి యింతపని కెవ్వరును లేరు. ॥ఇంత॥ 323

సాళంగనాట

పంచేంద్రియముల నేపట్టణస్వాములాల
తెంచి బేర మాడుకొని దెంచరో బరవు. ॥ పల్లవి ॥

తగినసంసారసముద్రములోనఁ దిరిగాడి
బిగువుదేహపుటోడ బేహారి వాఁడ
జగతిఁ బుణ్యపాపపుసరకులు దెచ్చినాఁడ
దిగిలి బూతురేవునఁ దీరుచరో సుంకము. ॥ పంచే ॥

అదరి గుణత్రయముల నేటి తెడ్డుల చేత
నడుమ విన్నాళ్ళదాఁకా నడపినాఁడ
కడుఁజంచలముల నేగాలిచాప లెత్తినాఁడ
వెడమాయపుసరకు వెలకియ్యరో. ॥ పంచే ॥

ఆతుమయ నేటికంథ మంతరాత్మఁ డెక్కియుండి
నీతితో మమ్ముఁగాచుక నిలుచున్నాఁడు
ఆతఁడే శ్రీవేంకటేశుఁ డటు మాకు మీకుఁ గర్త
ఘాతమాని ఇఁక మాకు కడుగుణ మియ్యరో. ॥ పంచే ॥ 324

పాడి

ఏడే తేనలు యీదేహంబును
యేడా నిఁకమరి యెరఁగము నేము. ॥ పల్లవి ॥

నిండును జలధులు నిమిషమాత్రమున
నిండియు నిండదు నేటి మనసు
పండును భువిఁగల పంట లన్నియును
పండదు నాలోఁ బాపపుమనసు. ॥ ఏడే ॥

పట్టవచ్చు నల పారేటిపాము
 పట్టరాదు నాపాయము
 అట్టే ఆరును అనలము నీటను
 యెట్టైన నారదు యీకోపంబు. ॥పదే॥

కానవచ్చు నదె ఘనపాతాళము
 కానరాదు నాకాలము
 శ్రీనగవిహార శ్రీ వేంకటేశ్వర
 సోనలఁ బుట్టిన సుద్దులు నివిగో. ॥పదే॥ 325

రేకు 257 సాళంగనాట

ఎక్కడిదివివేక మెంతవారికిని యిన్నియు నీమాయఁ దోయక లేదు
పక్కన అజ్ఞానపుజీవులయీపాప మిట్లనే వుండఁగను. ॥పల్లవి॥

విచ్చనవిడి నటు కౌరవులెదుటను విశ్వరూపు చూపినయపుడు
యిచ్చల నిను నమ్మఁగలేకేకా యింద్రజాలమనిరి
తచ్చన నిప్పటి నాస్తికజనులును తగునీసాకారము చూచి
నిచ్చలుఁ గల్లని నిరాకారము నిజమని తర్కించక మానుదురా. ॥ఎక్క॥

గరుడవాహనము శంఖచక్రములు కనియుండియు ద్వాపరజనులు
ధరలో నినుహరి[1]మూర్తని తెలియక తమయాదవుఁ డొకఁ డితఁడనిరి
సరుస దేవతాంతరములఁగొలిచేటిచంచలచిత్తులు ఇఁక నిన్నే
పరదైవంబననేరరు సరిగా బ్రహ్మాదులలో నొకఁడవందురు. ॥ఎక్క॥

యెఱిఁగినదాసులు యెఱుఁగుదురు నీ వెక్కుడనుచు యేకాలమును
యెఱఁగనిపామరు లెఱఁగరు నిను మతి నెంతైనా నాఁడు నేఁడును
తఱితో శ్రీవేంకటేశ్వర నినుఁగవి తగుశరణాగతు లున్నట్లు
మఱుఁగున నుండినప్రాకృతులకు నీమహిమలు గానఁగఁదరమవునా
॥ఎక్క॥ 326

---

౧. మూర్తి+అని='మూర్తని' ఈ సంధు లీవాఙ్మయమున కొల్లలు.
'మూర్తవి' పూ. ము. పా.

లలిత

పుట్టినమొదలు నేను పుణ్యమేమీఁ గాననైతి
  యెట్లు గాచేవయ్యా నన్ను యిందిరానాథా. ॥పల్లవి॥

కామినులఁ జూచి చూచి కన్నులఁ గొంతపాపము
  వేమరు నిందలు విని వీనులఁ గొంతపాపము
  నామువారఁ గల్లలాడి నాలికఁ గొంతపాపము
  గోమునఁ బాపము మేనఁ గుప్పలాయ నివిగో. ॥పుట్టి॥

కానిచోట్లకు నేఁగి కాఁగిళ్ళఁ గొంతపాపము
  సేన దానా లందుకొని చేతులఁ గొంతపాపము
  మాననికోపమే పెంచి మతిఁ గొంతపాపము
  పూని పాపములే నాలోఁ బోగులాయ నివిగో. ॥పుట్టి॥

చేసినట్టివాఁడఁగాన చెప్ప నీకుఁ గోటులేదు
  దాసుఁడ నేనైతిఁ గాన దయదలఁచితివయ్యా
  యీసరవులెల్లఁ జూచి యేమని నుతింతు నిన్ను
  ఆసల శ్రీవేంకటేశ అయఁబోయఁ బనులు. ॥పుట్టి॥ 327

వరాళి

కలిమిలేములెల్లా కాలముస్వభావము
  తలఁపులో జ్ఞానము దక్కుడి దొకటే. ॥పల్లవి॥

పుట్టుగులు జీవునికి పూఁచినస్వభావము
  పొట్టి యిదె సారెసారె పోమనేలా
  పట్టి నానాఁటిబ్రదుకు ప్రపంచముస్వభావము
  కొట్టఁగాన హరి ముక్తి గోరెటి దొకటే. ॥కలి॥

మక్కువసంసారము మాయలస్వభావము
చిక్కినవారికెల్లా మొక్కుకోనేలా
తక్కక రక్షించేది దైవముస్వభావము
నిక్కపువైరాగ్యము నిలుచుట వొకటే. ॥ కలి ॥

కప్పినభోగములెల్లా కర్మముస్వభావము
తప్పక ప్రియముచెప్పేదైన్యమేలా
యెప్పుడు శ్రీవేంకటేశ యెదలో నాకుఁగలవు
చప్పుడుసేయక నీకు శరణనే దొకటే. ॥ కలి ॥ 328

## కన్నడగౌళ

ఏమిసేయఁగల యెంతటివాఁడను
తామసపుమనసు తనియదు నాకు. ॥ పల్లవి ॥

యిలలోపల నూరేండ్లబ్రదుకే
కలవుద్యోగము కల్పాంతంబులు
నిలిచినవాఁడను నేనొక్కఁడనే
పలుసంసారము బండ్లకోలఁది. ॥ ఏమి ॥

ఆరయఁ బట్టెఁడుఅన్నమువాఁడను
కోరినకోర్కులు కోటానఁగోట్లు
నారవంటిదే నల్లెఁడునాలుక
తీరవు రుచులివె తెప్పలకోలఁది. ॥ ఏమి ॥

నిరతరతిసుఖము నిమిషములోనిదే
విరహపుంవెదలు వేవేలు
యిరవుగ శ్రీవేంకటేశ నీమఱఁగు
చొరఁగా నాకివి సులభములాయ. ॥ ఏమి ॥ 329

---

౧. 'వేదలు' పూ. ము. పా. వెద 'శబ్దము' "వ్యథా" శబ్దభవముకదా.

లలిత

ఎవ్వరివాఁడాఁ గాను యిదె పిరివీకులై
నవ్వుచు నీశరణంటి నన్నుఁ గావవయ్యా. ॥పల్లవి॥

తగఁ బంచేంద్రియములు తమవాఁడ ననేరు
వగఁ దల్లిదండ్రి తమవాఁడననేరు
చిగురుఁగర్మాలు తమసీమవాఁడననేరు
తెగదీ తగవు నీవే తిద్దవయ్యా. ॥ఎవ్వ॥

కొందరు నరకమందు కొంతవళకువేసేరు
కొందరు స్వర్గమువారు కొంతవళకువేసేరు
యిందుకు నందుకుఁ బోవీ రిహాలోకమందువారు
దిందుపడనివళకు తీరుచవయ్యా. ॥ఎవ్వ॥

కాంతలు తమవాఁడంటాఁ గనుచూపులఁ గట్టేరు
చెంతలఁ గాంచనములు చేయివట్టుకొనె నన్ను
ఇంతటా శ్రీవేంకటేశ యెదలోనున్నాఁడవు
వంతు కీతగపు నీవే వహించుకోవయ్యా. ॥ఎవ్వ॥ 380

రేకు 258 సామంతం

ఇంకనైన వారిఁ జేరు యింతే చాలు
సంకెలెల్లాఁ బెడఁబాపి చక్కఁజేసీ నతఁడే. ॥పల్లవి॥

యెఱఁగక పుట్టితివి యిన్నియోనులందుఁ దొల్లి
తటి నాఁటి కాయఁబోయ దానికేమి
నెటి నఱకములో వాని తివియుఁ గొన్నాళ్ళు
తఱవాయి దెలుసుకో దానికేమి. ॥ఇంక॥

పాపపుణ్యములు సేసి పరులఁగొలిచి తొల్లి
తాపములఁ బొందితివి దానికేమి
పూపసంసారము నమ్మి పుంగుఁడై యున్నాళ్ళదాఁకా
దాపులేక బ్రతికితి దానికేమి ॥ఇంక॥

జగములోవారిఁ జూచి సారెసారె నాసలనే
దగదొట్టై నీకుఁ దొల్లి దానికేమి
జిగి శ్రీవేంకటపతి చిత్తములో నున్నవాఁడు
తగవెంచుకో జీవుఁడ దానికేమి. ॥ఇంక॥ 331

ముఖారి

గోవిందాదినామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు
ఆవలనీవల నోరఁ గుమ్మలుగ నాడుద మీతనిఁ బాడుదము ॥పల్లవి॥

సత్యము సత్యము సకలసురలలో
నిత్యుఁడు శ్రీహరి నిర్మలుఁడు
ప్రత్యక్షమిదే ప్రాణులలోపల
అత్యంతము శరణనరో యితని. ॥గోవిం॥

చాటెడి చాటెడి సకలవేదములు
పాటించినహరి పరమమని
కూటస్థుఁ డితఁడు గోపవధూపతి
కోటికి యీతనిఁ గొలువరో జనులు. ॥గోవిం॥

నిలుచున్నాఁ డిదె నేఁడును నెదుటను
కలిగిన శ్రీవేంకటవిభుఁడు
వలసినవారికి వరదుఁ డితఁడు
కలఁడు గలఁ డితనిఁ గని మనరో. ॥గోవిం॥ 332

దేసాళి

ఒక్కఁ డెవ్వఁడో వుర్వికి దైవము
యెక్కువ నాతని నెరఁగవో మనసా. ॥ పల్లవి ॥

వొట్టినజీవుల కొకబ్రహ్మ గలఁడు
పట్టినవిప్రులు బ్రహ్మలమందురు
నట్టనడుమవారే నవబ్రహ్మలు
ఇట్టిగ బ్రహ్మలసంతాయ జగము. ॥ ఒక్కఁ ॥

కైలాసంబునఁ గలఁ డొక రుద్రుఁడు
తాలిమి నేకాదశరుద్రులు మరి
కాలరుద్రుఁడును కడపట నదివో
చాలినరుద్రులసంతాయ జగము. ॥ ఒక్కఁ ॥

అవతారంబున నలరినవిష్ణువు
అవలవిష్ణుమయ మనియెడివిష్ణువు
భువి శ్రీవేంకటమున నున్నాఁ డిదె
యివె వరంబులసంతాయ జగము. ॥ ఒక్కఁ ॥ 333

దేవగాంధారి

ఇంకనైనా రోయరాదా యీపాటివార మింతే
మంకుఁదనమేల మామాట వినరాదా. ॥ పల్లవి ॥

తోలుబొంతగట్టుకొన్నదొర నింతే నన్ను నీవు
కూళసంసారమా యేల కొసరేవు
యీలకొన్నయెముకలఇంటిలోకాఁపుర మింతే
యేల మాయ వెంటఁబెట్టే వేమి గద్దు నీకును. ॥ ఇంక ॥

పంచభూతపుచుట్టాలబదుకులో వాఁడ నింతే
 యెంచ కింద్రియయాచకులేల వచ్చేరు
 కంచపుగాలావటించేకలిమిలో వార మింతే
 చంచలపుటాసలు చేయిచాఁచనేఁటికి. ॥ఇంక॥

నెత్తురుజలదుర్గాన నిలిచినవాఁడ నింతే
 జొత్తుఁబాపములు యేల చోటడిగేరు
 హత్తిన శ్రీవేంకటేశుఁ డాత్మలోన నున్నవాఁడు
 మత్తపుటజ్ఞానమా మమ్మేమి చూచేవు. ॥ఇంక॥ 384

మలహరి

తమయెఱుక తమకుఁ దగినంతే
 నెమకిన మాకును నీకృప యింతే. ॥పల్లవి॥

పొసఁగ నీనాభినిఁ బుట్టినబ్రహ్మాలు
 యెసఁగిననీపూర్వ మెఱిఁగేరా
 వెస నీముఖమున వెడలినవేదము
 దెసల నీమహిమ తెలియఁగఁగలదా. ॥తమ॥

నగుచు నీమాయల నడచేజగములు
 సొగసి నీమూరితి చూపెడినా
 తగ నినుఁ గానఁగ తపించు మునులును
 పొగరుల మము నిఁక బోధించేరా. ॥తమ॥

అంతేసివారల కటువలె నుండఁగ
 వింతజీవులకు వివేక ౧మెట్లొకో
 యింతట శ్రీవేంకటేశ నీవే మము
 చెంతఁజేరి దయసేయఁగదే ॥తమ॥ 385

౧. 'మెట్లకో' రేకు

శంకరాభరణం

ఎన్నఁడు దెలిసే మెచ్చరికెపుడో
 ఇన్నియుఁ గన్నవె యెఱిఁగీనెఱఁగ ॥పల్లవి॥

నిన్నటియాఁకలి నేఁడూ నున్నది
 కన్నదినంబే కడచనెను
 పన్ని నిదుర మాపటికి నున్న దదె
 యెన్నఁగ రాతిరి యెందో పోయ. ॥ఎన్నఁ॥

కాయపుసుఖములు గంపల నున్నవి
 పాయమే కై వాలి పండెనదే
 యీయెడ సంసార మింటనే వున్నది
 చేయును నోరును చెనకై నిలిచె. ॥ఎన్నఁ॥

విడువనిజన్మములు వెంటనే వచ్చి
 తడవేటిమోక్షము దవ్వాయ
 యెడపక శ్రీవేంకటేశ నీమఱఁగు
 బడిఁ జొచ్చితి నాధారము నీది. ॥ఎన్నఁ॥ 886

రేకు 259 ముఖారి

పుణ్యమున నన్నుఁగాచి పురుషార్థివౌదుగాక
 గణ్యమా నే నీకు నాకత యెంతవున్నది. ॥పల్లవి॥

వెలయ నిన్నుఁబొగడేవేదము లనంతములు
 యెలమి నిన్నుఁ బొగడ నెంతవాఁడను
 యిల నిన్నుఁ బూజించేరు ఋషులు కోటానఁగోటి
 అలరి నిన్నుఁబూజించేయంతవాఁడనా. ॥పుణ్య॥

శరణు నీకుఁ జొచ్చినజంతువు లనంతములు
వరుస నే నందులో నెవ్వరిఁ బోలుదు
సొరిది నిన్నుఁ గొలిచేసురలు సేనాసేన
పరగ నేఁగొలిచేటిపని నీకు నెంత. ॥ పుణ్య ॥

కాల మెంతైనాఁ గద్దు కర్మములు వేవేలు
ఆలించ నందులో నే నణుమాత్రము
తాలిమి శ్రీవేంకటేశ దయాధర్మము నీది
పాలించవే నీవు నన్నుఁ బలుకు లేమిటికి. ॥ పుణ్య ॥ 837

లలిత

నాలో నున్నాఁడవు నన్నుఁగావ(క) నీకుఁబోదు
యీలీలఁ బట్టుచీ రెరవిచ్చినవానివలె. ॥ పల్లవి ॥

చుట్టుకొంటిఁ గర్మములు సొరిదిఁ బసిరికాయ
నట్టనడిమిపురువునడకవలె
వట్టిజాలిఁ దిరిగితి వడిఁ బంచేంద్రియముల
పట్టిననీటిలో జలభ్రమణమువలెను?. ॥ నాలో ॥

ధరలోనఁ బుట్టి పుట్టి తగ వచ్చినందే వచ్చి
వరుస రాట్నపుగుండ్రవలె నైతిని
అరసి నే నంటుకొంటి అంగనలపొందులను
చొరఁజారి వేలుకాడేసూదిరాతివలెను. ॥ నాలో ॥

అంతటను ౧ స్వర్గనరకాదిలో కాలు మెట్టితి
బంతిగట్టి నురిపెడిపసురమునై
చెంతల శ్రీవేంకటేశ చేరితి నీవద్ద నేఁడు
వంతుకుఁ గామధేనువద్దిదూడవలెను. ॥ నాలో ॥ 838

---

౧. 'సర్వ' పూ. ము. పా.

సామంతం

జననమరణములు జంతురాసులకు
వెనకముందరను విడువనికొలలు. ॥పల్లవి॥

తలఁచినచోటను తగుదేహములై
పొలసిపోయినాఁ బోనీవు
వెలువల లోపల వెలయ భోగములు
కలలోపలివలెఁ గన్నది తెలివి. ॥జన॥

పూఁచినచోటుల పుత్రమిత్రులై
కాఁచి కరఁచినాఁ గరఁగవివి
తూఁచిన నిరుదెస దుఃఖసుఖంబులు
౧వూఁచి విడుచుచే వోపిన తెలివి. ॥జన॥

అనాదివాసన లంటినజిగురులు
మనోగుణములై మానవివి
వినోదములు శ్రీవేంకటేశుకని
కనేవుపాయము కందువతెలివి. ॥జన॥ 339

ధన్నాసి

అక్కడ నెక్కడినరకము అమాకే కల్లా
దిక్కుల ని(నిం?)దె ఇన్నియుఁ దీరుచుకొంటిమయ్యా. ॥పల్లవి॥

తనువిది మలమూత్రంబుల(లు?) దాకొనియుండినపట్టము
దినదినమును ౨వుచ్చిష్టపుదిడ్డఁ దూరెడము
జననము నెత్తురు నెమ్ములు సారెకు నూరెడిగుంతలు
మని మని నరకము చొచ్చిన మనుజుల మిదె నేము. ॥అక్క॥

---

౧. 'వూఁచి' లోని 'వు'వర్ణస్థానీయ 'వూ' వర్ణమునకు, 'వోపిన' లో అచ్చై వ్యావహారికముగ 'వో' అయిన దానికిని యతి. అచ్-హల్లులకుయతి. ఈవిధమైన యతి వింత. లేక 'ఊఁచుట' అనుసర్థముగల 'ఊఁచు' ధాతువా? అర్థము సరిపడదు. ౨. పూర్వముద్రణమున ఈ 'వు' జారిపోయినది.

మదనజలంబుల కాలువ మాపెద్దలిగపూర్వంబులు(?)
పొదలినపుత్రులయిసిళ్లపుట్లలు వెట్టెదము
యెదుటనె సంసారంబులు యెడయనికారాగృహాములు
మది మది నరకముచవిగొనుమనుజుల మిదె నేము. ॥అక్క॥

పుట్టినదె నగ్నత్వము బూతో బండో యెరఁగము
చిట్టంట్లవాచవులగుజీవుల మ్రింగెదము
నెట్టన శ్రీవేంకటేశ్వర నీతోఁ గూడఁగ జగములు
మట్టినచోటేమట్టేమనుజుల మిదె నేము. ॥అక్క॥ 340

దేసాళి

తప్పులు వొప్పులు దేహి తనమూలమే
రెప్పలతుద నివిగో రేపులు మాపులును. ॥పల్లవి॥

తనలోనిపాపములే తగిలి యెదిటివారి-
నినుపునేరములై నిందింపించు
మనసులోపుణ్యములే మహిఁ గన్న వారిమీఁద
పొనుఁగనినేరుపులై పొగడింపించును. ॥తప్పు॥

తొల్లిటిమరణములు తోడనేపుట్టినపుడే
యెల్లవారుఁ జూడఁగాను యేడుపించును
వెల్లిరేఁగి తాఁజేసే పెనుఁగర్మబంధములే
మెల్లనే నానాఁటికి మేను గొప్పచేసును. ॥తప్పు॥

సావిఁ దననడకలే స్వర్గనరకములై
జీవులకు మాయగప్పి చిక్కింపించు
శ్రీవేంకటేశ్వరుసేవ చేతిలోని మోక్షమై
కేవలపుప్రపంచము గెలుపించును. ॥తప్పు॥ 341

---

౧. 'పూరంబుల' కావచ్చు.

శ్రీరాగం

నడుమ రెంటికిని నామేను
వడఁబడె ౧యెందలివాఁడనో నేను. ॥పల్లవి॥

కంటిమి జగమిది కన్నులయెదుటను
అంటి యిదియు నిజమనరాదు
వింటిమి స్వర్గము వేరెకలదని
కంటగించి అది గాదనరాదు. ॥నడు॥

కట్టుకొంటి మిదె ఘనసంసారము
గట్టిగ నీకఁ దొలఁగఁగరాదు
పట్టుకొంటి మిదె పాపపుణ్యములు
తెట్టఁదెరువుననె దించాలేము. ॥నడు॥

నగితి నొకసెలవి నానాఁటిబదుకు
మొగి నొకచే నిను మొక్కితిని
అగపడె శ్రీవేంకటాధిప నీకృప
నిగుడి గురుచే నినుఁ గనఁగలిగె. ॥నడు॥ 342

రేకు 260 భూపాళం

వెట్టి దెలిసి జగము వెస రోఁకలి చుట్టెను
వొట్టెదేవతలవరా లొగి నెందు లెక్కునో. ॥పల్లవి॥

తగిలి సంపదలచేఁ దనిసినవారు లేరు
అగపడి దైవమానుషాలందును
వొగరుసంసారభార మోపనన్నవారు లేరు
వగవఁగఁ జదువు లెవ్వరికిఁ జెప్పెనో. ॥వెట్టి॥

౧. 'యందలి' రేకు.

జడిసి ౧ ఆయుష్యము చాలునన్న వారు లేరు
పొడమేటిపదునాల్గుభువనాలందు
తడవి తనముదిమి తా రోసేవాఁడు లేఁడు
యెడయనితపముల యెవ్వరిఁ ౨ దెచ్చెనో(?) ॥ వెట్టి ॥

నడుమనే తిరిగాడీ నానాధర్మములు
పడని పాట్ల నేము పడఁగాను
తడవి శ్రీవేంకటేశుదాసులు మమ్ముఁ గాచిరి
బడిబడి నిత్యకర్మఫలము లెన్నటికో. ॥ వెట్టి ॥ 343

రాయగౌళ

ఇంతగాలమాయను యేడనున్నారో వీరు
వింతలై యడవిఁగాసేవెన్నేలాయ బ్రదుకు. ॥ పల్లవి ॥

యేలేవారి దూరితి యెడరువుట్టినవేళ
కాలమును దూరితిని కలఁగేవేళ
తాలిమిలేనివేళ తగుఁగర్మము దూరితి
యేలాగని కాచేవారి నెవ్వరిఁ గానము. ॥ ఇంత ॥

దైవమును దూరితి తమకించినట్టివేళ
కావించి నన్నే దూరితిఁ గాఁగినవేళ
సోవగాఁ గోపపువేళ చుట్టాల దూరితిమి
యీవలఁ దోడైనవారి నెవ్వరిఁ గానము. ॥ ఇంత ॥

పుట్టుగు దూరితిమి పోరానియట్టివేళ
౩ కట్టఁగడ నెందువంకఁ గానమైతిమి
జట్టి శ్రీవేంకటేశుఁడు శరణంటేనే కాచె
యిట్టె యింతటివారు యెవ్వరును లేరు. ॥ ఇంత ॥ 344

౧. 'ఆయిష్యము', రేకు. ౨. 'దేర్చెనో' కావచ్చునేమో? ౩. 'కట్టఁగడ' లో అరసున్న చింత్యము.

నాట

తల మొలా నొక్కసరా తను వొక్కటౌఁగాక
కొలఁది యెఱిఁ గతనిఁ గొలువరో మీరు. ॥పల్లవి॥

బొడ్డున బ్రహ్మఁగనినపురాణపురుషుఁడే
దొడ్డు గాక, ఆతనితోడివాఁడ(డా?)
వొడ్డిన కైలాసమేలేవుమాపతిఁ గడుపులో
వెడ్డువెట్టి పెంచేవాఁడు వీరితోవాఁడా. ॥తల॥

చక్కనికన్నుల సూర్యచంద్రులుగాఁ గలవాఁడు
యెక్కుడుగా, కిందరిలో నీడువెట్టేదా
అక్కర యీదేవతల కాపద మానిపేవాఁడు
వెక్కసమేకాక యెంచ వీరిలోనే వొకఁడా. ॥తల॥

అందరు నీతనియందే అఇతే నౌదురుగాక
యెందును శ్రీపతితోడియీడువారా
కందువ శ్రీవేంకటాద్రి ఘనవరము లొసఁగె
దిందువడ్డలోకులకు ద్రిష్ట మిదే కాదా. ॥తల॥ 345

పాడి

ఏమిచెప్పెడినో శాస్త్రరహస్యము యేమిచెప్పెడినో వేదములు
తామసమై బహునాయకమాయను తత్వమెఱంగఁగఁ దరమేదయ్యా
॥ పల్లవి ॥

కొన్నిజంతువులు రోసినహేయము కొన్నిజంతువుల కమృతము
కొన్నిజంతువులదివములే రాత్రులు కొన్నిజంతువులకు
అన్నియు నిట్లనె వొక్కటొక్కటికి అన్యోన్యవిరుద్ధములు
పన్నినజీవుల కేకసమ్మతము భావించఁగ మరి ఇఁకనేదయ్యా. ॥ఏమి॥

కొందరు విడిచినసంసారము మరికొందరికి నది భోగ్యంబు
కొందరివునుకులు వూర్ధ్వలోకములు కొందరివునుకులు పాతాళంబు
అందరు నందరె వారివాఁరుచు లవిగా దిది(వి?) యనరాదు
కందువజీవులు విచారించేటి కార్యాకార్యము లిఁక నేదయ్యా. ॥ఏమి॥

కొంతభూమి నటు చీఁకటినిండినఁ గొంతభూమి వెన్నెలగాయు
కొంతట సురలును కొంతట నసురలు కోరికై కొనిరి జగమెల్లా
ఇంతట శ్రీవేంకటేశ్వర నీవే యిందరియంతర్యామివి
చింతలు వాయవు యెవ్వరిమనసునఁ జేరి నీకు శరణంటేఁ గాని॥ఏమి 846

## సామంతం

అణుమాత్రపుదేహి నంతే నేను
మణఁగెద లేచెద మందర గానను. ॥పల్లవి॥

తగుసంసారపుతరఁగలు నీమాయ
నిగమములయడవి నీమాయ
పగలునిద్రలువుచ్చేభవములు నీమాయ
గగనపునీమాయఁ గడవఁగవశమా. ॥అణు॥

బయలువందిలి కర్మబంధములు నీమాయ
నియమపుఁబెనుగాలి నీమాయ
క్రియ నిసుకపాఁతరఁ[1]కెల్లొత్తు నీమాయ
జయమంది వెడలఁగ జనులకు వశమా. ॥అణు॥

కులధనములతోఁ జిగురుఁగండె నీమాయ
నిలువు నివురగాయ (?)నీమాయ
యెలమితో శ్రీవేంకటేశ నీకు శరణని
గెలుచుటగాక యిది గెలువఁగవశమా. ॥అణు॥ 847

---

[1]. 'కెల్లొత్తు' = పెళ్లగించుటయా?

బౌళి

ఎన్నఁడుఁ దీరవు యీపనులు
పన్నిన నీమాయ బహుళంబాయ ॥ పల్లవి ॥

పెక్కుమతంబుల పెద్దలు నడచిరి
వొక్కసమ్మతై వొడఁబడరు
పెక్కుదేవతలు పేరువాడెదరు
తక్కక ఘనులము తామేయనుచు. ॥ ఎన్నఁ ॥

వలికెటిచదువులు బహుమార్గంబులు
కలసి యేకవాక్యత గాదు
చ(ఛ?)లవాదంబులు జనులును మానరు
పలుతర్కంబులె పచరించేరు. ॥ ఎన్నఁ ॥

శరణాగతులకు శ్రీవేంకటేశ్వర
తిరముగ నీవే తీర్చితివి
పరమవైష్ణవులు పట్టిరి వ్రతము
యిరవుగ నాచార్యు లెరుఁగుదురు. ॥ ఎన్నఁ ॥ 348

రేకు 261 బౌళి

ఇంతలోనే యెచ్చరేది ఇంతలో మోసపోయేది
చెంత వలసినట్లఁ ౧ తేసుకొంట(?)దేహికి. ॥ పల్లవి ॥

నిమిషములోనిది నింగిఁ దిరిగాడేది
జమళిలోను వెలికి సరదూఁగేది
సమతై వుంటే నుండు చాలించిపోతేఁ బోవు
భ్రమవంటిది ప్రాణము పట్టరాదు దేహికి. ॥ ఇంత ॥

---

౧. చేసుకొంట=తలపోయుట, పశ్చాత్తాపపడుట ఇత్యాదులు కావచ్చు.

నీరుబుగ్గవంటిది నిచ్చకొత్తలైనది
పోరచి పంచభూతాలపొరుగైనది
తీరితేనే తీరును తీరకుండితే నిలుచు
నారువంటిది మేను నమ్మరాదు దేహికి. ॥ఇంత॥

రేపుమాపులైనది రెండు మొకాలైనది
పైపై శ్రీవేంకటేశుభారమైనది
రూపై దగ్గరియుండు రుచులై యెదుటనుండు
తీపువంటిది కాలము తెగదెందు దేహికి. ॥ఇంత॥ 849

దేవగాంధారి

పాపము పాపము ప్రజలాలా
పైపై నిటువలెఁ బలుకకురో. ॥పల్లవి॥

హరియందుఁ బుట్టినజుఁడును శివుఁడును
హరితో సరి వీరను టెట్లూ
హరిఁ గొండలందుఁబుట్టినశిల లివి
సరుసఁ బెట్టితే సరియౌనా. ॥పాప॥

యిందిరాధిపుని విలఁగలసిరులివి
అంది మరొకరివి అనుటెట్లు
కొందరము యేరు గుడిచి కాలువలఁ
బొంది పొగడితేఁ బొసఁగీనా. ॥పాప॥

శ్రీవేంకటపతి సేవకులకు సరి
అవల మరి కలరనుటెట్లు
కావించిన యల కామధేనువుల—
కేవి యూరఁబసు లీడవునా. ॥పాప॥ 850

గుజ్జరి

చెప్పఁగా నెఱఁగరా చేర వేదవ్యాసులు
తప్పక చేతులెత్తి దైవ మితఁ డన్నది. ॥ పల్లవి ॥

యిరవుగా నెఱఁగరా యెల్లదేవతలలో
పొరిఁ గృష్ణుఁడు అగ్రపూజ గొన్నది
తిరమై తెలియరా యీదేవునిపాదపూజ
హరునిశిరసుమీఁద నమరివుండినది. ॥ చెప్పఁ ॥

యింతా నెఱఁగరా యితని రామమంత్రము
తెంకినుండి హరుఁ డుపదేశించేది
పొంకమిదెరఁగరా భువిమీఁద శరభము—
మంకుదనఁ మెల్లఁ దీర మానిపివేసినది. ॥ చెప్పఁ ॥

చూచియు నెఱఁగరా సొరిది శ్రీవేంకటాద్రి—
నేచినవరములెల్లాఁ నియ్యఁగాను
కాచేదెఱఁగరా ఘనుడితఁ డెవ్వరైనా
చేచేత శరణంటేఁ జేకొనేటిరుదు. ॥ చెప్పఁ ॥ 351

వసంతవరాళి

పెలుగఁగఁ బెలుగఁగఁ బెద్దల మైతిమి నేము
కలకలిలేకాని కడగంటలేదు. ॥ పల్లవి ॥

సరి నిన్న భుజియించి చాలువన్నయన్న మే
అరిది నేఁడప్పటిని నాస రేఁచీని
ధరలో రాతిరి గూడి తనిసినసతులే
పరగ నప్పటిని విశ్రాంతి రేఁచీని. ॥ పెలు ॥

మాయఁ గట్టివిడిచిన మలినపుఁగోకలు
యీయెడ నుదికితేనే యిచ్చ రేఁచీని
కాయముపై మోఁచి పెట్టెఁగట్టివేసినసొమ్ములు
మాయలై ఁనదినము మమత రేఁచీని. ॥ పెలు ॥

నీవువట్టినచలమో నేము సేసినట్టితపో
శ్రీవేంకటేశ్వరుఁడ చిక్కితి మిందు
మోవరాని మోపయి ములుగనియ్యదు మమ్ము
చేవసంసారముపైఁ జిమ్మిరేఁచీని. ॥ పెలు ॥ 352

## బౌళి

ఇంకానేలా తర్కవాదములు యిన్నియు నిందునే ముగిసెను
యింకానేలా కొందరు మోక్షం బెవ్వరికిని లేదనుమాటా ॥పల్లవి॥

సరయువుపొంతను సకలజీవులకు
సిరుల మోక్షమిచ్చితివని విన్నపుడే
మరలుచు నాయనుమానము వాసెను
ధర నీవొకఁడవే దైవమవని కంటినయ్యా. ॥ ఇంకా ॥

తగిన లంకవొద్దను రాక్షసులను
తెగనడిచి ముక్తితెరువు చూపినపుడే
వగలఁ బెక్కుదేవతలవరంబులు
జగతి నీపగకు సరిగావయ్యా. ॥ ఇంకా ॥

యేమనిచెప్పుదు నిట్టినీమహిమ
వేమరుఁ బురాణవిధి విన్నపుడు
శ్రీమంతుఁడవు శ్రీవేంకటేశ్వర
కామింప నీకంటే ఘనము లేదుగదవో అయ్యా. ॥ఇంకా॥ 353

సామంతం

అన్నియుఁ జదివితిఁగా అవూ నేను
నున్ననిమాటల నోరు నుడిగెడి దేదో. ॥ పల్లవి ॥

వొద్దనుండే నాజన్మ మోహాన మరచితిఁగా
చద్దివంటి మాతల్లిచన్ను మఱచితిఁగా
ముద్దుతోఁ బోరలే మలమూత్రము మఱచితిఁగా
యెద్దువంటి వాఁడ నేను యెఱిఁగేటిదేదో. ॥ అన్ని ॥

యిప్పటిచవి రేపటి కెంచి తనియలేఁగా
తప్పక కాంతలఁజూచి తలఁపు దనియలేఁగా
ముప్పిరిఁ బెక్కుగాలము ముదిసీఁ దనియలేఁగా
పిప్పివంటి వాఁడ నేను పెనఁగేటి దేదో. ॥ అన్ని ॥

యేడదో యీదేహమాత యే నేమి నెఱఁగఁగా
కూడినమనువెక్కడో గురుతూ నెఱఁగఁగా
యీడనే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గాచెఁగా
నీడవంటివాఁడ నేను నేరుపింక నేదో. ॥ అన్ని ॥ 854

రేకు 262 దేవగాంధారి

వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబలమిదివో విష్ణుకథ. ॥ పల్లవి ॥

ఆదినుండి సంధ్యాదివిధులలో
వేదంబయినది విష్ణుకథ
నాదించీనిదె నారదాదులచే
వీదివీధులనే విష్ణుకథ. ॥ విన ॥

వదలక వేదవ్యాసులు నుడిగిన—
విదితపావనము విష్ణుకథ
సదనంబై నది సంకీర్తనమై
వెదకినచోటనే విష్ణుకథ. ॥విన॥

గొల్లెతలు చల్ల గొనకొని చిలుకఁగ
వెల్లవిరియాయ విష్ణుకథ
యిల్లిదె శ్రీవేంకటేశ్వరునామము
వెల్లిగొలిపె నీవిష్ణుకథ. ॥విన॥ 355

సాళంగనాట

భవరోగవైద్యుఁడవు పాటించ నీవొకఁడవే
నవనీతచోర నీకు నమో నమో. ॥పల్లవి॥

అతివలనెడిసర్పా లధరాలు గఱచిన
తతి మదనవిషాలు తలకెక్కెను
మితిలేనిరతులఁ దిమ్మురివట్టె దేహాలు
మతిమఱచె నిందుకు మందేదొకో. ॥భవ॥

పొలఁతులనెడిమహాభూతాలు సోఁకిన
తలమొలలు విడి చిత్తలై యున్నారు
అలరుచెనకులచే నంగములు తీరలాయ
మలసి యిందుకు నిఁక మంత్రమేదొకో. ॥భవ॥

తరుణులకాఁగిలనేతాపజ్వరాలు వట్టి
కరఁగి మేనెల్ల దిగఁగారఁజొచ్చెను
నిరతి శ్రీవేంకటేశ నీవే లోకులకు దిక్కు
అరుదుసుఖాననుండే యంత్రమేదొకో. ॥భవ॥ 356

సామంతం

కలిగిననాఁడే చుట్టరికంబులఁ దిరుగు నివి
నలుగడ నివి సతమని మతి నమ్ముట పాపమయా. ॥పల్లవి॥

దేహముతోడనె పెరుగును తీరని యీఇంద్రియములు
దేహముతోడనె ముదియును తేటతెల్లమిగను
ఆహా పుట్టిననాఁడును అంతమునొందిననాఁడును
శ్రీహరిమాయలఁ దగులుక జీవునిఁ దడవ విని. ॥కలి॥

తెలిసున్నపుడే తగులును తియ్యనియీసంసారము
తెలివికిఁ బాసినయప్పుడు దిగఁబడుఁ దా నెందో
మలయక నిద్రించునప్పుడు మత్తుఁడై యున్నప్పుడు
చలమరి జీవునితోడుత సమ్మతమే లేదు. ॥కలి॥

కన్నులుదెరచినయప్పుడే కాన్పించును యీలోకము
కన్నులు మూసినయప్పుడె కడగడఁ దా నణగు
అన్నిట శ్రీవేంకటేశ్వరుఁ డాత్మను వెలిఁగెడివేళను
వున్నతిజీవులఁ దగులవు వొడుగుచుఁ దిరుగు నివి ॥కలి॥ 357

దేసాళం

అతఁడే బ్రహ్మణ్యదైవ మాదిమూలమైనవాఁడు
అతని మానుటలెల్లా నవిధిపూర్వకము. ॥పల్లవి॥

యెవ్వనిపేరఁ బిలుతు రిలఁ బుట్టినజీవుల
నవ్వుచు మాసనక్షత్రనామములను
అవ్వల నెవ్వనికేశవాదినామములే
రవ్వగా నాచమనాలు రచియింతురు. ॥అతఁ॥

అచ్చ మేదేవుని నారాయణనామమే గతి
చచ్చేటి వారికి సన్న్యాసము వారికి
ఇచ్చ నెవ్వరిఁ దలఁచి యిత్తురు పితాళ్లకు
ముచ్చట నెవ్వని నామములనే సంకల్పము. ॥ అతఁ ॥

నారదుఁడు దలఁచేటి నామ మది యెవ్వనిది
గారినుడిగేటి నామకథ యెడది
తారకమై బ్రహ్మరుద్రతతి కెవ్వరి నామము
యీరీతి శ్రీవేంకటాద్రి నెవ్వఁ డిచ్చీ వరము. ॥ అతఁ ॥ 358

దేవగాంధారి

పంటఁ భాగ్యులు వీరా బహువ్యవసాయులు
అంటిముట్టి యిట్లఁ గాపాడుమరు ఘనులు. ॥ పల్లవి ॥

పొత్తుల పాపమనేటి పోడు నఱికి వేసి
చిత్తమని యెడ చేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనే మంచి వానపదనున
విత్తుమరు హరిభక్తి వివేకులు. ॥ పంట ॥

కామక్రోధాలనేకలుపు దవ్వివేసి
వేమరువైరాగ్యమనే వెలుఁగు వెట్టి
దోమటి నాచారవిధుల యెరువులు వేసి
వోముచున్నారు ౧ జ్ఞానపుఁబై రుద్యోగజనులు. ॥ పంట ॥

యెందు చూచిన శ్రీవేంకటేశుఁ డున్నాఁడని యెడి—
అందినచేనిపంట లనుభవించి
సందడించి తమవంటి శరణాగతులఁ దాము
గొంది సిముడుకొందురు గురుకృప జనులు. ॥ పంట ॥ 359

---

౧. "జ్ఞానపుఁబేరుద్యోగ" రేకు.

శంకరాభరణం

మానుపవశమా మాయ లివిన్నియు
శ్రీనాథుఁడు మును సేసినవే ॥పల్లవి॥

రాతిరి చీఁకటి రతిఁ బగలు వెలుఁగు
ఘాతల నెప్పుడు గలదిదియే
యీతల జ్ఞానుల కిల నజ్ఞానుల—
జాతివైరములు సహజములే. ॥మాను॥

అసురలకు సురల కనాదినుండియు
అసమున వైరంబది గలదే
౧యెసగి వైష్ణవుల కిలఁ బ్రాకృతులకు
పొసఁగనివాదము భువిఁ గలదే. ॥మాను॥

యిహమునుఁ బరమును యీలంకెలతో
విహితము చెప్పెడి వేదములే
అహిపతి శ్రీవేంకటాధిపుమతమిది
నిహితం బెఱిఁగిన నిశ్చలమే. ॥మాను॥ 860

రేకు-268 సామంతం

ఎక్కడనున్నాఁ బోదు యేతులైనఁ బోనీదు
వొక్కటి కొక్కబంధము వూహింప నెక్కుడు. ॥పల్లవి॥

బుడిబుడిమాయలఁ బొరలేటిదేహికి
కడవరానిబంధము కాంతలు
యెడపడ కందుకంటే నెక్కుడైనబంధము
కడునాసఁ బొరలించు కనకము. ॥ఎక్క॥

౧. 'పొసగి' పూ. ము. పా. యతిభంగము.

బాలులకు ౧వృద్ధులకు పాయపువివేకులకు
తేలించేబంధములు దినరుచులు
మూఁననున్నాఁ బోనీదు ౨ముంగిటనే వేసేది
వేళగాచినబంధము విద్యాగర్వము. ॥ఎక్క॥

పాయ దేజంతువులైనాఁ బశుపతులకునైనా
బాయటి గీముల ౩కట్టుఁబాటు బంధము
యేయెడ శ్రీవేంకటేశ ఇంక నీదాసులకైతే
చాయై చెప్పినట్టు సేసు సకలబంధములు. ॥ఎక్క॥ 361

మలహరి

దైవమా యేమిసేతు తలఁప నీవే దిక్కు
భావించి చదువఁబోయి పశుబుద్ధినైతి. ॥పల్లవి॥

కననా సంసారము కడలేనిభారమౌట
కనినాఁ దొలఁగరాదు కాలురులు
విననా యీదేహము విరసపుహేయమౌట
వినినా జిగురుఁగండె విడిపించరాదు. ॥దైవ॥

తెలియనా ఇంద్రియాలు ౧దిష్టపువిరోధమౌట
తెలిసినాఁ బోఁగువలెఁ దెంచరాదు
పలుకనా పాపములు పాయనిబంధములని
పలికినాఁ గొన్నవెట్టి పట్టితోయరాదు. ॥దైవ॥

యెఱఁగనా యీలోక మిది మాయమయమని
యెఱిఁగినాఁ బడ్డవోఁద మెక్కరాదు
మెఱయ శ్రీవేంకటేశ మేనిలోననేవుండి
మఱియును నన్ను నేల మన్ననసేసితివి. ॥దైవ॥ 362

---

౧. 'ద్రిష్ట' రేకు ౨. 'మున్నిటి' పూ. ము. పా. ౩. 'లఁగట్టు' పూ. ము. పా.

పాడి

మించిన తలపోఁతలే మీఁద మిక్కిలి
 కొంచెము(మొ?) దొడ్డో సరికోరి ఇందుకందుకు. ॥పల్లవి॥

చేసేటిపుణ్యములకు చెందేటిపాపములకు
 యీసుల సరికిసరి ఇందుకిందుకు
 వాసులఁబుట్టుగులకు వడి మరణాలకును
 ఆసల సరికిసరి అందుకందుకు. ॥మించి॥

దినదినసుఖాలకు౧ తీదీపుదుఃఖములకు
 యెనసి సరికిసరి ఇందుకిందుకు
 అనుఁగుఁబున్నమలకు అమాసచీఁకట్లకు
 అనయము సరికిస రందుకందుకు. ॥మించి॥

శ్రీవేంకటేశ పుట్టేజీవులకు నేదిగతి
 యేవి చూచిన సరికిస రిందుకిందుకు
 వేవేగ నీశరణని వెలసి బ్రతికితిమి
 యేవల్ల లేదు సరి యెందుకం(కెం?)దుకు. ॥మించి॥ ౪౬౪

సాళంగనాట

హరియిచ్చినవరము లటువలెఁ గావుగా
 తిరమై వివేకులెల్లాఁ దెలిసేటి దిదియే. ॥పల్లవి॥

శిరసులు తుంచి తుంచి చిచ్చులోన వేలిచి
 వరములు వడసె రావణుఁ౨డెన్నైనా
 నిరతి రామునిచేత నిమిషములోననే
 వరములన్నియు నెందో వరతిపాలాయ. ॥హరి॥

---

౧. 'సుఖాలు' పూ. ము. పా. ౨. 'డెంనైనా' రేకు.

వీరఘోరతపముల వెలయ బాణాసురుఁడు
కోరి చేకొన్నవరాలు కోటానఁగోటి
వూరకే కృష్ణునిచేత నొకకుసుమంతలోనే
తోరమైన వరములు తుత్తునియలాయ. ॥హరి॥

వట్టిజాలిఁ బొరలక వరుస విభీషణుఁడు
జట్టిగ రఘుపతికి శరణనెను
నెట్టన నాతనిఁ గాచె నేఁడూ నున్నాఁడదె
యిట్టె శ్రీవేంకటాద్రి నిచ్చీ వరములు. ॥హరి॥ 364

మాళవి

వీఁడుగదే శేషుఁడు శ్రీవేంకటాద్రిశేషుఁడు
1 పేఁడుక గరుడనితోఁ బెన్నుద్దైన శేషుఁడు ॥పల్లవి॥

2 వేయివడిగెలతోడ వెలసిన శేషుఁడు
చాయ మేనితళుకువజ్రాల శేషుఁడు
మాయనిశిరసులపై మాణిక్యాల శేషుఁడు
యేయెడ హరికి నీడై యేఁగేటిశేషుఁడు ॥వీఁడు॥

పట్టపువాహనమైనబంగారుశేషుఁడు
చుట్టుచుట్టుకొనినమించుల శేషుఁడు
నట్టుకొన్న రెండువేలునాలుకల శేషుఁడు
నెట్టన హరిఁబొగడ నేరుపరి శేషుఁడు. ॥వీఁడు॥

కడిసి పనులకెల్లఁ గాచుకున్న శేషుఁడు
మొదల దేవతలెల్లా మొక్కే శేషుఁడు
అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకును
పదరక యేపొద్దూ పానుపైనశేషుఁడు. ॥వీఁడు॥ 365

1. 'వేఁడుక' పూ. ము. పా. 2. వేయి+పడిగెలు.

శ్రీరాగం

ఎక్కడి విరతి మాకు నిహమెల్లాఁ దగులు
౧మక్కళించి మక్కళించి మాయకింతాఁ దగులు. ॥పల్లవి॥

పుట్టినప్పుడే పాపపుణ్యములు దగులు
అట్టె యాదేహమున కన్నముఁ దగులు
గట్టిగా నిరెండూనైతే కర్మముఁ దగులు
యెట్టునుఁ బోరాదు మాయకింతాఁ దగులు. ॥ఎక్క॥

వానికి సంసారమైతే మమతలు దగులు
పెనగఁగఁ బెనగఁగా బిడ్డలూఁ దగులు
అనువై యీలంపటాన కాసలెల్లాఁ దగులు
మన సొక్కటొక్కటై మాయకింతాఁ దగులు. ॥ఎక్క॥

అరయ శ్రీవేంకటేశుఁ డాత్మలోనే తగులు
శరణన్నవారికి విజ్ఞానము దగులు
గరిమ నిందువల్లనే ఘనమోక్షముఁ దగులు
మరిగినప్పుడేసుమ్మీ మాయకింతాఁ దగులు. ॥ఎక్క॥ 366

రేకు 264 శుద్ధవసంతం

కడనుండేవిజ్ఞానికిఁ గా దిటువలెను
వొడలిరోఁతలు చూచి వూరకైనా నవ్వును. ॥పల్లవి॥

అడఁ బాముగరచినట్టివాఁడు దినఁబోతే
జాఅనివేఁపచేఁదైనాఁ జప్పనై తోఁచు
వీటిదై సంసారపువిష మెక్కినవానికి
చూటలై హేయకాంతలు సుఖములై తోఁచును. ॥కడ॥

---

౧. 'మక్కళించీ మక్కళించీ' పూ. ము. పా.

చెంగట వెట్టివానికి చేసినచేఁతలెల్ల
తొంగలించి వివేకాలై తోఁచినట్లు
మింగుచుఁ గర్మపునామము మేసినసంసారికి
అంగడికర్మమే బ్రహ్మమై తోఁచును. ॥కడ॥

ఆగమిది యొక్కటే చవులు వేరేవేరే
మొగి నెఱుకమఱపు ముడిచున్నది
పగటు శ్రీవేంకటేశుఁ బట్టి కొలువనివాఁడు
తెగని మాయలలోనఁ దేలాడవలసె. ॥కడ॥ 367

బౌళి

నరహరి నీదయమీఁదట నాచేఁతలు గొన్నా
శరణాగతియును జీవునిస్వతంత్రము రెండా. ॥పల్లవి॥

మొఱయుచు నరకపువాకిలి మూసిరి హరి నీదాసులు
తెఱచిరి వైకుంఠపురము తెరువులవాకిళ్ళు
నుఱిపిరి పాపము లన్నియు నుగ్గుగ నిటు తూర్పెత్తిరి
వెఱవము వెఱవము కర్మపువిధు లిఁక మాకేలా. ॥నర॥

పాపిరి నాయజ్ఞానము పరమాత్ముఁడ నీదాసులు
చూపిరి నిను నామతిలో సులభముగా నాకు
రేఁపిరి నీపై భక్తిని రేయినిఁ బగలును నాలో
వోపము వోపము తపములు వూరకె యిఁక నేలా. ॥నర॥

దిద్దిరి నీధర్మమునకు దేవా శ్రీవేంకటేశ్వర
అద్దిరి నీదాసులు నీయానందములోన
ఇద్దరినీనాపొందులు యేర్పర చిటువలెఁ గూర్చిరి
వొద్దిక నొద్దిక నా కిఁక నుద్యోగములేలా. ॥నర॥ 368

ముఖారి

ఎంత విచారించుకొన్నా నిదియే తత్వము హరి
వంతుకు నీకృపగలవాఁడే యెరుఁగు హరి. ॥ పల్లవి ॥

నిన్ను నమ్మినట్టివాఁడు నిఖిలవంద్యుఁడు హరి
నిన్ను నొల్లనట్టివాఁడు నీరసాధముఁడు హరి
మున్ను దేవతలు నీకు మ్రొక్కి బ్రదికిరి హరి
వున్నతి నసురలు నిన్నొల్లక చెడిరి హరి. ॥ ఎంత ॥

యేపున నీపేరిటివాఁ డిన్నిటా ధన్యుఁడు హరి
నీపేరొల్లనివాఁడు నిర్భాగ్యుఁడు హరి
కేపుల నిన్ను నుతించి గెలిచె నారదుఁడు హరి
పైపై నిన్నుఁదిట్టి శిశుపాలుఁడు వీఁగెను హరి. ॥ ఎంత ॥

యిట్టె నీవిచ్చినవర మెన్నఁడుఁ జెడదు హరి
గట్టిగ నీవియ్యనివి కపటములే హరి
అట్టె శ్రీవేంకటేశుఁడ వంతరంగుఁడవు హరి
వుట్టిపడి కానకున్న నొచ్చెము దేహికి హరి. ॥ ఎంత ॥ 369

సామంతం

ఇతనికంటె మరి దైవముఁ గానము యెక్కడ వెదకిన నితఁడే
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటి కాధారము దానె ॥పల్లవి

మది జలధుల నొకదైవము వెదకిన మత్స్యావతారం బితఁడు
అదివో పాతాళమందు వెదకితే నాదికూర్మ మీవిష్ణుఁడు
పొదిగొని యడవుల వెదకిచూచితే భూవరాహమని కంటిమి
చెదలక కొండల గుహల వెదకితే శ్రీనరసింహం బున్నాఁడు. ॥ ఇత ॥

తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది
బలువీరులలో వెదకి చూచితే పరశురాముఁ డొకఁడై నాఁడు
తలఁపున శివుఁడునుఁ బార్వతి వెదకిన తారకబ్రహ్మము రాఘవుఁడు
కెలఁకుల నావులమందల వెదకిన ౧కృష్ణుఁడు రాముఁడు నై నారు ॥ఇత

పొంచి యసురకాంతలలో వెదకిన బుద్ధావతారంబై నాఁడు
మించినకాలము కడపట వెదకిన మీఁదటి కల్క్యవతారము
అంచెల జీవులలోపల వెదకిన నంతర్యామై మెరసెను
యెంచుక ఇహమునఁ బరమున వెదకిన యీతఁడే శ్రీవేంకటవిభుఁడు.
॥ ఇత ॥ 870

లలిత

చాలుఁజాలు నీహరియే మాకును సకలక్రియలకు నాయకుఁడు
నాలుకతుదనే యీతఁ డుండఁగా నలుగడ నెవ్వరి వెదకేము. ॥పల్లవి॥
యేలినవాఁడట లక్ష్మీవిభుఁడట యేమిటనుఁ గొరత మాకిఁకను
నాలోమన్నాఁడు బ్రహ్మతండ్రియట నాకాయుష్యము బాఁతా
పాలజలధిపై దేవునివారము పాఁడి మాకు నిఁక నేమరుదు
ఆలింపఁగ నేమింతటివారము అన్యుల కిఁకఁ జేయి చాఁచేమా. ॥చాలుఁ

భూకాంతాపతికింకరులము యీ భూము లిన్నియును మాసొమ్మే
పైకొని చక్రాయుధుఁడే మాదాపు భయము లిన్నిటాఁ బాసితిమి
యీకడ నచ్యుతుమరఁగు చొచ్చితిమి యెన్నటికిని నాశములేదు
యేకొలఁతని ఇఁక నాసపడుచు నే మెవ్వరికి నోళ్లు దెరచెదము. ॥చా

శ్రీవైకుంఠనివాసులమట యరచేతిది మోక్షము మా కిదివో
పావనగంగాజనకునిబంట్లము పాపములన్నిటఁ బాసితిమి
శ్రీవేంకటపతి వరము లియ్యఁగాఁ జిక్కినవెలుతులు మా కేవి
యీవైభవములఁ దనిసిన మాకును ఇతరులఁ దగిలెడి దిఁకనేది
॥ చాలుఁ ॥ 371

---

౧. 'క్రిష్ణుఁడు' రేకు

రేకు 265 లలిత

ధరఁ గడపట నేజంతువుకైనా తనజన్మమే సుఖమై తోఁచు
హరి గలఁడని తా నమ్మివుండఁగా నతఁడిచ్చేసుఖ మెల్లరు. ॥ పల్లవి ॥

మొదలఁ గొందరికి స్వర్గలోకమే మోక్షసుఖంబని తోఁచును
అదె కొందరికి దేవత్వమే బ్రహ్మానందంబై తోఁచును
పుదుటునఁ గొందరికి సంసారమే పున్నతసుఖమై తోఁచును
తుద నామీఁదటిహరిదాస్యసుఖము ధ్రువపట్టంబని కానరు. ॥ ధరఁ ॥

సొరిదిఁ గొందరటు శూన్యతత్త్వమే సుఖమని మాఁటలనందురు
యిరవెరఁగనివారికి ధనధాన్యము లెక్కువసుఖమై తోఁచును
నిరతిఁ గొందరికి చిరజీవులౌటే నిత్యసుఖంబని తోఁచును
వరుసల శ్రీపతిపై భారంబిదె వైరాగ్యపుసుఖ మెఱంగరు. ॥ ధరఁ ॥

యెక్కడ చూచిన మాయలసుఖములు యెన్నైనాఁ గల వెప్పుడును
చొక్కపు శ్రీవేంకటపతితోడుత సుఖియించేటిసుఖ మెల్లరు
యిక్కడ నక్కడ నీతనిదాసులే యేచి సుఖంతురు నిజసుఖము
కిక్కిరిసినయజ్ఞానాంధకారులు కిందును మీఁదును నెరఁగరు. ॥ ధరఁ ॥

372

మలహరి

నీ కెటు వలసె నటుసేసి నీచిత్తము నాభాగ్యము
యేకడనైనా లక్ష్మీకాంతుఁడ ఇదియే పో నావిన్నపము. ॥ పల్లవి ॥

నాగుణములే యెంచితినా నరకకూపములు చాలవు
ఆగతినే నాకర్మములూ అనుభవించి తీరేనంటే
నీగుణములే యెంచితివా నిఖిలసంపదలు చాలవు
యీగి ననుఁ గరుణించి యెపుడు నీవిచ్చేనంటేను. ॥ నీకె ॥

నా పాపములే లెక్కించితినా నదులయిసుకలును( జాలవు
యేపున నెంతై నా( గలదు అది యెన్న(డు దీరును దేవా
చేపట్టి నీవు రక్షించినయాజీవుల నెంచితివా తొల్లి
చూపట్టెడియీయాకసంబుపై చుక్కలకంటే ఘనము. ॥నీకె॥

మఱి నాసుద్దులు యెంచ(గ నెంచ(గ మంచముకింద నూయి
గుఱి నీకథలివి విన(బోతే నివే కొండలు( గోటాన(గోట్లు
నెఱవుగ శ్రీవేంకటేశ్వర నీకే నే శరణాగతి చొచ్చితిని
తఱి దరిచేర్చ(గ( గూడువెట్ట(గా దైవమ నీకే భారము. ॥నీకె॥ 373

**లలిత**

అరసి నన్ను( గాచినాతనికి శరణు
పరము నిహాముసేలేపతికిని శరణు. ॥పల్లవి॥

వేదములు దెచ్చినట్టివిభునికి శరణు
ఆదిమూలమంటే వచ్చినతనికి శరణు
యేదెసా( దానై యున్నయీతనికి శరణు
శ్రీదేవిమగ(డైన శ్రీపతికి శరణు. ॥అర॥

అందరికి( బ్రాణమైనఅతనికి శరణు
ముందు మూ(డుమూర్తులమూర్తికి శరణు
దిందుపడి దేవతలదేవునికి శరణు
అంది మిన్ను నేలనేకమైనతనికి శరణు. ॥అర॥

తానే ౧ చేతన్యమైనదైవానకు శరణు
నానాబ్రహ్మాండాలనాథునికి శరణు
అనుక శ్రీవేంకటాద్రియందునుండి వరములు
దీనుల కిందరి కిచ్చేదేవునికి శరణు. ॥అర॥ 374

---

౧. 'చైతన్య' కావచ్చు.

మంగళకౌశిక

౧ఇది నమ్మలేఁడు పుణ్యాలేమేమో చేసీ దేహి
పొదలి యిందువంకనే పొడవెక్కలేఁడా. ॥పల్లవి॥

మంచిమందుగొన్నవాఁడు మహామహారోగముల
అంచెలఁ బాసి సుఖయయ్యీనటా
అంచితపుహరినామమనేమందుగొన్నవాఁడు
పొంచి పాపరోగములఁ బోఁదోలలేఁడా. ॥ఇది॥

జోడుదొడిగినవాఁడు చొక్కపు టలుగులకు
వోడక రణజయము నొందీనటా
వాడకహరిదాస్యపువజ్రపంజరపువాఁడు
పీడ జన్మపుటమ్ములు విదలించలేఁడా. ॥ఇది॥

వైపగుఁగాణాచిగలవాఁడు దరిద్రముఁ బాసి
పైపై సంపదలతో బ్రదికీనటా
దాపై శ్రీవేంకటేశుపాదములందుఁ గాణాచి
యెపొద్దూఁ గలుగువాఁడు యెక్కువగాలేఁడా. ॥ఇది॥ 375

గుండక్రియ

ఎక్కడివుద్యోగాలు నేడ కెక్కు జీవునికి
నిక్కిచూచి హరి గరుణించినదాఁకాను. ॥పల్లవి॥

తనిసినవారు లేరు తగనింద్రియభోగాలు
పెనఁగఁబెనఁగఁ బైపైఁ బెరుగుఁగాని
మనసులోనికి రాదు మాటలలోని విరతి
తునిగినట్లనుండు దొరకుదాఁకాను. ॥ఎక్క॥

౧. ఈపాటలో రెండు, నాలుగు పాదముల కడదీర్ఘము రేకులోనిది. పూ. ము. పా. లో టాలంతా టలుగా ముద్రితము.

విడిచినవారు లేరు విషయాలు సంపదలు
పుడుగక కోరఁగోర నొదగుఁగాని
పుడమి విన్నట్టుండదు పుస్తకాలలో చదువు
నడుమంత్రపుములనుండు నానినదాఁకాను. ॥ ఎక్క ॥

తెలిసిన వారు లేరు దేవుని నాతుమలోన
పలులంపటాలఁ బడి భ్రమసుఁగాని
యెలమి శ్రీవేంకటేశుఁ డేమిటా మెచ్చఁడు తన్నుఁ
దలఁచి భక్తితోడ దగ్గరుదాఁకాను. ॥ ఎక్క ॥ 876

రేకు 266 పాడి

సకలశాంతికరము సర్వేశ నీపై భక్తి
ప్రకటమై మాకు నబ్బె బదికించు నిదియె. ॥ పల్లవి ॥

మనసులో పాపబుద్ధి మరి యెంతదలఁచినా
నినుఁ దలఁచినంతనే నీరౌను
కనుఁగొన్న పాపములు కడలేనివైనాను
మనుఁడ నిన్నుఁ జూచితే కడకుఁ దొలఁగును. ॥ సక ॥

చేతనంటి పాతకాలు సేనగా నేఁ జేసినాను
అతల నీకు మొక్కితే నన్నియుఁ బాయు
ఘాతలఁ జెవుల వినఁగా నంటినపాపము
నీతితో నీకథవించే నిమిషానఁ బాయును. ॥ సక ॥

కాయమునఁ జేసేటికర్మపుఁబాపములెల్ల
కాయపునీముద్రలచే గక్కన వీడు
యేయెడ శ్రీవేంకటేశ యేయేపాతకమైనా
ఆయమైన నీశరణాగతిచే నణఁగు. ॥ సక ॥ 877

లలిత

రెప్పలమరఁగదె రేపును మాపును
ఇప్పుడే తోఁచీ నిదివో కీలు. ॥పల్లవి॥

మనసున నున్నవి మాయలన్నియును
మనసు మరచితే మాయలు మరచును
పనిపడి మనసును బారఁగవిడిచిన
కనుఁగొన మాయలు కడలే వివిగో. ॥రెప్ప॥

దేహముననున్నది తెగనిలంపటము
దేహ మఱచితేఁ దెగును లంపటము
వూహల దేహమే వోముఁగఁదొడఁగిన
మోహపుమాయలు మోపులకొలఁది. ॥రెప్ప॥

ఆతుమ నున్నాఁడు అంతరాత్మకుఁడు
ఆతుమమరచిన నాతఁడు మరచును
యీతఁడె శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన
చేచేతనే సుఖములు సేనాసేన. ॥రెప్ప॥ 378

మాళవి

అన్నియు నాయందే కంటి నన్నిటివాఁడా నేనే
మున్నె నాభావముతో ముడిచివేసినది. ॥పల్లవి॥

చెలఁగి సంసారమే చింతించి సంసారినైతి
ములిగి ముక్తిదలఁచి ముక్తుఁడనైతి
పలునుకాలు దలఁచి పాషండబుద్ధినైతి
చెలఁగి శ్రీపతిఁ దలఁచి వైష్ణవుఁడనైతి. ॥అన్ని॥

పొసఁగఁ బుణ్యముసేసి పుణ్యాత్ముఁడనైతి
పసలఁ బాపముచేసి పాపకర్ముఁడనైతి
వెస బ్రహ్మచారినైతి వేరే యాచారమున
ముసిపి మరొకాచారమున సన్న్యాసినైతి. ॥ అన్ని ॥

వాగి నొడ్డెభాషలాడి వొడ్డెవాఁడనైతిని
తెగి తెలుఁగాడ నేర్చి తెలుఁగువాడ నైతి
అగడై శ్రీవేంకటేశ అన్నియు విడిచి నేను
తగు నీదాసుఁడనై దాసరి నే నైతి. ॥ అన్ని ॥ 379

సాళంగనాట

ఇహ పరములు ౧గొన నీదేవుఁడే
సహజ మిన్నిటాను సర్వేశుఁడే. ॥ పల్లవి ॥

తలఁచి చూచినాను తనలోనే మఱచిన(నా?)
తలఁపులకొనవాఁడు దైవ మొకఁడే
పలికిచూచినాను పలుకకమానినాను
పలుకులకొనవాఁడు పరమాత్ముఁడే. ॥ ఇహ ॥

కనుఁగొని చూచినాను కనురెప్ప మూసినాను
కనుచూపుకొనవాఁడు కమలాక్షుఁడే
విని యాలకించినాను వినకట్టె మానినాను
వినుకులకొనలెల్లా విష్ణుఁ డొక్కఁడే. ॥ ఇహ ॥

మేలుకొనివుండినాను మించి నిద్దిరించినాను
కాలముకొనలవాఁడు ఘనుఁ డీహరే
యీలాగు శ్రీవేంకటేశుఁ డెదలోన నున్నవాఁడు
కీలు విచారించితే ౨శ్రీకృష్ణుఁ డితఁడే. ॥ ఇహ ॥ 380

---

౧. 'గొనా' పూ. ము. పా., రేకు. అదీర్ఘము సంగీత పరమైనదనుకొందు.
౨. 'క్రిష్ణ' రేకు.

ధన్నాసి

నేనేమి సేఁతి నీకు నిరుణము పాపలేను
నానావిధముల నీవే నన్నుఁ గాయవుగా. ॥ పల్లవి ॥

మతిలో చీఁకటి మాన్ప మాణిక్యదీపమవై
సతమై నాలికెపైకి చవిదేనెవై
కతలై నన్నుఁ జొక్కించఁ గర్ణామృతమవై
గతి వైతివిగా నాకుఁ గమలారమణా. ॥ నేనే ॥

చేరి నాకన్నులెదుట శృంగారరసమవై
ఆరసి రక్షించఁ బిసుగార్జిసమవై
సారపుటిహపరాలసంసారసుఖమవై
యీరీతిఁ బెంచితిగా నా కిందిరారమణా. ॥ నేనే ॥

తనువిచ్చి జీవునికిఁ దల్లి వితండ్రివినై
దనమవై ౧దాతవు దైవమువునై
అనుఁగు శ్రీవేంకటేశ అంతరాత్మవు నీవై
నను మన్నించితివిగా నారాయణా. ॥ నేనే ॥ 381

శంకరాభరణం

ముగియదు కాలము ముందరి కింకాఁ
దెగనిప్రవాహము దినదిన మిదిగో. ॥ పల్లవి ॥

బొంకపుహరిచేఁ బొడమినజగమిది
యింకాఁ బొడమీ నివి గొన్ని
కంకిగఁ జెరువులు కాల్వలు నంటా
అంకెల నిర్మితమయ్యీ నివిగో. ॥ ముగి ॥

౧. ఇక్కడ, 'నా' మూ. ము.పా. లో ఎక్కువ. రేకులో లేదు.

దేహము భోగించి దించినవిషయము-
లీహల మీఁదెత్తె నివి గొన్ని
ఆహారములై అన్యస్త్రీలై
వూహలనే నోరూరించీ నివిగో. ॥ముగి॥

మనసునఁ దలఁచిన మాయలు కమ్మర-
నినుమడించె మతి నివి గొన్ని
కనుఁగొని శ్రీవేంకటపతిదాసులు
పెనఁగి పెంచఁగాఁ జెరిగీ నిదిగో. ॥ముగి॥ 382

రేకు 267 లలిత

పెద్దతెరు వుండఁగాను పెడగంతలు దీసుక
పొద్దువోక యడవులఁ బుంగుడయ్యేరు. ॥పల్లవి॥

తొల్లిటిపెద్ద లెంచిరి దొడ్డవాఁడు హరియంటా
అల్లదె భారతరామాయణభాగవతములు
ఇల్లిదె నేఁటిపెద్దలు యెవ్వరో దైవములంటా
వెల్లవిరిగా నింకా వెదకేరు. ॥పెద్ద॥

దేవలోకమువారు దేవుఁడు శ్రీపతియని
భావించి మొరవెట్టి బ్రదికిరి
యీవల నిప్పటివారు ఇందరికి మొరవెట్టి
కావిరి నెవ్వరివారుగాక వున్నారు. ॥పెద్ద॥

నానాభూములవారు నమ్మి శ్రీవేంకటపతిఁ
గానవచ్చి యేఁటనేఁట ఘనులయ్యేరు
యీనిజ మిక్కడివారు యిన్నియుఁ దెలిసుండియు
మానక చలాలఁబోయి మాయలఁ బొందేరు. ॥పెద్ద॥ 383

లలిత

నా కేల విచారము నా కేల యాచారము
సాక్షివై నవాఁడ నింతే సర్వేశుఁడే దిక్కు. ॥పల్లవి॥

ప్రపంచమధీనము పొలువడ్డ దేహమిది
ప్రపంచముతోడిపాటు వరగిని
యెప్పుడూ నీయాతుమ యీశ్వరాధీనము
అపు డాతఁ డెట్టునిచె నట్టె అయ్యీని ॥నా కే॥

కర్మాన కధీనము కలిములు లేములు
కర్మమెట్టు గల్పించెఁ గలిగీని
అర్మిలి నాయాచార్యునధీనము మోక్షము
ధర్మ మతనికృపను తానే వచ్చీని. ॥నా కే॥

చిత్తమున కధీనము చిల్లరయింద్రియములు
చిత్తము చిక్కినప్పుడు చిక్కీనవి
హత్తి శ్రీవేంకటేశుదాస్యమధీనము జన్మము
పొత్తుల నందుకు నద పూఁచినట్టయ్యీని. ॥నా కే॥ 384

మాళవి

ఏఁటి పరిణామము మమ్మేల యడిగేరయ్య
గాఁటపుహరి యొక్కఁడే గతి మాకిఁకనయ్య. ॥పల్లవి॥

మరుగుచు శ్రీహరిమాయలోఁ జిక్కినయట్టు
గరిమలఁ గులకాంత కాఁగిటఁ జిక్కితిమయ్య
తిరముగఁ గాలములు దిగమింగినయట్టు
సొరిది చవులు మింగుచునున్నారమయ్య. ॥ఏఁటి॥

జననిగర్భములోన చక్కఁగా మునిఁగినట్లు
మునుకొని నిద్దురల మునిఁగివున్నారమయ్యా
చనవునఁ గర్మమనేజలధిలో నున్నట్లు
ధనధాన్యాలనడుమఁ దగిలివున్నారమయ్యా. ॥ఏఁటి॥

పేదవాఁడు నిధిగని పెక్కువ బతికినట్లు
గాదిలి శ్రీవేంకటేశుఁగని చెలఁగితిమయ్యా
యీదెస ౧ మొక్కేదైవ మెదురుగావచ్చినట్లు
ఆ దేవుఁడే మాకు నంతరాత్ముఁ డాయనయ్యా. ॥ఏఁటి॥ 385

బౌళి

సాసముఖా ౨నదె సాసముఖా
ఆసలపరివారము అవధారు దేవా. ॥పల్లవి॥

మత్తిలి జీవుఁడనేటిమహిమగలుగురాజు
చిత్తమనియెడిపెద్దసింహాసనం బెక్కి
బత్తితోఁ బంచేంద్రియపుపరివారము గొలువ
చిత్తజుపారుపత్యము సేసీనిదివో. ॥సాస॥

కడుమదించినహంకారమనేయేనుగపై
యెడనెడ నెక్కి తోలీనిదె జీవుఁడనురాజు
బదిబడిఁ గర్మములబోఁజులు దీర్చరో
వెడమాయపట్టణపువీధుల నేఁగీని. ॥సాస॥

మించినసంసారమనేమేడలో నేకాంతమున
పొంచి జీవుఁడనేరాజు భోగము భోగించఁగా
అంచెల శ్రీవేంకటేశుఁడనేదేవుఁడు వచ్చి
మంచితనమునఁ దానె మన్నించె నదివో. ॥సాస॥ 386

---

౧. "యీదెస మొక్కె దైవ మొదురుగా" పూ. ము. పా. యతిభంగము.
౨. 'సదె' పూ ము. పా. ఈపాటవిచారణ చూ. ప్రథమసంపుటముపీఠిక. (1980)

ముఖారి

నీకు నీసహజ మిది నాకు నాసహజమిది
యేకడా నీవే నిరుహేతుకబంధుఁడవు. ॥ పల్లవి ॥

నే నిన్నుఁ దలఁచినా నెటి నిన్ను మఱచినా
పూని వాయంతరాత్మవై వుండకపోవు
పూని నిన్నుఁ బూజించినాఁ బూజించకుండినాను
కానీలే యీశ్వరుఁడవు గాకమానవు. ॥ నీకు ॥

యిట్టె నే నడిగినా నేమీ నడుగకుండినా
జట్టిగా నీవు రక్షించకమానవు
తొట్టి నిన్ను దగ్గరినా దూరమున నుండినాను
పుట్టించి నీగర్భములోఁ బొదలించకుండవు. ॥ నీకు ॥

భావించి నీకు మొక్కినాఁ బరాకై మానినా—
నేవి చూచినా నీవై యిఁకఁ బాయవు
శ్రీవేంకటేశుఁడ నీవే చింతాయకుఁడవు
కావించేటినావుద్యోగము లేమి కాఁతి. ॥ నీకు ॥ 287

రామక్రియ

కాంతలమానమనేటికరవట్నాలకు దిగె
మంతనాన జీవుఁడనే మంచిమరకాఁడు. ॥ పల్లవి ॥

అరిది సంసారమనేయంబుధిలోనఁ దిరిగి
పురుగతి దేహపుటోడమీఁద
సరిఁ బాపపుణ్యములసరకులు నించుకొని
దరి చేరె జీవుఁడనేతలమరకాఁడు. ॥ కాంత ॥

కడలేనినిట్టూర్పుగాలి విసరఁగాను
జడియుఁ గోరికలనేచాపలెత్తి
అడిబరవుగ మాయ అందునిండా నించుకొని
యెడతాఁకె జీవుఁడనేయీమరకాఁడు ॥ కాంత ॥

అలర శ్రీవేంకటేశుఁడని యేటిమాలిమి
నలుదిక్కులకు నోడ నడపఁగాను
ములిగె ధర్మార్థకామమోక్షధనము గడించి
పలుమారు జీవుఁడనేబలుమరకాఁడు. ॥ కాంత ॥ 388

రేకు 268 లలిత

చంకగుదియ యిదే శరణార్తి నే నిదే
తెంకి నాభావము దేవుఁడే యెరుఁగు. ॥ పల్లవి ॥

కోరెడిచిత్తము కోరక మానదు
వైరాగ్యము నే వదలను
యీరీతి దినములు యిట్లనే కడచీ
తేరినపను లేక దేవుఁడే యెరుఁగు. ॥ చంక ॥

తగుసంసారము తనువునఁ బెనఁగీ
వెగటై మోక్షము వెదకేను
పగటున రెంటాఁ బరగినజీవుఁడు
తెగువలుఁ దగులమి దేవుఁడే యెరుఁగు. ॥ చంక ॥

పంచేంద్రియములు పారీ నిక్కడ
పెంచఁ బెద్దనై పెరిగేను
అంచెల శ్రీవేంకటాధిపుఁ గొలిచితి
దించనియీమాయ దేవుఁడే యెరుఁగు. ॥ చంక ॥ 389

లలిత

ఆడుతాఁ బాడుతా నీతో నట్టె ముద్దుగునుసుతా
వోడక నీదండ చేరి వున్నారమయ్యా. ॥పల్లవి॥

ఆసఁ దల్లిదండ్రి మోము అట్టె చూచి శిశువులు
యే సుఖదుఃఖములుఁ దా మెరఁగనట్టు
వాసుల శ్రీపతి మిమ్ము వడి నాత్మఁ దలఁచుక
యీసుల పుణ్యపాపము లెఱఁగమయ్యా. ॥ఆడు॥

యేలినవారు వెట్టఁగా నేపునఁ దొత్తులు బంట్లు
ఆలకించి పరులఁ ౧బోయడుగనట్టు
తాలిమి శ్రీపతి మీరు తగ మమ్ము రక్షించఁగా
యేలని యేమియుఁ గోర నెరఁగమయ్యా. ॥ఆడు॥

చేతఁ జిక్కి నిధానము చేరి యుంటఁగలవాఁడు
యేతులఁ గలిమిలేము లెఱఁగనట్టు
ఆతుమలో శ్రీవేంకటాధిప నీ వుండఁగాను
యీతల నేవెలుతులు నెరఁగమయ్యా. ॥ఆడు॥ ౩౯౦

బౌళి

బాపురే వో ప్రాణి బాపురే వో మనసా
వోపనన వెందుకైనా నోడఁబడేవు. ॥పల్లవి॥

మురికిదేహమొకటి మోచుక నీ వప్పటిని
మురికిదేహసతుల మోవఁగోరే వప్పటిని
తరకుహేయము గొంత కడుపున నించుకొని
తిఁగి ౨హేయమేకాను(?)తినఁబోయే వప్పటి. ॥బాపు॥

౧. పోయి+అడుగనట్టు. ౨. 'హేయమే కాను'=హేయమేయగుటకు. మరల తిన్నఅన్నముకూడ హేయమగుట సహజముకదా.

పసిఁడి కమ్మడువోయి పరులఁగొలిచి మరిఁ
బసిఁడి సొమ్మంటాఁ బైఁబెట్టఁ గోరేవు
పిసరుఁ బాపపుణ్యాలఁ బెడఁగేలు గట్టించుక
విసువక అవియే కావించఁబోయే వప్పటి. ॥బాపు॥

పంచభూతములచేతఁ బట్టువడి కమ్మరాను
పంచభూతాల దేహాల బంధులంటాఁ దగిలేవు
అంచెల శ్రీవేంకటేశుఁ డాతుమలో నున్నవాఁడు
యెంచక తెలిసియును కల్లై మరచే వప్పటి. ॥బాపు॥ 391

భూపాళం

నారాయణ నే నస్వతంత్రుఁడను నాకా పనిగా దేవియును
ధారుణిలోపలఁ బుట్టించితివి తరువాతిపనులు నీకే సెలవు. ॥పల్లవి॥

శ్రీపతి నీకే సమర్పితంబై శేషంబైనది యాతుమ దొల్లే
యేపున విషయములందులోఁ దగిలె యేమయిన నీకే సెలవు
చూపరఁ బసురము తొరలు పోయినను సొమ్ముగలుగువాఁడే పరవంజుక
పైపైఁ దానే వెదకి తెచ్చి కాపాడఁగ నతనికి భారముగాన. ॥నారా

యీడులేక శ్రీహరి నీవుండెడియీ దేహపునీవరికరమూఁ
బాడిగఁ బంచేంద్రియములు పట్టుక బడిఁ దిప్పెడి నీకే సెలవు
వోడక యధికులు తమ దాసులు మరివొకరిపంపు లటు సేయఁగను
చూడరు తమబలములనే విడిపించుక తామే రక్షింతురు గాని. ॥నారా

శ్రీవేంకటపతి నీవే నన్నిటు సృష్టించినజీవుఁడ నింతే
కావిరి నజ్ఞానము నన్నిటువలెఁ గప్పిన నది నీకే సెలవు
ధావతిఁ దలిదండ్రులు తమబిడ్డలతనువులఁ బంకము లంటినను
యేవిధముల నీరార్చి పెంతు రటు ఇన్నిట నీవే గతి నాకు. ॥నారా॥392

ధన్నాసి

అందితిని( బొందితి నీయందు దశలభోగములు
కందర్పజనక నాకు( గలిగిత విన్నిటా. ॥పల్లవి॥

ఘనకుండలములు నీకథలు నాచెవులకు
ననుపైనరుచులు నీనామములు నాలుకకు
అనువై నీకు మొక్కు(గ నంటిననొసలిమన్ను
పనివడి నాకు పట్టబద్ధ(ంధ?)ము. ॥అంది॥

మంచినిర్మాల్యపుదండ మంగళసూత్రము నాకు
కాంచనపురాసి నీచక్కనిరూపు నామతికి
పంచామృతములు నీపాదతీర్థము మేనికి
వంచినముద్ర లదే వజ్రాంగిజోడు. ॥అంది॥

సకలబంధులు నీదాసానదాసులే నాకు
అకలంక జన్మఫల మన్నిటా నీకృప నాకు
ప్రకటపుశ్రీవేంకటపతివి నాయాతుమలో
మొకరివై యుండి నన్ను మోహించ( జేసితివి. ॥అంది॥ 393

భూపాళం

పాపము( బుణ్యము( బరకట నున్నది
చేపట్టుము నీచేతి దిప్రాణి. ॥పల్లవి॥

నాలుకకొనలనె నానుచు నున్నది
గాలపునిజమును( గల్లయును
వాలుచును తానువలెనున్న దిదే
కాలిమి ధర్మాధర్మములు. ॥పాప॥

చేతులకొనలను చేఁతై యున్నది
జాతిగ నరకము స్వర్గమును
ఆతల వేదోక్తమైనకర్మములు
దాతనె పిడికిటఁ దగిలెను ౧ వెదకు(?) ॥పాప॥

మనసుకొట్టఁగొన మాయయు నున్నది
వెనక శ్రీవేంకటవిభుఁడు నదే
తనరినయాతనిదాస్యము నున్నది
పిని చేకొందువు వెదకవో నీవు. ॥పాప॥ 394

రేకు 269 లలిత

తిప్పు దీయర్థమొకటి దాఁచినధనముసుండీ
విప్పరాదు చెప్పరాదు వేదమందు నున్నది. ॥పల్లవి॥

హరిభక్తిగలిగినయతనికి మోక్షము
పొరుగుననున్నట్టు పొసఁగినది
దరిశనభక్తిచేఁ దనరినవారికి
యిరవైనమోక్షము యెదిటిది. ॥తప్ప॥

మక్కువభాగవతాభిమానముగలవారి—
కక్కరలేనిమోక్ష మరచేతిది
నిక్కి యాచార్యాభిమాననిరతులైనవారికి
తక్కక మోక్ష మింతాఁ దనలోనిది. ॥తప్ప॥

యెంత విచారించుకొన్నా నేమేమి చదివినా-
నెంతవారికైనా మోక్ష మిందులోనిది
పింతగా శ్రీవేంకటవిభునిసంకీర్తన—
వంతులకు మోక్షము వదనములోనిది. ॥తప్ప॥ 395

---

౧. 'వెద' 'వ్యథ' శబ్దభవము గదా.

మలహరి

ఎవ్వరి దూరఁగఁ జోటు లేదు మరి యేమనఁ గల దిదివో తగవు
యివ్వల నందరి బడిబడిఁ దిరిగే యీకర్మముదే నేరమి. ॥పల్లవి॥

నీదాసులకును నేరమి లేదు నీవే గతియని వుండఁగను
ఆదినుండి నీకును నేరమి లేదఖిలానకుఁ గర్తవుగాన
పాదుపడక నడుమనుఁ దిరిగాడెడి ప్రపంచముదే నేరమి
యేదెస నొకచో నిజమేరుపడక యిటువలెఁ దిరిగాడెడిఁగాన. ॥ఎవ్వ॥

పాపము లేదిదె యజ్ఞానులకును భావమెరంగనిపశువులుగాన
మోపై సుజ్ఞానులకునుఁ బాపము మోవదు నినుఁ గొలిచిరిగాన
చాపలముగ నమ్మించి చెరుచు పలుచదువులదే యీపాతకము
పైపై నొకయర్థ మేరుపరచక భ్రమయఁగ వాదము వెట్టెడిఁగాన. ॥ఎ॥

యీలోకులకును అధర్మము లే దిన్నియు నీచేఁతలేకాన
మూలనున్నముక్తులకు నధర్మము మొదల లేదు నీకృపగనక
కాలము గడపుచు నీవు రచించినకపటపుమాయదే అధర్మము
ఆలరి శ్రీవేంకటేశ్వర య(యె?)క్కడనడ్డము తానే వచ్చీఁగాన ॥ఎ॥396

బౌళి

ఇదె చిక్కితి విఁక నెందు వోయెదవు
వుదిర తొలఁగరా దోవహో నీవు. ॥పల్లవి॥

జీవులలోపలఁ జెలఁగేటిమూర్తివి
దేవతలకు పరదేవుఁడవు
కైవల్యమునకుఁ గలుగుబ్రహ్మమవు
అవలిపరమున కర్థమవు ॥ఇదె॥

ఘనకర్మమునకుఁ గలిగినఫలమవు
మనసులోనికిని మాయవు
తనియనిచదువుకు దాఁచినధనమవు
మునుప జగములకు మూలమవు. ॥ ఇదె ॥

వలసినవారికి వర్ణించురూపవు
సులభులకు సంసార సుఖమవు
అలరినదాసులమగుమాకైతే
కలిగిన శ్రీవేంకటపతివి. ॥ ఇదె ॥ 397

భూపాళం

తెలిసియుఁ దెలియను తెగ దీచి క్కెమిటాను
కలకాల మిందుననే గరివడి బ్రదుకు. ॥ పల్లవి ॥

దేహముపై రోఁత తెలుసుకొనేటివేళ
ఆహా యిదే హేయమై తోఁచును
మోహించి విషయాల మునిఁగినవేళ నిదే
యూహాల నంతటిలోనే ఇతవులై వుండును. ॥ తెలి ॥

చదివి నేఁ బురాణాలు సారెకు వినేటివేళ
అదివో విరతి ఘనమై వుండును
కదిసి సంసారసుఖకాంతులఁ బొందేటివేళ
మది నన్నియు మరచి మదమెక్కివుండును. ॥ తెలి ॥

యెక్కుడదివివేక మెవ్వరు గెలిచినారు
చక్కఁ బొడవెక్కించు చరిఁ దోసును
దిక్కు నీవే శ్రీవేంకటదేవుఁడ నీశరణంటే
యెక్కువ బ్రదుకుఁదోవ యిదియే కలది. ॥ తెలి ॥ 398

### దేసాక్షి

అల్లనాఁడే యిదెరఁగమైతిమిగాని
యిల్లిదె దేవునికృప యీడ నున్నదిసుండీ. ॥పల్లవి॥

చేరువనే మోక్షము శ్రీహరిభక్తికిని
దారుణిఁ గర్మమునకే దవ్వుగాని
యీరీతి నింద్రియముల నించుకంతే దాఁటిన
దూరముగాదు జ్ఞానపుతోవ వున్నదిసుండీ. ॥అల్ల॥

ధరఁ జేరిది వైకుంఠ మతనిదాస్యమునకు
పరధర్మముల కగపడదుగాని
అరుదైనయాసలఆయము వొడిచితేనే
అరసి యాకంతగుండా నందవచ్చుఁజుండీ. ॥అల్ల॥

తలఁపులో దక్కె ముక్తి తగు శరణాగతికి
శిలుగుఁబుణ్యములకుఁ జిక్కదుగాని
తెలిసి శ్రీవేంకటేశుతిరుమంత్రము నాలికెఁ
బలికినాడనే దివ్యపద మబ్బుఁ జుండీ. ॥అల్ల॥ 399

### సామంతం

మూఁడుమూర్తులనైన ముంచుకొను నీవలపు
వేఁడివిరహములోనె వేఁచు నీవలపు. ॥పల్లవి॥

పాపమెరఁగదు వలపు భయమెరంగదు వలపు
రూపెరంగదు మతికి రుచిసేయు వలపు
పూపవయసున పండు వొడమించు నీవలపు
తీపులకుఁ గడుదీపు దినదినము వలపు. ॥మూఁడు॥

సిగ్గెరంగదు వలపు శిరసు కెక్కును వలపు
వొగ్గించు నన్నిటికి వొడిగట్టు వలపు
బగ్గనను నటు గుండె పగిలించు నీవలపు
అగ్గలపుజాణలకు నాయ మీవలపు. ॥ మూఁడు ॥

తెగువ దెచ్చును వలపు తేలించు నీవలపు
యిగిరించి కలిమితే మెఱఁగ దీవలపు
వగల శ్రీవేంకటేశ్వరుమాయ లీవలపు
౧తగులువిరికాని(?)వలెఁ దగిలించు వలపు. ॥ మూఁడు ॥ 400

రేకు 270 దేసాళం

ఎదురులేక చరింతు రెట్టైనా శ్రీవైష్ణవులు
మదించినేనుగులకు మట్టు మేర వున్నదా. ॥ పల్లవి ॥

భాగీరథిలోనఁ బాపమున్నదా పుణ్య—
భోగపువేదములలో బొంకు లున్నవా
సాగరపుటమృతపుచవిలోఁ జేఁదున్నదా
ఆగతి హరిదాసుల కప ాధ మున్నదా. ॥ ఎదు ॥

ఆకసములోన ౨నెరుసందున్నదా భూమిఁ
జేకొని రవియెదుటఁ జీఁకటున్నదా
యీకడఁ గామధేనువు కియ్యరాని వున్నవా
కైకొన్న ప్రపన్నులను గరిసించ నున్నదా. ॥ ఎదు ॥

హరినామమంత్రములో నోఁగాము లున్నవా
గురుకృప గలిగియుఁ గొరతున్నదా
సరవి శ్రీవేంకటేశు శరణన్న వారికి
విరసంబు లందులో వెదకఁగఁ గలదా. ॥ ఎదు ॥ 401

---

౧. తగులావిరికాఁడు=సంబంధము కలిగించు మన్మధుడా?
౨. నెరుసు+అందున్+ఉన్నదా=నెరసందున్నదా.

రామక్రియ

వీఁడివో లక్ష్మీపతి వీఁడివో సర్వేశుఁడు
వీఁడివో కోనేటిదండవిహారించే దేవుఁడు. ॥ పల్లవి ॥

కొండ గొడుగుగ నెత్తి గోవులఁ ౧గాచె నాఁడు
కొండవంటిదానవునిఁ గోరి చించెను
కొండ శ్రీవేంకట మెక్కి కొలు వున్నాఁ డప్పటిని
కొండవంటి దేవుఁ డిదే కోనేటికడ నితను. ॥ వీఁడి ॥

మాఁకులమద్దులు దొబ్బి మరి కల్పభూజమనే—
మాఁకు వెరికి తెచ్చెను మహిమీఁదికి
మాఁకుమీఁద నెక్కి గొల్లమగువలచీర లిచ్చి
మాఁకులకోనేటిదండ మరిగినాఁ డిదివో. ॥ వీఁడి ॥

శేషునిపడగనీడఁ జేరి యశోదయింటికి
శేషజాతికాళింగుఁ జిక్కించి కాచె
శేషాచలము నెటి శ్రీవేంకటాద్రిపై
శేషమై కోనేటిదండఁ జెలఁగీని దేవుఁడు. ॥ వీఁడి ॥ 402

సామంతం

కడుపు నిండె నిఁకఁ గడమేది। మును
తడవినయపుడే నే ధన్యుఁడ నైతి. ॥ పల్లవి ॥

హరిహరి యని నే నన్ననాఁడె నా-
పరగినజన్మము ఫలియించె
కెరలి మీఁద మిక్కిలి నీసేవలు
వరుస జలధిలో వానలు. ॥ కడు ॥

౧. 'గాచేనాఁడు' పూ. ము. పా.

ముందర నీకును మొక్కినయపుడే
అందితిఁ దుదిపదమగుసుఖము
విందుగ మీఁదటివేవేలుసేవలు
యెందును శ్రీమంతు కిచ్చినసిరులు. ॥ కదు ॥

శ్రీవేంకటపతి శరణనినపుడే
దైవము నాపాల దక్కితివి
చేవలఁ గమ్మర సేవించుసేవలు
వేవేలు పూజలవేడుకలు. ॥ కదు ॥ 403

దేవగాంధారి

మాయలఁబొరలఁగ నేఁటికి మనసా కలకాలంబును
యేయెడ లక్ష్మీకాంతుఁ డీతనిఁ దలఁచవుగా. ॥ పల్లవి ॥

మన్నునఁ బుట్టినకాయము మన్నున నణఁగేటి దింతే
మిన్నులమీఁదికిఁ బోవదు మెరయుచు నెంతైనా
అన్నిట నీజీవునికిని అంతర్యామి దేవుఁడు
యెన్నఁడుఁ బాయనిబంధువుఁ డీతనిఁ దలఁచవుగా ॥ మాయ ॥

ధరపైఁ బుట్టినదేహము ధరపైఁ [1]బుట్టి(ట్టు?)న దింతే
పరమానందము గోరదు పైపై నెంతయినా
గరిమల నీజీవునికిని గతియగుదేవుం డీతఁడు
నిరతపుసుఖములె యొసఁగును నీ విటు దలఁచవుగా ॥ మాయ

శ్రీవేంకటపతిసొమ్ములు చేరెడి దాతని నింతే
అవల నితరుల నంటవు ఆతుమ లన్నియును
యేవిధముల నీజీవుని కేలికె యీదేవుండే
పావనముగ బ్రదికించెను పయికొని తలఁచవుగా. ॥ మాయ 404

[1]. 'గిట్టెడి' కావచ్చునేమో?

మాళవిగౌళ

రుచులు నే నిటు గొనని వేడవి రోఁతలయ్యోడిఁగాక నేఁడు
వచనముల హరి నీకు శరణని వసుధఁ బావనమైతిఁగాక ॥ పల్లవి ॥

నేను సేయనిపాప మేడది నిఖలలోకములందును
నేను చొరనినరక మేడది నెఱయ దుర్గతుల
నేను పొడమనియోను లేడవి నిఖలజంతువులందును
పూని హరి నిను శరణుచొరఁగాఁ బుణ్యుఁగాఁ జేసితివిగాక ॥ రుచు ॥

నిరతి నాడనికల్ల లేడవి నేను నాలుకతుదలయందును
పొరలి నడపనికర్మ మేడది భువి ననాచారములలో
తిరిగి తిరిగి నీచులిండ్లను తిరియనర్థము లింక నేడవి
గరిమ హరి నే నిన్ను శరణనఁగాను ఘనుఁ జేసితివిగాక. ॥ రుచు ॥

తలఁప నజ్ఞానములు నపరాధములు నాయెడ లేని వేడవి
యెలమి నన్నిట్లేలఁ దగునా యేలితివిగాక
నిలిచి శ్రీవేంకటగిరీశ్వర నీకు శరణనుమాత్ర మింతే
కలసి నాయెడ నేమి గంటివి కాచితివి భువనములలోను. ॥ రుచు ॥ 405

రేకు 271 సామంతం

ఎవ్వరి దూరఁగనేల యేమీ ననఁగనేల
నవ్వుచు హరికి మొక్కి నడచుటగాక. ॥ పల్లవి ॥

కోపమే యెక్కుడుసేసు కొందరిగుణములోన
పాపమే యెక్కుడుసేసు పరులఁ గొందరికి
దీపన మెక్కుడుసేసు దేహములఁ గొందరికి
శ్రీపతిఆజ్ఞ లివి చెల్లీ లోకానను. ॥ ఎవ్వ ॥

కొందరి నసురలఁగా గుట్టుతోడ నటుసేను
కొందరి దేవతలఁగా కోరి తానే యిటు సేను
కొందరి మనుజులఁగా కూటపుజీవులఁ జేసు
విందువలె హరిమాయ వెలసి లోకానను. ॥ఎవ్వ॥

వరుస నెరిఁగి నడవ నెవ్వరి కిచ్చగాదు
సరిస ౧వనాదినుండే సహజమే కలది
చిరపుణ్యు లిన్నిటిలో శ్రీవేంకటేశుఁ గని
శరణనఁగా సుఖము జరగీ లోకానను. ॥ఎవ్వ॥ 406

## గుండక్రియ

పొదలఁ బొదలఁగఁ దనువు పుణ్యపాపముపొత్తు
వదల వదలఁగ మనసు వద్దనే నిలుచు. ॥పల్లవి॥

పెరుగు నింద్రియసుఖము పెంచఁగాఁ బెంచఁగా
ధరఁ బెరుగుఁ గోరికలు తలఁచఁ దలఁచ
కెరలు లంపటము మిక్కిలి కూర్పుఁ(ర్చ(?) గూర్చఁగా
మరలింప మరలింప మనసులో నణఁగు. ॥పొద॥

కలుగు సనులేమైనఁ గడుఁ జేయఁ జేయఁగా
మలసి కలుగును ౨రుచులు మరుగ మరుగ
బలియు నజ్ఞానంబు భ్రమయఁగా భ్రమయఁగా
నిలువ నిలువఁగ మనసు నిశ్చలం బవును. ॥పొద॥

నెగడు గుణములు పెక్కు నించఁగా నించఁగా
మిగుల(లు?) సంసారంబు మెలఁగ మెలఁగ
తగిలి శ్రీవేంకటేశు దగ్గర కొలువఁగఁ గొలువ
పొగడఁ బొగడఁగ నతఁడు పొంతనే నిలుచు. ॥పొద॥ 407

---

౧. 'సరిస్+ఇవి+అనాది, ౨. 'రుచుల' రేకు

ధన్నాసి

నీ వెటు సేసిన నిజభోగ్యం బౌ
చేపలఁ గైకొని చెలఁగుటగాక. ॥పల్లవి॥

దేవ నీయానతిఁ దిరిగేటిచిత్తము
నావద్ద నిలుపఁగ నావసమా
యీవల నీవేయిచ్చినపుట్టుకు
యేవిధిఁ ౧దప్పిన యిఁక మానవశమా. ॥నీవె॥

వామన నీపంపు వచ్చినప్రకృతిదే
నామాఁట వినుమన నావసమా
శ్రీమంతుఁడ నీచేఁత దేహ మిది
దోమటి గుడువక తోయఁగవశమా. ॥నీవె॥

నగధర నీ విటు నడపేటికర్మము
నగినగి తోయఁగ నావసమా
తగు శ్రీవేంకటదైవమ నాపాలఁ
దగిలితి వితరముఁ దలఁచఁగవశమా. ॥నీవె॥ 408

భైరవి

విశ్వరూప మిదివో విష్ణురూప మిదివో
శాశ్వతులమైతి మింక జయము మాజన్మము. ॥పల్లవి॥

కొండవంటిహరిరూపు గురుతైనతిరుమల
పండినవృక్షములే కల్పతరువులు
నిండినమృగాదులెల్ల నిత్యముక్తజనములు
మెండుగఁ బ్రత్యక్షమాయ మేలువో నాజన్మము. ॥విశ్వ॥

---

౧. 'దప్పిన' పూ. ము. పా.

మేడవంటిహరిరూపు మించైనపై (డిగోపుర-
మాడనే వాలినపక్షు లమరులు
వాడల( గోనేటిచుట్ల వైకుంఠనగరము
యీడ మాకు( జూడచూపె ఇహమేపో పరము. ॥విశ్వ॥

కోటిమదనులవంటిగుడిలోచక్కనిమూర్తి
యీటులేని శ్రీవేంకటేశు( డిత(డు
వాటపు సొమ్ములు ముద్రవక్షపుటలమేల్మంగ
కూటువై వన్నెలిచ్చె యొక్కవపో నాతపము. ॥విశ్వ॥ 409

## అహిరి

నీకే శరణంటి నిన్నే నమ్మితినయ్య
పైకొని శ్రీహరి నీవే ౧పరిహరించవే ॥పల్లవి॥

విజ్ఞానములు గొన్ని విందు నే నూరకే
సుజ్ఞానములు గొన్ని చూతు నే నేపొద్దు
అజ్ఞానము నే ననిశము నడచేది
ప్రజ్ఞాహీనుడ నెంత పాపకర్మమో. ॥నీకే॥

సుకృతము లోకమరి సొరిది నే బోధింతు
ప్రకృతి యొక్కొకవేళ భావింతు నాత్మలో
అకృతములే నే ననిశము( జేసేది
వికృతాచారుడ నింకా వికార మెంతో. ॥నీకే॥

ధర్మమార్గమూ( గొంత తల(పున నెరి(గితి
నిర్మలచిత్తమై మోక్షనిలయము నెరి(గితి
నిర్మించి శ్రీవేంకటేశ నీవు నన్ను నేల(గాను
మర్మ మెరి(గితి నెట్ల మన్నన( గాచితివో. ॥నీకే॥ 410

---

౧. 'పరిహరించేవే' రేకు.

రామక్రియ

ఇంతటిదైవము లేఁడు యెందుఁ జెప్పి చూపఁగ
వంతులకుఁ గొలిచేటివారిభాగ్య మిఁకను· ॥ పల్లవి ॥

గక్కన మన్మథునిఁగన్నతండ్రిగనక
యెక్కువచక్కఁదనాల కితఁడే దొడ్డ
నిక్కపుసూర్యచంద్రాగ్ని నేత్రుఁడుగనక
దిక్కులఁ గాంతుల నీదేవుఁడే దొడ్డ. ॥ ఇంత ॥

అంచెల లక్ష్మికి మగఁడైనాఁడుగనక
యెంచరానిసంపదల కితఁడే దొడ్డ
పంచినచోటఁ జక్రము పంపుచేసిఁగనక
మించినప్రతాపాన మిక్కిలిని దొడ్డ. ॥ ఇంత ॥

దైవికపుఁబురుషోత్తముఁ డితఁడుగనక
దేవతలకెల్లా నీదేవుఁడే దొడ్డ
వావాత శ్రీవేంకటాద్రి వరము లిచ్చీఁగనక
యేవల దాతలలోన నితఁడే దొడ్డ. ॥ ఇంత ॥ 411

రేకు 272 దేసాళి

కలవి రెండే భూమి కామనిధానంబులు
జలజాక్షుఁడు నతని శరణాగతియును. ॥ పల్లవి ॥

నరులు లేరా భూమి నానాదిక్కులలోన
హరిదాసుఁ డొక్కఁడే యరుదుగాక
సురలు లేరా మింట సోదించ ఘనుఁ డొక్కఁడే
పరమపదమేలు శ్రీపతియేకాక. ॥ కల ॥

మాటలు లేవా భూమి మంత్రము లెంచిచూడఁగ
తేటలహరినామమే తేఁకువగాక
కోటిపూజ లిల లేవా కుమతులు నేసేవి
పాటల ప్రపన్నునిభక్తి దొడ్డుగాక. ॥కల॥

విహితసుఖము లేదా విశ్వములో భోగించ
సహజమోక్షసుఖమే సారముగాక
యిహమున శ్రీవేంకటేశుఁ డిందరికి లేఁడా
మహి శ్రీవైష్ణవులకే మనికాయఁగాక ॥కల॥ 412

ముఖారి

విష్ణుఁడ వచ్యుతుఁడవు విశ్వపరిపూర్ణుఁ డని
వైష్ణవు లానతియ్యఁగా వట్టిచదువులేల. ॥పల్లవి॥

వెన్న చేతఁబట్టి నేయి వెదకఁగ నిఁక నేల
నిన్ను లోన నించుకొని నిజమేదోయననేల
వున్నతి దీపమువట్టి వొగి నూతఁబడనేల
పన్ని నీదాస్యము గల్గ బహుకర్మమేల. ॥విష్ణుఁ॥

చాలాధనము గల్గి సంతలఁ దిరియనేల
వాలుక నీపేరు గల్గ నానాజపములేల
కాలము నేరు గుడిచి కాలువ వొగడ నేల
పాలించ నీవుండఁగాను పరచింతలేల. ॥విష్ణుఁ॥

మిన్ను చూచేయందుకుఁగా మిక్కిలి తోదోపులేల
అన్నిటా నీవుండఁగాను అడుగనేల
యెన్నఁగ శ్రీవేంకటేశ యిందరి నేలేవు నీవే
నిన్నే గొలుచుటగాక నీటుగర్వాలేల. ॥విష్ణుఁ॥ 413

వరాళి

చంచలము మానితేను సంసారమే సుఖము
పొంచి హరిదాసుఁడైతే భూమెల్లా సుఖము. ॥పల్లవి॥

పొరుల వేఁడకవుంటే వున్నచోనే సుఖము
పరనింద విడిచితే పావమెల్లా సుఖము
సరవిఁ గోపించకుంటే జన్మమెల్లా సుఖమే
హరిఁ గొలిచినవారి కన్నిటాను సుఖమే. ॥చంచ॥

కానిపని సేయకుంటే కాయమే సుఖము
మౌనమున నుండితేను మరులైనా సుఖము
దీనత విడిచితేను దినములెల్లా సుఖము
ఆని హరిఁ దలఁచితే నంతటా సుఖమే. ॥చంచ॥

చలము విడిచితేను సంతతము సుఖము
యిల నాసలుడిగితే నిహమెల్లా సుఖమే
కలఁగి శ్రీవేంకటేశుదాసులైనవారు వీని
గెలిచి నటించఁగాను కిందా మీఁదా సుఖమే. ॥చంచ॥ 414

దేసాళం

వెదకవో చిత్తమా వివేకించి నీవు
అదనఁ దదియ్యసేవ అంతకంటే మేలు. ॥పల్లవి॥

చూపులెన్నైనాఁ గలవు సూర్యమండలముదాఁకా
చూపులు శ్రీహరిరూపు చూడ దొరకదుగాని
తీపులెన్నైనాఁ గలవు తినఁ దిన నాలికెకు
తీపు శ్రీహరిప్రసాదతీర్థమని కోరదు. ॥వెద॥

మాటలెన్నైనాఁ గలవు మరిగితే లోకమందు
మాటలు శ్రీహరినామము మరపఁగ వలె
తేటలెన్నైనాఁ గలవు తీరనిచదువులందు
తేటగా రామానుజులు ౧ తేరిచె వేదములలో. ॥ వెద ॥

చేఁత లెన్నైనాఁ గలవు సేసేమంటే భూమి
చేఁతల శ్రీవేంకటేశుసేవ సేయవలెను
వ్రాఁతలెన్నైనాఁ గలవు వనజభవునిముద్ర—
వ్రాఁతలు చక్రాంకితాలె వహికెక్కేముద్రలు. ॥ వెద ॥ 415

లలిత

బహుకుటుంబివి నీవు బ్రతుకఁగ వెరవేదో
విహగగమన నాకు వెరగయ్యీ నిందుకే. ॥ పల్లవి ॥

పుట్టేటిజంతువులు భువనములెల్లానిండె
ఇట్టిబ్రహ్మాండకోట్లు ఇన్నియు నీమేన నిండె
ఇట్టె ఇందరి రక్షించే యిత వైనవిధ మేదో
వొట్టుగ కాఁపురము నీ వుండఁగఁ జోటేదో. ॥ బహు ॥

చిన్నిచిన్నిదేవతలచేఁతల ముద్దులు నిండె
కన్నుల నీ కివి చూచి కడుసంతసాలు నిండె
మన్ననలు వీరికిచ్చి మలసేటివిధ మేదో
వున్నతి నీచింతదీరి వుండు టేఁక నెన్నఁడో. ॥ బహు ॥

నీదేవియైనలక్ష్మి నిచ్చ సంపదలు నిండె
ఆదియై శ్రీవేంకటేశ ఆకె నీవురాన నిండె
పోదియై నీవివియెల్లా భోగించే దేపొద్దో
నీదాసులము నేము నినుఁ జింతించితిమి. ॥ బహు ॥ 416

౧. 'తెరిచె' పూ. ము. పా.

నిలిచినచోటనెల్లా నిధాన మీతఁడు
యిల వెఱవ వెఱవ నేమిటికి నిఁకను. ॥ పల్లవి ॥

హరి నాకుఁ గలఁడుగా అన్నిటిఁ బరిహరించ
నిరతి గర్మములెంత నిండుకుండినా
దరిదాపు ఆతఁడేకా తగ వెనుకవేసుకో
విరవిరఁ బాపాలు నావెంటఁబడినాను. ॥ నిలి ॥

గోవిందుఁడు గలఁడుగా కొంకుదీర్చి ననుఁగావ
కావరపుభవములు గదిమినాను
దేవుఁ డితఁ డున్నాఁడుగా దిక్కుదెసై నిలువఁగా
భావపుసంసారవార్ధి పైకొని ముంచినను. ॥ నిలి ॥

శ్రీవేంకటేశుఁడే చిత్తగించి నన్నేలఁగా
వావాత నింద్రియాలు వశకాడినా
యీవలనావల నితఁ డిహపరా లిచ్చెఁగా
వావిరి నే దాస్యగర్వముతో నుండినను. ॥ నిలి ॥ 417

రేకు 278 బౌళి

దేవశిఖామణివి దిష్టదైవమవు నీవు
యీవల నీబంటు నాకు నెదురింక నేది. ॥ పల్లవి ॥

కామధేనువుఁ బిదుకఁగలకోరికె లివెల్ల
కామధేనువులు పెక్కు గాచేకృష్ణుఁడవట
కామించి నీ బంటనట కమ్మి నిన్నుఁ దలఁచితి-
నేమి మాకుఁ గడమయ్యా యిందిరారమణా. ॥ దేవ ॥

యెంచఁ గల్పవృక్షమును యిచ్చు సిరులెల్లాను
నించి కల్పవృక్షములనీడల కృష్ణుఁడవట
అంచెల నీబంటనట ఆత్మలో నిన్ను నమ్మితి
వంచించఁ గడమ యేది వసుధాధిశ. ॥ దేవ

తగ నొక్క చింతామణి తలఁచినట్లఁ జేసు
మిగులఁ గౌస్తుభమణిమించినకృష్ణుఁడవట
పగటు శ్రీవేంకటేశ భక్తుఁడ నీకట నేను
జగములోఁ గొఱతేది జగదేకవిభుఁడా. ॥ దేవ ॥ 418

సాళంగం

కొలిచినవారలకొంగుపైఁ డితఁడు
బలిమిఁ దారకబ్రహ్మ మీతఁడు. ॥ పల్లవి ॥

యినవంశాంబుధి నెగసిన తేజము
ఘనయజ్ఞంబులఁ గలఫలము
మనుజరూపమున మనియెడిబ్రహ్మము
నినుపులరఘుకులనిధాన మితఁడు. ॥ కొలి ॥

పరమాన్నములో పలిసారపుఁజవి
పరగినదివిజులభయహరము
మరిగినసీతామంగళసూత్రము
ధరలో రామావతారం బితఁడు. ॥ కొలి ॥

చకితదానవులసంహారచక్రము
సకలవనచరులజయకరము
వికసితమగు శ్రీవేంకటనిలయము
ప్రకటితదశరథభాగ్యం బితఁడు. ॥ కొలి ॥ 419

## బౌళిరామక్రియ

అభయదాయకుఁడ వదె నీవే గతి
 యిభరక్షక నను నిపుడు గావవే ॥ పల్లవి ॥

భయహర దైత్యభంజన కేశవ
 జయ జయ నృసింహా సర్వేశ్వరా
 నియతము మాకిదె నీపాదములే గతి
 ప్రియగా మమ్మేలి కింక లుడుపవే. ॥ అభ ॥

బంధవిమోచన పాపవినాశన
 సింధురవరదా శ్రితరక్ష
 కంధరవర్ణుఁడ గతి నీనామమె
 అంధకారముల నణఁచి మనుపవే. ॥ అభ ॥

దైవశిఖామణి తతచక్రాయుధ
 శ్రీవేంకటగిరి శ్రీరమణా
 సావధాన నీశరణ్యమే గతి
 వేవేలకు నావిన్నప మిదియే. ॥ అభ ॥ 420

## శంకరాభరణం

శరణు కపీశ్వర శరణం బనిలజ
 సరవి నెంచ నీసరి యిఁక వేరీ. ॥ పల్లవి ॥

పుట్టిననాఁడే భువనములెరఁగఁగ
 పట్టితి సూర్యునిఁ బండనుచు
 ముట్టినచుక్కలు మోవఁగఁ బెరిగితి
 విట్టిప్రతాపివి యెదురేదయ్యా. ॥ శర ॥

అంపినయప్పుడె యంబుధి దాఁటితి-
వింపులు సీతకు నిచ్చితివి
సంపద మెరయుచు సంజీవి దెచ్చితి
పెంపును సొంపునుఁ బేర్కొనవశమా. ॥శర॥

చెదరక నేఁడే శ్రీ వేంకటగిరిఁ
గదిసి రామకృప గైకొంటి
వదలక నీకృపవాఁడనైతి నిదె
యెదుటనె కాచితి విఁకఁ గడమేమీ. ॥శర॥ 421

నారాయణి

దేవ నీపక్షపాతమో తిరిగేలోకులవెల్తో
శ్రీవిభుఁడ నీవేకాదా చిత్తములోనయ్యా. ॥పల్లవి॥

దివములు సరియే దినరాత్రులును సరే
యివల సుఖదుఃఖాలు హెచ్చుకుందులేలయ్యా
భవములు సరియే ప్రాణములు సరియే
భువిఁ బుణ్యపాపములభోగము వేరేలయ్యా. ॥దేవ॥

విని కిందరి కొకచే విషయాలు నొకరీతే
మునిఁగేటిజాతిభేదము లివేలయ్యా
అనయముఁ జూపొక్కటే అఁకలియు నొకచే
పెనఁగేటిగుణముల పెక్కుజాడ లేలయ్యా. ॥దేవ॥

అంతరాత్మ నీవొక్కడ వన్నిటా శ్రీవేంకటేశ
చింతలు వేవేలైన సిలుగేలయ్యా
యింత సేసీ నీమాయ లిందుకే నీశరణంటే
కాంతుఁడ నన్నిందుకే కాచితివి నేఁడయ్యా. ॥దేవ॥ 422

మంగళకౌశిక

నేమెంత మూఢులమైనా నీలవర్ణుఁ డంతరాత్మ
మామనసు వెలితేల మంచిదౌఁగాక. ॥పల్లవి॥

దైవముకృప గలితే తనకర్మా లడ్డమా
ఆవేళ ఘనపుణ్యుఁడౌఁగాక
గోవిందుఁడు మన్నించితేఁ గొంచము దొడ్డున్నదా
కోవరపుసిరు లంది కొనకెక్కుఁగాక. ॥నేమెం॥

పరమాత్ముఁ దేలుకొంటే బంధములు గలవా
తెరదీసినట్లానె తెగుఁగాక
హరి విజ్ఞానమిచ్చితే నడ్డము మాయలుండునా
తొరలి జీవుఁడు మాయఁ దొలఁగుఁగాక. ॥నేమెం॥

శ్రీవేంకటేశ్వరురూపు చిత్తములోఁ జిక్కితేను
చావుఁబుట్టుగు లున్నవా జయమౌఁగాక
కైవల్య మీతఁ డిచ్చితేఁ గడమలు గలవా
కేవలపుజగమెల్లా గెలుపించుఁగాక. ॥నేమెం॥ 428

రేకు 274 మంగళకౌశిక

విడువవో మాయా విష్ణువధీనము
వొడలిది నీ కెందు నునికే లేదు. ॥పల్లవి॥

శ్రీపతినామము చేకొనేనాలుక
యేపాపములకు నెడలేదు
దాపగుగోవిందుఁ దలఁచినమనసిది
కోపముల కిరవుకొన నెడలేదు. ॥విడు॥

సెలవుగ హరికథ నిండెను వీనుల
కలిదోషము లిక్కడ లేవు
అలరినజన్మం బచ్యుతు శరణని
నిలిచె దుఃఖములనివారణము. ॥విదు॥

శ్రీవేంకటపతిఁ జేరె నాత్మ యిది
భావవికారము పని లేదు
దైవాధీనము తత్త్వవిచారము
వేవేల కర్మపువిధులే లేవు. ॥విదు॥ 424

లలిత

ఇన్నిటా శ్రీహరిభక్తి యిది లాభము
పన్ని నతపముచేత బడలుటే లాభము. ॥పల్లవి॥

యెనయఁ గర్మదేహ మిదెన్నిపాట్లు వచ్చినా
ననుభవించి తీరుచు టది లాభము
తన పాపవర్తన యితరు లెంత నిందించినా
ననుమానించక పడుటదె లాభము. ॥ఇన్ని॥

తగుసంసారజీవుఁడు తన్నెంత వేసరించినా
నగి రుణము దీర్చుట నానాలాభము
చిగురువంటిచిత్తము చేరి యెందు దిప్పినాను
నగిలి యలయుటే దక్కినట్టిలాభము. ॥ఇన్ని॥

శ్రీవేంకటేశ్వరుఁడు జీవములో నుండఁగాను
యేవేళ నెట్లయినా నివి లాభము
పావనమైనట్టియాత్మ భావమెంత మఱచినా
ఆవల నానందించు టది లాభము. ॥ఇన్ని॥ 425

లలిత

మనసొకటి కోరికలు ౧మాలు గలవుమ(?)నుండు
తెనిసితే నదియ పరతత్త్వమై నిలుచు. ॥ పల్లవి ॥

కన్నులని యెడిపాపకర్మంబు లివి రెండు
వన్నె లాయెన్నంటిపై నైనఁ బారు
మున్నె యివి హరిపాదములమీఁద నిలిపినను
అన్ని పుణ్యంబులును అందునే కలుగు. ॥ మన ॥

వీనులని యెడిమహావెడఘోరనరకములు
ఆని పరనిందలే ఆలింపుచుండు
నానాట యిందులో నారాయణునికథలు
పూని నించిన పుణ్యభోగములే యొసఁగు. ॥ మన ॥

నాలుకనియెడిగుహను నాచుఁబా మది యొకటి
గాలి అమృతపువిషము గ్రక్కుచుండు
యీలీల శ్రీవేంకటేశునామామృతము
నోలి నించవే ఆత్మ శుభములే కలుగు ॥ మన ॥ 426

౨కేదారగౌళ

ఎన్ని చందముల నెట్లైన నుతింతు
కన్నుల నిన్నే కనుఁగొంటిఁగాన. ॥ పల్లవి ॥

గోవిందాయని కొలిచిననిన్నే
శ్రీవల్లభుఁడని చింతింతును
భూవిభుఁడవు యిది పునరుక్తనకుమీ
దైవ మొకఁడవే ధరణికిఁగాన. ॥ ఎన్ని ॥

---

౧. మాలు=శూన్యము కావచ్చు. ౨. 'కన్నడగౌళ' పూ. ము. పా

పరమాత్ముఁడవని భక్తిసేసి నిను
నరహరివని ధ్యానముసేతు
సరవులఁ జర్విత చర్వణమనకుమీ
అరయఁగ గురి యంతరాత్మవుగాన. ॥ఎన్ని॥

సరుగ శ్రీవేంకటేశ్వర నీదాస్యము
మరిగితి నదె ముమ్మాఁటికిని
తిరిగినయందే తిరిగెదననకుమీ
యిరవుగ నితరం బిఁక లేదుగాన. ॥ఎన్ని॥427

గుజ్జరి

దేవ నీవేకాల మెట్టు దిప్పినాఁ దిరుగుట గా-
కీవలఁ బెద్దరికము యెక్కడిదో తనకు ॥పల్లవి॥

దొరకొని జీవుఁడు దుఃఖముల కోపఁడు
నరకములోనఁ దనవాఁ టిపా టెంచఁడుగాని
సిరులకొరకుఁగాఁ జిందువందయ్యీఁ బ్రాణి
పురుషై పుట్టినపుడే బుద్ధు లెందువోయనో. ॥దేవ॥

పొల్లువో కీమేను నేఁడు భోగించకుండలేదు
తల్లికడుపులోనుండి తానేమి భోగించెనో
యిల్లు ముంగి లాసపడీ నిప్పుడే యీగుణము
తొల్లి జనించనినాఁడు తొలఁగి యెందుండెనో. ॥దేవ॥

గుక్కక మనసు నేఁడు కోరక వుండఁగలేదు
తక్కి బ్రహ్మప్రళయానఁ దా నెట్లుండెనో
నిక్కి శ్రీ వేంకటేశ్వర నీమరఁగు నేఁ జొచ్చితి
యెక్కువఁ బానిటమీఁద నెందుకు దాఁగీనో. ॥దేవ॥ 428

కన్నడగౌళ

నడపే వేఁటికి నాటకము
అడరి నిజముగా నానతి యావే. ॥పల్లవి॥

విశ్వమూర్తి కొకవిన్నపము
శాశ్వతములాయ జగములివి
యీశ్వరేశ్వరున కింకొకవిన్నపము
ఐశ్వర్యమోక్షం బాత్మలకేది. ॥నడ॥

రమాధిపతి కొకరహస్యము
సమానుఁడవు నీవు సర్వమున
క్రమాన నిఁక నొకరహస్యము
[1]సమోహి (?)నరకము స్వర్గము నేలా. ॥నడ॥

హరి నే నొకమాఁ టడిగెదను
నిరంతరాత్మవు నీవుగదే
యిరవుగ శ్రీవేంకటేశ నే నడిగెద
విరసము లే దిఁక విచార మేలా. ॥నడ॥ 429

రేకు 275 శంకరాభరణం

చానిపిలోపలఁ జవిగలదా। యివి
మానిపి నీగతి మరపుదుగాకా. ॥పల్లవి॥

చంచలపుగుణముల జడిసినజీవుఁడు
మంచిగుణంబుల మలసీనా
అంచెల హరి నీ వంతర్యామివి
నించి నీగుణమే నెరపుదుగాకా. ॥చాని॥

1. 'సమోహి' నరకము స్వర్గమునేలా=అన్నిటా సముఁడుగదా? వానికి స్వర్గనరకభేద మేలా। అని భావమేమో? వాక్యమధ్యములో 'సమోహి' అని సంస్కృతము వాడుట వింత.

బూతుల యెంగిలిఁ బుట్టినదేహము
 కాఁతిగ ౧శుచియై పరగీనా
౨చైతన్య మందులో శ్రీపతివి నీవు
 నీతత్త్వఫలమే నెరపుదుగాకా. ॥ చాని ॥

లలి సుఖదుఃఖపుఁటంకె కాఁపురము
 మెలుపున సాజాన మెలఁగీనా
యిలపై శ్రీవేంకటేశ్వర నీవిది
 కలిగించితి విఁకఁ గాతువుగాకా. ॥ చాని ॥ 480

## లలిత

అన్నిటికి నారదాదు లదివో సాక్షి
 యిన్నిటా మాకుఁ గలిగె నేమైనాఁగాని. ॥ పల్లవి ॥

భూమిలోన నెన్నైనా పుణ్యములు గలవు
 ౩కామింప నాచారాలు కల వెన్నైనా
సామజవరదు నొక్కసారె దలఁచినందుకు
 యేమియును సరిగావు యెట్టయినాఁగాని. ॥ అని ॥

వుత్తమలోకసుఖము లోగి నెన్నైనాఁ గలవు
 యిత్తల సిరులు గల విల నెన్నైనా
చిత్తజగురుని నటు సేవించేపుణ్యమువలె
 నిత్తెము గావుగాని నిచల్బు నెంతైనను. ॥ అన్ని ॥

కలవు మతాలు గొన్ని కలవు ముక్తులు గొన్ని
 కలవు మాయలు పెక్కు గల్పించేవి
తలఁచి శ్రీవేంకటేశుదాసుఁడైనభాగ్య మిది
 గలిగె నిక్కె మాకుఁ గాణాచిగాని. ॥ అన్ని ॥ 481

౧. 'మచియై' రేకు. ౨. 'చేతన్య' రేకు. ౩. 'కావింప' రేకు. ప్రాసభంగము.

లలిత

రామకృష్ణ నీవు నందే రాజ్యా మేలుచుండుదువు
యేమిసేసే విక్కడ నీ యిరవుకే వదవే. ॥ పల్లవి ॥

లంక విభీషణు నుంచ లక్ష్మణుని నంపినట్టు
అంతె సుగ్రీవుఁ గిష్కింధ కంపినయట్టు
వంకకు సంజీవి దేను వాయుజుని నంపినట్టు
వేంకటాద్రిపొంతనుండ వేగ మమ్ము నంపవే ॥ రామ ॥

ఘనకిరీటము దేను గరుడని నంపినట్టు
అనుఁగుఁగవుల నిండ్ల కంపినట్టు
వొనర గోపికలొద్ది కుద్ధవుని నంపినట్టు
నమవు శేషాద్రినుండ నన్ను నంపవే. ॥ రామ ॥

పెండిలికిఁ బరుషలఁ బిలువఁగ నంపినట్టు
అండనే ముందరఁ గంత కంపినయట్టు
వెండియు శ్రీవేంకటేశ వేఁట వచ్చి మరలితి-
వుండ(డు?)చోట నుండి నన్ను వూడిగాన కంపవే. ॥ రామ 432

రామక్రియ

విచ్చేయవయ్యా వేంకటాచలముపొంత-
కచ్చుగా నేమున్నచోటి కచ్యుత నారాయణా. ॥ పల్లవి ॥

అల్లనాఁడు లంక సాధించందరును బొగడఁగ
మల్లడి నయోధ్యకు మరలినట్లు
యెల్లగాఁ గైలాసయాత్ర కేఁగి కమ్మర మరలి
వెల్లవిరి ద్వారకకు విచ్చేసినట్లు. ॥ విచ్చే ॥

యెన్నికెతో గోమంతమెక్కి జయము చేకొని
మన్ననతో మధురకు మరలినట్లు
అన్ని చోట్లానుండి అల్లిరము లారగించ
వెన్నుఁడవై వేడుకతో విచ్చేసినట్లు. ॥ విచ్చే ॥

వహికెక్కఁద్రిపురాలవనితల బోధించి
మహి నిందిరవొద్దికి మరలినట్లు
విహగగమన శ్రీవేంకటేశ మముఁ గావ
విహితమై నామతిలో విచ్చేసినట్లు. ॥ విచ్చే ॥ 483

బౌళి

మాదురితములు వాపి మమ్ముఁ గాచు టరుదా
శ్రీదేవీరమణుఁడ శ్రీవేంకటేశ. ॥ పల్లవి ॥

అంబరీషుఁ బై కొన్న ఆపదలన్నియుఁ బాపి
వెంబడిఁ గాచె నీచే పెనుచక్రము
అంబరాననున్న ధ్రువు నజ్ఞానమెల్లఁ బాపె
పంబి నీచేతనుండినపాంచజన్యము. ॥ మాదు ॥

పక్కన జరాసంధుబలమెల్ల నుగ్గాడి
నిక్కము మధురనిల్పె నీచేగద
తొక్కి హిరణ్యకశిపుఁ దునిమి ప్రహ్లాదుఁ గాచె
నిక్కి నిక్కి మెరిచేటి నీఖడ్గము. ॥ మాదు ॥

వెడరావణునిఁ జంపి విభీషణునిఁ గాచె
చిడుముడి పడక నీచేశార్ఙ్గము
యెడమీక శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గాచె
బడిబడి నీనామపఠన నేఁడిదిగో. ॥ మాదు ॥ 484

దేవగాంధారి

తప్పు లెంచ కిఁక దరిచేర్పవయ్యా
చెప్పనేల నీచిత్తమయ్యా. ॥పల్లవి॥

కలిదోషహరణ కర్మవిదారణ
సులభపునీదాసులమయ్యా
కలిగినశరణాగతవజ్రపంజర
వలనగునీమరఁగు వారమయ్యా ॥తప్పు॥

దురితనివారణ దుఃఖవిమోచన
దొరకొని నీభక్తులమయ్యా
కరిరాజవరద కరుణాసముద్ర
సరి నిను నమ్మినఁజంతులమయ్యా. ॥తప్పు॥

శ్రీకాంతప్రియ శ్రీవేంకటేశ్వర
కైకొన్ననీకింకరులమయ్యా
మాకేల యితరపుమతదైన్యంబులు
పైకొనఁ బోఁజేసి పాలించవయ్యా. ॥తప్పు॥ 435

రేకు 276 రామక్రియ

ఎంతగాలమైనాను హెచ్చీ నాసలు శ్రీ-
కాంతుఁడ వింతటనైనాఁ గరుణించరాదా. ॥పల్లవి॥

పచ్చితనానఁ దిరిగి పండవద్దా చిత్తము
గచ్చులఁ దాఁ గసుఁగాయే కలకాలము
చచ్చి చచ్చి పుట్టి పుట్టి జారవద్దా కర్మము
కొచ్చి కొచ్చి సేసి సేసి గోరపడీఁగాక. ॥ఎంత॥

---

౧. 'జంతూం' రేకు.

రోఁత గడుపున నించి రోయవద్దా దేహము
కూఁతలతో రుచులెల్లాఁ గోరీఁగాక
చేఁతలు యీగుణమైన సిగ్గువడవలదా
కాఁతిపడి విషయాలఁ బరచయ్యీఁగాక. ॥ఎంత॥

వానాఁడే విరతిఁబొందఁది నవ్వు నవ్వవలదా
మానక యీజీవుఁ డనుమానించీఁగాక
మోనాన శ్రీవేంకటేశ మొక్కి నీదాసుఁడఁగాఁగా
అనినవిన్నియుఁ బరిహార మయ్యీఁగాక ॥ఎంత॥ 486

లలిత

సొమ్ముగలవాఁడు తనసొమ్ము చెడనిచ్చునా
కమ్మి నీసొమ్మును నేను కాపాడవే హరి. ॥పల్లవి॥

పసురమడవిఁబడ్డ పసురముగలవాఁడు
దెసలు వెద కింటికిఁ దెచ్చుకొన్నట్టు
వసగా నాసలలోన వడిఁబడ్డనామనసు
యెసగ మళ్లించవే నన్నేలినగోవిందుఁడా. ॥సొమ్ము॥

గొందిఁ బంటసేయువాఁడు కొలుచులు పరకళ్లఁ
జిందకుండా గాదెఁ బోసి చేరి కాచీని
కందువ మమ్ముఁ బుట్టించి కన్నవారివాకిళ్లఁ
జెంది కావనియ్యకువే జీవునిలోదేవుఁడా. ॥సొమ్ము॥

కడుపులోశిశువు కన్నతల్లి(ఁ?) దన్ని తేను
బెడగులెంచక కని పెంచీసటా
యెడమీక శ్రీవేంకటేశ నీకుక్షిలో నేను
తడవి తప్పుసేసినా దయఁ గావవే. ॥సొమ్ము॥ 487

ధన్నాసి

మెచ్చులదంపతులార మీరే గతి
మెచ్చితి నిన్నిట మిమ్ము మెరసె మీచేఁతలు. ॥ పల్లవి ॥

తమ్మిలోనిమగువా వో ధరణీధరుఁడా
మిమ్మునే నమ్మితి నాకు మీరే గతి
నెమ్మది నో యిందిరా నీరజలోచనుఁడా
కమ్మి యేపొద్దును మీరే కలరు నాపాలను. ॥ మెచ్చు ॥

పాలజలధికూఁతుర భక్తవత్సలుఁడ హరి
మేలిచ్చి రక్షించ నాకు మీరే గతి
కేలి నో శ్రీమహాలక్ష్మి కేశవ దయానిధి
తాలిమి మీరే నాకు దాపు దండ యెపుడు. ॥ మెచ్చు ॥

చిన్నగురమాకాంత చెందిన వో మాధవ
మిన్నక యేపొద్దు మాకు మీరేగతి
చిన్నియలమేలుమంగ శ్రీవేంకటేశుఁడా
యెన్నికె కెక్కించి నన్ను నేలుకొంటి రిదిగో. మెచ్చు ॥ 498

శంకరాభరణం

దైవంబవు కర్తవు నీవే హరి
యీవలనావల నెవ్వఁడనయ్యా. ॥ పల్లవి ॥

తలఁచినతలఁపులు దైవయోగములు
కలిగినచేఁతలు కర్మములు
వెలసిన దేహము విషయాధీనము
యిల నేఁగాదన నెవ్వఁడనయ్యా. ॥ దైవం ॥

జిగి నింద్రియములు చిత్తపుమూలము
తగులమి(ము?)మాయకుఁ దనుగుణము
జగతిఁ బ్రాణములు సంసారబంధము
యెగ దిగ నాడఁగ నెవ్వఁడనయ్యా. ॥ దైవం ॥

శ్రీతరుణీశ్వర శ్రీవేంకటపతి
ఆతుమ యిది నీయధీనము
యీతల నీవిఁక నెట్టైనఁ జేయుము
యేతలపోఁతకు నెవ్వఁడనయ్యా. ॥ దైవం ॥ 439

దేసాళి

ఎన్నఁ డఁక యేది గోలఁదివాటు
వున్నతపుమాయలకే వొడిగట్టవలసె. ॥ పల్లవి ॥

చీ చీ మనసా చీ మనసా
కాచేటిపూ చేటివోఘనజన్మమూ
నీచు యెండమావులెల్లా నీళ్లంటా నమ్మినట్టు
చూచి చూచి యింద్రియాలే సుఖమనవలసె. ॥ ఎన్నఁ ॥

కట్టా జీవుఁడా కటకటా జీవుఁడా
తొట్టినపంచభూతాలతోడిదేహామా
వెట్టిఁ జెఱకుపోలికి వెదురు నమలినట్టు
పట్టినయీకనకమే బ్రహ్మ మనవలెసె. ॥ ఎన్నఁ ॥

కావుకావుదైవమా భావపుశ్రీవేంకటేశ
చూపుల నాయాతుమలో సుజ్ఞానమా
దోపుచుఁ బూవులవల్ల తుంగ దలకెక్కినట్టు
దాపగునాలికె నిన్నుఁ దలఁచఁగవలసె. ॥ ఎన్నఁ ॥ 440

దేవగాంధారి

పొందినవెల్లా భోగ్యములే
అందరిలో నీఁక ననుమానమేలా. ॥పల్లవి॥

హరి నీసంకల్ప మన్నిట నుండఁగ
గరిమల మాసంకల్పము లేఁటికి
దురితము లణఁచీ దొర నీనామము
సొరిది విధికిఁగా సుడివడనేలా. ॥పొంది॥

జిగినీధ్యానము చింతలు మాన్పఁగ
వెగటున మాకిఁక వెడచింతేఁటికి
తగునీతత్వము తపఃఫల మొసఁగ
అగడుఁగోరికల ఆసలిఁకేలా. ॥పొంది॥

కమ్మి నీశరణు గతియిటు చూపఁగ
కమ్మర నుద్యోగము మాకేఁటికి
యిమ్ముల శ్రీవేంకటేశ్వర మాపాల
నెమ్మదిగల విఁక నేనాడనేలా. ॥పొంది॥ 441

రేకు 277 రామక్రియ

రాతిరిఁబగలనేటిరంటినదుమనుఁ జిక్కి
పూఁతి గాన వెళ్లనీరో వో యాసలాల. ॥పల్లవి॥

దైవ మెప్పుడు గలఁడు తలఁచఁగలేముగాని
కైవసమై జీవుఁడుండు కానరాదుగాని
పూవు పిందెవంటి పాపపుణ్యములఁ జిక్కినాఁడ
తోవచూపరో మాకు తొలుజన్మములాల. ॥రాతి॥

లోకము మాయామయమై లోనుగాకుండుఁగాని
లోక పరమాత్మలోనే సోదించముగాని
కైకొని మూసితెరచేకనురెప్పలనుఁ జిక్కి
వాకిలిఁ గనేఁ ౧జూపరో వద్దనున్న కాలమా(?). ॥ రాతి ॥

రూపము విజ్ఞానమే రూఢి కెక్కనైతిఁగాని
కాపు శ్రీవేంకటేశుఁడే గతి గంటిఁగాని
౨యీపారినేనైతే నిహపరాలకుఁ జిక్కి
పైపూఁత లేమి గానఁ బాలించవో గురుఁడా. ॥ రాతి ॥ 442

సామంతం

ఇంతటఁ గావఁగదే ఇందిరానాయక నన్ను
పంతానఁ గాకాసురునిఁ బాలించినట్లు ॥ పల్లవి ॥

దించనిపంచభూతాలదేహము మోచితిఁగాన
నించినయజ్ఞానమున నిన్ను నెరఁగ
పంచేంద్రియములచేఁ బట్టువడ్డవాఁడఁగాన
యెంచరానిపాపములే ఇన్నియు జేసితిని. ॥ ఇంత ॥

మిన్నువంటిజఠరాగ్ని మించిపున్నవాఁడఁగాన
కన్నవెల్లా వేఁడి వేఁడి కష్టపడితి
పన్నినసంసారపుభ్రమఁ బడ్డవాఁడఁగాన
అన్నిటా దేవతలకు నరిగాఁపనైఁతి. ॥ ఇంత ॥

ఆతుమలో నీ వుండేభాగ్యముగలవాఁడఁగాన
చైతన్యమున నీకు శరణంటిని
నీతితో శ్రీవేంకటేశ నీపాలివాఁడఁగాన
ఖాతితో సర్వము నీకొప్పనముసేసితిని. ॥ ఇంత ॥ 448

---

౧. 'చూపవో' కావచ్చు. కనురెప్పలు మూసితెరచుటతో నేర్పడు నదేగదా కాలము.
౨. 'యీపాటి' కావచ్చు.

తనిసితి మిన్నిటితగులేలో
మినుకులదినముల మెచ్చేమయ్యా. ॥ పల్లవి ॥

మనసూ రోసితి మరులూఁ జూసితి
తనువేలో వైతరవాయ
వెనకాఁ దెలిసితి మునుపూఁ జూచితి
నను నేనే యిఁక నవ్వేమయ్యా. ॥ తని ॥

మాయల వెడలితి మమతల బదలితి
పాయంబేలో వదరీని
దాయల గెలిచితి ధర్మముఁ దెలిచితి
పోయినజన్మముఁ బొగడేమయ్యా. ॥ తని ॥

శరణూఁ జొచ్చితి జయముల హెచ్చితి
దురితము లెందో తొలఁగిని
గరిమల శ్రీవేంకటపతిఁ గొలిచితి
తరతర మిందే దక్కితిమయ్యా. ॥ తని ॥ 444

శ్రీరాగం

నీవు నట్ల నేరుపు నేరమి నేఁడు నాయెడకుఁ జూడకుమీ
సేవలయెడ తృణము మేరువుగఁ జేసుకోఁగలవు నీమహిమలను. ॥పల్లవి

తప్పు లెరంగము వొప్పు లెరంగము దైవమ నే నిను నుతియించేదా
నెప్పున వేదము సకలశబ్దము నీవేయని చాటఁగ వినుచు
ఇప్పుడు ద్రిష్టాంత మొకటి చెప్పెద నిందుకు సముద్రుఁ డటు తనలో
చిప్పలు గుల్లలు బహురత్నంబులు చేకొని గర్భీకరించుఁగదా. ॥ నీవు

కర్మ మెరంగ నకర్మ మెరంగను కరుణానిధి నినుఁ బూజించేదా
నిర్మలవేదము చైతన్యంబిది నీవేయని చాటఁగ వినుచు
అర్మిలి ద్రిష్టాంత మిందుకు నొకటె అన్నియు గర్భీకరించుకొని
ధర్మాధర్మపుమనుజులనెల్లాఁ దగ నీభూకాంత మోచుఁగదా. ॥ నీవు

జ్ఞాన మెరఁగ నజ్ఞాన మెఱఁగను సారెకు నిను నేఁ దలఁచేదా
అనినవేదము శ్రీవేంకటేశ్వర అంతరాత్మ నినుఁ జాటఁగను
పూని ద్రిష్టాంతము మీ కిటు సరిగాఁ బోలుపరా; దిఁకనైనాను
తానే సూర్యుఁడు రాత్రి గలబయట తనగుణము వేగి నెరపుఁగదా.
॥ నీవు ॥ 445

లలిత

కల దందేవో సర్వముఁ గలదు కామితార్థమునుఁ గలదు
కలదు గలదు శరణాగతులకు హరికైంకర్యంబున మోక్షము గలదు.
॥ పల్లవి ॥

ఆకాశంబున మోక్షము వెదకిన నందులోపలా లేదు
పైకొని తానెంత వెదకి చూచినా పాతాళంబున లేదు
యీకడ ధరలో మూలమూలలను యెందు వెదకినా లేదు
శ్రీకాంతుని మతిఁ జింతించి యాసలఁజిక్కక తొలఁగిన నందే కలదు
॥ కల ॥

కోటిజన్మములు యెత్తిన ముక్తికి కొనమొదలేమియుఁ గనరాదు
వాటపుసంసారములోఁ గర్మపువార్ధి యీఁదినాఁ గనరాదు
కూటువతో స్వర్గాదిలోకములఁ గోరి వెదకినాఁ గనరాదు
గాఁటపుకేశవభక్తి గలిగితే కైవల్యము మతిఁ గానఁగవచ్చు ॥ కల ॥

సకలశాస్త్రములు చదివినాఁ బరము చక్కటిమార్గము దొరకదు
వికటపుపలువేల్పుల నెందరిఁ గడువెదకి కొలిచినా దొరకదు
అకలంకుఁడు శ్రీవేంకటగిరిపతి అంతరంగమున నున్నాఁడనుచును
పకటముగా గురుఁ డానతిఇచ్చిన పరము సుజ్ఞానము తనలో దొరకు
॥ కల ॥ 446

౧ సంసారమే మేలు సకలజనులకును
కంసాంతకునిభక్తి గలిగితే మేలు. ॥పల్లవి॥

వినయపుమాటల విద్య సాధించితే మేలు
తనిసి యప్పులలోన దాఁగకుంటే మేలు
మునుపనే భూమి దన్ను మోచి దించకుంటే మేలు
వెనుకొన్నకోపము విడిచితే మేలు. ॥సంసా॥

కోరి వొకరినడిగి కొంచపడకుంటే మేలు
సారె సారె జీవులను చంపకుంటే మేలు
భారపుటిడుమలను పడకుండితే మేలు
కారించి తిట్ల కొడిగట్టకుంటే మేలు. ॥సంసా॥

పరకాంతల భంగపరచకుంటే మేలు
దొరకొని కెళవులు దొక్కకుంటే మేలు
అరుదైన శ్రీవేంకటాద్రివిభునిఁ గొల్చి
యిరవై విశ్రాంతుఁడైతే నిన్నిటాను మేలు. ॥సంసా॥ 447

## లలిత

భగవద్విభవపుప్రత్యక్షం బిది
జగి నిందొకటియుఁ జేయఁగఁగలమా. ॥పల్లవి॥

దైవికమెపో తతియగువానలు
తావగుమొలకలు దైవికమే
కావిరినివెల్లాఁ గఁటూ వింటా
దైవము నేలో తలఁచము మనము. ॥భగ॥

---

౧. ఇందు దశావతారసమన్వయము గలదు.

జననమరణములు సరి దైవికమే
తనుపోషణములు దైవికమే
యెనసి యివెల్లా నెఱిఁగియు మఱిగియు
కొన దైవము నేలో కొలువము మనము. ॥భగ॥

యిహపరంబులును యివి దైవికమే
తహతహ లుడుపఁగ దైవికమే
అహిపతి శ్రీవేంకటాధిపుకృపచే
మహిమ గంటిమిఁక మఱవము మనము. ॥భగ॥ 448

బౌళి

నన్నెంచఁబనిలేదు నిన్నెంచుటేకాని
మన్నించు హరి నీమఱఁగు చొచ్చితిని. ॥పల్లవి॥

రాజుఁ బెండ్లాడినయట్టిరమణి యేజాతైనా
పూజితమై యిన్నిటాను భోగించినట్టు
సాజాన నేనెంతసకలహీనుఁడనైనా
వోజతో నిన్నుఁ గొలిచి వున్నతుఁడనైతిని. ॥నన్నెం॥

వేల ముద్దుటుంగరము వేడుకనిడి ప్రధాని
కేలెత్తి యిందరిచే మొక్కించుకొన్నట్టు
నేలనే నీముద్ర మోచి నే నేఁటివాఁడనైనా
వేలరిజగములోనఁ బెద్ద నైతి నిదివో. ॥నన్నెం॥

తల్లిదండ్రిగలవాఁడు తప్పులేమైనాఁ జేసి
తల్లితో ముద్దు గునిసి తప్పించినట్టు
చల్లని శ్రీవేంకటేశ సరవి నీకృపవల్ల
కెల్లున నిన్ను నుతించి గెలిచితినిదివో. ॥నన్నెం॥ 449

శుద్ధవసంతం

ఎందు వెదకనేల యేప్రయాసాలు నేల
యిందే వున్నది బ్రదు కిహాపరములకు. ॥పల్లవి॥

ముక్కోటితీర్థములు ముకుందుదాసుల-
వొక్కపాదాంగుటమున నొలికీనిదే
మిక్కిలిజపతపాలు మించినప్రపన్నుల-
చిక్కనికృపాకటాక్షసీమ నున్న దిదివో. ॥ఎందు॥

చేసేటిపుణ్యాఫలాలు శ్రీవైష్ణవులచేత
రాసులై యిరుదెసల రాలీనివే
ఆసల విజ్ఞానార్థ మదివో ప్రపన్నుల-
భాసురపుఁబెదవులఁ గాఁతి పైపై నున్నది. ॥ఎందు॥

సకలదేవతలచే సాధించేవరములు
మొకరి తదియ్యులమూఁక నిదివో
వెకలి శ్రీవేంకటాద్రివిభునిమహిమలెల్లా
ప్రకటించి వీరసల్లాపాన నున్న దిదివో. ॥ఎందు॥ 450

సాళంగం

నీకుఁ దొల్లే యలవాటు నిరుహేతుకపుదయ
జోక నురుత మెచ్చిన సులభుఁడవే కా. ॥పల్లవి॥

నేరములు దొలఁగించ నెలవులు గలిగించ
గారవించ హరి నీవే కలవు నాకు
నారపేరఁ బిలిచితే నారాయణ యనెనంటా
చేరి కాచినటువంటి శ్రీపతివిగా. ॥నీకుఁ॥

దురితము లణఁగించ దుఃఖములు పెడఁబాప
గరిమఁ గేశవ నీవే కలవు నాకు
మరమరా యంటేను మరి రామ యనెనంటా
తిరముగఁ గాచినట్టి దేవుఁడవుగా. ॥ నీకు ॥

వినుతులు చేకొని వేడుకతో నన్నుఁ గావ
ఘనుఁడ శ్రీవేంకటేశ కలవు నాకు
మనసునఁ దలఁచితే మాటలఁ బిలిచెనంటా
తనిసి కంభాన వెళ్లే దైవమవుగా. ॥ నీకు ॥ 451

గుండక్రియ

ఏపాటితనకర్మ మాపాటి కాపాటె
శ్రీపతిదాసుఁ డయితే చిహ్నా లిటువలెఁబో. ॥ పల్లవి ॥

అందరిని నిర్మలులే యని తలఁచిన తన-
నిందలేనిమనసే నిర్మలము
మందలించి లోకులతో మంచిమాఁట లాడితేను
బందెలేని తననోరే భావించ మంచిది. ॥ ఏపా ॥

అంతటాను హరి యున్నాఁడని చూచినఁ దన-
యంతరంగమున నుండు నాదేవుఁడే
చింతించి యీజగము చేకొని పావనమంటే
సంతపుతనదేహముఁ బరమపావనమే ॥ ఏపా ॥

పుట్టితేఁ దనపాలికిఁ బుట్టె నీప్రపంచము
దట్టమైనపుట్టెల్లఁ దనతోడిదే
యిట్టె శ్రీవేంకటేశుఁ డిచ్చినాఁ డీగుణము
పట్టమై నావద్దనుండు ౧ పరమవిజ్ఞానము. ॥ ఏపా ॥ 452

౧. 'పరమ విజ్ఞానమా' రేకు

రేకు 279 రామక్రియ

బలువుఁడు నాతఁడే బంధువుఁడు నాతఁడే
తలఁ చాతనికి మొక్కఁ ౧దగులింతే నేము ॥పల్లవి॥

దైవమే కారకుఁడు ధరణి రక్షించుటకు
కావింప నరులచేఁత పనిలేదు
శ్రీవల్లభుఁ డతఁడు సేసినట్లా నవును
నావాత ననుభవించేవారమింతే నేము. ॥బలు॥

హరియే స్వతంత్రుఁడు అన్నిపనులుగాఁ జేయ
పరులవుద్యోగాలు పనిలేవు
సురనాథుఁ డాతఁడు చూచినట్లా నవును
వరుసతోఁ దిరిగాడేవారమింతే నేము. ॥బలు॥

సకలేశుఁడే కర్త జగములు గాచుటకు
ప్రకటించ నేర్పులు పనిలేవు
వొకట శ్రీవేంకటేశుఁ డొనరించినట్లవును
సుకియించి పొగడేటిసుద్దులింతే నేము. ॥బలు॥ 458

బౌళి

వద్దిక నోపము పట్టిస్వతంత్రము
వొద్దిక శాంతితో నుండేమయ్యా ॥పల్లవి॥

నడవక మానవు నానాజగములు
కడఁగినహరిసంకల్పానను
వుడుగక కిందు నావుద్యోగమేఁటికి
నడుమనే కనుఁగొని నవ్వేమయ్యా ॥వద్ది॥

౧. 'దగునింతే' కావచ్చు.

కలుగక మానదు కాఁగలభోగము
కలిమిఁ బురాకృతకర్మమిది
అలసి యిందుకు నాయాస లేమిటికి
కలిగినపాటే కానీవయ్యా. ॥ వద్ది ॥

తగులక మానదు తనసంసారము
వెగటగుమాయావిలాసము
అగపడి శ్రీవేంకటాధిపుకృపచే
తగినపాటినే తనిసేమయ్యా. ॥ వద్ది ॥ 454

దేవగాంధార

ఒక్కమాటు శరణని వుండేనింతేకాక
పెక్కువిధముల నెట్టు పెనఁగేనయ్యా. ॥ పల్లవి ॥

నాలికె వొక్కటే నీనామము లనంతము
పోలించి నే నెన్నటు పొగడేదయ్యా
వోలి నాకన్నులు రెండే వొగి నీమూర్తులు పెక్కు
సోలి నే నెన్నటువలెఁ జూచెదనయ్యా. ॥ ఒక్క ॥

పట్టి నాచేతులు రెండే పదములు నీకుఁ బెక్కు
వొట్టి నిన్నుఁ బూజించ నోపికేదయ్యా
గట్టి నాచెవు లిసుమంతే కథలు నీ కవియెన్నో
పట్టవు నేనెట్టు విని భజియించేనయ్యా. ॥ ఒక్క ॥

యేమిటాఁ జిక్కవు నీవు యింతదేవుఁడవుగాన
కామించి నీడాగు చూచి గతిగనేను
యీమేర శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గావు
దీమసాన నిఁక వేరేతెరువు లేదయ్యా. ॥ ఒక్క ॥ 455

సామంతం

గరిమల నెరఁగరుగాక మానవులు
సిరులఁ దియ్యనివోరఁ జేఁదుమేసెదా. ॥పల్లవి॥

హరినారాయణ యనియెడినోరను
ధర నితరులపేళ్లు దడవుటెట్టు
సరవితో వేదములు చదివేటినోరను
పరులమీఁదిపదాలు పాడేదా. ॥గరి॥

మునుప శ్రీపతికి మ్రొక్కినచేతుల
అనరుహులకు దండమనుట యెట్టు
మునుకొని పూవులు ముడిచినసిరసున
౧కవలి కట్టెలు మోచి కాకయ్యేదా. ॥గరి॥

బలిమి శ్రీవేంకటపతిఁ గొలిచినవారు
తెలియ కల్పులఁ గొల్పి తిరుగుటెట్లు
జలధి దాఁటేవాఁడు సరి నోడ వుండఁగ
వలవనిజోలితో వదరువట్టేదా. ॥గరి॥ 456

శాళి

వేళలేదు జాడలేదు వీనితోడిదే పాటు
కూళఁడనై తిరిగేను గుణమేది నాకు. ॥పల్లవి॥

వేగిరించి పెరరేఁచి వేసరించీఁ బనులు
సాగి ముందరఁ బోలసి చలపట్టీ సిరులు
జాగుసేసి వచ్చి వచ్చి చవిచూపీఁ గాయము
యేగతి నిన్నుఁ దలఁతు నేది బుద్ధి నాకు. ॥వేళ॥

---

౧. 'కనలు' పూ. ము. పా

తన్నుఁదానే వచ్చి వచ్చి తగిలీ లంపటము
వున్నతి భోగముల నోరూరించీ సుఖము
కన్నచోనే యెలయించి కదిమీ సంసారము
యెన్నఁడు నిన్నుఁ దలఁతు నెఱుకేది నాకు. ॥ వేళ ॥

కాలిమితో మీఁదమీఁదఁ దరవయ్యీఁ గర్మము
నాలితోడ సన్నసేసి నవ్వు నవ్వీ మర్మము
యేలితివి శ్రీవేంకటేశ్వరుఁడ నన్ను నీవు
సీలాన నీవాఁడనైతిఁ జెప్పనేది నాకు. ॥ వేళ ॥ 457

లలిత

అంతర్యామీ వో అంతర్యామీ
బంతి నాకేమిగల్లా నాపాలివాఁడవుగావా. ॥ పల్లవి ॥

దొంతులై అన్నియోనులాఁ దొల్లి నేఁ బుట్టేటివాఁడే
అంతరాత్మవైనవాఁడ వటు నీవేకా
ఇంతట విడిచేవా న న్నింద్రియాలఁ గట్టివేసి
పొంతఁ జూచేవిటు నాకుఁ బొత్తులకాఁడవుగా. ॥ అంత ॥

తొడరి ౧స్వర్గనరకదుఃఖసుఖములనాఁడు
అడరి కర్మసాక్షి వటు నీవేకా
విడువ వెప్పుడు నన్ను విషయాలఁ జిక్కనాఁడ
కడ నూరకుండనేల కన్నవాఁడవుగావా. ॥ అంత ॥

నీచేతఁగానిది లేదు నీవు నాకుఁ బ్రాణమవు
కాచుటకు నీకంటే నొక్కరు వచ్చేరా
చేచేత శ్రీవేంకటేశ చేరి నీకు శరణంటి
యేచి నన్ను మన్నించితి విది నీతేజముగాదా. ॥ అంత ॥ 458

౧. "స్వర్గనరక దుఃఖసుఖము" అనుట అనుక్రమమును దప్పించినయతిబాధ.

రేకు 280 సాళంగనాట

తీరుచు నతఁడే దినకర్మంబది
నూరిటిరుణ మొకనూలిపోఁగునా. ॥ పల్లవి ॥

తొల్లిటికర్మము దోడఁ గుడుచుటకె
తెల్లమి జీవుఁడు దేహము మోచుట
వొల్లనన్నఁ బో దున్నంతగాలము
మల్లాడి హరినే మఱవఁగవలదు. ॥ తీరు ॥

కోరినకోర్కికి గురియగునందుకె
సారపుసంసారసంగమిది
నేరిచిబ్రదికేటి నెపమునఁ బోదది
కూరిమి హరినే కొలువఁగవలయు. ॥ తీరు ॥

తెంచనియాసలఁ దిప్పుటకే పో
పంచేంద్రియములపంతమిది
చించినఁ బో దిది శ్రీవేంకటపతి
నించి మనసులో నించగవలయు. ॥ తీరు ॥ 459

లలిత

ఎక్కడి పుట్టుగు లిఁక నెక్కడి మరణములు
మిక్కిలి నీముద్రలు నామేన నున్న వివిగో. ॥ పల్లవి ॥

కెరల పాపములకుఁ గెరల కర్మములకు
హరి నీనామము నోర నంటితేఁజాలు
నరకము లేమిసేసు నానేర మేమిసేసు
నిరతి నామతిలోన నీ వుండఁగాను. ॥ ఎక్క ॥

చిక్క నింద్రియములకు చిక్కను బంధములకు
చొక్కి హరి నీమఱఁగుచొచ్చితిఁ జాలు
మొక్కనేలే యెవ్వరికి మొరవెట్ట నేమిటికి
నిక్కపుమాయిలువేల్పు నీవై వుండఁగా. ॥ ఎక్క ॥

దగ్గరవు మాయలింక దగ్గరవు దుర్గుణాలు
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు గల్గఁగా
యెగ్గులేదు తగ్గులేదు యిఁక నీదాసులలోన
౧వుగ్గువలె నీప్రసాద మూనినది వోడల. ॥ ఎక్క ॥ 460

దేసాళం

జోజో యని మీరు జోల వాడరో
సాజపుజయంతి నేడే సఫల మిందరికి ॥పల్లవి॥

అదె చంద్రోదయమాయ హరి యవతారమందె
మొదల జాతకర్మములు సేయరో
అదన పుత్రోత్సవమట పుణ్యాహము చేసి
కదిసి యిట్టె నామకరణముఁ జేయరో. ॥జోజో॥

కాయము దేవకి కిచ్చి గక్కన వాసుదేవుని-
కీయరో గంధాక్షత లిటు విడేలు
కాయకపుగాడిదెకు కవణము వెట్టి మరి
వీయపుచుట్టాలెల్ల వీడువెట్టరో. ॥జోజో॥

షోడశోపచారములఁ జొక్కించి శ్రీవేంకటేశుఁ
బాడరో ధర్మము నిల్పె భార మణఁచె
వోడించెఁ గౌరవదానవులఁ గంసాదులఁ జంపె
ఆడనే పాండవులఁ గాచె నని యర్ఘ్యమియ్యరో. ॥జోజో॥ 461

౧. 'వుగ్గువలేని ప్రసాద' పూ. ము. పా

సాళంగం

చరమార్గమందు నీవు చాటితివిగాన
    అరవిది నమ్మితి నాకెదురెందు లేదు. ॥పల్లవి॥

పతికిఁ జనవరైన ప్రాణధారిలెంకలకు
    తతి నేమిసేసినాను తప్పులేదు
    సతతము హరి నీశరణాగతుఁడ నాకు ౧(గాన)
    అతిపాపము సేసిన అది నాకు లేదు. ॥చర॥

పారుచు నగరి డాగు పసుర మెవ్వరిచేని-
    పైరు మేసినా నందు బందె లేదు
    సారె నీముద్రలు మోచి సంసారవిషయాల
    యేరితిఁ బొరలినా యెగ్గే లేదు ॥చర॥

ధర్మానఁ గొనితెచ్చినదాసులకు పూర వెట్టి-
    అర్మిలిఁ జేయఁగఁ బని అంతలేదు
    నిర్మల శ్రీవేంకటేశ నీకరుణగలనాకు
    కర్మలోపమైనాను కడమే లేదు. ॥చర॥ 462॥

పాడి

నీమాయ లింతేకాక నీరజనాభుఁడ। యివి
    నామది నిజమనెట్టు నమ్మెదయ్యా. ॥పల్లవి॥

బాలుఁడనై నేఁ జన్నుఁబాలు దాగేనాఁడు
    వోలి నను ష్ఠానము లెందుండెనయ్యా
    చాలి యానేనె బ్రహ్మచారినయినమీఁద
    వాలి యవె యెందుండ వచ్చెనయ్యా. ॥నీమా॥

---

౧. ఈ "(గానః)" రేకులోలేదు. పూ. ము. పా.

వేను దినదినమును నిద్దురవో యేవేళ
    వూని నిత్యకర్మము లెందుండెనయ్యా
॥ ౨౭౮ జ్ఞానముతో మేలుకొని సంసారి నైనవేళ
    అనుకొని యెందుండి అంటుకొనెనయ్యా. ॥నీమా॥

యేడ కర్మ మేడ ధర్మ మింతలో సన్యాసైతే
    వేడుకకాదియెల్లా నీవిలాసాలు
॥ ౨౭॥ జాడ నీమనసువస్తే సరుగఁ గరుణింతువు
    వోడక శ్రీవేంకటేశ వున్నసుద్దులేఁటికి. ॥నీమా॥ 463

రామక్రియ

॥ ౨౭॥
హరి హరియని వెరగందుటగాక
    సిరివర మాకు బుద్ధి చెప్పఁగదవయ్యా. ॥పల్లవి॥

పావపుకొంపలోవారు పంచమహాపాతకులు
॥ ౨౮౪ ॥ కాపులకు పదుగురు కర్త లందుకు
    పాపికాండ్లారుగురు ధర్మాసనమువారు
    చాపలమే పనులెట్టు జరగీనయ్యా. ॥హరి॥

పలుకంతలచేను బండవెవసాయము
    బలిమిఁ దొక్కఁ గుంటిపసురము
    తలవరులు ముగురు తగువాదు లేఁదైయారు
    నొలసి ఆవాజ్ఞ కిందుఁ జోటేదయ్యా. ॥హరి॥

ఖూతాల పొంగటికే పొడమినపంటలెల్లా
    కోఁతవేఁత చూచుకొని కోరు కొటారు
    యీతల శ్రీవేంకటేశ యిన్ని విచారించి నీ-
    చేఁతే నిలిపితి వికఁ దెప్పేదేఁటిదయ్యా. ॥హరి॥ 464

రేకు 281 శుద్ధవసంతం

ఏమి సేయుదును నాకేది బుద్ధి యంతర్యామి
యీమతులఁ జిక్కి నీచిత్తమునకు నెట్టుండునో యని
చింతయ్యీడిని ॥పల్లవి॥

కులగోత్రంబులు గుణశీలంబులు
తెలియఁగ గర్వోద్రేకములు
కలసి మెలఁగినఁ గలుగదు జ్ఞానము
తొలఁగిన లోకద్రోహంబు. ॥ఏమి॥

మఱియు గృహారామక్షేత్రంబులు
జఱిగొను మాయాజనకములు
మఱవఁగ నివియే మదకారణములు
౧ విఱిగిన సంసారవిరుద్ధము(?) ॥ఏమి॥

అనుపమవ్రతకర్మానుష్ఠానము-
లెనలేని బంధహేతువులు
తనిసితి నింక నీదాస్యంబే గతి
ఘనుఁడవు శ్రీవేంకటనాథా. ॥ఏమి॥ 465

బౌళి

పారవేసినపుల్లాకు బండికల్లై మించినట్లు
కోరి నీముద్రలు మోచి కొండగొంటి నిదివో. ॥పల్లవి॥

మూఁడుగుణములలోన మునిఁగేటివాఁడఁగాన
పోఁడిమి నాకొకబుద్ధి పుట్ట దెందును
నేఁడు నీశరణమనే నిశ్చయమిచ్చితిగాన
వాఁడిమి నిన్నిటా నేఁ బావనమైతి నిదివో. ॥పార॥

౧. విఱిగిన సంసారవిరుద్ధము—గృహారామక్షేత్రాదులనుండి తొలగినచో వారు సంసారిగా మండుటకు విరోధమగును" కావచ్చు

పంచభూతాలతనువు పాటించి మోచితిఁగాన
పంచేంద్రియవికారాలు పాయవు నాకు
యెంచఁగ నీదాస్యము నా కినామిచ్చితిగాన
పంచల నాపుట్టుగు సఫలమాయ నిదివో. ॥పార॥

తగిలి ఇన్నిటికి స్వతంత్రుఁడ నేఁ గాను గాన
జిగి నిన్ను నెరిఁగి పూజించలేను
నగుతా శ్రీవేంకటేశ నాలో నుండుదుగాన
పగటున నిన్ను నమ్మి బ్రదికితి నిదివో. ॥పార॥ 466

బౌళి

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పదిరెండువేళల రాగాలను. ॥పల్లవి॥

తనువే వోళవు తలయే దండెకాయ
ఘనమై వూర్పులు రెండు కట్టినతాళ్ళు
మనసే నీబద్దితాడు మరి గుణాలె జీవాళి
మొనసినపుట్టుగే మూలమైన కరడి. ॥పాడే॥

పాపపుణ్యా లిరువంక పైఁడివెండియనుసులు
పైపైఁ గుత్తికె మేటిపై చనిగె
కోపులనాలికె లోనఁగుచ్చికట్టినట్టితాడు
చూపరానిసంసారమే సూత్రపుగణికె. ॥పాడే॥

జీవునికిని దండెసేసినవాఁడవు నీవు
వావాతిమాటలే నీపై వన్నెపదాలు
యీవి మాకు నిహపరాలిచ్చితివి మెచ్చితివి
శ్రీవేంకటేశ నీవే చేకొన్నదాతవు. ॥పాడే॥ 467

సాళంగనాట

తానెంత బ్రదుకెంత దైవమా నీమాయ యెంత
మానవులలంపటాలు మరి చెప్పఁగలదా. ॥పల్లవి॥

తెలఁగి నేలఁ దారేటిచీమసయితమును
కలసి పూరకే పారుఁ గమ్మర నెందో మరలు
తలమోఁచి కాఁపురము ధాన్యములు గూడపెట్టు
యిల సంసారము దనకిఁక నెంతగలదో. ॥ తానెం ॥

౧ యేడో బాయిటఁ బారేయీఁగ సయితమును
వాడుదేర నడవుల వాలి వాలి
కూడపెట్టుఁ దేనెలు గొందులఁ బిల్లలఁబెట్టు
యేడకేడ సంసార మిఁక నెంతగలదో. ॥ తానెం ॥

హెచ్చి గిజిగాండ్లుసయిత మెంతోగూఁడువెట్టు
తెచ్చి మిణుఁగురుఁబురువు దీపమువెట్టు
తచ్చి శ్రీవేంకటేశ నీదానులు చూచి నగుదు-
రిచ్చలఁ దానిసంసార మిఁక నెంత గలదో ॥ తానెం ॥ 468

దేవగాంధారి

చెలఁగి యధర్మము పుట్టింప నీకేల స్రుష్టింపఁగ మరి నీకేల
పులులను లేళ్ల నొక్కకదుపుగా పులు మేపుదురటే మాధవుఁడా. ॥పల్లవి॥

గొనకొని పాపండులదుర్భాషలక్రోధము సహింపరాదు
దనుజులపుట్టువు వారలనుచు నిజతత్వజ్ఞానము నీ వియ్యవు
అనిశముఁ జూచిన వారికి మాకును అంతర్యామివి నీవు
పెనఁచి చీఁకటియు వెలుఁగును నొకచోఁ బెంచెద వేలే ముకుందుఁడా.
॥ చెలఁ ॥

౧. 'యేదో(?)' పూ. ము. పా. యేదో=ఎక్కడనో.

ఖలుల తామసపుదేవతార్చనలు కనుఁగొని యవి యోర్వఁగరాదు
నెలకొని వారలు నరకవాసులని నీమీఁది భక్తియు నీ వియ్యావు
పొలుపుగ నిందరిలోపలఁ గ్రమ్మరఁ బూజగొనేటివాఁడవు నీవే
చలమునఁ బుణ్యము పాపము నొకశో సరిచేతురటవే గోవిందుఁడా.

॥ చెలఁ ॥

సతతము నీదాస్యద్రోహులతో సహయోగంబును సహింపదు
క్షితిలో నీవటువంటివారలను సృజింప కేర్పడ మానవు
హితవుగ శ్రీవేంకటేశ్వర నీవే యిహపరములకుఁ గర్తవు
గతి నీశరణాగతి యని నమ్మినఁ గల విందరికిని నారాయణా.

॥ చెలఁ ॥ 469

రేకు 282 లలిత

అతఁడే పరబ్రహ్మ మతఁడే లోకనాయకుఁ-
డతనికంటే మరి యధికులు వేరయ్యా. ॥ పల్లవి ॥

కమలవాసిని లక్ష్మి కలదా యెవ్వరికైనాఁ
గమలనాభునికి నొక్కనికేకాక
కమలజుఁడైనబ్రహ్మ కలఁడా యెవ్వనినాభి-
నమరవంద్యుఁడు ౧మాహరికేకాక. ॥ అతఁ ॥

అందరు నుండెడిభూమి యన్యులకుఁ గలదా
అందపుగోవిందునికే అలాయఁగాక
చెందినభాగీరథి శ్రీపాదాలఁ గలదా
మందరధరుఁడయినమాధవునికిఁగాక. ॥ అతఁ ॥

నిచ్చలు నభయమిచ్చేనేరుపు యెందుఁగలదా
అచ్చుగనారాయణునియందేకాక
రచ్చలశరణాగతరక్షణ మెందుఁ గలదా
తచ్చిన శ్రీవేంకటాద్రిదైవానకేకాక. ॥ అతఁ ॥ 470

---

౧. ఈ 'మా' పూ. ము. పా. లో తప్పిపోయినది.

రామక్రియ

కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ
తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ. ॥ పల్లవి ॥

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెసఁ బుణ్యరాసులే యేరులైనది కొండ
గాదిలి బ్రహ్మాదిలోకములకొనలకొండ
శ్రీదేవుఁడుండేటిశేషాద్రి యీకొండ. ॥కట్టె॥

సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైనకొండ
వుర్విఁ దపసులే తరువులై నిలిచినకొండ
పూర్వపుటంజనాద్రి యీపొడవాటికొండ. ॥కట్టె॥

వరములు కొటారుగా వక్కణించి పెంచేకొండ
పరగులక్ష్మీకాంతుసోబనపుఁగొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండినకొండ
విరివైన దిదివో శ్రీవేంకటపుఁగొండ. ॥కట్టె॥ 471

సామంతం

విజయపుటమ్ము వేసె వేంకటేశుఁడు
విజయునిసఖుఁడు యీవేదమూరితి. ॥పల్లవి॥

పాటితెంచి దశకంఠుపదిశిరసులమీఁద
అటికి(?)నమ్ము వేసె నాదిదేవుఁడు
ఆటిడిసేనలతోడ నంబుధిమీఁద వేసె
వేటొకయమ్ము దొడిగి విష్ణుదేవుఁడు. ॥విజ॥

చాలుగ నేడుదాళ్ల ౧సర్వము నొక్కటిగాఁగ
 ఆలములో నమ్ము వేసె నఖలేశుఁడు
 అలించి రుక్మిణిఁ బెండ్లియాడునాఁడు వైరులపై
 ౨జాలి(?)యమ్ము వేసెను విజయకృష్ణుఁడు. ॥విజ॥

భజన నిందిరఁగూడి పంతమున నమ్ము వేసె
 విజయదశమిని శ్రీవేంకటేశుఁడు
 సుజనుల దేవతల సొరిది నిందరిఁ గాచు
 విజయము చేకొనె విష్ణుదేవుఁడు. ॥విజ॥ 472

లలిత

౩నీదాఁకావలెనా నిచ్చలు నారాయణా
 ఆది నీదాసుఁడే చాలు నందరి రక్షించను. ॥పల్లవి॥

నీపాదమూలమున నిలిచిన౪జలమును
 మోపుగా మోచె రుద్రుఁడు ముందుముందే
 కాపాడునీనామమునఁ గలిగినమహిమచే
 పైపై మునులు యిహపరములు గనిరి. ॥నీదాఁ॥

పందేటిపాలవెల్లి నీప్రసాదమునఁ గాదె
 దండిగా దేవతలెల్ల ధన్యులైరి.
 అండనే నీసాకార మాతుమఁ దలఁచి కాదె
 నిండినయోగీంద్రులు నిత్యముక్తులైరి. ॥నీదాఁ॥

చేరి నీవిహారమైన శ్రీవేంకటాద్రిఁ గాదె
 కోరి నరులు వరాలు కొల్లగొనిరి
 ఆరీతిఁ దాళ్లపాకఅన్నమయ్య ఘనుఁడాయ
 వారివారమై నేము వహికెక్కితిమి. ॥నీదాఁ॥ 473

౧. 'సర్పము' రేకు ౨. రుక్మి తనకు బావమరదికావున చంపుటకిష్టములేక పట్టుకొనుటకు మాత్రమనువుగా దయ (జాలి)తో వేసిన అమ్ముకావచ్చు. ౩. ఈ పాటగూడ పెదతిరుమలయ్యదో, చినతిరుమలయ్యదో కావలసియున్నది. ౪. 'జలమున' రేకు.

శుద్ధవసంతం

దీనుఁడ నేను దేవుఁడవు నీవు
నీనిజమహిమే నెరపుటగాకా. ॥పల్లవి॥

మతి జనన మెఱఁగ మరణం బెఱఁగను
యితవుగ నిను నిఁక నెరిఁగేనా
తతిఁ బుట్టించిన శ్రీపతివి నీవే
తతి నాపై దయ దలఁతువుగాకా. ॥దీనుఁ॥

తలఁచఁ బాపమని తలఁచఁ బుణ్యమని
తలఁపున నిఁక నినుఁ దలఁచేనా
అలరిననాలో యంతర్యామివి
కలుష మెడయ నను గాతువుగాకా. ॥దీనుఁ॥

తిడవ నాహేయము తడవ నామలినము
తడయక నీమేలు దడవేనా
విడువలేని శ్రీవేంకటవిభుఁడవు
కడదాఁకా నీకఁ గాతువుగాకా. ॥దీనుఁ॥ 474

మాళవి

నారాయణాచ్యుతానంత నిన్నొకచోట
గోరి వెదకనేల నీరివల్లఁ గంటిఁబో. ॥పల్లవి॥

సొలసి నీరూపము శ్రుతులలోఁ జెప్పఁగాని
బలిమి నాచార్యుఁడై తేఁ బ్రత్యక్షము
పలికి నీతీర్థము పావనలందేకాని
అల నీదాసులతీర్థ మరచేత నిదివో. ॥నారా॥

నీయానతు లెన్నఁడు నేము దెలియముగాని
మాయాచార్యునిమాట మంత్రరాజము
కాయములో నీవుండేది కడు మఱఁగులుగాని
యీయెడ నీపరికర మిన్నిటా నున్నదివో. ॥నారా॥

అరిది నీవందన మొకర్చావతారానఁగాని
గురుపరంపరనై తేఁ గోట్లాయఁబో
హరి నిన్ను శ్రీవేంకటాద్రినే చూచితిఁగాని
పరమున నిహమునఁ బంచి చూపె నతఁడు. ॥నారా॥ 475

రేకు 283 దేసాళం

నేరుపు నతఁడే నేరమి నతఁడే
భారమెల్ల నాతఁడే పని లేదు మాకు. ॥పల్లవి॥

దేవుఁడట యంతరాత్మ దేహ మెంచిచూచితేను
పోవులకర్మాలు సేయఁబుట్టినదట
జీవుఁ డేఁటివాఁ డిందు శ్రీపతియానాజ్ఞగాక
భావించఁ బాపపుణ్యాలు పనిలేదు మాకు. ॥నేరు॥

హరి లోకాలేలునట అతనిమాయకులోనై
నరులజీవనములు నడచీనట
వెరవులు మాకేల విష్ణుఁడే యింతాఁగాక
పరచువిచారాలు పనిలేదు మాకు. ॥నేరు॥

వేడుక నాలుకను శ్రీవేంకటేశునామమట
పాడితో నాతనికి నే బంటనట
తోడునీడ యాతఁడే తోవ చూప నాతఁడే
పాడయిన కోరికలు పనిలేదు మాకు. ॥నేరు॥ 476

శంకరాభరణం

మునులతపము నదె మూలభూతి యదె
వనజాక్షుఁడే గతి వలసినను. ॥పల్లవి॥

నరహరినామము నాలుక నుండఁగ
పర మొకరి నడుగఁబని యేల
చిరపుణ్యము నదె జీవరక్ష యదె
సరుగఁ గాచు నొకసారె నుడిగినా. ॥మును॥

మనసులోననే మాధవుఁ డుండఁగ
వెనుకొని యొకచో వెదకఁగనేఁటికి
కొనకుఁగొన యదే కోరెడి దదియే
తనుఁ దా రక్షించుఁ దలఁచినను. ॥మును॥

శ్రీవేంకటపతి చేరువ నుండఁగ
భావకర్మముల భ్రమయఁగనేఁటికి
దేవుఁడు నతఁడే తెరువూ నదియే
కావలెనంటేఁ గావకపోఁడు. ॥మును॥ 477

వరాళి

విత్తొకటి వెట్టితేను వేరొకటి మొలచునా
యెత్తిన శ్రీహరి నీవే యీడేర్చవయ్యా. ॥పల్లవి॥

పాపపుణ్యదేహికి బంధములే సహజము
యేపునఁ గాదని తోయనెట్టువచ్చును
పూపవంటిమనసుకు భోగములే సహజము
తేపగా విరతి యెందుఁ దెచ్చుకొనేమయ్యా ॥విత్తొ॥

మాయలజన్మమునకు మమతలే సహజము
యేయెడఁ జొరక మాననెట్టువచ్చును
కాయవంటిగుణానకు కర్మమే సహజము
చాయల నేమెటువలె శాంతిఁబొందేమయ్యా ॥విత్తో॥

తప్పనిజ్ఞానమునకు దైవమే సహజము
యెప్పుడు స్వతంత్రుఁడుగా నెట్టువచ్చును
నెప్పున శ్రీవేంకటేశ నీమహిమే ఇంతాను
చెప్పఁజూపఁ జోటులేదు చేరివుండేమయ్యా. ॥విత్తో॥ 478

మాళవిగౌళ

ధరలో నాజన్మమే తనువు నదియె
యిరవై నీదాసుఁడైతే హీనుఁడైనా ఘనుఁడే. ॥పల్లవి॥

అలరావణునితమ్ముఁ డసురనరభోజనుఁ—
డలరి తొల్లెల్లా నీవాఁడైనమీఁదను
కులజుఁడు పుణ్యుఁడు గుణనిధి యిందరునుఁ
దలఁప యోగ్యుఁడు నట దాస్యమహి మెట్టిదో. ॥ధర॥

౧జాతిబోయ పాతకుఁడు సత్యతపుఁడట తొల్లి
నీతి నరణియనేటినీదాసుఁ జేరి
అతల బ్రహ్మఋషాయ నష్టాక్షరమంత్రాన
చేఁతల నీదాసుల సేవాఫల మెట్టిదో. ॥ధర॥

నానాజంతువులందు నవభక్తిగలిగితే
హీనాధిక్యము లేక యేచి కాతువు
శ్రీనాథ కాచితివి శ్రీవేంకటేశ మమ్ము
నేనూ ధన్యుఁడనైతి నీమహిమ యెట్టిదో. ॥ధర॥ 479

౧. ఈకథ "వరాహపురాణము" లో కలదు.

శంకరాభరణం

తెలిసినవారికి దేవుఁ డితఁడే
వలవనిదుష్టులవాదములేలా. ॥పల్లవి॥

పురుషులలోపలఁ బురుషోత్తముఁడు
నరులలోన నరనారాయణుఁడు
పరదైవములకుఁ బరమేశ్వరుఁడు
వరుస మూఢులకెవ్వరో యితఁడు. ॥తెలి॥

పలుబ్రహ్మలకును పరబ్రహ్మము
మలయునీశులకు మహేశుఁ డితఁడు
ఇల నాత్మలలో నిటు పరమాత్ముఁడు
ఖలుల కెట్లుండునో కానము యితఁడు. ॥తెలి॥

వేదంబులలో వేదాంతవేద్యుఁడు
సోదించ కరిఁ గాచుచో నాదిమూలము.
యీదెస శ్రీవేంకటేశుఁ డిందరికి
గాదిలిమతులనుఁ గైకొనఁ డితఁడు. ॥తెలి॥ 480

లలిత

సంసారికిఁ గల సహజమిది మతిఁ
గంసారి మనకుఁ గలఁ డటుగాన. ॥పల్లవి॥

చేతులు చాఁచుచు సేయఁగఁదొడఁగిన
ఘాతల నిన్నిఁ గర్మములే
వాతులుమోవఁగ వలెనినవెదకిన
పూఁతల నిన్నియు భోగములే. ॥సంసా॥

వొగి లంపటముల కోపిక గలిగిన
జగమింతాఁబో సంపదలు
తగిఁ జిత్తములోఁ జింతించిచూచిన
సగుణం బింతా సంతోషములు. ॥ సంసా ॥

యేచిన శ్రీవేంకటేశ్వరుఁ గొలిచిన
చూచినవెల్లా సులభములే
తాచి యీతనికె దాసులమయితిమి
కాచె నతఁడు మముఁ గడమలు లేవు. ॥ సంసా ॥ 481

రేకు 284 శ్రీరాగం

కొలిచినవారిపాలి కొల్లలివివో
యిల నిట్టి దైవమవు యిఁక వేరేకలరా ॥ పల్లవి

యెట్టైన నభయహస్త మెత్తుక కాచుకున్నాఁడ-
వట్టె దాసులఁ గాచేనంటా నీవు
తొట్టినపాపాలు పోఁదోలు నీనామమంత్రాలు
జట్టిగా లోకాల వెదచల్లినాఁడవు. ॥ కొలి ॥

తలఁచినవారికెల్లా ధనధాన్యా లిత్తు నంటా
వొలసి శ్రీసతి మోచుకున్నాఁడవు
యిలఁ బావనులఁగా నిందరిఁ జేసేనంటా
నెలమిఁ బాదతీర్థ మేరు చేసినాఁడవు. ॥ కొలి ॥

పుట్టించ జీవులను భువనములోపల
గట్టిగ బ్రహ్మను నాభిఁ గన్నాఁడవు
అట్టుగఁ బాలుపడి చుట్టి రక్షకాన్ని కే
యిట్టె శ్రీవేంకటాద్రి యెక్కినాఁడవు. ॥ కొలి ॥ 482

భైరవి

కాను స్వతంత్రుఁడననఁ గాదని తలఁగలేను
నేను నీకింకరుఁడ నీరచనలే. ॥ పల్లవి ॥

యెంతైనాఁ దీర దిదే యెందు చూచిన పనులు
అంతటాను నీమాయ అలయించఁగా
దొంతులగుఁగర్మములు తోడనే తిరిగిని
సంతకూటపుఁబ్రతుకు సటలఁ బెట్టీని. ॥ కాను ॥

మాన వింద్రియము లివి మతిలోనఁ బెర రేఁచు
నానాగము(తు?)లఁ బ్రకృతి నటియించఁగా
పూని పురాకృతములు పోనీక తిరిగిని
సానఁబట్టినవయసు సటలఁ బెట్టీని. ॥ కాను ॥

తరవులనే పెట్టీని తతిలేని యాసలివి
నిరతంపుజన్మములు నిడుసాగఁగా
వరుస శ్రీవేంకటేశ్వర నీవు నన్నేలి
కరుణించఁగా భక్తి ఘనత మీరీని. ॥ కాను ॥ 483

భూపాళం

ఏమి నిద్దిరించేవు యెంచాఁకాను
కామించి బ్రహ్మాదులెల్లఁ గాచుకున్నా రిదివో. ॥ పల్లవి ॥

పులుఁగాలుఁ బచ్చళ్ళు బోనమువెట్టినదిదే
వెలయుధనుర్మాసవేళయు నిదే
బలసి సంకీర్తనపరులు పాడేరిదే
జలజాతుఁడ లేచి జలకమాడవయ్యా. ॥ ఏమి ॥

తోడనే గంధాక్షతలు ధూపదీపాలివిగో
కూడినవిప్రులవేదఘోషణలివే
వాడుదేరఁ బూజించవలెఁ గమ్మఁబువ్వులివె
వీడెమిదె కొలువుకు విచ్చేయవయ్యా. ॥ఏమి॥

చదివేరు వైష్ణవులు సారెఁ దిరువాము డిదె
కదిసి శ్రీసతి ముందే కాచుకున్నది
అదనాయ శ్రీవేంకటాధిప యూచరపిదే
యెదుట నిన్నటిమావే యియ్యకొంటివయ్యా. ॥ఏమి॥ 484

శుద్ధవసంతం

చేరి యశోదకు శిశు వితఁడు
ధారుణి బ్రహ్మకుఁ దండ్రియు నితఁడు. ॥పల్లవి॥

సొలసి చూచినను సూర్యచంద్రులను.
లలి వెదచల్లెడులక్షణుఁడు
నిలిచిననిలువున నిఖిలదేవతల
కలిగించు సురలగనివో యితఁడు. ॥చేరి॥

మాటలాడినను మరియజాండములు
కోటులు వొడమేటిగుణరాశి
నీటగునూర్పుల నిఖిలవేదములు
చాటువనూరేటిసముద్ర మితఁడు. ॥చేరి॥

ముంగిటఁ బొలసినమోహన మాత్మలఁ
బొంగించేఘనపురుషుఁడు
సంగతి మావంటిశరణాగతులకు
నంగము శ్రీవేంకటాధిపుఁ డితఁడు. ॥చేరి॥ 485

సాళంగం

జీవన్ముక్తులము శ్రీపతిదాసులము
భావించవో మమ్మును ప్రపంచపుమాయా. ॥ పల్లవి ॥

యివల దానధర్మము లేమిఁ జేయుటలేదు
తవిలినపాతకాలు దైవమే వహించుకొనె
భువిలోన నాకిఁక బుట్టఁబనిలేదు లేదు
భవరోగవైద్యుఁడు శ్రీపతి గలఁడుగాన. ॥ జీవ ॥

యెలమి స్వర్గాదిలోకాలేమీఁ గోరుటలేదు
కలవైకుంఠము హరి కాలమునాఁడే యిచ్చె
తొలుత నాకుఁ జావులతోడినడ్డ వద్దు వద్దు
బలువైనయచ్యుతునిబంట్లముగాన. ॥ జీవ ॥

పాపసుఖమూ నొల్లము పొంచి దుఃఖమూ నొల్లము
చేపట్టి బ్రహ్మానందము శ్రీవేంకటేశుఁ డిచ్చెను
దూపయు నాఁకటికిఁగా తోదోపు మాకిఁక వద్దు
కాఁ పమృతమథనుఁడు గలఁ డిట్టేకాన. ॥ జీవ ॥ 486*

పాడి

కాఁపులము నేము కర్తవు నీవు
దాపుదండై మము నిట్టే దయఁజూడవయ్యా. ॥ పల్లవి ॥

నెట్టన నైదుగురికి నేము డాగువెట్టేము
చుట్టి చుట్టి పీడుఁబట్టు చూపివున్నది
అట్టె కర్మములకు నరిగోరు వెట్టేము
నట్టుకొట్టి(ట్టే?)జీవులకు నరకములేలయ్యా. ॥ కాపు ॥

మించినయాసల కిదే మేరలెల్లాఁ జెల్లేము
పొంచి మమతలలోఁ గాఁపుర మున్నారం(ము?)
పంచేంద్రియములకే పైరులు సేసితిమి
అంచెలఁ బ్రాణులకిఁక నానాజ్ఞలేలయ్యా. ॥కాపు॥

కూరిమి విషయముల కొట్నాలు దంచేము
చేరి నీవు చెప్పినట్టే సేసేము
యీరీతి శ్రీవేంకటేశ యిటు నీకే దాసులము
ఆరూఢిగా మన్నించితి వంతే చాలు నౌనయ్యా. ॥కాపు॥487

రేకు 285 మలహరి

సకలముఁ జదివిన శాస్త్రము లెఱిఁగిన
శుకబ్రహ్మవాదు లిటు చూపినది. ॥పల్లవి॥

భవభవములకును ప్రకృతులు వేరే
భువి నామరూపములు వేరే
యివల నీదాస్యం బెప్పుడు నొకటే
కవిసిననీమాయఁ గడచినది. ॥సక॥

మతము మతమునకు మార్గము వేరే
అతిసంశయములు అవి వేరే
గతి నీశరణము గలిగినదొకటే
యితవగుమోక్షం బిచ్చేది ॥సక॥

జాతిజాతియాచారము వేరే
ఆతల మోక్షంబది యొకటే
శ్రీతరుణీశ్వర శ్రీవేంకటేశ్వర
చేత మాగురుఁడు చెప్పినది. ॥సక॥ 488

ముఖారి

తొల్లిటివారికంటే దొడ్డ నేను పాతకాన
బల్లిదుఁడవగుటకుఁ బ్రతాపమిదివో. ॥ పల్లవి ॥

నరహరి యచ్యుత వో నారాయణా
గురుఁడు నిన్నుఁ [1]గొండించెఁ(?)గోరి నే వింటి
గరిమ నొక్కతప్పున కాకికిఁ బరమిచ్చితి
సిరులఁ బెక్కుతప్పులు సేసితి నేమిచ్చేవే. ॥ తొల్లి ॥

మందరధరుఁడ వో మధుసూదనా
అందరు నిన్నొకమాఁట ఆడఁగా వింటి
నింద కొకటి బొంకితే నీవు ధర్మజుఁ గూడితి
వంది పెక్కుబొంకుల నాయందుఁ గూటమెంతో. ॥ తొల్లి ॥

శ్రీవేంకటేశ్వర శ్రీసతీమనోహర
సేవ నీదాసులే నిన్నుఁ జేతఁ జూపేరు
మోవ నొక్కశునకము మొర యాలించితివట
వేవేలు జన్మాలెత్తితి యీవిధ మెట్లాలించేవో. ॥ తొల్లి ॥ 489

వరాళి

ఇదె చాలదా మమ్ము నీడేర్చను
అదన నెవ్వఁ డెరుఁగు నటమీఁదిపనులు. ॥ పల్లవి ॥

ఇట్టె పంచసంస్కారా లెచ్చోటు నుండినాను
పట్టైనవారే మాకుఁ బ్రమాణము
మట్టుగ వీరూపనామము లెందు నుండినాను
[2]కట్టఁగడవారైన ఘనపుణ్యులు. ॥ ఇదె ॥

---

1. 'కొండాఁడెను' అనుటకు వ్యావహారికమా? లేక 'కొండెము' పైనామధాతువా? రెండవదైనచో అర్థము పొసగునా? 2. 'కట్టఁగడ' లో అరసున్నవిచార్యము'

పలుక వైష్ణవవేషభాష లెందు నుండినాను
వలనుగ మాకు సహవాసయోగ్యులే
తలకొన్న ౧దాసానుదాస్య మెందు నుండినాను
అల కర్మదూరులైన నంతరంగులు. ॥ఇదె॥

యెక్కువ సంకీర్తన మెచ్చోట నుండినాను
అక్కడ పరమపద మది భాగ్యము
చక్కఁగ వేదశాస్త్రసమ్మతము నిదియే
పక్కన శ్రీవేంకటేశుపరమార్థము నిదె. ॥ఇదె॥ 490

రామక్రియ

అన్నిటిమూలం బతఁడు
వెన్నునికంటెను వేల్పులు లేరు. ॥పల్లవి॥

పంచభూతముల ప్రపంచమూలము
ముంచినబ్రహ్మకు మూలము
పొంచినజీవులపుట్టుగుమూలము
యెంచఁగ దైవము యితఁడే కాఁడా. ॥అన్ని॥

వెనుకొని పొగడేటివేదాలమూలము
మునులతపములకు మూలము
ఘనయజ్ఞాదుల కర్మపుమూలము
యెనలేనిదైవ మితఁడే కాఁడా. ॥అన్ని॥

అగపడి సురలకు నమృతమూలము
ముగురుమూర్తులకు మూలము
నగుశ్రీవేంకటనాథుఁడే మూలము
యెగువలోకపతి యితఁడే కాఁడా. ॥అన్ని॥ 491

---

౧. 'దాసాన' రేకు

లలిత

అవధారు రఘుపతి యందరినిఁ జిత్తగించు
యివల నిందెఁ గొలు విదె ౧నడె సముఖా. ॥ పల్లవి ॥

రామ రాఘవ రామభద్ర రామచంద్ర
శ్రీమదయోధ్యాపతి సీతాపతి
ప్రేమ నారదుఁడు వాఁడీఁ బెక్కు రంభాదు లాడేరు
మోమెత్తి కపులెల్లా మొక్కేరదివో. ॥ అవ ॥

యినవంశకులజాత ఇక్ష్వాకుతిలకా
ఘనదశరథసుత కౌశికప్రియ
మునులు దీవించేరు ముందట భరతుఁ డదె
వెనక లక్ష్మణుఁడు సేవించీ వింజామర. ॥ అవ ॥

కందువఁ గౌసల్యాగర్భరత్నాకర
చెందిన శ్రీవేంకటాద్రి శ్రీనివాసా
సందడిఁ గుశలవులు చదివేరు వొకవంక
చెంది నీరాజనము చెప్పరాదు రామా. ॥ అవ ॥ 492

దేసాళం

అక్కటా రావణుబ్రహ్మహత్య నీకు నేడది
వుక్కటిపురాణలింగపూజ నీకు నేడది. ॥ పల్లవి ॥

గురుహత్య బ్రహ్మహత్యఁ గూడీ ద్రోణాచార్యువంక
హరి నీకృప నర్జును కవి లేవాయ
యెరవుగాఁ గల్లలాడి యేచినధర్మజునకు
పరగ నీయనుమతిఁ బాపము లేదాయను. ॥ అక్క ॥

---

౧. 'నదె' పూ. ము. పా.

అదివో రుద్రుని బ్రహ్మహత్య వాయఁ గాసి యిచ్చి
పొదలిననీ వతనిఁ బూజింతువా
అదనఁ బార్వతిదేవి కాతఁడే నీమంత్ర మిచ్చె
వదరుమాటల మాయావచనాలేమిటికి. ॥ అక్క ॥

తగిలి నీనామమే తారకబ్రహ్మమై
జగమువారిపాపాలు సంతతముఁ బాపఁగాను
మిగుల శ్రీవేంకటేశ మీకు నేడ పాతకాలు
నగుఁబాటు లింతేకాక నానాదేశముల ॥ అక్క ॥ 493

రేకు 286 సామంతం

నారాయణుఁడ నీ నామము మంత్రించివేసి
పారేటియీజంతువులభ్రమ విడిపించవే. ॥ పల్లవి ॥

మదనభూతము సోఁకి మగువలుఁ బురుషులు
అదన ౧ విరిదలలై యంగమొలలై
పెదవి నెత్తురు వీర్చి పెనుగోళ్ళఁ జించుకొంటా
కొదలు కుత్తికలనుఁ గూసేరు జీవులు. ॥ నారా ॥

పంచభూతములు సోఁకి భ్రమసి యజ్ఞానులై
పొంచి హేయములు మన్నుఁబూసుకొంటాను
అంచెల వీడెపురస మందు నిందు గురియుచు
యెంచి ధనముపిశాచాలిల్లైరి జీవులు. ॥ నారా ॥

తమితోడ మాయాభూతము సోఁకి బహుజాతి-
యెముకలుఁ దోలు నరా లిరవుచేసి
నెమకి శ్రీవేంకటేశ నిన్నుఁ జేర కెక్కడైన
తముఁ దా మెరఁగరింతటాఁ జూడు జీవులు. ॥ నారా ॥ 494

౧ 'విరిదలై ' పూ. ము. పా.

వసంతం

నీ శరణమేగతి నే నితరమెరఁగ
పాశబంధముల పనులేలయ్యా. ॥ పల్లవి ॥

పూఁచినతొలుకర్మంబులు భోగించకపోవు
చాఁచుకున్న యీ శరీరగుణములు చాలునన్నఁ బోవు
రేఁచినజననమరణములు రెంటికిఁ దీసీని
మోఁచివచ్చితే విజ్ఞాన మెరఁగఁగ మొదలికిఁ గొనకును యెడ
యేదయ్యా ॥ నీ శ॥

కోరిననాకోరికలు కొనసాగకపోవు
కారిఁబడుచు కాలము దా బడిఁదగులకపోదు
మేరతో పంచేంద్రియములు మెడ చుట్టకపోవు
యేరీతుల సంసారము గెలువఁగ నెదురుబడిని బలిమిఁక నేదయ్యా॥నీశ

మనసును వాకునుఁ జేఁతయు మానుమన్నఁ బోవు
తనువులోన నా యంతర్యామివి తలఁచక ఇఁకఁ బోదు
ఘనుఁడవు శ్రీవేంకటపతి నన్నుఁ గావక ఇఁకఁ బోదు
కని కాననియజ్ఞానజంతువను కడమలెంచ నిఁకఁ గొల(లఁ?)దేదయ్యా.
॥ నీ శ ॥ 495

ముఖారి

కడవరాదు వారి ఘనమాయ। తెగి
విడువఁగరాదు వేసరరాదు. ॥ పల్లవి ॥

చూపుల యెదిటికి సోద్యంబై నది
పాపపుణ్యములప్రపంచము
తీపులు వుట్టించు దినదినరుచులై
పూవలసంసారభోగములు. ॥ కడ ॥

మనసులోపలికి మర్మంబైనది
జననమరణములశరీరము
వెనవెనకఁ దిరుగు వెడ లంపటమై
కవకపుటాసలకర్మములు. ॥కడ॥

తగుమోక్షమునకుఁ దాపయైన దిదె
నగి హరిఁ దలఁచిన నాలుకిది
వెగటు దీరె శ్రీవేంకటపతియై
యగపడె నిపుడు పురాకృతము. ॥కడ॥ 496

రామక్రియ

పంచేంద్రియములాల పంచభూతములాల
అంచెలఁ దొమ్మి సేయకురో మీరు. ॥పల్లవి॥

కొందరికి మంచివాఁడ కొందరికిఁ గానివాఁడ
నిందకుఁ గీర్తికిఁ బొత్తు నే నొకఁడనే
అంది నిద్దిరించువాఁడ నటు మేలుకొనువాఁడ
బొందితో నెఱుకమఱపులకు నొక్కఁడనే. ॥పంచేం॥

దైవము నిర్మించినది ధరణిఁ బొడమినది
యీవలావలికిఁ బొత్తు యీ దేహమే
వేవేలుపుణ్యములకు వెలయుఁ బాపములకు
యీవల రెంటికి గురి ఇదివో నా మనసు. ॥పంచేం॥

తుంచి సగమటు వోవు తోడనే సగము వచ్చు
పంచి లోనికి వెలికిఁ బ్రాణమొక్కటే
కొంచక శ్రీవేంకటేశుఁ గొలిచి నే శరణంటి
మంచివాయఁ బనులెల్లా మమ్ముఁ గాచె నితఁడు. ॥పంచేం॥ 497

భైరవి

అటమీఁద శరణంటి నన్నిటా మాన్యము నాకు
    యెటుసేసినాఁ జెల్లె నిఁకనేల మాటలు. ॥ పల్లవి ॥

ఏదిపుణ్యమో నాకు నేదిపాపమో కాని
    శ్రీదేవుఁడవు నీవే సేయించేవు
    సేదదేర నామీఁదఁ జిత్రగుప్తుఁ డేల వా(వ్రా?)సీ
    మేదిని స్వతంత్ర మేదిగ మెరయ నీబంటను. ॥ అట ॥

పుట్టినట్టి౨ తెరువేదో పోయేటిజాడ యేదో
    పుట్టించితి నీవే పురుషోత్తమ
    వెట్టి సంసారబంధాలు వెంట వెంట నేలవచ్చీ
    ఇట్టె యెవ్వరివాఁడ నిందులోన నేను. ॥ అట ॥

చిత్త మెటువంటిదో జీవుఁ డెటువంటివాఁడో
    హత్తిన శ్రీవేంకటేశ అంతరాత్మవు
    యొత్తినమదము నిన్ను నేల కాననియ్యదాయ
    నిత్తెము తొల్లే నేను నీవాఁడఁగాన. ॥ అట ॥ 498

పాడి

సౌమిత్రిసహోదర దశరథరామా
    చేముంచి గుత్తిలో వెలసినరఘురామా. ॥ పల్లవి ॥

చెలిమి సుగ్రీవుతోడఁ జేసినరామ తొల్లి
    శిలనుఁ బడఁతిఁ గావించినరామా
    చెలరేఁగినవానరసేనలరామా
    శిలుగు మాయామృగముఁ జించినరామా. ॥ సౌమి ॥

---

౧. 'మెరయవిబంటను' పూ. ము. పా. ౨. 'పుట్టనట్టి' రేకు

తరణివంశ తాటకాంతక రామా
నరనాథ కౌసల్యానందన రామా
సిరులఁ బెండ్లాడిన సీతారామా
గరిమతో సేతువుగట్టినరామా. ॥సామి॥

రావణాదిదనుజహరణ రామా
కావించి విభీషణునిఁ గాచినరామా
దీవెన లయోధ్యలోఁ జెందినరామా
శ్రీవేంకటాద్రిమీఁది శ్రీరామా. ॥సామి॥ 499

రేకు 287 సాళంగనాట

అదివో నీప్రతాపము హనుమంతా
యెదురులేదు నీకు నెక్కడా హనుమంతా. ॥పల్లవి॥

యెత్తిననీ కుడిహస్త మిల నసురలు చూచి
హత్తిరి పాతాళము హనుమంతా
చిత్తగించి నీయెడమచేతిపిడికిటికి
తత్తరించి చిక్కిరదె దైత్యులు హనుమంతా. ॥అది॥

నలియఁదొక్కినసీవున్నతవుఁబాదముకింద-
నలమటించే రరులు హనుమంతా
చలపట్టి నీవు జంగ చాఁచిన పాదహతిని
బలుదానవులు భంగపడిరి హనుమంతా. ॥అది॥

వడి నీవు మీఁదికి వాలమల్లార్చిన
అడఁగిరి రాక్షసులు హనుమంతా
బడినే శ్రీవేంకటేశుపంపున నీవు గెల్వఁగ
చెడిదమై పొగడేరు పెద్దహనుమంతా. ॥అది॥ 500

మాళవి

దిక్కులెల్లా సాధించి దేవదుందుభులు మ్రోయ-
నెక్కడ చూచినఁ దానే యేఁగీ సేవించరో. ॥పల్లవి॥

అదివో శ్రీహరితేరు అదె గరుడధ్వజము
కదలేటిఘనతురంగము లవిగో
పొదలుఁబూదండ లవే పూఁచి వాఁగేఘంటలవే
యెదుటఁ దిరువీధుల నేఁగీ సేవించరో. ॥దిక్కు॥

వారె అచ్చరలేమలు వారె మునులు రుషులు
వారక కొలిచేదేవతలు వారే
వీరె యనంతగరుడవిష్వక్సేనాదులు
యీరీతిఁ బ్రతాపాన నేఁగీ సేవించరో. ॥దిక్కు॥

వీఁడె శ్రీవేంకటేశుఁడు వీఁ డలమేల్మంగపతి
వీఁడె శంఖచక్రాదుల వెలసినాఁడు
పోఁడిమి వరములిచ్చీఁ బొసఁగ దాసులకెల్లా
యేఁడేఁడు దప్పకుఁడాను యేఁగీ సేవించరో. ॥దిక్కు॥501

బౌళి

ఆనందనిలయ ౧ప్రహ్లాదవరదా
భానుశశినేత్ర జయ ప్రహ్లాదవరదా. ॥పల్లవి॥

పరమపురుష నిత్య ప్రహ్లాదవరదా
హరి యచ్యుతానంత ప్రహ్లాదవరదా
పరిపూర్ణ గోవింద ప్రహ్లాదవరదా
భరితకల్యాణగుణ ప్రహ్లాదవరదా. ॥ఆనం॥

---

౧. రేకులో అంతటా "ప్రంహ్లాద" అనియే.

భవరోగసంహారణ ప్రహ్లాదవరదా
అవిరళకేశవ ప్రహ్లాదవరదా
పవమాననుతకీర్తి ప్రహ్లాదవరదా
భవపితామహవంద్య ప్రహ్లాదవరదా. ॥అనం॥

బలయుక్తనరసింహ ప్రహ్లాదవరదా
లలితశ్రీవేంకటాద్రిప్రహ్లాదవరదా
ఫలితకరుణారస ప్రహ్లాదవరదా
బలివంశకారణ ప్రహ్లాదవరదా. ॥అనం॥ 502

రామక్రియ

పంతగాఁడు మిక్కిలి బంటుతనమునను
అంతటాఁ గలశాపురహనుమంతరాయఁడు ॥పల్లవి॥

నీరధి చంగనదాఁటి నెట్టన లంకచొచ్చి
శ్రీరామునుంగరము సీతకిచ్చి
మేరమీరి యతుఁ గొట్టి మేటివనము వెరికె
అరయఁ గలశాపురహనుమంతరాయఁడు. ॥పంత॥

ఘాతతో లంక గాలిచి గక్కన లంకిణిఁ జంపి
యీతలికి మగుడఁ దా నేతెంచి
సీతాశిరోమణి శ్రీరామునకు నిచ్చె
అతఁడే కలశాపురహనుమంతరాయఁడు. ॥పంత॥

అలరావణుని గెల్చి అయోధ్యాపురికి వచ్చి
బలురాముని సీతతోఁ బట్టముగట్టి
నిలిచె శ్రీవేంకటాద్రినిలయునియెదుటను
అలరెఁ గలశాపురహనుమంతరాయఁడు. ॥పంత॥ 503

ముఖారి

అవధారు సకలలోకైకనాథ
సువర్ణరూపమైనసుగ్రీవనారసింహా. ॥ పల్లవి ॥

అరుదుగ మీరు సింహాసనముపై నుండగ
యిరుగడ సేవించేరు ఇంద్రాదులు
పరగ నెట్టనెదుట ప్రహ్లాదుఁ డున్నవాఁడు
సొరిదినే చిత్తగించు సుగ్రీవనారసింహా. ॥ అవ ॥

చాపలపుహిరణ్యుని సమయించివున్న మీకు
చేపట్టి మొక్కేరు వశిష్ఠాదులు
యేపొద్దు మీతొడమీఁద నిందిర గాచుకున్నది
చూపులఁ గరుణ నించు సుగ్రీవనారసింహా. ॥ అవ ॥

సలలితముగ నీవు జగములు రక్షించఁగా
వలనుగఁ బొగడేరు వ్యాసాదులు
యెలమి శ్రీవేంకటేశ ఇందు నందు నెలకొని
సులభమూర్తివైతివి సుగ్రీవనారసింహా. ॥ అవ ॥ 504

శ్రీరాగం

శరణు శరణు రామచంద్ర నరేంద్రా
సరి మమ్ముఁ గావు రామచంద్ర నరేంద్రా. ॥ పల్లవి ॥

ఘనదశరథునకుఁ గౌసల్యాదేవికిని
జననమందిన రామచంద్రనరేంద్రా
కనలి తాటకిఁ జంపి కౌశికుజన్నము గాచి
చనవులిచ్చినరామచంద్రనరేంద్రా. ॥ శర ॥

అరిది సీతఁ బెండ్లాడి అభయ మందరికిచ్చి
శరధిఁగట్టినరామచంద్రనరేంద్రా
అరసి రావణుఁ జంపి అయోధ్యానగర మేలి
సరవినేలినరామచంద్రనరేంద్రా. ॥శర॥

పన్నుగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు-
సన్నిధినిల్చినరామచంద్ర నరేంద్రా
అన్నిటా లక్ష్మణభరతాంజనేయశత్రుఘ్నుల-
సన్నుతికెక్కినరామచంద్రనరేంద్రా. ॥శర॥ 505

రేకు 288 నాట

కంభమున వెడలి ఘననరసింహము
కుంభిని హిరణ్యుఁ గూలిచెను. ॥పల్లవి॥

తొడికి దైత్యుఁ దనతొడపైకిఁ దిగిచి
కడుపుచించి రక్తము చల్లి
జడియక పేగులు జందెంబులుగా
మెడఁ దగిలించుక మెరసీ వాఁడే. ॥కంభ॥

పెదవులు చింపుచు పెనుగోళ్ల నదిమి
వుదుటుఁబునుక గోరి కుమియుచును
సదరపుగుండెలు చప్పరింపుచును
మెదడు గందముగ మెత్తీ వాఁడే. ॥కంభ॥

దేవతలభయము దీర్చి యంకమున
శ్రీవనితనుఁ గృపసేయుచును
పావనపుటహోబలగిరిదైవము
శ్రీవేంకటగిరిఁ జెలఁగీ వాఁడే. ॥కంభ॥ 506

సాళంగనాట

ఆదిమపురుషుఁడు అహోబలమునను
వేదాద్రిగుహలో వెలసీ వాఁడే. ॥ పల్లవి ॥

వుదయించె నదిగో వుక్కుఁగంభమున
చెదరక శ్రీనరసింహుఁడు
కదిసి హిరణ్యుని ఖండించి ప్రహ్లాదు-
నెదుట గద్దెపై నిరవై నిలిచె. ॥ ఆది ॥

పొడచూపె నదిగో భువి దేవతలకు
చిడుముడి శ్రీనరసింహుఁడు
అడర నందరికి నభయం బొసగుచు
నిడుకొనెఁ దొడపై నిందిరను. ॥ ఆది ॥

సేవలుగొనె నదె చెలఁగి సురలచే
౧శ్రీవేంకటనరసింహుఁడు
దైవమై మమ్మేలి దాసుల రక్షించె
కావుకొనఁగ నిటు దయతోఁ జూచి. ॥ ఆది ॥ 507

దేవగాంధారి

ఏమని నుతింతు నేను యిందిరానాయక నీవు
కామించి కోరినవారి కల్పలతవు. ॥ పల్లవి ॥

నెట్టనఁ దలఁచేవారినిందునిధానమవు
పట్టినవారిచేతిబంగారమవు
చుట్టరిక మెంచేవారిచోటికిఁ దల్లిదండ్రివి
ముట్టి కొలిచినవాంముంజీతమవు. ॥ ఏమ ॥

౧. 'శ్రీవేంకట'తరువాత 'గిరి' యనురెండక్షరములు సన్నగా వ్రాసిరిగాని చెక్కలేదు.

సేవ చేసినవారికి చేతిలో మాణికమవు
భావించువారికి పరబ్రహ్మమవు
కావలెనన్న వారికి ఘనమనోరథమవు
వావిరిఁ బూజించువారివజ్రపంజరమవు. ॥ఏమ॥

బత్తిసేసినవారికి భవరోగవైద్యుఁడవు
హత్తి నుతించినవారియానందమవు
పొత్తులఅలమేల్మంగబువ్వపుశ్రీవేంకటేశ
ఇత్తల మాపాలిటికి నిహపరదాతవు. ॥ఏమ॥ 508

దేసాళం

సురలు సంతోషించి రసురలెల్లా నడఁగిరి
తొరలి దిక్కుల దేవదుందుభులు మొరసె. ॥పల్లవి॥

కడఁగి వసుదేవుని కాంత దేవకిదేవికి
వుడివోని వేడుకఁ జంద్రోదయవేళ
కొడుకై జన్మించినాఁడు కూరిమి శ్రీకృష్ణుఁడు
నడురేయి నిదె శ్రావణబహుళాష్టమిని. ॥సుర॥

రేపల్లె కెమున దాఁటి రేతిరే తెచ్చి తండ్రి
పాపని యశోదవద్దఁ బండఁగఁ బెట్టి
ఆపొద్దే మధురలోని కాఁడుఁగాపఁ దెచ్చుకొనె
కోపగించి కంసుని మార్కొనె నందనందని. ॥సుర॥

పురుఁడు వెళ్లెను మరి[౧] పుణ్యావాజనసేసిరి
మురిపేన గొల్లెతలు ముద్దాడిరి
అరిది శ్రీవేంకటేశుఁ డలమేలుమంగపతై
యిరవై కొల్చినవారి నిందరి రక్షించెను. ॥సుర॥ 509

౧. 'పుణ్యావాజన' వంటివ్రాత కేవలము రేకుల చెక్కినవారికైవాడమే.

బౌళి

దేవదుందుభులతోడ దివ్యులతోడ
యీవేళ శ్రీహరితేరు యేఁగీ వీధులను. ॥పల్లవి॥

గరుడధ్వజముతోడ కనకపుగుఱ్ఱాలతో
పరపైె యష్టదిక్కుల బండికండ్లతో
నిరతితో పట్టునూలినిడుపపగ్గాలతోడ
యిరవై శ్రీపతితేరు యేఁగీ వీధులను. ॥ దేవ ॥

పచ్చలప్రతిమలతో పగడపునొగలతో
హెచ్చినవై దూర్యపుటిరుసులతో
కుచ్చులముత్యాలతో గుంపుఁబైఁడికుండలతో
యిచ్చల భూధవుతేరు యేఁగీ వీధులను. ॥ దేవ ॥

మంచినీలాలగద్దెతో మణిదర్పణాలతోడ
పొంచినసింగారాలతో పూదండలతో
అంచె శ్రీవేంకటేశుతో నలమేలుమంగతోడ
యెంచఁగ దేవునితేరు యేఁగీ వీధులను. ॥ దేవ ॥ 510

పాడి

సేవించి చేకొన్నవారిచేతిభాగ్యము
వేవేగ రారో రక్షించీ విష్ణుఁ డీడను. ॥ పల్లవి ॥

గరుడగంభముకాడ కడుఁబ్రాణాచారులకు
వరము లొసఁగీని శ్రీవల్లభుఁడు
కిరమై కోనేటిచెంతఁ దీర్థఫలములెల్ల
పరువల కొసఁగీని పరమాత్ముఁడు. ॥సేవిం॥

సేనమొదలారివద్ద చిత్తములో సుజ్ఞానము
నానాగతిఁ బుట్టించీని నారాయణుఁడు
కానుక పైఁడిగాదెలకాఁడఁ దననిజరూపు
అనుక పొడచూపీని అఖిలేశుఁడు. ॥ సేవిం ॥

సన్నిధి గర్భగృహాన చనవిచ్చిమాటలాడి
విన్నపాలు వినీ శ్రీవేంకటేశుఁడు
యెన్నికఁ బాదాలవద్ద యిహముఁ బరముఁ జూపి
మన్ననల అలమేలుమంగవిభుఁడు. ॥ సేవిం ॥ 511

రేకు 289 సాళంగనాట

చూడరో చూడరో నేఁడు సురలార నరులార
దాడివోయి దనుజుల దండించి తా వచ్చె. ॥ పల్లవి ॥

వాయువేగమున వచ్చె వనజాక్షునరదము
వేయిసూర్యులప్రతాపవిభవముతో
చాయల చక్రవాళాద్రిసముద్రాలు దాఁటివచ్చె
ఆయితమై పైఁడిశెక్కె లవే కానవచ్చె. ॥ చూడ ॥

మునుకొని మనోవేగమున వచ్చె హరితేరు
తనరారుకోటిచంద్రప్రభలతో
వెనుకొని దిక్కులెల్లా విజయము సేసి వచ్చె
కనకాచలముతో గక్కన సరివచ్చె. ॥ చూడ ॥

గరుడవేగాన శ్రీవేంకటేశురథము వచ్చె
మరిగినయలమేలుమంగసిరితో
ధరలోన వీధులేఁగి తనవెలవుకు వచ్చె
పరగ హరిదాసులపంతములు వచ్చె. ॥ చూడ ॥ 512

సామంతం

నానాభరణములనరసింహా
పూనినప్రతాపములనరసింహా. ॥పల్లవి॥

నగవులనెమ్మోమునరసింహా
పొగరుమించుటూర్పులనరసింహా
నగముమీఁదిఘననరసింహా
తగుకాంతులయందపునరసింహా. ॥ నానా ॥

నలినినేత్ర శ్రీనరసింహా
పొలుపొందునఖంబులనరసింహా
నలుదెసలమెఱయునరసింహా
వెలయుమూఁడుగన్నులనరసింహా. ॥ నానా ॥

నమితసురాసురనరసింహా
కమనీయగుణాకరనరసింహా
నమోస్తుతే శుభనరసింహా
కమలాంక శ్రీవేంకటనరసింహా. ॥ నానా ॥ 513

శంకరాభరణం

నమితదేవం భజే నారసింహం
సుముఖకరుణేక్షణం సులభనరసింహం. ॥ పల్లవి ॥

విజయనరసింహం వీరనరసింహం
భుజబలపరాక్రమస్ఫుటన్నసింహం
రజనీచరవిదళనవిరాజితనృసింహం
సుజనరక్షకమహాశూరనరసింహం. ॥ నమి ॥

దారుణనృసింహం ప్రతాపనరసింహం
చారుకల్యాణనిశ్చలనృసింహం
ధీరచిత్తావాసదివ్యనరసింహం
సారయోగానందచతురనరసింహం. ॥నమి॥

విమలనరసింహం విక్రమనృసింహం
కమనీయగుణగణాకరనృసింహం
అమితసుశ్రీవేంకటాద్రినరసింహం
రమణీయభూషాభిరామనరసింహం ॥నమి॥ 514

వరాళి

దేవుఁడవు నీవు జీవులు నీబంట్లు
చేవ దేరి నీసేఁతే శేఖరమై నిలిచె. ॥పల్లవి॥

చేరి నేరమిసేసేది జీవునికి స్వభావము
నేరిచి రక్షించేది నీస్వభావము
ధారుణిలోపల మరి తప్పులెంచఁబోయేది
మేర మీరి నీమహిమే మిక్కుటమై నిలిచె. ॥దేవుఁ॥

మత్తుఁడై వుండేదే మనుజునిస్వభావము
నిత్తెపుజ్ఞాన మిచ్చేదినీస్వభావము
వొత్తి గుణావగుణాలు వొరయఁగఁబోయేది
సత్తుగా నీకరుణే సతమయి నిలిచె. ॥దేవుఁ॥

చెలఁగి నీశరణుచొచ్చేదే నాస్వభావము
నెలవై యేలుకొనేది నీస్వభావము
మలసి శ్రీవేంకటేశ మనసు సోదించ నేది
చలిమి బలిమిని నీస్వతంత్రమే నిలిచె. ॥దేవుఁ॥ 516

సాళంగనాట

సీతాసమేత రామ శ్రీరామ
రాతి నాతిఁ జేసిన శ్రీరామ రామ. ॥పల్లవి॥

ఆదిత్యకులమునందు నవతరించినరామ
కోదండభంజన రఘుకులరామ
ఆదరించి విశ్వామిత్రుయాగముగాచినరామ
వేదవేదాంతములలో వెలసినరామ. ॥సీతా॥

బలిమి సుగ్రీవునిపాలినిధానమ రామ
యిల మునులకభయమిచ్చినరామ
జలధి నమ్ముమొననుసాధించినరామ
అలరు రావణదర్పహరణ రామ. ॥సీతా॥

లాలించి విభీషణుని లంకయేలించినరామ
చాలి శరణాగతరక్షక రామ
మేలిమి శ్రీవేంకటాద్రిమీఁద వెలసినరామ
తాలిమితో వేయు ప్రతాపపురామ. ॥సీతా॥ 516

దేసాళం

కోనేటిదరుఁ గనుఁగొనరో మూఁడుదేరులు
నానాదేవతలార నరులార మీరు. ॥పల్లవి॥

తెంకిగా ముందర నొక్క తేరెక్కె శ్రీకృష్ణుఁడు
వేంకటేశుఁ డెక్కె నదె వేరొక్క తేరు
లంకెలై శ్రీభూసతులు లలి నొక్క తేరెక్కిరి
కొంకక వీధుల నడగొండలో యనఁగను. ॥కోనే॥

యిరవై శ్రీకృష్ణునిది యిదె వానరధ్వజము
గరుడధ్వజము శ్రీవేంకటపతిది
కరిలాంఛనధ్వజము కమలకు మేదినికి
అలరి చూపట్టెను బ్రహ్మాండాలవలెను. ॥కోనే॥

చెలఁగి చెఱకువిల్లు చేతఁబట్టె శ్రీకృష్ణుఁడు
బలు శ్రీవేంకటేశుఁడు పట్టెఁ జక్రము
అలమేలుమంగ భూమి యంబుజాలు చేఁబట్టిరి
కలసి మెలసేరు బంగారుమేడ లనఁగ. ॥కోనే॥ 517

రేకు 290 నాట

దొరతనములతోడ తొడపై శ్రీసతితోడ
కేరలీఁ బంతముల సుగ్రీవనారసింహము. ॥పల్లవి॥

నిక్కినకర్ణములతో నిట్టచూపుగుడ్లతో
మిక్కుటమైనపెద్దమీసాలతోడ
వెక్కసపునోరితోడ వెలయుబుగ్గలతోడ
కిక్కిరిసీ నవ్వుల సుగ్రీవనారసింహము. ॥దొర॥

చల్లునూరుపులతోడ సంకుఁజక్రములతోడ
మొల్లమైనసహస్రకరములతోడ
తెల్లనిమేనితోడ దిండైనపిరుఁదుతోడ
కెల్లురేఁగీఁ గరుణ సుగ్రీవనారసింహము. ॥దొర॥

విరులపాదాలతోడ వెలయుసొమ్ములతోడ
తిరమైనకోటిసూర్యతేజముతోడ
విరులదండలతోడ వేడుక శ్రీవేంకట-
గిరిమీఁద వెలసె సుగ్రీవనారసింహము. ॥దొర॥ 518

---

౧. 'దీఁదైన' రేకు

గౌళ

వీఁడిగో నిలుచున్నాఁడు విజనగరములోన
పేఁడుకొన్న ప్రతాపానఁ బెద్దహనుమంతుఁడు. ॥పల్లవి॥

ఇదె పుట్టుఁ గౌపీనము హేమకుండలములతో-
నుదయించినాఁ డితఁ డుర్విమీఁదను
పదరి బాలార్కుని పండనుచుఁ బట్టినాఁడు
వదలక దేవతలవర మందినాఁడు. ॥వీఁడి॥

నులిచి తా వాలము మిన్నులు మోవఁ జాఁచినాఁడు
జలధి దాఁటఁగ జంగ చాఁచినాఁడు
ఇల నసురలమీఁద వలచెయ్యెత్తినవాఁడు
నిలువెల్ల సాహసమై నిండుకొనున్నాఁడు. ॥వీఁడి॥

పెక్కువండ్లగోలలు పిడికలించినవాఁడు
మిక్కిలి లంక సాధించి మించినవాఁడు
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరుబంటైనవాఁడు
తక్కక లోకములెల్లా దయఁగాచేవాఁడు ॥వీఁడి॥ 519

సామంతం

అనిశముఁ దలఁచరో అహోబలం
అనంతఫలదం బహోబలం. ॥పల్లవి॥

హరినిజనిలయం బహోబలం
హరవిరించినుత మహోబలం
అరుణమణిశిఖర మహోబలం
అరిదైత్యహరణ మహోబలం. ॥అని॥

అతిశయశుభదం బహోబలం
అతులమనోహర మహోబలం
హతదురితచయం బహోబలం
యతిమతసిద్ధం బహోబలం. ॥అని॥

అగు శ్రీవేంకట మహోబలం
అగమ్య మసురల కహోబలం
అగపడుఁ బుణ్యుల కహోబలం
అగకులరాజం బహోబలం. ॥ అని ॥ 520

పాడి

కలశాపురముకాడ గంధపుమాకులనీడ-
వలరేవు మేలు మేలు హనుమంతరాయ. ॥ పల్లవి॥

సంజీవికొండ దెచ్చి సౌమిత్రి బ్రతికించితి
భంజించితి వసురుల బలువిడిని
కంజాప్తకులరాఘవుని మెప్పించితివి
అంజనీతనయ వో హనుమంతరాయ. ॥కల॥

లంక సాధించితివి నీలావులెల్లాఁ జూపితివి
కొంకక రాముని సీతఁ గూరిచితివి
లంకెల సుగ్రీవునికి లలిఁ బ్రధాని వైతివి
అంకెలెల్లాఁ నీకుఁ జెల్లె హనుమంతరాయ. ॥కల॥

దిక్కులు గెలిచితివి ధీరతఁ బూజ గొంటివి
మిక్కిలి ప్రతాపాన మెరసితివి
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరుబంట వైతివి
అక్కజపుమహిమలహనుమంతరాయ. ॥కల॥ 521

రామక్రియ

అఖిలలోకైకవంద్య హనుమంతుఁడా సీత-
శిఖామణి రామునికిఁ జేకొని తెచ్చితివి. ॥పల్లవి॥

అంభోధి లంఘించితివి హనుమంతుఁడ
కుంభినీజదూతవైతి గురుహనుమంతుఁడ
గంభీరప్రతాపమునఁ గడఁగితివి
జంభారిచే వరములు చయ్యన నందితివి. ॥అఖి॥

అంజనీదేవికుమార హనుమంతుఁడ
కఁజాప్తఫలహస్త ఘనహనుమంతుఁడ
సంజీవని దెచ్చిన శౌర్యుఁడవు
రంజితవానరకులరక్షకుఁడ వైతివి. ॥అఖి॥

అట లంకసాధించినహనుమంతుఁడ
చటులసత్వసమేత జయహనుమంతుఁడ
ఘటన నలమేల్మంగకాంతు శ్రీవేంకటేశుకుఁ
దటుకన బంటవై ధరణి నిల్చితివి. ॥అఖి॥ 522

గౌళ

౧త్రిజగముల నెరుఁగు దేవదేవుఁడు
అనుజువిజనకుఁడైన ఆదినారాయణుఁడు. ॥పల్లవి॥

గరుడనిమీఁద నెక్కి ఘనచక్రము చేఁబట్టి
పరమపదాననుండి పరతెంచి
మురిపేన కరిఁ గాచి మొసలిఁ దుంచినవాఁడు
అరుదైనప్రతాపపుఆదినారాయణుఁడు. ॥త్రిజ॥

౧. 'త్రిజగములు' రేకు

కనకాంబరము గట్టి కౌస్తుభము మెడఁ బెట్టి
వెనువెంట శ్రీసతి సేవించుచుండఁగా
పనివూని జయముతో పాంచజన్యము వట్టి
అనిశముఁ గరుణించీ నాదినారాయణుఁడు. ॥త్రిజ॥

త్రిదశులు నుతియించ దిక్కులెల్లా నుల్లసిల్ల
ముదమున దాసులెల్లా మొక్కఁగాను
వదల కెల్లవారికి వరము లిచ్చీ వాఁడే
అదె శ్రీవేంకటవిభుఁ డాదినారాయణుఁడు. ॥త్రిజ॥ 523

రేకు 291 దేసాళి

ఇది యెఱిఁగినవారే యెంచఁగ నీదాసులు
వెదకి తెలుసుకొంటే వేదాంతాల నున్నవి. ॥పల్లవి॥

పట్టితే నీస్వరూపము బయలు లోపల నిండి
అట్టె సర్వశక్తితో సాకారముతో
యెట్టు దలఁచినాఁ [౨]జిత్తాజిత్తమై వున్నాఁడవు
వొట్టి ప్రకృతిపురుషు లోగి నీదేహములు. ॥ ఇది ॥

అనంతమైనప్రకృతి అఖిలవికారములై
పనివడి నీమాయలై ప్రపంచమై
వొనరి జడమై యుండ నొకచో దివ్యమై యుండు
నినుపై ఇహాపరాలు నీయైశ్వర్యములు ॥ ఇది ॥

జీవుఁ డణువు జ్ఞానము చింతించఁగా విభువు
యీవిధము నానాజీవు లివె నీయందె
శ్రీవేంకటేశుఁడ నీవే చేకొన్నచైతన్యమవు
కావింపఁ గర్మభక్తులే కారణఫలములు. ॥ ఇది ॥ 524

---

౧. 'కరము' పూ. ము. పా. క్రి గీత గలవి రేకులలో నస్పష్టములు.
౨. 'జిత్తాజిత్తము' రేకు.

పాడి

కొలువు విరిసె నిదె గోవిందుఁడు పొద్దువోయ
వెలుపట నుక్కళాలు వేగుదాఁకా నుండరో. ॥పల్లవి॥

యీపొద్దుకుఁ బోయిరారో ఇంద్రాదిదేవతలు
శ్రీపతి పవ్వళించెను శేషునిమీఁద
తీపులఁబ్రసాద మీరో దేవమునులకునెల్ల
వైపుగఁ దెల్లవారఁగ వత్తురుగాని. ॥కొలు॥

పాళెలపట్టుకుఁ బోరో బ్రహ్మరుద్రాదు లిందరు
పాలసముద్రాన హరి పవ్వళించెను
వేళగాదు లోనికిట్టె విచ్చేసె హరి ద్వార-
పాలకులు వాకిళ్ళఁ బదిలముసుండో. ॥కొలు॥

గీత మొయ్యనే పాడరో కిన్నరకింపురుషులు
యీతల శ్రీవేంకటేశుఁ డెక్కెను మేడ
ఘాత నెడ నెడ నూడిగకాండ్లు నిలువరో
రాతిరెప్పుడైనా మిమ్ము రమ్మనునో యతఁడు. ॥కొలు॥525

లలిత

ఇతరుల నడుగము యితఁడే మాదాత
యితనియీవి వోరు లియ్యఁగఁగలరా. ॥పల్లవి॥

దేవదేవుఁ డాదిమపురుషుఁడు హరి
శ్రీవత్సాంకుఁడు చిన్మయుఁడు
యీవల నావల యిలువేలు పతఁడు
భావజగురుఁడు మా పాలిటివాఁడు. ॥ఇత॥

జగదేకగురుఁడు శాశ్వతుఁ డచ్యుతుఁ—
డగజకు వరదుఁడు అనంతుఁడు
తగి మమునేలినదైవము యేలిక
నిగమమూర్తి మానిజబంధువుఁడు. ॥ ఇత ॥

కలిదోషహరుఁడు కైవల్యవిభుఁడు
అలరిన శ్రీవేంకటాధిపుఁడు
చలిమి బలిమి మాజననియు జనకుఁడు
అలమి యితఁడు మాయంతర్యామి. ॥ ఇత ॥ 526

భైరవి

శ్రీహరి నిత్యశేషగిరీశ
మోహనాకార ముకుంద నమో శ్రీహరి. ॥ పల్లవి ॥

దేవకిసుత దేవ వామన
గోవిందా గోపగోపీనాథా। శ్రీహరి
గోవర్ధనధర గోకులపాలక
దేవేశాధిక తే నమోనమో. ॥ శ్రీహ ॥

సామజాన(వ?)న సారంగ(శార్ఙ్గ?)పాణి
వామనా కృష్ణ వాసుదెవా। శ్రీహరి
రామనామ నారాయణ విష్ణో
దామోదర శ్రీధర నమో నమో. ॥ శ్రీహ ॥

పురుషోత్తమ పుండరీకాక్ష
గరుడధ్వజ కరుణానిధి। శ్రీహరి
చిరంతనాచ్యుత శ్రీవేంకటేశ
నరమృగ తే నమో నమో. ॥ శ్రీహ ॥ 527

దేవగాంధారి

వేసరితేనే లేదు విచారించితేఁ గద్దు
మూసినదిదే కీలు ముంచి వివేకులకు ॥ పల్లవి ॥

యెవ్వరు మనసులోన నిందిరేశుఁ దలఁచిన
అవ్వలఁ బాయకవుండు నదియే వైకుంఠము
దవ్వులకు నేఁగవద్దు తపము జపము వద్దు
యివ్వల నిదే కీలు యెరిఁగినవారికి. ॥ వేస ॥

నాలుక నెవ్వరైనాను నారాయణుఁ బొగడిన
చాలి యాతఁ డాడ నుండు జగములూ నుండును
కాలమూ నడుగవద్దు కర్మమూ నడుగవద్దు
పోలింప నిదే కీలు పుణ్యమానసులకు. ॥ వేస ॥

శ్రీవేంకటేశ్వరునిఁ జేరి యెవ్వరు నమ్మినా
కైవసమై యాతఁ డింటఁ గాచుకుండును
సావధానములు వద్దు శరణంటేనే చాలు
భావింప నిదే కీలు పరమయోగులకు. ॥ వేస ॥ 528

శంకరాభరణం

దనుజులు గనిరి తత్త్వమిది
వనజాక్షునికృప వసించనేలా. ॥ పల్లవి ॥

హరి పరమాత్ముఁ డనాదిపురుషుఁడు
సురలకు నరులకు సులభుఁడు
హరికోపముతో నన్యులవరములు
సరిగా వెంచఁగ జగములలోన. ॥ దను ॥

వేదాంతవిదుఁడు విష్ణుఁడు కృష్ణుఁడు
శ్రీదేవికిఁ బతి శేఖరుఁడు
పోదిఁ బరస్తుతి పుణ్యాముకంటే
పాదుగ వారిఁ దిట్టేపాపము మేలు. ॥దను॥

నారాయణుఁ డున్నతుఁ డచ్యుతుఁ డుప-
కారుఁడు శ్రీవేంకటవిభుఁడు
చేరి యీతఁడే శిక్షించ రక్షించ
వూరదయివములు వొగి నితనిసరా. ॥దను॥ 529

రేకు 292 మలహరి

విశ్వమెల్ల నీ విరాడ్రూపము
శాశ్వతహరి నీశరణులము. ॥పల్లవి॥

కన్నులఁ సూర్యుఁడు కమలాప్తుఁడు నీ-
పన్నినమోమున బ్రాహ్మణులు
వున్నతివైశ్యులు వూరువులందును
యెన్నఁగ శూద్రులు యిదె పాదముల. ॥విశ్వ॥

యింద్రాదిదేవత లీశానబ్రహ్మము-
నీంద్రు లంగముల నెసఁగిరదే
సాంద్రలోకములు జఠరంబున నవె
రుంద్రతేజ మదె రోమముల. ॥విశ్వ॥

కాలముఁ గర్మముఁ గైవల్యంబును
ఆలోను వెలియు నది నీవు
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర
కోలుముందు నినుఁ గొలిచితిమయ్యా. ॥విశ్వ॥ 530

దేవగాంధారి

కలదు తిరుమంత్రము కల దిహము( బరము
  కలిమి గలుగు మాకు( గడమే లేదు. ॥పల్లవి॥

కమలాక్ష నీవు మాకు( గలిగియుండ(గ భూమి
  నమరలేనిదొకటి నవ్వుల లేదు
  నెమకి నాలుకమీ(ద నీనామము మెల(గ(గ
  తమితో( బరుల వే(డ( దా( జోటులేదు. ॥కల॥

శౌరి నీ చక్రము నాభుజముమీ(ద నుండ(గాను
  యీరసపు(బగ లేదు యెదురూ లేదు
  చేరువ నీసేవ నాచేతులపై నుండ(గాను
  తీరనికర్మపువెట్టి దినమూ లేదు. ॥కల॥

అచ్యుత నీపై భక్తి యాతుమలో నుండ(గాను
  రచ్చల( బుట్టిన యపరాధమూ లేదు
  నిచ్చలు శ్రీవేంకటేశ నీశరణాగతుండ(గా
  విచ్చినవిదేకాని విచారమే లేదు. ॥కల॥ 531

దేసాక్షి

దేవు( డొక్క(డే మాకు దిక్కుగాని
  కావ నెవ్వరును లేరు కతలింతేకాని. ॥పల్లవి॥

పచ్చివొళ్లు మోచితిమి పాపమెల్లా( జేసితిమి
  హెచ్చినమీ(దటిసుద్దు లే(టివోకాని
  రచ్చల(బడె మా గుట్టు రమణులచే(త బెట్టు
  అచ్చమై యిందుకు( బరిహారమేదోకాని. ॥దేవు(॥

గాలిమూఁటఁ జిక్కితిమి కన్నచోటే తొక్కితిమి
ఆలించి యేమిటివారమయ్యేమోకాని
మైల గొంత మనసూ మఱుఁగు గొంతానాయ
తాలిమి నా విధి యేమి దలఁచీనోకాని. ॥ దేవుఁ ॥

మాయలఁ బొరలితిమి మరచితి మింతలోనే
చాయల శ్రీవేంకటేశు శరణంటిమి
రోయఁజొచ్చె జగమెల్లా రుచియాయ వైరాగ్య-
మాయము నాలోపలి అంతరాత్మేకాని. ॥ దేవు ॥ 532

వసంతవరాళి

అతని నమ్మలే రల్పమతులు భువి
నతఁ డాద్యుఁడు పరమాత్ముఁడు. ॥ పల్లవి ॥

సకలలోకపతి సర్వేశ్వరుఁడట
వొకఁడిఁక దొర మరి వున్నాఁడా
ప్రకటించఁగ శ్రీపతియే దాతట
వెకలి నియ్యఁ గొన వేరేకలరా. ॥అత॥

దివిజవందితుఁడు దిక్కుల హరియట
యివల మొక్క సురలిఁక వేరీ
కవ నంతర్యామి కరుణాకరుఁడట
వివిధథంగులను వెదకఁగనేలా. ॥ అత ॥

వేదాంగుఁడు శ్రీవేంకటపతియట
ఆదిమతము లిఁక నరసేదా
యేదెస నెవ్వరి కెప్పుడుఁ గలఁ డితఁ-
డీదేవుఁడె మన కిహపర మొసఁగ. ॥ అత ॥ 533

సాళంగనాట

ఒకరిఁ గానఁగ నొడఁబడదు మనసు
సకలముహరియని సరిఁదోఁచీని. ॥ పల్లవి ॥

అంతరాత్మ శ్రీహరి యతఁ డొకఁడే
జంతువులన్నియు సమములే
బంతులఁ బాత్రాపాత్రము వెదకిన
అంతట హరిదాస్యమేపో ఘనము. ॥ ఒక ॥

జగమును నొకటే చైతన్య మొకటే
తగినపంచభూతము లొకటే
నగుతా నెదిరిని నన్నును నెంచిన
మొగి నాపై హరిముద్రలె ఘనము. ॥ ఒక ॥

కారు స్వతంత్రులు కడపట నొకరును
యీరీతి నొఁగాము లిఁక నేలా
శ్రీరమణీపతి శ్రీవేంకటేశుఁడే
కారణము శరణాగతియే ఘనము. ॥ ఒక ॥ 584

సాళంగనాట

వేదవట్టి యిఁక నేమి వెదకేరు చదివేరు
వేదాంతవేద్యుఁడై నవిష్ణుని నెఱఁగరా. ॥ పల్లవి ॥

తొలె నదె గరుడనిఁ దొడఁగి బాణునిమీఁద
వాలెను కంసునిమీఁద వడి నెగసి
కేలుచాఁచి చక్రమునఁ గెడపె శిశుపాలుని
వేలుపులరాయఁడై నవిష్ణుని నెఱఁగరా. ॥ వేద ॥

తొక్కెను బలీంద్రునిఁ దొల్లి పాతాళానఁ గుంగ
మొక్కలాన బల ధమ్ము మొనకుఁ దెచ్చె
పక్కన బ్రహ్మాండము పగులించెఁ బెనువేల
వెక్కసపుదైవమైనవిష్ణుని నెఱఁగరా. ॥ వేద ॥

భేదించె రావణాదిభీకరదైత్యులనెల్ల
నాదించె శంఖమున నున్నతజయము
సేదదేర నిపుడును శ్రీవేంకటాద్రిమీఁద
వీదివీది మెరసేటివిష్ణుని నెఱఁగరా. ॥ వేద ॥ 585

రేకు 293 లలిత

ఈతని నెఱఁగకుంటే నిల స్వామిద్రోహము
ఘాతల నేలు గుడిచి కాలువ వొగడుట. ॥ పల్లవి ॥

హరిపాదముననే యడఁగె లోకములెల్ల
హరినాభినే వొడమి రదివో బ్రహ్మాదులు
హరినామము వేదాల కాదియు నంత్యము నాయ
హరిదాసులే వశిష్ఠాదు లిందరును. ॥ ఈత ॥

విష్ణుఁడే యమృత మిచ్చె విష్ణుఁడే ధరణి మోఁచె
విష్ణువాజ్ఞ నడచేది విశ్వమింతాను
విష్ణుచక్రమున దైత్యవీరులెల్లా నడఁగిరి
విష్ణువుముఖమునందే విప్రులు జనించిరి. ॥ ఈత ॥

పరమపుశ్రీపతివే భారతరామాయణాలు
పరమాత్ముఁ డితఁడే పలుజీవులయందెల్లా
వరము చేచేతఁ జూపె పట్టి శ్రీవేంకటేశుఁడు
పరమానంద మొసఁగు భక్తులకు నితఁడు. ॥ ఈత ॥ 586

శుద్ధవసంతం

నిండినజగములెల్లా నీయాధీనము
బందుజన్మములవాఁడ భయమేమీ నెరఁగ. ॥ పల్లవి ॥

పాతకపుదేహమిది ప్రకృతియాధీనము
ఆతుమ శ్రీహరి నీయాధీనము
యీతల నాతల నే నెవ్వరి నేమనలేను
చేతనుఁడ నింతే నేను చిక్కినవేమెఱఁగ. ॥ నిండి ॥

వెలయునాకర్మము నీవేదశాస్త్రాధీనము
నిలిచినజ్ఞానమెల్లా నీయాధీనము
తలఁచి యెవ్వరి నేఁ దగుఁ దగదనలేను
కొలఁదిజీవుఁడనింతే కొనమొద లెఱఁగ. ॥ నిండి ॥

అక్కడ వాసనసిక నాచార్యాధీనము
నిక్కపునామోక్షము నీయాధీనము
యెక్కువ శ్రీవేంకటేశ యెవ్వరి నేమనలేను
పక్కన నీబంటనింతే పరచింత లెఱఁగ. ॥ నిండి ॥ 587

రామక్రియ

ఏమి సేయఁగలఁడు తా నీజగమెల్లాను
కోమలపుదేహి కొక్కకోకే కలది. ॥ పల్లవి ॥

మించినకోరిక లివి మిన్నులపొడవులు
కొంచపుదేహము దనకొలఁది గాదు
యెంచరానిసిరు లవి యెన్ని గలిగినా
కంచములోనికూడే కలిగినది. ॥ ఏమి ॥

గోరపడి గడించేవి కోట్లకొలఁదులు
 తారి తూరి నోటికిఁ దగ్గంత గాదు
 యేరుపరచి యింతుల నెందరిఁ బెండ్లాడినాను
 కూరిమి సతి యొకతె కూటమికిఁ గలది. ॥ఏమి॥

తలఁచి మొక్కేసురలు తలవెంట్రుకలందరు
 యిలఁ దన బతుకెంతో యెరఁగరాదు
 చెలఁగి రక్షించేవాఁడు శ్రీవేంకటేశుఁ డొకఁడే
 కల దంతరంగమునఁ గైవల్యమే కలది. ॥ఏమి॥ 538

లలిత

వీరు వారనేటి వింతేల
 శ్రీరమణునికృప సిద్ధముగాక. ॥పల్లవి॥

యెక్కడిపాపము యెక్కడిపుణ్యము
 దక్కిన శ్రీపతిదాసునికి
 పక్కన లోహముఁ బరుసము దాఁకిన
 యెక్కువ నంతా హేమమేకాదా. ॥వీరు॥

యేది హీనము యేది యధికము
 పాదుగ నడచుప్రపన్నునికి
 మేదినీశుఁ దేమెలుఁతఁ బెండ్లాడిన
 సాదించ నేలికసానేకాదా. ॥వీరు॥

యేడ నింద లిఁక నేడ సంస్తుతులు
 జాడల శ్రీవైష్ణవునికిని
 యీడనే శ్రీవేంకటేశుఁ డాత్మ్మయట
 యీడులేనియతఁ డెక్కుడేకాదా. ॥వీరు॥ 539

రామక్రియ

నేనా గెలువ లేను నీమాయ
  శ్రీనాథ నీవు సేసేచేఁతలే నీమాయ. ॥పల్లవి॥

తమకము గడు రేఁచు తలఁపు ఉబ్బూఁతలూఁచు
  నిమిష మూరకుండదు నీమాయ
  తిమిరము బుద్ధిఁ గప్పు తెఱవల వెంటఁ దిప్పు
  అమరి తోడునీడ ఆయఁబో నీమాయ. ॥నేనా॥

పట్టినందుకెల్లాఁ దీసు పాపమే చవులుసేసు
  నిట్టి(ట్ట?) పిడిఁ బోనీదు నీమాయ
  కొట్టఁగొన కెక్కించుఁ గోరి మొదలికి దించు
  మట్టులే దింతింతని మరియు నీమాయ. ॥ నేనా ॥

పలులంపటాల ముంచు భావజుచే భ్రమయించు
  నిలిచినచోటనెల్లా నీమాయ
  యెలమి శ్రీవేంకటేశ యిటు నిన్నుఁ గొలువఁగా
  మలసి సొలసి నన్ను మన్నించె నీమాయ. ॥నేనా॥ 540

సామవరాళి

తనుఁ దా నేమఱక దైవము మఱవకుంటే
  మనసులోనే కలుగు మహామహిమ. ॥పల్లవి॥

కనురెప్ప మూసితేనే కడ దాఁగె జగమెల్ల
  కనుదెరచినంతనే కలిగెఁ దాను
  ననిచివుండుట లేదు నమ్మికపోవుట లేదు
  తనతోడిదే యిన్నిఁ దాఁ గలితేఁ గలవు. ॥తనుఁ॥

కడుపు నిండినంతనే కై పాయ రుచులెల్లా
బెడిదపుటాఁకలై తేఁ బ్రియమాయను
యెడనెడఁ జేఁదుగాదు యింతలోనే తీపు గాదు
వొడలితోడివే యివి వుండినట్టే వుండును. ॥తను॥

అద్దములోఁ దననీడ అంతటా మెరసినట్లు
పొద్దు వొద్దు తనతోనే భోగాలెల్లా
అద్దిన శ్రీవేంకటేశుఁ డంతరాత్మయైనవాఁడు
కొద్ది లేదాతనిమాయ కొనసాగుచుండును. ॥తను॥ 541

రేకు 294 శంకరాభరణం

చవిచేసుక యిటు జరగెదము
జవదాఁటకురో సంసారులార. ॥పల్లవి॥

యేదిచూచినా నెరవెరవే
పోదిఁ గూడఁగా పొదపింతే
ఆదికినాది హరి యొక్కఁడే
పాదుగఁ బుట్టెడిభవములె వేరు. ॥చవి॥

కలుములు లేములు కతలింతే
నిలుకడగలచో నిజమౌను
యిలయును జగమును యిదే యిదే
తెలిసి చూడఁగా దినములే ఘనము. ॥చవి॥

చెంతల నిందరు జీవులే
బంతులఁ బుణ్యముఁ బాపమునే
యింతట శ్రీవేంకటేశ్వరుఁడే
కాంతలుఁ బురుషులగతులై నిలిచె. ॥చవి॥ 542

భూపాళం

హరి కృష్ణ మేలుకొను ఆదిపురుషా
తరవాత నా మోము తప్పకిటు చూడు. ॥పల్లవి॥

మేలుకొను నాయన్న మెల్లనే నీతోడి
బాలులదె పిలిచేరు బడి నాడను
చాలు నిఁక నిద్దురలు చద్దికూళ్ళపొద్దు-
వేళాయ నాతండ్రి వేగ లేవే. ॥హరి॥

కను దెరవు నాతండ్రి కమలాప్తుఁ డుదయించె
వనిత ౧ మొకమజ్జనము వడిఁ దెచ్చెను
మొనసి మీతండ్రి యిదె ముద్దాడఁ జెలఁగీని
దనుజాంతకుండ యిఁకఁ దగ మేలుకోవే. ॥హరి॥

లేవె నాతండ్రి నీలీలలటు వొగడేరు
శ్రీవేంకటాద్రిపతి శ్రీరమణుఁడా
దేవతలు మునులుఁ జెందినవారదాదులు
ఆవలనుఁ బాడేరు ఆకసమునందు. ॥హరి॥ 548

లలిత

విశ్వాత్మ నీకంటె వేరేమియునుఁ గాన
ఐశ్వర్యమెల్ల నీయతివచందములే. ॥పల్లవి॥

కలవు మతములు పెక్కు కర్మభేదములగుచు
కలవెల్ల నీయందె కల్పితములే
కలరు దేవతలు బహుగతులమహిమల మెరయు
అలరి వారెల్ల నీ యంగభేదములే. ॥ విశ్వా॥

---

౧. మొకమజ్జనము=ముఖముకడుగుట.

ఘనమంత్రములు పెక్కు గలవు వరముల నొసఁగు
నని చి యవియెల్ల నీనామంబులే
పెనగొన్న జంతువులు పెక్కులెన్నే గలవు
పనిగొన్న నీదాసపరికరములే. ॥విశ్వా॥

యెందును దగులువడ కేకరూపని నిన్ను
కందువఁ గొలుచువాఁడే ఘనపుణ్యుఁడు
అందపు శ్రీవేంకటాద్రీశ అన్నిటా—
నందినపొందినవెల్లా హరి నీయనుమతే. ॥విశ్వా॥ 544

సామంతం

ఇహపరములకును యిది సుఖము
సహజావస్థే జరగేటిసుఖము. ॥పల్లవి॥

శ్రీరమణుఁడే చింతాయకుఁడని
వూరక వుండుట వొకసుఖము
కోరకుండఁగా గూడినయర్థము
ఆరయఁ గైకొను టది సుఖము. ॥ఇహ॥

వసముగానిపని వడిఁ దలకెత్తుక
అసురుసురుగాని దది సుఖము
౧యెసరెత్తుక లేళ్లేవని తోలక
పసఁ దనవిధిఁ గలపాటే సుఖము. ॥ఇహ॥

పెక్కు చంచలము పెనచుక తిరుగక
వొక్క సుఖంబొ టురుసుఖము
యెక్కువ శ్రీవేంకటేశ్వరు శరణని
నిక్కితిమిదె మానిజమే సుఖము. ॥ ఇహ ॥ 545

---

౧. ఈమూదవపాదము సుఘటితార్థము కాదు.

లలిత

వింటిమి నీకతలు కంటిమి నీమాయలు
బంటుల మచ్యుత నీపాలివారమయ్యా. ॥పల్లవి॥

కలిగిరి నీవల్లనే కడఁగి బ్రహ్మాదులు
నిలిచిరి సురలెల్లా నీవల్లనే
తెలిసిరి మునులెల్లా దేవుఁడవు నీవేయని
చలపట్టి హరి నీకు శరణనేమయ్యా. ॥వింటి॥

నుతియించీ వేదములు నోరార నీమహిమ
గతి యాయ వైకుంఠమే ఘనులకెల్లా
ప్రతిలేనినీరూపే భావించేరు యోగీంద్రులు
తతితో శ్రీపతి నీకే దాసులమయ్యా. ॥వింటి॥

అదె నీచక్రముచేత నడఁగి రసురలెల్లా
బదికిరి విప్రులు నీపాదసేవను
పొదలి శ్రీవేంకటేశ పొంది నీకరుణచేత
మొదల వెనక నీకే మొక్కేమయ్యా. ॥వింటి॥ 546

గుండక్రియ

ఎట్టొకో దైవమా ఇదె నీకు శరణంటి
తొట్టిననాబ్రదుకుకుఁ దుదయు లేదు. ॥పల్లవి॥

నాని యీజన్మమెత్తి నాటివెల్లా మఱచితి
పూని యేమిటా విరతి పుట్టనేరదు
కానను ముందరవచ్చేఘనకర్మపాశములు
౧పానిపట్టి(?) యించుకంతా భయమూ లేదు. ॥ఎట్టొ॥

౧. 'పూనిపట్టి' కి వ్యావహారికరూపము కావచ్చు.

పంచేంద్రియములఁ జిక్కి భావమెల్లాఁ జిక్కువడె
అంచెల మోహముతోవ అరయ లేను
యెంచి నాదేహములోని హేయమును సాత్మించె
చంచలపుదుర్గుణాలు చక్కనైనాఁ గావు. ॥ ఎట్టో ॥

నగుసంపదలచేత నన్ను నేనే మరచితి
౧తెగువది వివేకించఁ దీర దెప్పుడు
నిగిడి శ్రీవేంకటేశ నీవు నన్ను నేలఁగాను
జగమెల్లా నెరఁగ నే సాత్వికుఁడనైతి. ॥ ఎట్టో ॥ 547

రేకు 295 తెలుఁగుకాంబోది

ఇందునే తుదిపద మెక్కి రిందరును
మందరధర నీమహిమిదివో. ॥ పల్లవి ॥

మఱిగినపుణ్యులమతిలో కోరిక
పరమపుహరి నీపాదములు
గరిమ గోపికలు గావలెనన్నది
హరి నీసంభోగ మదియేపో. ॥ ఇందు ॥

పొంచి వేదములు పొగడెడియర్థము
అంచెల గుణకథ లివి నివి
పంచి యజ్ఞములఫలమై యున్నవి
నించి దేవ నీ నిజపూజలెపో. ॥ ఇందు ॥

కైవల్యమునకుఁ గడుఁ దెరువై నది
ఆవల నీశరణాగతియే
శ్రీవేంకటేశ్వర చెప్పె మాగురుఁడు
మావద్ద నిదె నీ మంత్రమెపో. ॥ ఇందు ॥ 548

---

౧. 'తెగువడి' పూ. మ పా.

సామంతం

గోవిందుదాసులమై కొనకెక్కుదుముగాక
వేవేలువిధుల నమ్మి వెతఁబడఁగలమా. ॥ పల్లవి ॥

మనసులోపలిమామర్మము దెలియలేము
ఘనుఁడైనహరి నెట్టు గానఁగలము
తనువుతో భోగాలు తగులు వీఁడగలేము
వెనకకర్మపాశాలు వీడించుకోఁగలమా. ॥ గోవిం ॥

వడిఁబెట్టేయింద్రియాల వద్దని మానుపలేము
తొడరి సంసారము తోయఁగలమా
బడిబడి నానాటిబతుకు చెప్పుకోలేము
పొడలేటియితరుల బోధించఁగలమా. ॥గోవిం॥

కొంకక ఆడినమాట గురుతువెట్టఁగలేము
లంకె వేదవాక్యము దలఁచఁగలమా
యింతా శ్రీవేంకటేశుఁ డితఁడే మాదేవుఁడని
సంకెలేకుండుముగాక జాలిఁబడఁగలమా. ॥గోవిం॥ 549

బౌళి

పుట్టుగులు వొక్కటే పుణ్యపాపములే వేరు
యెట్టుసేసినాఁ జేసీ నేమి సేయవచ్చును. ॥ పల్లవి ॥

పగలే రేయి యీబడిఁ గొన్నిజీవులకు
వొగి నారేయి పగలౌ నొకరికిని
తగులైన మొకఁడే తమమతములే వేరు
పగటుల విష్ణుమాయ భ్రమయించీ నిదివో. ॥ పుట్టు ॥

నిలువెల్లాఁ జేఁదే నెరిఁ గొన్నివ్రతములు
కలదెల్లఁ దీపే కమ్మరఁ గొన్ని
తలఁపును నొకటే తత్వములే వేరువేరు
చెలరేఁగి విష్ణుమాయ చిక్కువెట్టీ నిదివో. ॥పుట్టు॥

ఇహమే పరము యెరిఁగితేఁ గొందరికి
మహిఁ బరమే ఇహము మరొకరికి
వహితో శ్రీవేంకటేశు వలెనని కొలిచితే
సహజపువిష్ణుమాయ జారిపోవు నపుడే ॥పుట్టు॥ 550

కన్నడగౌళ

దైవమా నీవే యిందు దయ దలఁచుటగాక
తోవనున్నజీవు లెట్లు తోసేరు నీమాయ. ॥పల్లవి॥

౧. పలుచవులందునెల్ల ప్రాణమే మిక్కిలి చవి
బలిమి తీపులలోనఁ బ్రాణమే తీపు
యిలపైఁ బూజ్యాలలోన నింతులే కడుఁబూజ్యాలు
తలఁచి జీవులు యెట్లు దాఁటేరు నీమాయ. ॥దైవ॥

తగుచుట్టరికాలలో ధనమే చుట్టరికము
జగతిఁ గట్టనికట్టు సంసారము
వగలైనగుణాలలో వైరమే నిజగుణము
తెగి ప్రాణు లెట్లు గెలిచేరు నీమాయ. ॥దైవ॥

తమలో నెవ్వరికైవా తమజాతి తమనేర్పు
తమకు నెక్కుడై తోఁచు తక్కువనరు
నెమకి శ్రీవేంకటేశ నీదాసులకే కాని
భ్రమసినజీవులెల్లాఁ బాయరు వీమాయ. ॥దైవ॥ 551

---

౧. 'పలుచదువు' పూ. ము. పా

లలిత

తెలిసినవారి కింతా దేవుఁడై యుండు
కలఁడన్నచోట హరి గలఁ డటుగాన. ॥పల్లవి॥

అందు నిందుఁ బోయి శ్రీహరిని వెదకనేల
బొందితోడిరూపులెల్లాఁ బోరి నతఁడే
కొందరిలో నుండి ఇచ్చుఁ గోరినట్టియీవులెల్ల
కొందరిలో మాటలాడుఁ గొందరిలో నగును. ॥ తెలి ॥

లోన వెలిఁ జూచి పరలోకము వెదకనేల
యేనెలవైన వైకుంఠ మెదుట నదె
పూని వొకచోట నెండ పొడచూపు నక్కడనే
నానినవెన్నెల గాసు నానారీతులౌను. ॥ తెలి ॥

చొక్కి చొక్కి యానందసుఖము వెదకనేల
మక్కువఁ దా శాంతుఁడైతే మతిలో నదె
యెక్కువతో శ్రీవేంకటేశ్వరుదాసుఁడనైతి
వొక్కఁడే మాకిన్నిటికీఁ నొడయఁడై నిలిచె. ॥తెలి॥ 552

భవుళి

ఇంక మాలోనింట్ల కేది విధో
కింకరులమని యెడిగెలుపే కాక. ॥పల్లవి॥

యెవ్వరు గడచిరి యింతకతొలుతను
నివ్వటిల్లు హరి నీమాయ
నవ్వుచు నీశరణాగతి నమ్మిన
మువ్వంక శుకాదిమునులే కాక. ॥ ఇంక ॥

కన్నవారెవ్వరు ఘనవైకుంఠము
వున్నతమగునీవురుమహిమ
మున్ను నిపుడు నీ ముద్రలు మోఁచిన
అన్నిటా ఘనసనకాదులుగాక. ॥ఇంక॥

తెలియువారెవ్వరు దివ్యజ్ఞానము
చలనముగాఁ జెప్పుశాస్త్రములు
యిలలో శ్రీవేంకటేశ నీవారై
చెలఁగిరి శేషాదిజీవులుగాక. ॥ఇంక॥ 553

రేకు 296 సాళంగనాట

ఎందరు గలిగిన నితనిలోనే
ముందు వెనకలను ముఖ్యం బితఁడే. ॥పల్లవి॥

భవవిదూరుఁ డాపద్బంధుఁడు హరి
వివరించి కొలువ వేల్పితఁడు
కవతో లక్ష్మీకాంతుఁ డితఁడు
రవిశశినేత్రుఁడు రక్షకుఁడు. ॥ఎంద॥

కలిదోషహరుఁడు కారుణ్యనిలయుఁడు
వలెననువారికి వరదుఁడు
తలఁపులోనఁగలతత్వం బితఁడు
సులభుఁ డితఁ డరసిచూచినను. ॥ఎంద॥

శ్రీవేంకటేశుఁడు చిత్తజగురుఁడు
యేవలఁజూచిన నితఁడే
గోవిందుఁ డితనిఁ గొలిచితిమిదివో
తోవయుఁ గంటిమి తుదకెక్కితిమి. ॥ఎంద॥ 554

శుద్ధవసంతం

కనుఁగొననిది హరికల్పితము
తనకు నిందులోఁ దగినంతే. ॥ పల్లవి ॥

నానా భేదములు నరులగుణంబులు
నానారుచు లివి నవపదార్థములు
ఔ ననేదేది యటు గాదనేదేది
వానివానివిధి వలసినయట్టు. ॥ కనుఁ ॥

నడచుఁ బ్రపంచము నడపేవిధముల
నడచు మాయ లెన్నఁగరావు
విడిచేటి వేఁటివి విడువని వేఁటివి
పడఁగఁబడఁగ నవి పరచినయట్లు. ॥ కనుఁ ॥

తెగనికర్మములు దేహధర్మములు
తెగనియాస లివె దినదినము
తగు శ్రీవేంకటదైవము దాసులు
నగుదు రిన్నిటిని నటనలు చూచి. ॥ కనుఁ ॥ 555

వరాళి

అరిగాఁపులము నేము అంతర్యామివి నీకు (వు?)
యిరవై నీచెప్పినట్టు యేమిసేతుమయ్యా. ॥ పల్లవి ॥

గాలి ౧ ముడిగట్టినట్టు కాయముమోచితిమి
కాలముగొలచితిమి కనురెప్పల
జాలి రొప్పితిమి వట్టిసటలనే యేపొద్దు
యేల మెచ్చ వింకాను యేమిసేతుమయ్యా. ॥ అరి ॥

౧. 'ముదె' రేకు.

చుక్కలు లెక్కించినట్టు చూడఁగ మాజన్మములు
పుక్కునఁ గర్మములకు నొడిగట్టితి (మి?)
తెక్కులను వెంట వెంటఁ దిరిగేము బంట్లమై
యెక్కువాయ వెట్టి మాకు నేమిసేతుమయ్యా. ॥అరి॥

పాలు ౨ వొంగినటువలెఁ గాయము మోచితిమి
నాలుక కెక్కినవెల్లా నమలితిమి
యీలీల శ్రీవేంకటేశ ఇంత సేసితివి
యేలినవాఁడవు ఇంకా నేమిసేతుమయ్యా. ॥అరి॥ 556

శంకరాభరణం

మిగిలిన దే మిఁకమీఁదట దేహికి
అగపడు నొక పడెఁ దన్నంటు. ॥పల్లవి॥

రతిఁ బగటివెలుఁగు రాత్రిచీఁకటికి
సతము గాదు అది సరికి సరి
అతిభోగములకు నార్జించుటకును
చతురపుసంపద సరికి సరి. ॥మిగి॥

అలయపథ్యమున నౌషధము గొనుట
చలువకు వేఁడికి సరికి సరి
నిలిచినపుణ్యము నిండుఁబాపములు
జలువు వెలువులకు సరికి సరి. ॥మిగి॥

మహి మరణములకు మరి పుట్టుగులకు
సహజ మందరికి సరికి సరి
యిహమున శ్రీవేంకటేశ్వరుఁ డాత్మకు
సహకారి యతఁడు సరికి సరి. ॥మిగి॥ 557

౨. 'వాఁగి' రేకు

మాళవి

తెలుపఁగరాదిది దేవునిమాయలు
ఫల మెఱఁగరు యీ పట్టినవెట్టి. ॥పల్లవి॥

పుట్టిరి దివిజులు పురుషోత్తమునం-
దట్టే యణఁగిరి యతనందు
యిట్టె యీతని యింగరతో సరి-
వెట్టి కొలుచుటే పెనువెట్టి. ॥తెలు॥

హరివరముననే యందరు బదికిరి
పరులవరము గని బడలిరి యసురలు
యిరవెఱఁగితని నిందరిలోపల
సరిగా మొక్కుట సహజపువెట్టి. ॥తెలు॥

జీవాంతరాత్ముఁడు శ్రీవేంకటేశుఁడు
యేవల శ్రీలక్ష్మి యీతనిదేవులు
వేవేలు సిరులు వీరె యొసఁగిరని
భావించువారికిఁ బట్టదు వెట్టి. ॥తెలు॥ 558

ముఖారి

కలలోన నిట్లనే కాఁపురము నిట్లనే
నిలువు గల్లందమో నిజమందమో. ॥పల్లవి॥

వొక్కనాటిప్రపంచము వొక్కనాటివలె రాదు
వొక్కనిమిషమువలె నొకటి గాదు
పక్కన మాయమై పోవు బడిబడినే వచ్చు
నెక్కొని కల్లందమో నిజమందమో. ॥కల॥

పొద్దు వొడచేది గొంత పొద్దు గూఁకేది గొంత
చద్ది గొంత వేఁడి గొంత చవులు గొంత
వొద్దనే కాలము నుండు వుండుండీ దవ్వయిపోవు
నిద్దపుఁగల్లందమో నిజమందమో. ॥కల॥

పాపపుణ్యా లంటెనంటాఁ బాయవు సుఖదుఃఖాలు
పైపై ననుభవించఁ బరసిపోవు
యేపొద్దు శ్రీవేంకటేశుఁ డెదలోనే వున్నాఁడు
యేపునఁ గల్లందమో యిది నిజమందమో. ॥కల॥ 559

రేకు 297 నారాయణి

ఏఁటివిచారము యెక్కడి యాచారము
మాటున జీవుఁ డింతేసి మాయలఁ బొరలును. ॥పల్లవి॥

పరగ నూరేండ్లబ్రతుకునకే కా
ధర నన్నియునుఁ గూర్చి దాఁచుకొనేది
పొరసి నానాసుఖభోగాలు చింతించుఁగాని
పరమున కిపాటిప్రయాస పడఁడు. ॥ఏఁటి॥

కడుపు నించుకొరకుఁ గామసుఖమునకే కా
చెడనివుద్యోగాలు సేయఁగోరును
మిడిసి లోకములెల్ల మెప్పించ నడచుఁగాని
చిడుముడి హరి మెప్పించే ననలేఁడు. ॥ఏఁటి॥

సారె సారెఁ జచ్చి చచ్చి జననము వొందేదెల్లా
వూరఁగలకర్మము లొగిఁ జేయుట
మేరలేక నరులను మెచ్చుగఁ గొలుచుఁగాని
కూరిమి శ్రీవేంకటేశుఁ గొలువఁగలేఁడు. ॥ఏఁటి॥ 560

దేసాళి

భావములోనా బాహ్యమునందును
గోవింద గోవింద యని కొలువవో మనసా. ॥పల్లవి॥

హరియవతారములే యఖిలదేవతలు
హరిలోనివే బ్రహ్మాండములు
హరినామములే అన్నిమంత్రములు
హరి హరి హరి యనవో మనసా. ॥భావ॥

విష్ణునిమహిమలే విహితకర్మములు
విష్ణుని బొగడీ వేదములు
విష్ణుఁ డొక్కఁడే విశ్వాంతరాత్ముఁడు
విష్ణు విష్ణువని వెదకవో మనసా. ॥భావ॥

అచ్యుతుఁ డితఁడే ఆదియు నంత్యము
అచ్యుతుఁడే యసురాంతకుఁడు
అచ్యుతుఁడు శ్రీవేంకటాద్రిమీఁద నిదె
అచ్యుత యచ్యుత శరణనవో మనసా. ॥భావ॥ 561

గుండక్రియ

అంతయు నతనిమహామహిమే అతఁ-
డెంత సేసినా నెట్టయిన నవును. ॥పల్లవి॥

రావలెనన్నవి రాక మానవు
పోవలె నన్నవి పోకుండవు
ఆవలఁ యీవల నలమట లేఁటికి
దైవ మొక్కఁడే తగిలినగురుతు. ॥అంత॥

కాయపుగుణములు కలిగినవే భువి-
నీయెడ జీవుఁడు యిటు గలఁడే
ఆయమిందుఁ గా దవునన నెవ్వరు
కాయజగురుఁ డొక్కఁడే ప్రేరకుఁడు. ॥అంత॥

అంతరంగమే యాత్మజ్ఞానము
వింతగు వెలుపల వెడమాయ
చింతించి రక్షించ శ్రీవేంకటేశుఁడు
మంతుకెక్కె నిఁక మతకములేల. ॥అంత॥ 562

సాళంగం

ఒక్కఁడే దైవం బున్నతుఁ డితఁడు
తక్కినతలఁపులు తప్పుఁదెరువులు. ॥పల్లవి॥

పురుషులకెల్లాఁ బురుషోత్తముఁడు
సురేంద్రాదులకు సురేంద్రుఁడు
హరునికి నజునికి నవ్వలిమూరితి
హరి యితఁడే పరమాత్ముఁడు. ॥ఒక్కఁ॥

వేదాంతంబుల వేద్యుఁ డితఁడు
ఆదికినాదియునన నితఁడే
మేదిని నరులకు మేదినీశ్వరుఁడు
యేదెసఁ జూచిన నీశ్వరుఁ డితఁడే. ॥ఒక్కఁ॥

యెక్కువలకెల్ల నెక్కువ యీతఁడు
మక్కువ మరునికి మరుఁ డితఁడు
యిక్కడ శ్రీవేంకటేశుఁడై మిగుల
పక్కన నిదివో ప్రత్యక్ష మితఁడు. ॥ఒక్కఁ॥ 563

శ్రీరాగం

ఓహో నిలిచిన దొకటిదియే
శ్రీహరిసాకారచింతనము. ॥పల్లవి॥

పంచమంగవేదపుపద్మాత్మునామము
అంచెఁ బాపహర మౌషధము
పంచలఁ బీతాంబరుశరణాగతి
ముంచినయజ్ఞానమునకు దీపము ॥ ఓహో ॥

విందులకుడుపులు విష్ణుకీర్తనము
చందపువై కుంఠ(ము?) సంబళము
పొందుగ నచ్యుతుఁబూజించుపూజలు
కిందటఁ గొనకెక్కెడినిచ్చెనలు. ॥ ఓహో ॥

కట్టినముడుపగు ఘనకృష్ణభక్తి
ముట్టిన పాపవిమోచనము
యిట్టె శ్రీవేంకటేశ్వరుకృప యిది
పట్టినవారికి బలువగుకొమ్ము(మ్మ?). ॥ ఓహో ॥ ౯౬౪

శంకరాభరణం

వేదము దీర్చదు వేరే శాస్త్రములు
యేదియుఁ దీర్చదు యిది నీమాయ. ॥ పల్లవి ॥

నీవల్ల బ్రదికిరి నిండుదేవతలు
నీవల్ల నసురలు నెలఁజెడిరి
ఆవల నిందరి కాత్మవు నీవే
చేవదేరె నీచిక్కులే భువిని. ॥ వేద ॥

---

౧. 'వేదము' కావచ్చు.

నెమ్మిఁ బాండవుల నీవారంటివి
కమ్మర విడిచితి కౌరవుల
యిమ్ముల నీవావి యిద్దరికొకచే
తెమ్మలాయ నీతీరనిచిక్కు. ॥ వేద ॥

జగమున నీదే స్వతంత్రమెల్లా
నెగడనజీవులు నీవారు
తగు శ్రీవేంకటదయివమ యిన్నియు
తెగి నీదాసులు తెలిసినచిక్కు. ॥వేద॥ 565

రేకు 298 దేవగాంధారి

మాయామోహము మానదిది
శ్రీయచ్యుత నీచిత్తమే కలది. ॥ పల్లవి ॥

యెంతవెలుఁగునకు నంతేచీఁకటి
యెంత సంపదకు నంతాపద
అంతటా నౌషధ మపథ్యమును సరి
పింతే మిగిలెను వేసటే కలది. ॥ మాయా ॥

చేసినకూలికి జీతమునకు సరి
పూసినకర్మభోగము సరి
వాసులజన్మము వడి మరణము సరి
ఆసల మిగిలిన దలపే కలది. ॥ మాయా ॥

మొలచినదేహము ముదియుటకును సరి
తలఁచినదైవము తనలోను
యిలలో శ్రీవేంకటేశ నీకరుణ—
గలిగినమాకెల్ల ఘనతే కలది. ॥మాయా॥ 566

సాళంగనాట

చేకొని కొలువరో శ్రీనరసింహము
శ్రీకరమగు నిదె శ్రీనరసింహము. ॥పల్లవి॥

వెడలేటివూర్పుల వేఁడిమి చల్లీ
చిడుముడికోపపు శ్రీనరసింహము
గడగడవడఁకేటిగండస్థలములు
౧చెడలు గదలిచీ శ్రీనరసింహము. ॥ చేకొ ॥

వంకరగోళ్లవై పులు వెదకీ
చింకచూపులను శ్రీనరసింహము
హుంకారంబుల నుదధులు గలఁచీ-
నంకెల శ్రీపతియగు నరసింహము. ॥ చేకొ ॥

వదనము దిప్పుచు వడి నసురమేను
౨చిద్రుపలు చేసెను శ్రీనరసింహము
అదివో శ్రీవేంకటాద్రి యెక్కి యిటు
చెదరక నిలిచెను శ్రీనరసింహము, ॥ చేకొ ॥ 567

వరాళి

అతనిలోనే యణఁగె నన్నియును
కతలెన్నైనాఁ గలవు కమలాక్షుఁ గనరో. ॥పల్లవి॥

యిసుక లెక్కవెట్టితే నెంతైనాఁ గలదు
అసముదించనిపుణ్యా లటువంటివే
వసగానిపెక్కుదేవతలఁ గొలుచుకంటే
నుసరాన హరివారై సుఖయించరో. ॥అత॥

---

౧. 'చెడలు' వ్యావహారికము యతి. ౨. 'చిద్రుపలు' రేఫ.

గోర గడుగఁగఁ బోతేఁ గొనదాఁకా రొంపే
ఆడుకోలుతర్కవాదా లటువంటివే
వాడిక నారుమతాలవాఁడై తిరుగుకంటే
యీడనే శ్రీపతివారై యీడేరరో. ॥అత॥

మనసునఁ జాలు దాగితే మట్టు లేదు మేర లేదు
అనుగుసంసారభోగా లటువంటివే
దినదినతపములఁ దీదీపులవుకంటే
తనిసి శ్రీవేంకటేశుదాసులై బ్రదుకరో. ॥అత॥ 568

సౌరాష్ట్రం

మరల విచారించితే మంచముకిందే నుయ్యా
తిరుల హరివారైరి శివాదులు. ॥పల్లవి॥

ఆడేటిమాటలకెల్ల వాది నంతము లేదు
వీడనికర్మములకు విధి లేదు
తాడుపడ్డమనసుకు దైవము విష్ణుఁడేయని
పాడి కొలిచిరి తొల్లి బ్రహ్మాదులు. ॥మర॥

పుట్టిపడేజన్మముల కూరట యెందూ లేదు
౧కట్టడి ఇంద్రియాలకు గతి లేదు
తట్టువడ్డజీవునికి దైవము శ్రీహరియని
యిట్టె మొరయిడిరి యింద్రాదులు. ॥మర॥

కప్పినయీమాయలకు కడవ రెందూ లేదు
తిప్పనిహరిభక్తికిఁ దిరుగు లేదు
చొప్పుగా శ్రీవేంకటేశుఁ డొక్కఁడే దైవమని
చొప్పువట్టి కొలిచిరి శుకాదులు. ॥మర॥ 569

౧. 'కట్టడి', రేకు. వ్యావహారికము కావచ్చు.

సామవరాళి

ఏవల్ల నోఁగాము ౧ లిఁక నేవి అన్నియు నీలోనే
శ్రీవల్లభుఁడ నిన్నుఁ జేరితిమి నేము. ॥పల్లవి॥

సగుణనిర్గుణములును సావయవనిరవయవ-
మగుఁదర్కవాదకలహములు ఘనము
జగములో చదువులును సంశయంబే కాని
తెగనీదు నీమాయ తెలియవసమా. ॥ఏవ॥

వేదమార్గము గొంత వేదబాహ్యము గొంత
పోదిమతములవారిపోరు ఘనము
పాదైనమునిఋషులు బహుముఖములే కాని
సోదించి వొకమాట చూపంగలేరు. ॥ఏవ॥

వెసఁ గర్మ మొకవంక విజ్ఞాన మొకవంక
వసగావు రెంటిబలవంతములును
వసుధ శ్రీవేంకటేశ్వర నీవు గావు మిఁక
ముసుఁగువెట్టినవాదు ముగియదెంతైనా. ॥ఏవ॥ 570

బౌళి

సర్వాత్మకుఁడవు సర్వేశ్వరుఁడ నా-
పూర్వాపరాలు నీకే భువి సమర్పయామి. ॥పల్లవి॥

వేగిలేచి నేఁ జేసేవెడచేఁత నీ చేఁతే
అగడపుమాటాడిన వది నీ మాటే
ఆగము భోగములు నా యన్నపానాదులు మరి
శ్రీగురుఁడ నాలోని చింతయు నీ చింతే. ॥సర్వా॥

---

౧. "లి(కనేవిఅ) న్నియు" పూ. ము. పా. తాళము చెడుననుభయముతో '(కనెవి అ) అక్షరములు చివ్వగుర్తులో ఉంచిరేమో?

కోపము శాంతములును గుణావగుణము నా-
రూపును నీ సాకారరూపమే
పాపపుణ్యములు నా ప్రాణవాయువులును
శ్రీపతి నా సంసారసేవయు నీసేవే. ॥సర్వా॥

ఉదయాస్తమపుదినా లున్నాఁడ నీ దినములే(?)
యెదురు నేను నీ వాఁడ నింతా నీదె
అదివో శ్రీవేంకటేశ అంతరియామివి నీవే
నిదుర మేల్కొనుటయు నీ మహిమే. ॥సర్వా॥ 571

రేకు 299 శంకరాభరణం

తన చిత్తముకొలఁది తమకించ నేఁకనేల
మనసువచ్చినప్పుడే మన్నించీఁగాక. ॥పల్లవి॥

కొండలందు నదులందుఁ గోరి యాకసాన భువి
నిండియున్నాఁడు తొలుతే నీలవర్ణుఁడు
అండనే నాయందు లోకులందు నుండుటరుదా
గండికాఁడై తనమాయ గాననీఁడుగాక. ॥తన॥

గాలియై పంచమ(హా?)హాద్యగతులై శబ్దములై
ఆలకించి పలికిని యాదిమూరితి
నాలుకకొననే వుండి నానాభాషలాడీని
కాలముతో నెదిరికిఁ గాననీఁడుగాక. ॥తన॥

వేదమందు శాస్త్రమందు వేవేలువాదములందు
పాదుకొని బోధించీఁ బరమాత్ముఁడు
యీదెసనే శ్రీవేంకటేశుఁడై పొడచూపె
గాదిలితనదాసులఁ గరుణించీఁగాక. ॥తన॥ 572

లలిత

శ్రీపతి యొకఁడే శరణము మాకును
తేప యితఁడె మఱి తెరఁగేది. ॥పల్లవి॥

ఆసలు మిగులా నాతుమ నున్నవి
యీసులేనిసుఖ మెక్కడిది
చేసినపాపము చేతుల నున్నది
మోసపోనిగతి ముందర నేది. ॥శ్రీప॥

కోపము గొందుల గుణముల నున్నది
యేపున నిజసుఖ మిఁక నేది
దీపనాగ్నితోఁ దిరిగెటిదేహము
పైపై విరతికిఁ బట్టేది. ॥శ్రీప॥

పంచేంద్రియములపాలిటిబదుకిది
యించుక నిలుకడ యెడ యేది
యెంచఁగ శ్రీవేంకటేశ్వరుఁ డొకడే
పంచినవిధులను పాలించుఁగాక. ॥శ్రీప॥ 578

మాళవిగౌళ

నారాయణ నీనామమహిమలకు
గోరఁ బోవుటకు గొడ్డలి దగునా. ॥పల్లవి॥

హరియని నొడిగిన నణఁగేటిపాపము
సిరుల నేను నుతిసేయఁగఁగలనా
పరగినపిచ్చుకపై బ్రహ్మాస్త్రము
దొరకొని పూరకె తొడిగినయట్లు. ॥నారా॥

---

వ్యావహారికముగ "శరణము" అనియాః లేకున్న యతిభంగము.

అచ్యుతయనఁగా నందెటిసంపద
యిచ్చల నెంచిన నిలఁ గలవా
కొచ్చి కొచ్చి యొకకొండంతకనకము
వెచ్చపుఁబోఁకకు వెల యిడినట్లు. ॥నారా॥

యెదుటనే శ్రీవేంకటేశ్వర యనఁగాఁ
బొదిగెటితపముల పుణ్యము గలదా
కదిసి సముద్రము గడచి వోడలోఁ
జదిసి యినుము దెచ్చినయట్లు ॥నారా॥ 574

లలిత

నీ వెటు దలఁచిన నిఖలము నట్టౌ
యేవల స్వతంత్రమింతా నీది. ॥పల్లవి॥

యేఁటిపురాకృత మెక్కడికర్మము
దాఁటక హరి నీదయ గలితే
నీటున నిన్నియు నీ కల్పితములు
పాటించి నీవే పాపఁగలేవా. ॥నీవె॥

యెక్కడిజన్మము లెక్కడిమరణము-
లొక్కఁడవె నీవు వొద్దంటే
యెక్కువ నిందరి నేలెటివాఁడవు
యిక్కడఁ గొలిచితి మితరము లేలా. ॥నీవె॥

యేది పాపము యేది పుణ్యము
పోదిగ నీవే పొమ్మంటే
చేదోడిందుకు శ్రీవేంకటేశ్వర
ఆదెస నిను శరణంటిమి గొంత. ॥నీవె॥ 575

ముఖారి

నానాఁటిబదుకు నాఁటకము
కానక కన్నది కైవల్యము. ॥పల్లవి॥

పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్టనడిమిపని నాఁటకము
యెట్టనెదుటఁ గల దీప్రపంచమును
౧కట్టఁగడపటిది కైవల్యము. ॥నానాఁ॥

కుడిచే దన్నము కోక చుట్టేడిది
నడుమంత్రపుపని నాఁటకము
వొడిఁగట్టుకొనినవుభయకర్మములు
గడిదాఁటినపుడే కైవల్యము. ॥నానాఁ॥

తెగదు పాపమును తీరదు పుణ్యము
౨నగి నగి కాలము నాఁటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరుఁ డేలిక
గగనముమీఁదిది కైవల్యము ॥నానా॥ 576

సాళంగనాట

ముద్దుగారే యశోద ముంగిటిముత్యము వీఁడు
తిద్దరానిమహిమల దేవకిసుతుఁడు. ॥పల్లవి॥

అంత నింత గొల్లెతల అరచేతిమాణికము
పంతమాడేకంసునిపాలివజ్రము
కాంతుల మూఁడులోకాల గరుడపచ్చఁబూస
చెంతల మాలోనున్న చిన్నికృష్ణుఁడు. ॥ముద్దు॥

---

౧. 'కట్టఁగడపటిలో' అరసున్నచింత్యము. ౨. 'నగినగి' సరిగ అతుకుట లేదు.

రతికేలి రుక్మిణికి రంగుమోవిపగడము
మితి గోవర్ధనపుగోమేధికము
సతమై శంఖచక్రాలసందుల వైడూర్యము
గతియై మమ్ముఁగాచేటికమలాతుఁడు. ॥ ముద్దు ॥

కాఁగునితలలపైఁ గప్పినపుష్యరాగము
యేలేటిశ్రీవేంకటాద్రియింద్రనీలము
పాలజలనిధిలోనఁ బాయనిదివ్యరత్నము
బాలునివలెఁ దిరిగీఁ బద్మనాభుఁడు. ॥ ముద్దు ॥ 577

౧ రేకు 300 దేసాళం

ఇందరు నెఱిఁగిన దీ బదుకు
పొందినదాఁకా భోగించవలయు ॥ పల్లవి ॥

పొట్టఁబోరుగు లివె పుణ్యాపాపములు
నట్టనడుమనే నాబదుకు
వెట్టిమోపువో వెడ సంసారము
ముట్టినదాఁకా మోవఁగవలెను ॥ ఇంద ॥

తోడునీడ యిది తొలఁగనిజన్మము
యేడకుఁ బోరాదు యీబదుకు
వీడనికట్లు వెడవెడయాసలు
వూడినదాఁకా నుండఁగవలెను ॥ ఇంద ॥

చేతిలో ధనము శ్రీవేంకటపతి
యీతనితోడిదె యీబదుకు
ఆతుమలోనే యలవైకుంఠము
ధాతు మాతుగని తలఁచఁగవలెను ॥ ఇంద ॥ 578

౧. పూర్వముద్రణసమయాని కీరేకు దొరకలేదు.

లలిత

నీవే యంతర్యామివి నీవున్న దేవై కుంతము
అవలఁ బరమపదమన నింకాఁ గలదా ॥ పల్లవి ॥

యిందరు జంతువులు నీవిచ్చినరూపులు మోచి
కొందితో నీకే సెలవై పుట్టివారు
కందువ నీ ప్రపంచపుకై ంకర్యములు సేసి
అందిరి జీవన్ముక్తు లదివో చాలదా ॥ నీవే ॥

యేలిక వంచినపనే యింద్రియభోగములెల్ల
తోలితోలి రాచాజ్ఞ తోయకున్నారు
కాలము నిన్నుఁ బాయరు గర్భగోళమం దున్నారు
యీలోకమే సాలోక్య మిది యింత చాలదా ॥ నీవే ॥

జ్ఞానము నజ్ఞాన మేది స్వామికార్యములోన
మానక నీపనులలో మత్తులై నారు
శ్రీనాథుఁడవు నీవే శ్రీవేంకటేశ్వర
నీనాటకములోనే నిత్యులై రి చాలదా ॥ నీవే ॥ 579

ధన్నాసి

పరిణామమే మాకుఁ బతివి నీవు గలుగ
శరణాగతే మాకు సకలరక్షయ్యా ॥ పల్లవి ॥

నుదుట వ్రాసినవ్రాఁత నూఁటికి నీతిరుమణి
యెదురేది మాకు నేఁడు యేఁడులోకాల
పెదవిమీఁదటితేనె పేరుకొనేనీజపము
అదన మాకు నదివో అక్కరలేదయ్యా ॥ పరి ॥

చేతికివచ్చినసొమ్ము చేరె నీశంఖుచక్రాలు
ఘాతల మాకిఁక నేది గడమలేదు
నీతితో వెనుబలము నీదాసులసేవ
రాతిరిఁబగలు నిదె రాజులమోయయ్యా ॥పరి॥

తొల్లిఁటిపుణ్యఫలముతోడనే నీసంకీర్తన
తల్లి దండ్రి నీవు నీతరుణియును
యెల్లగా శ్రీవేంకటేశ యిన్నియుఁ గలిగె మాకు
చల్లఁగా బ్రతికితిమి జయమందవయ్యా ॥పరి॥ 580

పాడి

ఇందులోన నే నెవ్వరిఁబోలుదు
అంది నీవాఁడ నేననుకొంటిఁజుమ్మీ ॥పల్లవి॥

జలజనాభ నీ శరణనువారలు
అల నారదసనకాదులు
కెలన మరియు నీ ౧ కింకరవర్తులు
తెలిసినబ్రహ్మాదిదేవతలు ॥ఇందు॥

నోరార హరి నిను నుతించువారలు
చేరువనుండేటిశేషాదులు
ధారుణిలో నీదాసాన(ను?)దాసులు
మారుతిముఖ్యులు మహామహులు ॥ఇంద॥

బడి నీచే ముక్తివడసినవారలు
సుడిగొనుమునిజనశుకాదులు
కడఁగినశ్రీవేంకటపతి నీవే
తడవి నన్ను దయదలఁచుమీ ॥ఇంద॥ 581

౧. 'కింకరాః ఇవ వర్తంతే ఇతి కింకరవర్తినః' దానితత్సమ మిది కావచ్చు.

శుద్ధవసంతం

అతుయింబగుమోహ మందులే తగుగాక
భక్షించుపండ్లకుఁ బ్రాణ మీఁదగునా ॥ పల్లవి ॥

కొండంతపసిఁడి కలగూరకె వెలయిడిన-
నిండనవివేకులకు నేరమిదిగాదా
దండమిడి హరి నిన్ను దలఁచినఫలంబెల్ల -
నండ పాపము వాపుమనుట కిది దగునా ॥ అతు ॥

గుఱుతుగలరత్నంబు గుగ్గిళ్లు గొనఁగ వెల-
పఱచులే తన బుద్ధి పాడౌట గాదా
అఱిముఱి హరి నిన్నునర్చించుఫలమెల్ల
కఱకుఁదనదేహభోగముల కనఁదగునా ॥ అతు ॥

కామధేనువుఁ దెచ్చి కాసుకె వెలకొసఁగ
కామించ నధికులకు కడుఁగొరతిగాదా
శ్రీమంతుఁడై నట్టిశ్రీవేంకటేశ నిను
సేమమునఁ గొలిచి తుచ్చెము ఁడుగఁదగునా ॥ అతు ॥ 582

దేసాళం

ఎవ్వరము నేమిసేసే మేమిగడమలు నీకు
రవ్వగా శరణంటే రక్షించుటింతే ॥ పల్లవి ॥

అందరుఁ జేసినకర్మము లవి నీకు జీవనమై
అంది జీవించేవంటే నదియూఁ గాదు
కొందరు సురల(లు?)తోడై కూడిరాఁగా నసురల-
యిందరి గెలిచేవంటే నిదియూఁ గాదు ॥ ఎవ్వ ॥

ఒొకచోటఁ గలవు వేరొకచోట లేవంటే-
నకటా యెంచిచూచిన నదియూఁ గాదు
మొకమిచ్చి వొకగుణమునఁ దిరిగేవంటే
సకలగుణుఁడ వాఱాడయుఁ గాదు ॥ఎవ్వ॥

కపట మిదనరాదు కడునవుననరాదు
వుపమించరాదు వొల్లకుండఁగరాదు
యెపుడును శ్రీవేంకటేశ నీ చిత్తమింతే
విపరీతములు లేవు వెలితీ లేదు. ॥ఎవ్వ॥ 588

శ్రీః శ్రీః శ్రీః

# 1-వ అనుబంధము

## అకారాదిగ రాగ సంకీర్తన సంఖ్యాసూచి

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| ఆహిరి | .... 7, 39, 60, 64, 77, 95, 147, 200, 206, 265, 311, 410. |
| ఆహిరినాట | .... 236. |
| కన్నడగౌళ | .... 47, 216, 244, 269, 329, 429, 551. |
| కాంబోది | .... 80, 129, 201. |
| కేదారగౌళ | .... 427. |
| గుండక్రియ | ... 22, 33, 53, 96, 109, 111, 133, 300, 302, 307, 310, 312, 376, 407, 452, 547, 562. |
| గుజ్జరి | 14, 20, 72, 85, 108, 191, 254, 306, 351, 428. |
| గౌళ | .... 63, 139, 523. |
| తెలుఁగుఁగాంబోది | .... 548. |
| దేవగాంధారి | .... 30, 32, 36, 44, 86, 106, 127, 136, 158, 162, 181, 207, 224, 247, 278, 285, 334, 350, 355, 359, 404, 435, 441, 455, 469, 508, 528, 531, 566. |
| దేసాళం | .... 49, 73, 90, 102, 115, 132, 140, 177, 205, 211, 228, 246, 260, 266, 288, 299, 319, 333, 341, 399, 412, 440, 524, 532, 561, 578. |

రాగములు సంకీర్తనసంఖ్యలు

దేసాళం .... 4, 50, 61, 81, 84, 125, 146, 150
178, 183, 196, 231, 237, 245
263, 287, 309, 358, 401, 415, 461
476, 493, 509, 517, 583.

ధన్నాసి .... 8- 16, 79, 113, 117, 151, 174, 210
218, 241, 272, 297, 315, 340, 381
393, 408, 433, 580

నాగవరాళి .... 215.

నాట .... 5, 42, 133, 153, 202, 232, 274
.... 345, 506, 518.

నారాయణి .... 270, 422, 560.

పాడి .... 66, 68, 83, 92, 167, 179, 230
256, 25, 271, 304, 325, 346, 363
377, 463, 487, 499, 511, 521, 525
581.

పూర్వగౌళ .... 294,

బౌళి .... 2, 6, 24, 54, 58, 74, 88, 94, 101
103, 104, 119, 170, 176, 189, 195
222, 240, 250, 257, 277, 286, 303
305, 318, 320, 348, 349, 353, 363
386, 391, 391, 397, 418, 434, 449
454, 457, 466, 467, 502, 510, 519
550, 553, 571.

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| బౌళిరామక్రియ | .... 43, 420. |
| భూపాలం | .... 55, 107, 212, 252, 298, 343, 392 .... 394, 398, 434, 543. |
| భైరవి | .... 37, 99, 160, 221, 248, 275, 409 483, 498, 527. |
| మంగళకౌశిక | .... 182, 375, 423, 424. |
| మలహరి | .... 159, 223, 296, 335, 362, 378, 396 438, 530. |
| మాళవి | .... 1, 154, 281, 365, 379, 385, 475 489, 501, 558. |
| మాళవిగౌళ | 35, 45, 145, 173, 226, 258, 405 479, 574. |
| ముఖారి | .... 43, 51, 62, 112, 171, 214, 220 225, 229, 235, 273, 279, 290, 332 337, 369, 387, 413, 489, 496, 504 559, 576. |
| రామక్రియ | .... 17, 21, 27, 105, 138, 148, 175 186, 217, 233, 264, 291, 317, 321 338, 402, 411, 433, 436, 442, 453 464, 471, 491, 497, 503, 522, 538 540. |
| రాయగౌళ | .... 344. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
| --- | --- |
| లలిత | .... 11, 15, 18, 19, 29, 52, 57, 67, 76 98, 114, 118, 121, 130, 134, 152 168, 169, 172, 180, 184, 190, 193 197, 199, 203, 233, 261 268, 276 303, 314, 323, 327, 330, 333, 371 372, 374 378, 383, 384, 389, 390 395, 416, 417, 425, 426, 431, 432 437, 444, 446, 448, 458, 460, 470 473, 481, 492, 526, 536, 539, 544 546, 552, 573, 575, 579. |
| వరాళి | .... 9, 70, 91, 128, 187, 204, 249, 288 298, 313, 328, 414, 478, 490, 515 556, 568. |
| వసంతం | .... 495. |
| వసంతవరాళి | .... 34, 141, 243, 352, 533. |
| శంకరాభరణం | .... 23, 25, 41, 46, 78, 110, 131, 137 149, 157, 163, 185, 242, 280, 289 316, 336, 360, 382, 421, 430, 439 477, 480, 514, 529, 542, 557, 565 572. |
| శుద్ధవసంతం | .... 69, 135, 213, 322, 367, 450, 465 474, 485, 537, 555, 582. |
| శ్రీరాగం | .... 28, 59, 82, 155, 165, 209, 342 366, 445, 482, 505, 564. |

| రాగములు | సంకీర్తనసంఖ్యలు |
|---|---|
| సామంతం | .... 18, 38, 71, 75, 89, 97, 116, 120 126, 156, 166, 194, 198, 208, 227 255, 259, 267, 292, 295, 331, 339 347, 354, 357, 361, 370, 400, 403 406, 448, 447, 456, 472, 494, 518 520, 545, 549. |
| సామవరాళి | .... 284, 541, 570. |
| సాళంగం | 10, 100, 124, 419, 451, 462, 486 568. |
| సాళంగనాట | .... 3, 12, 26, 31, 40, 56, 65, 87, 93 ... 122, 128, 142, 143, 144, 161, 164 192, 219, 234, 239, 251, 282, 301 324, 326, 356, 364, 380, 459, 468 500, 507, 512, 516, 534, 535, 554 567, 577. |
| సౌరాష్ట్రం | .... 569. |
| హిందోళ వసంతం | .... 262. |

# 2-వ అనుబంధము

## అకారాదిగ సంకీర్తన, రాగ, సంఖ్యాసూచి,


| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అంజనా | సాళంగనాట | 143 |
| అంతటి | దేవగాంధారి | 247 |
| అంతయు | గుండక్రియ | 562 |
| అంతరాత్మ | ధన్నాసి | 272 |
| అంతర్యామీ | లలిత | 458 |
| అంతవాని | ధన్నాసి | 113 |
| అందరికి | మాళవి | 281 |
| అందాకానమ్మ లేక | లలిత | 18 |
| అందాకా వైష్ణవ | గుండక్రియ | 310 |
| అందితిని | ధన్నాసి | 393 |
| అక్కటా నీమాయ | అహిరి | 206 |
| అక్కటారావణు | దేసాళం | 493 |
| అక్కడ నెక్కడి | ధన్నాసి | 340 |
| అక్కలాల | శంకరాభరణం | 149 |
| అఖిలలోకైక | రామక్రియ | 522 |
| అచ్యుత | శంకరాభరణం | 23 |
| అచ్యుతు | దేసాళ | 245 |
| అటమీద | భైరవి | 498 |
| అణుమాత్రపు | సామంతం | 347 |
| అతడే పరబ్రహ్మ | లలిత | 470 |
| అతనినమ్మ | వసంతవరాళి | 538 |
| అతనిలోనే | వరాళి | 568 |
| అదివో నీ | సాళంగనాట | 500 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అద్దిరా వో | సాళంగనాట | 26 |
| అనంతమహిమ | దేసాళం | 81 |
| అనిరావణు | సాళంగనాట | 31 |
| అనిళము | సామంతం | 520 |
| అన్నిటా నాపాలి | లలిత | 15 |
| అన్నిటా నేరుపరి | రామక్రియ | 188 |
| అన్నిటికి | లలిత | 431 |
| అన్నిటిమూలంబ | రామక్రియ | 491 |
| అన్నియుఁ జదివి | సామంతం | 354 |
| అన్నియు నా | మాళవి | 379 |
| అన్నియు నీ | మాళవిగౌళ | 35 |
| అభయ | బౌళిరామక్రియ | 420 |
| అమ్మేదొకటి | బౌళి | 176 |
| అయ్యో నానేరమి | ఆహిరి | 39 |
| అయ్యోవికల్ప | లలిత | 52 |
| అయ్యోసదా | గుజ్జరి | 108 |
| అరసినన్ను | లలిత | 374 |
| అరిగాఁపులము | వరాళి | 556 |
| అరుదరుదీ | ఆహిరినాట | 286 |
| అలిముడిఁగూడఁబోతే | దేవగాంధారి | 127 |
| అల్లనాఁడే | దేసాళి | 399 |
| అవధారు దేవ | సాళంగనాట | 144 |
| అవధారు రఘు | లలిత | 492 |
| అవధారు సకల | ముఖారి | 504 |
| అవాప్తసకల | బౌళి | 108 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| అతుయంబగు | శుద్ధవసంతం | 582 |
| అదరమ్మ | ముఖారి | 112 |
| అదరా | శంకరాభరణం | 280 |
| అడుతాఁబాడుతా | లలిత | 390 |
| అతఁడుభక్త | భైరవి | 99 |
| అతఁడుపేసే | రామక్రియ | 291 |
| అతఁడేబ్రహ్మణ్య | దేసాళం | 358 |
| అతఁడే యిన్నియు | భైరవి | 160 |
| అతఁడే సకలము | శంకరాభరణం | 25 |
| ఆదిమపురుషుఁడు | సాళంగనాట | 507 |
| ఆదివిష్ణు | లలిత | 198 |
| ఆనందనిలయ | బౌళి | 502 |
| ఇంకనాదైన్యము | ఆహిరి | 265 |
| ఇంకనేల | సాళంగనాట | 251 |
| ఇంకనైన | సామంతం | 331 |
| ఇంకనైనా | దేవగాంధారి | 334 |
| ఇంకమాబోంట్ల | ధవుళి | 553 |
| ఇంకానేల | బౌళి | 353 |
| ఇంకానో | రామక్రియ | 175 |
| ఇంతకంటె | సామంతం | 259 |
| ఇంతగామన్నించి | దేసాళం | 309 |
| ఇంతగాలమాయనన్ను | లలిత | 323 |
| ఇంతగాలమాయను | రాయగౌళ | 344 |
| ఇంతటఁగావఁగదే | సామంతం | 448 |
| ఇంతటిదైవము | రామక్రియ | 411 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇంతలోనే | బౌళి | 349 |
| ఇంతేపో | గుజ్జరి | 14 |
| ఇందరు నెఱిఁగిన | దేసాళి | 578 |
| ఇందరు వెఱుగుదు | లలిత | 261 |
| ఇందరెరిఁగిన | మాళవగౌళ | 226 |
| ఇందాఁకా | నారాయణి | 270 |
| ఇందిరయుఁడా | దేసాళం | 146 |
| ఇందుకంటే | బౌళి | 101 |
| ఇందుకే | బౌళి | 195 |
| ఇందునేతుది | తెలుఁగుకాంభోది | 548 |
| ఇందునేవున్నది | సామంతం | 120 |
| ఇందులోననే | పాడి | 581 |
| ఇచ్చలోఁగోరేవల్లా | రామక్రియ | 27 |
| ఇట్టినాస్తికుల | గుండక్రియ | 83 |
| ఇట్టిప్రతాప | మాళవి | 1 |
| ఇట్టియవివేక | బౌళి | 189 |
| ఇట్లెజ్ఞాన | దేసాళి | 211 |
| ఇతనికంటేఘను | శ్రీరాగం | 28 |
| ఇతనికంటేనుపాయ | దేసాళి | 73 |
| ఇతనికంటే మరి | సామంతం | 370 |
| ఇతనిమఱచి | గుజ్జరి | 306 |
| ఇతరచింత | గుండక్రియ | 22 |
| ఇతరదేవతల | దేవగాంధారి | 44 |
| ఇతరము | శంకరాభరణం | 289 |
| ఇతరుల | లలిత | 526 |
| ఇదికల్లయన | ధన్నాసి | 210 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఇదిగాదది | గుండక్రియ | 312 |
| ఇదిగాన | లలిత | 130 |
| ఇదినమ్మలేఁడు | మంగళకౌశిక | 375 |
| ఇది యెఱిఁగిన | దేసాళి | 524 |
| ఇదెచాలదా | వరాళి | 490 |
| ఇదెచిక్కితి | బౌళి | 397 |
| ఇదె నీ కన్నుల | మంగళకౌసిక | 182 |
| ఇన్నిటా శ్రీహరి | లలిత | 425 |
| ఇన్నిటికి | వరాళి | 123 |
| ఇన్నిటిమూలంబీశ్వరుఁడా | మలహరి | 296 |
| ఇన్ని దేహాము | దేసాళం | 84 |
| ఇన్నియుముగిసె | సాళంగనాట | 87 |
| ఇవ్వలవెదకి | లలిత | 303 |
| ఇహపరములకు | సామంతం | 545 |
| ఇహపరములు | సాళంగనాట | 380 |
| ఇహముఁబరము | వసంతవరాళి | 34 |
| ఈతఁడు | పాడి | 271 |
| ఈతఁడే | దేసాళం | 183 |
| ఈతగవే | సామంతం | 97 |
| ఈతనినెఱఁగ | లలిత | 536 |
| ఈమాటవిని | సాళంగనాట | 56 |
| ఈయపరాధ | కన్నడగౌళ | 269 |
| ఉడివోని | శంకరాభరణం | 110 |
| ఉన్నచోనే | శంకరాభరణం | 78 |
| ఉవిదలాల | ముఖారి | 285 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఊరకే | ధన్నాసి | 16 |
| ఎంతగాలమున | దేవగాంధారి | 86 |
| ఎంతగాలమైనా | రామక్రియ | 436 |
| ఎంతవిచారించు | ముఖారి | 369 |
| ఎందరితోఁబెనఁగే | సామంతం | 38 |
| ఎందరు | సాళంగనాట | 554 |
| ఎందరైనఁగలరు | నాట | 42 |
| ఎందుకుఁబని | ధన్నాసి | 297 |
| ఎందు జూచినా | మాళవి | 154 |
| ఎందునైనా | దేవగాంధారి | 158 |
| ఎందు వెదక | శుద్ధవసంతం | 450 |
| ఎక్కడఁగడచే | సామంతం | 295 |
| ఎక్కడచూచిన | దేసాళం | 4 |
| ఎక్కడనున్నాఁబోదు | సామంతం | 361 |
| ఎక్కడనున్నారో | ఆహిరి | 64 |
| ఎక్కడిది వివేక | సాళంగనాట | 326 |
| ఎక్కడినరకము | సాళంగనాట | 12 |
| ఎక్కడిపుట్టుగు | లలిత | 460 |
| ఎక్కడివిరతి | శ్రీరాగం | 366 |
| ఎక్కడివుద్యోగాలు | గుండక్రియ | 376 |
| ఎక్కడిసుద్ది | సాళంగం | 124 |
| ఎటువంటి | దేసాక్షి | 260 |
| ఎట్టయినాఁజేసుకో | ఆహిరి | 95 |
| ఎట్టు గెలుతుఁబంచేంద్రియ | కన్నడగౌళ | 47 |
| ఎట్టున్నదో | లలిత | 168 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎట్టు మోసపోతి | శంకరాభరణం | 41 |
| ఎట్టు వలసినా | మాళవిగౌళ | 45 |
| ఎట్టు వలసినా | బౌళి | 305 |
| ఎట్టువేగించీ | నాగవరాళి | 215 |
| ఎట్టొకో | గుండక్రియ | 547 |
| ఎదిరించి | రామక్రియ | 186 |
| ఎదుటనే | దేవగాంధారి | 278 |
| ఎదురులేక | దేసాళం | 401 |
| ఎదురేది | పాడి | 92 |
| ఎన్నఁడిఁక | దేసాక్షి | 440 |
| ఎన్నఁడు దీరవు | బౌళి | 348 |
| ఎన్నఁడు దీరీ | దేసాళం | 50 |
| ఎన్నఁడుదెలిసే | శంకరాభరణం | 386 |
| ఎన్నఁడునేనిఁక | బౌళి | 88 |
| ఎన్నఁడుమంచివాఁడ | సామంతం | 71 |
| ఎన్నఁడుమానవు | గుజ్జరి | 85 |
| ఎన్నఁడు వివేకించే | వరాళి | 204 |
| ఎన్నఁడొకో నేఁదెలిసి | దేవగాంధారి | 30 |
| ఎన్నఁడొకో బుద్ధెరిఁగి | దేవగాంధారి | 285 |
| ఎన్నికై శ్రీవేంకటేశుఁడి | హిందోళవసంతం | 262 |
| ఎన్నిచందములఁ | కేదారగౌళ | 427 |
| ఎవ్వరము | దేసాళం | 583 |
| ఎవ్వరిదూరఁగఁబోటు | మలహరి | 398 |
| ఎవ్వరిదూరఁగనేల | సామంతం | 406 |
| ఎవ్వరివసము | ముఖారి | 225 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఎవ్వరివాఁడా | లలిత | 380 |
| ఎవ్వరుఁగానని | శంకరాభరణం | 316 |
| ఎవ్వరు దిక్కింక | కాంబోది | 80 |
| ఏఁటినేను | లలిత | 98 |
| ఏఁటిపరిణామ | మాళవి | 385 |
| ఏఁటివిచార | నారాయణి | 560 |
| ఏకాలము | పాడి | 280 |
| ఏడధర్మ | సామంతం | 198 |
| ఏడపెద్దల | కాంబోది | 129 |
| ఏడేజేనలు | పాడి | 325 |
| ఏదినిజంబని | బౌళి | 2 |
| ఏదెస | సాళంగనాట | 65 |
| ఏనోరువెట్టుక | ఆహిరి | 60 |
| ఏపాటిగలవాఁడ | భైరవి | 248 |
| ఏపాటితనకర్మ | గుండక్రియ | 452 |
| ఏపొద్దు చూచిన | దేసాళి | 299 |
| ఏమనఁగవచ్చు | దేసాళం | 178 |
| ఏమనిచెప్పఁగ | మాళవిగౌళ | 253 |
| ఏమనిచెప్పినో | పూర్వగౌళ | 294 |
| ఏమనినుతింతు | దేవగాంధారి | 508 |
| ఏమిచెప్పెడినో | పాడి | 346 |
| ఏమి నిద్దిరించేవు | భూపాళం | 484 |
| ఏమిసేతు | కన్నడగౌళ | 216 |
| ఏమిసేయఁగలఁడు | రామక్రియ | 588 |
| ఏమిసేయఁగలయెంతాళ | కన్నడగౌళ | 329 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ఏమిసేయఁగలవాఁడ | ఆహిరి | 200 |
| ఏమి సేయఁగలవార | కాంబోది | 201 |
| ఏమిసేయుదును | శుద్ధవసంతం | 465 |
| ఏలవెట్టి | లలిత | 314 |
| ఏలికె | రామక్రియ | 217 |
| ఏలోకమున | దేసాళి | 102 |
| ఏవల్లనౌఁగాము | సామవరాళి | 570 |
| ఐనదయ్యీఁగాని | వరాళి | 9 |
| ఒకరిఁగానఁగ | సాళంగనాట | 534 |
| ఒకరికొకరు | దేవగాంధారి | 162 |
| ఒక్కఁడెవ్వఁడో | దేసాళి | 333 |
| ఒక్కఁడేదైవంబు | సాళంగం | 563 |
| ఒక్కఁడేయీ | లలిత | 268 |
| ఒక్కటి తరవాత | గుండక్రియ | 111 |
| ఒక్కమాటు | దేవగాంధారి | 455 |
| ఒడఁబడఁగద | సామంతం | 126 |
| ఒరసిచూడఁగ | దేవగాంధారి | 106 |
| ఓడవిడిచి | దేసాళం | 196 |
| ఓపితేఁదానే | లలిత | 190 |
| ఓహోనిలిచిన | శ్రీరాగం | 564 |
| కంటిరా | సాళంగనాట | 234 |
| కంఠమున | నాట | 506 |
| కటకటా | ధన్నాసి | 79 |
| కట్టెదుర | రామక్రియ | 471 |
| కడనుండి | గుండక్రియ | 307 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కడనుండే | శుద్ధవసంతం | 367 |
| కడవరాదు | ముఖారి | 496 |
| కడునజ్ఞానపు | లలిత | 19 |
| కడుపునిండె | సామంతం | 403 |
| కనకము | బౌళి | 119 |
| కని గుడ్డును | శంకరాభరణం | 185 |
| కనియుఁగానరు | బౌళి | 277 |
| కనుఁగొన | శుద్ధవసంతం | 555 |
| కన్న దేఁటిదో | బౌళి | 318 |
| కన్నవిన్న | దేశాక్షి | 90 |
| కన్నులపండుగ | సాళంగనాట | 98 |
| కమ్మరను | బౌళి | 257 |
| కరుణానిధి | భైరవి | 221 |
| కలకాల | ఆహిరి | 77 |
| కలదందే | లలిత | 446 |
| కలదు | దేవగాంధారి | 531 |
| కలలోన | ముఖారి | 559 |
| కలవిరెండే | దేశాక్షి | 412 |
| కలశాపురము | పాడి | 521 |
| కలిగిననాఁడే | సామంతం | 357 |
| కలిగినమీఁదా | శంకరాభరణం | 242 |
| కలిమి గలిగి | వరాళి | 187 |
| కలిమిలేము | వరాళి | 328 |
| కాఁపులము | పాడి | 487 |
| కాంతలమాన | రామక్రియ | 388 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| కాకుంటే | పాడి | 68 |
| కాదన్న వారికి | దేసాళం | 287 |
| కాదనేటి | నాట | 202 |
| కానరునాలుగు | దేసాక్షి | 319 |
| కానస్వతంత్రుఁడ | భైరవి | 483 |
| కొమ్మలుచూడరే | సాళంగనాట | 142 |
| కొలఁదిపుణ్యా | బౌళి | 170 |
| కొలిచినవారల | సాళంగం | 419 |
| కొలిచినవారికిఁగొమ్మని | నాట | 282 |
| కొలిచినవారిపాలి | శ్రీరాగం | 482 |
| కొలువు విరిసె | పాడి | 525 |
| కోనేటిదరు | దేసాళం | 517 |
| గరిమల | సామంతం | 456 |
| గరుడధ్వజంబెక్కె | రామక్రియ | 21 |
| గెలిచితి | సాళంగనాట | 3 |
| గోవిందహరి | గుండక్రియ | 109 |
| గోవిందాది | ముఖారి | 332 |
| గోవిందుదాసుల | సామంతం | 549 |
| ఘనుఁడాతఁడా | గుండక్రియ | 302 |
| జ్ఞానినైనా | లలిత | 11 |
| చంకగుదియ | లలిత | 389 |
| చంచలము | వరాళి | 414 |
| చరమార్గమందు | సాళంగం | 462 |
| చవిచేసుక | శంకరాభరణం | 542 |
| చవులకు | రామక్రియ | 105 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| చానిపిలోపలఁజవి | శంకరాభరణం | 430 |
| చాలుఁజాలు | లలిత | 371 |
| చింతలు రేఁచకు | గౌళ | 63 |
| చిత్తగించ | శ్రీరాగం | 209 |
| చూడనరుదాయ | లలిత | 114 |
| చూడరో | సాళంగనాట | 512 |
| చూడవేగోవింద | దేవగాంధారి | 224 |
| చూడ వేడుక | లలిత | 29 |
| చెప్పఁగానెఱఁగరా | గుజ్జరి | 351 |
| చెప్పరాని | సామంతం | 166 |
| చెలఁగి నాకిందుకే | లలిత | 67 |
| చెలఁగి యధర్మము | దేవగాంధారి | 469 |
| చేకొనికొలువరో | సాళంగనాట | 567 |
| చేకొసువారికి | శుద్ధవసంతం | 69 |
| చేరయందెల | పాడి | 179 |
| చేరి యశోదకు | శుద్ధవసంతం | 485 |
| చేసినట్టే | వరాళి | 91 |
| జగములేలే | ముఖారి | 229 |
| జననమరణ | సామంతం | 339 |
| జయజయ | గుండక్రియ | 300 |
| జాలి మోహిని | దేసాక్షి | 132 |
| జీవన్ముక్తులము | సాళంగం | 486 |
| జీవుఁడ | భైరవి | 275 |
| జోజోయని | దేసాళం | 461 |
| తగు మునులు | ధన్నాసి | 315 |

| సంకీ_ర్తనమొదలు | రాగము | సంకీ_ర్తనసంఖ్య |
|---|---|---|
| తనచి_త్తము | శంకరాభరణం | 572 |
| తనసొమ్మి | దేసాళం | 61 |
| తనిసిరి | లలిత | 444 |
| తనుఁదానే | సామవరాళి | 541 |
| తప్పదీయర్థ | లలిత | 395 |
| తప్పదు | సాళంగనాట | 128 |
| తప్పించు | ధన్నాసి | 218 |
| తప్పులు | దేసాక్షి | 341 |
| తప్పులెంచకిఁక | దేవగాంధారి | 435 |
| తమ యెఱుక | మలహరి | 385 |
| తలఁచినప్పుడు | దేసాక్షి | 140 |
| తలమొలా | నాట | 345 |
| తానెంత | సాళంగనాట | 468 |
| తాముస్వతంత్రులుగారుతమ | ముఖారి | 62 |
| తాముస్వతంత్రులుగారుదానో | సాళంగనాట | 40 |
| తిరువీధు | సాళంగనాట | 122 |
| తీరుచు నతఁడే | సాళంగనాట | 459 |
| తెగకపరము | లలిత | 203 |
| తెలిసినవారికింతా | లలిత | 552 |
| తెలిసినవారికిదేవుఁడి | శంకరాభరణం | 480 |
| తెలిసియుఁదెలియను | భూపాళం | 398 |
| తెలుపఁగ | మాళవి | 558 |
| తొల్లిటివారి | ముఖారి | 489 |
| త్రిజగముల | గౌళ | 523 |
| దనుజులు | శంకరాభరణం | 529 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| దాటలేను | దేసాళి | 288 |
| దాసవర్గము | సామంతం | 267 |
| దాసోహమను | నాట | 5 |
| దిక్కులెల్లా | మాళవి | 501 |
| దీనుడ | శుద్ధవసంతం | 474 |
| దేవతలెందున్న | దేసాళి | 115 |
| దేవదుందుభుల | దేసాళం | 125 |
| దేవదుందుభుల | బౌళి | 510 |
| దేవ నీవతు | నారాయణి | 422 |
| దేవనీవేకాల | గుజ్జరి | 428 |
| దేవశిఖామణి | బౌళి | 418 |
| దేవానీమాయ | సామంతం | 89 |
| దేవానీవే | బౌళి | 240 |
| దేవుడవు | వరాళి | 515 |
| దేవుడొక్కడే | దేసాళి | 582 |
| దేహము | మలహరి | 223 |
| దైవంబవు | శంకరాభరణం | 439 |
| దైవము నీవే | దేవగాంధారి | 32 |
| దైవమా నీచేతి | వరాళి | 249 |
| దైవమా నీవెలితేది | సామవరాళి | 284 |
| దైవమూ యిందు | కన్నడగౌళ | 551 |
| దైవమూయేమి | మలహరి | 362 |
| దైవమావో | ముఖారి | 171 |
| దొరతనము | నాట | 518 |
| ధరగడపట | లలిత | 372 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| ధరనీవే | సామంతం | 227 |
| ధరలో | మాళవిగౌళ | 479 |
| ధర్మాధర్మములాల | దేవగాంధారి | 136 |
| ధ్రువ విభీషణాదులు | సామంతం | 292 |
| నగుబాట్లకు | శుద్ధవసంతం | 135 |
| నడపే | కన్నడగౌళ | 429 |
| నడుమరెంటికి | శ్రీరాగం | 342 |
| నన్ను నెవ్వరు | బౌళి | 74 |
| నన్నెంచఁబని | బౌళి | 449 |
| నమితదేవం | శంకరాభరణం | 514 |
| నమోనమో | సాళంగనాట | 282 |
| నమోనారాయణ | లలిత | 199 |
| నరహరి | బౌళి | 368 |
| నలినాక్షు | శంకరాభరణం | 131 |
| నవనీతచోర | భవుళి | 24 |
| నాకేలవిచారము | లలిత | 384 |
| నానాఁటికిఁ బెరిగీ | నాట | 158 |
| నానాఁటి బదుకు | ముఖారి | 576 |
| నానాభరణముల | సామంతం | 513 |
| నారాయణనీదాసుల | దేశాక్షి | 228 |
| నారాయణనీనామ | మాళవిగౌళ | 574 |
| నారాయణనే | భూపాళం | 392 |
| నారాయణాచ్యుతా | మాళవి | 475 |
| నారాయణుఁడ | సామంతం | 494 |
| నారాయణుఁడితఁడు | వసంతవరాళి | 141 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నారాయణుఁడే | రామక్రియ | 264 |
| నాలోననున్నాఁడవు | లలిత | 398 |
| నిండినజగము | శుద్ధవసంతం | 537 |
| నిండుకంతటా | దేసాళం | 237 |
| నిండుమనసే | బౌళి | 320 |
| నిత్యానందుల | భూపాళం | 252 |
| నిలిచినచోట | లలిత | 417 |
| నీకుఁదొల్లే | సాళంగం | 451 |
| నీకు నాకు | మాళవిగౌళ | 173 |
| నీకు నీసహజ | ముఖారి | 387 |
| నీకెటు | మలహరి | 373 |
| నీ కేళరణంటి | ఆహిరి | 410 |
| నీదాఁకా | లలిత | 473 |
| నీదాసుల | దేసాక్షి | 266 |
| నీమహిమది | లలిత | 76 |
| నీమాయ | పాడి | 463 |
| నీయంతవారు | గుండక్రియ | 53 |
| నీయాధీనము | భూపాళం | 55 |
| నీవారైనవారికి | సాళంగనాట | 219 |
| నీవు దేవుఁడవు | సామంతం | 116 |
| నీవునట్ల | శ్రీరాగం | 445 |
| నీవెంత నేనెంత | ముఖారి | 51 |
| నీవెటుదలఁచిన | లలిత | 575 |
| నీవెటు సేసిన | ధన్నాసి | 408 |
| నీవేనన్ను | దేవగాంధారి | 207 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| నీవే నేరవు | దేసాళి | 49 |
| నీవేయంతర్యామివి | లలిత | 579 |
| నీవే యెఱిఁగి | గుండక్రియ | 188 |
| నీవొక్కఁడవేయిత్తు | దేసాళి | 205 |
| నీవొక్కఁడవే సర్వా | బౌళి | 222 |
| నీశరణమేగతి | వసంతం | 495 |
| నేఁడు దప్పించు | పాడి | 83 |
| నేఁడు నీమహిమ | లలిత | 184 |
| నేనాగెలువ | రామక్రియ | 540 |
| నేనింతసేసిన | సాళంగనాట | 192 |
| నేనేమి జాఁతి | ధన్నాసి | 381 |
| నేనొక్కఁడ | బౌళిరామక్రియ | 48 |
| నేమెంత | మంగళకౌసిక | 423 |
| నేరనైతి | పాడి | 167 |
| నేరుపు | దేసాళం | 476 |
| పంచేంద్రియములనే | సాళంగనాట | 324 |
| పంచేంద్రియములాల | రామక్రియ | 497 |
| పంటలభాగ్యులు | దేవగాంధారి | 359 |
| పంతగాఁడు | రామక్రియ | 503 |
| పచ్చిదేరుచు | దేసాళం | 150 |
| పట్టరో వీదులఁబరువులు | దెవగాంధారి | 36 |
| పట్టిపిసుక | శంకరాభరణం | 137 |
| పరమ యోగీశ్వరు | భూపాలం | 21[illegible] |
| పరమాత్మ | ముఖారి | 220 |
| పరిణామమే | ధన్నాసి | 580 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పరుసము | సామంతం | 75 |
| పలుదెరువులు | రామక్రియ | 321 |
| పలుమారు | లలిత | 134 |
| పలువిచారము | సాళంగం | 100 |
| పసిఁడియక్షంత | సామంతం | 194 |
| పాటించి | శ్రీరాగం | 82 |
| పాడేము | బౌళి | 467 |
| పాపముఁబుణ్య | భూపాలం | 394 |
| పాపముపాపము | దేవగాంధారం | 350 |
| పామరుల | ముఖారి | 214 |
| పారవేసిన | బౌళి | 466 |
| పుట్టించే | ముఖారి | 43 |
| పుట్టినట్టె | ధన్నాసి | 8 |
| పుట్టిన మొదలు | లలిత | 327 |
| పుట్టుగు నీ | దేసాళి | 246 |
| పుట్టుగులు | బౌళి | 550 |
| పుణ్యమున | ముఖారి | 337 |
| పురుషుల | సామంతం | 13 |
| పురుషోత్తముఁడ | లలిత | 121 |
| పూచిన | ఆహిరి | 7 |
| పెంచితమ | వరాళి | 70 |
| పెట్టినదైవ | వరాళి | 318 |
| పెద్దతెరువుండఁగా | లలిత | 383 |
| పెరిగి పెద్దఁగా | రామక్రియ | 317 |
| పెఱుగఁగఁ బెఱుగ | వసంతవరాళి | 352 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| పైకొనిచూడరో | సాళంగనాట | 161 |
| పొందినవెల్లా | దేవగాంధారి | 441 |
| పొదలఁబొదలఁగ | గుండక్రియ | 407 |
| బయలీఁదించి | వరాళి | 298 |
| బలువుఁడు | రామక్రియ | 458 |
| బహుకుటుంబి | లలిత | 416 |
| బాపుబాపు | నాట | 138 |
| బాపురే | బౌళి | 391 |
| బోధింపరే | బౌళి | 58 |
| భక్తసులభుఁడ | సాళంగం | 10 |
| భక్తినీపై | శుద్ధవసంతం | 322 |
| భగవద్విభవపు | లలిత | 448 |
| భవరోగవైద్యుఁడ | సాళంగనాట | 356 |
| భావములోనా | దేసాళి | 561 |
| భావించనేర | గుజ్జరి | 20 |
| భావించరే | శ్రీరాగం | 165 |
| భీకరపు | సాళంగనాట | 164 |
| భూమిలోనఁగొత్త | రామక్రియ | 17 |
| మంగళసూత్ర | లలిత | 197 |
| మదనజనకుని | శంకరాభరణం | 163 |
| మదించిన | భూపాలం | 107 |
| మనసొకటి | లలిత | 426 |
| మనుజులూరకే | లలిత | 238 |
| మమ్ముఁజూడ | బౌళి | 386 |
| మరలవిచారించి | సౌరాష్ట్రం | 569 |
| మఱచిన | బౌళి | 104 |
| మఱియేపురుషార్థము | శ్రీరాగం | 59 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| మాకేమినీ | గుజ్జరి | 191 |
| మాదురితములు | బౌళి | 484 |
| మానుప వశమా | శంకరాభరణం | 360 |
| మాయలఁబొరలఁగ | దేవగాంధారి | 404 |
| మాయామయము | సామంతం | 208 |
| మాయామోహము | దేవగాంధారి | 566 |
| మించినతల | పాడి | 363 |
| మిగిలినదే | శంకరాభరణం | 557 |
| ముందర గల | సామంతం | 156 |
| ముగియదు | శంకరాభరణం | 382 |
| ముద్దుగారే | సాళంగనాట | 577 |
| మునుల తపము | శంకరాభరణం | 477 |
| మూఁడుమూర్తుల | సామంతం | 400 |
| మెచ్చులదంపతు | ధన్నాసి | 438 |
| మొక్కరయ్య | రామక్రియ | 148 |
| మొక్కరో | సాళంగనాట | 301 |
| మొదలే | ముఖారి | 273 |
| రాతిరఁబగలనే | రామక్రియ | 442 |
| రామకృష్ణనీవు | లలిత | 432 |
| రామభద్ర | పాడి | 304 |
| రామాదయాపర | బౌళి | 94 |
| రాముఁడులోకా | రామక్రియ | 233 |
| రుచులునే | మాళవిగౌళ | 405 |
| రెక్కలకొండ | మాళవిగౌళ | 145 |
| రెప్పలమరఁగదె | లలిత | 378 |
| లేదందు | శుద్ధవసంతం | 213 |
| వట్టిమోపు | బౌళి | 54 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వట్టిస్వతంత్ర | వసంతవరాళి | 243 |
| వద్దిక నోపను | భవుళి | 454 |
| వాఁడివో వీఁడివో | పాడి | 66 |
| వాని వాని | దేసాళం | 263 |
| వారి వారి | పాడి | 256 |
| వింటిమి | లలిత | 546 |
| విచారించు | ధన్నాసి | 241 |
| విచ్చేయవయ్యా | రామక్రియ | 433 |
| విజయపు | సామంతం | 472 |
| విడువనో | మంగళకౌశిక | 424 |
| వి త్తొకటి | వరాళి | 478 |
| వినరో | దేవగాంధారి | 355 |
| విన్నపము | ఆహిరి | 147 |
| వివరము | గుండక్రియ | 96 |
| వివరించు | గౌళ | 139 |
| విశ్వమెల్ల | మలహరి | 530 |
| విశ్వరూపసీ | దేసాళం | 231 |
| విశ్వరూపమిది | భైరవి | 409 |
| విశ్వాత్మనీకంటె | లలిత | 544 |
| విష్ణుఁడ | ముఖారి | 413 |
| వీఁడిగో | బౌళి | 519 |
| వీఁడవో | రామక్రియ | 402 |
| వీఁడుగదే | మాళవి | 365 |
| వీఁడెవీఁడె | ధన్నాసి | 151 |
| వీదివీది | నాట | 274 |
| వీరు వారనేటి | లలిత | 539 |
| వెదకవో | దేసాళం | 415 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| వెదకిన | లలిత | 118 |
| వెన్నచేతఁబట్టి | లలిత | 180 |
| వెనుబల | గుజ్జరి | 254 |
| వెలుపకు | లలిత | 276 |
| వెఱ్ఱిదెలిసిజగ | భూపాళం | 343 |
| వెఱ్ఱి దెలిసిమరి | దేసాక్షి | 177 |
| వెఱ్ఱి దెలిసిరోఁకలి | ధన్నాసి | 174 |
| వెఱ్ఱిమానుప | గుజ్జరి | 72 |
| వెఱ్ఱి వాఁడ | బౌళి | 6 |
| వెఱ్ఱివారిఁదెలుపు | భైరవి | 37 |
| వేఁకువఁదిరు | భూపాళం | 298 |
| వేదము దీర్చదు | శంకరాభరణం | 565 |
| వేదవట్టి | సాళంగనాట | 525 |
| వేళొకచోట | లలిత | 57 |
| వేళలేదు | బౌళి | 457 |
| వేవేలుబంధ | శంకరాభరణం | 46 |
| వేసరితేనే | దేవగాంధారి | 528 |
| శరణని బ్రదుకరో | సాళంగనాట | 239 |
| శరణాగత | ధన్నాసి | 117 |
| శరణుకపీశ్వర | శంకరాభరణం | 421 |
| శరణునేఁజొచ్చి | బౌళి | 250 |
| శరణువేఁడెద | శ్రీరాగం | 155 |
| శరణు శరణు | శ్రీరాగం | 505 |
| శిష్టరక్షణము | పాడి | 258 |
| శ్రీపతియీతఁడుండ | లలిత | 169 |
| శ్రీపతియొకఁడే | లలిత | 573 |

| సంకీర్తనమొదలు | రాగము | సంకీర్తనసంఖ్య |
|---|---|---|
| శ్రీహరి నిత్య | భైరవి | 527 |
| సంసారమే | సామంతం | 447 |
| సంసారికిఁగల | లలిత | 481 |
| సకలము | మలహరి | 488 |
| సకలశాంతి | పాడి | 377 |
| సరవులు | కన్నడగౌళ | 244 |
| సర్వసులభుఁడ | లలిత | 152 |
| సర్వాత్మకుఁడ | బౌళి | 571 |
| సర్వేశ్వరా | మలహరి | 159 |
| సాసముఖా | బౌళి | 386 |
| సీతారమణ | శంకరాభరణం | 157 |
| సీతాసమేత | సాళంగనాట | 516 |
| సురలువంతోషించి | దేసాళం | 509 |
| సులభమార్గ | ముఖారి | 279 |
| సేయరాని | ఆహిరి | 311 |
| సేవించిచేకొన్న | పాడి | 511 |
| సొమ్ముగల | లలిత | 437 |
| సౌమిత్రి సహోదర | పాడి | 499 |
| హరికృష్ణ | భూపాళం | 543 |
| హరిదగ్గర | బౌళి | 303 |
| హరి నిను | లలిత | 172 |
| హరి యిచ్చిన | సాళంగనాట | 364 |
| హరియే | సామంతం | 255 |
| హరిహరి నా | వరాళి | 283 |
| హరిహరియని | రామక్రియ | 464 |
| హీనుఁడైన | దేవగాంధారి | 181 |
| హేయము | ముఖారి | 290 |

T. T. D. Religious Publications Series No. 188

Price Rs. 16-00

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రచురణ

Published by S. Lakshminarayana, I.A.S. Executive Officer,
T. T. Devasthanams and Printed at T.T.D. Press, Tirupati.